# టెంత్ క్లాస్

## పాఠకుల జ్ఞాపకాలు







శ్రీ

**కౌముది**

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 156




(2014 01 – 2015 12)

# విషయసూచిక


| ఏడాది | నెల | పేరు | పేజి |
|---|---|---|---|
| 2014 | 01 | నామాల నాగ మురళీధర్ | 3 |
| | 02 | వేణు శ్రీకాంత్ దార్ల | 8 |
| | 03 | పిన్నమనేని రాధిక (నాని) | 13 |
| | 04 | విశ్వామిత్ర | 19 |
| | 05 | “zoo–near” "జూ–నియర్" చిరు | 24 |
| | 06 | డా చిట్టే స్వర్ణలత | 28 |
| | 07 | భరత్ రెడ్డి పాతూరి | 32 |
| | 08 | రాధిక బుక్కా | 40 |
| | 09 | జ్యోతి వలబోజు | 44 |
| | 10 | డా స్రవంతి ఐతరాజు | 49 |
| | 11 | డొక్కా శ్రీనివాసా ఫణికుమార్ | 53 |
| | 12 | భారతీ ప్రకాష్ | 58 |
| 2015 | 01 | ఫణీంద్ర బాబు కామిరెడ్డి | 63 |

| | | | |
|---|---|---|---|
| | 02 | స్ఫురిత మైలవరపు | 68 |
| | 03 | కర్రా నాగలక్ష్మి | 73 |
| | 04 | శ్రీనివాసరావు డి | 76 |
| | 05 | దామరాజు నాగలక్ష్మి | 80 |
| | 06 | ఆనందరావ్ పట్నాయక్ | 83 |
| | 07 | ఉషారాణి నూతులపాటి | 86 |
| | 08 | సాయి భాస్కర్ అంకరాజు | 90 |
| | 09 | అంకరాజు శ్రీకాంత్ మురళి | 93 |
| | 10 | శివ నాగేశ్వరరావు | 97 |
| | 11 | (చిట్టే) పసుపులేటి భార్గవీలత | 102 |
| | 12 | పద్మ యార్లగడ్డ | 108 |




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# నామాల నాగ మురళీధర్

**బ్రూస్ ఆల్మైటీ సినిమాలో జిమ్క్యారీకి సర్వశక్తులు** వచ్చాక ప్రజల ఈతి బాధల్ని వినే ఓపిక లేక అందరి కోరికలూ తీరిపోయేలా కంప్యూటర్లో "యెస్" కమాండ్ ఇచ్చేస్తాడు. తర్వాత ఏం జరిగింది అనేది సినిమా చూస్తే తెలుస్తుంది, మనకు అప్రస్తుతం కూడా. సరిగ్గా అలాంటి శక్తి గనక నాకు వస్తే ఒక రీప్లేస్ కమాండ్ రన్ చెయ్యాలని ఉంది. డబ్బు, అధికారం పిచ్చి పట్టిన ప్రతిమనిషికి బాల్యం, ప్రేమ ఇన్హెరిట్ అయిపోయేలాంటి కమాండ్.

"అసలుందో లేదో స్వర్గం నా పుణ్యం నాకిచ్చెయ్, నా సర్వస్వం నీకిస్తా నా బాల్యం నాకిచ్చెయ్" అనే గజల్ శ్రీనివాస్ పాట తరుచూ నాకు ఎదురవుతూనే ఉంటుంది. బాల్యం అనే పదమే ఎంత తియ్యగా, హాయిగా ఉంటుంది. మనం హైరానా పడిపోయిన చిన్ని చిన్ని సమస్యలు, వాటికి మనమే తయారు చేసుకున్న సరళమైన సమాధానాలు. సారీలు చెప్పటానికో, సహాయం అడగటానికో బేషజాలెరుగని అమాయకత్వం. అదే ఆలోచనా సరళి ఇప్పటికీ మనం పాటిస్తే మన సమస్యలన్నీ గాలిబుడగల్లా తేలిపోవూ?

పదవతరగతి బాల్యమనే ఊరికి పెద్ద దూరమేం కాదు. అప్పుడే మొలిచిన నూనూగు మీసాలు యవ్వనాన్ని ప్రదర్శిస్తున్నా పసితనపు ఛాయలేం పెద్ద పలచబడవు. అదే ఆకతాయితనం, అదే అల్లరి. అయినా ఆనాటి అల్లర్లేగా పడక్కుర్చీకి ప్రయాణం చేరే నాటికి మనకు నిత్యావధానం. అందుకేనేమొ అంటారు నిన్నలో సంతోషంగా లేని వాడు ఎప్పటికీ సంతృప్తిగా ఉండలేడని.

1998 లో 500ల మార్కు వైకుంఠద్వారంలా వెలిగిపోతున్న రోజులవి. తెల్లని చొక్కాని, ఖాకీ ఫ్యాంటులోకి ఇన్షర్టు చేసుకుని ఒక గొప్ప సూర్యోదయంలో పదవతరగతిలో అడుగు పెట్టేసాను. మాస్కూలు బొబ్బిలిరాజుల హయాంలో నడిచే సంస్థానం ఉన్నత పాఠశాల. 150 ఏళ్ళ చరిత్రను కీర్తిచంద్రికగా మోస్తూ ఈనాటికీ దిగ్విజయంగా నడుస్తున్న స్కూలు.




మా స్కూల్లో అన్ని తరగతులూ గ్రౌండ్,ఫ్లోర్ లోనే ఉంటాయి. ఒక్క పదవతరగతి మాత్రమే మొదటి అంతస్థులో ఉంటుంది. ఆ మేడ పైకి వెళ్ళాలని ఎనిమిదవ తరగతి నుండీ గొప్ప కుతూహలంగా ఉండేది. కానీ పదవతరగతి వాళ్ళు డిస్టర్బ్ అవుతారని మా మాష్టార్లు వెళ్ళనిచ్చేవారు కాదు. అందుకే పదవతరగతి మొదలయిన మొదటిరోజు బాగా ముస్తాబయ్యి, మమ్మల్ని ఎప్పుడూ అడ్డుకునే మా ప్యూను గంగుల్ని నాన్సెన్స్ అని తిరస్కారంగా చూస్తూ మేడపైకి అడుగుపెట్టాం. దేశాన్ని ఉద్ధరించబోయే శాస్త్రవేత్తల బృందానికి ప్రత్యేక శిక్షణనిచ్చేంత శ్రద్ధగా మమ్మల్ని చూసుకునేవారు స్కూల్లో. పదవతరగతి వాళ్ళకి సాయంత్రంపూట నిర్బంధంగా చేయించే డ్రిల్ క్యాన్సిల్, మొక్కలు పీకుట, లాగుట చేయించే క్రాఫ్ట్ క్లాసు క్యాన్సిల్, స్కూల్ని ఊడ్చి ముగ్గులెట్టే జన్మభూమి పనులు క్యాన్సిల్. ఈ పనులన్నీ పాపం 8,9 తరగతులు చదివే వాళ్ళతో చేయించేవారు.

పాఠశాలల్లో సంస్థానం ఉన్నత పాఠశాల, తరగతుల్లో పదవతరగతి, సెక్షన్లలో బి సెక్షన్ నేనే అని సృష్టి ఆదియందు నాచే చెప్పబడింది అని భగవద్గీతకి సొంత భాష్యం చెప్పేవారు మా తెలుగు మాష్టారు కొల్లూరు సత్యారావుగారు. ఒక తరగతి మొత్తాన్ని అడాప్ట్ చేసుకుని వాళ్ళ జీవితాల్లో ముఖ్యమైన మలుపుగా భావించే పదవతరగతిని ఫస్టుక్లాసులో గట్టెక్కించటం తన బాధ్యతగా స్వచ్ఛందంగా

స్వీకరించి, తొంభైశాతం ఫలితాలు తెచ్చి చూపించిన ఉపాధ్యాయోత్తముడాయన. కేవలం ఒక్కసారి కాదు అదే ఫీట్ రిటైరయ్యేదాక ప్రతి ఏడాది రిపీట్ చేసిన ఉపాధ్యాయశిఖరం. అందుకునేమో అంటారు ఒక విద్యార్థి మంచి వాడయితే వాడొక్కడికే మేలు, ఒక ఉపాధ్యాయుడు మంచి వాడయితే సమాజానికే మేలు.

మొన్నే నా పెళ్ళికి వచ్చి భేష్ అని నా భుజంతట్టి ఆశీర్వదించిన తెలుగు మాష్టారు ఇప్పుడు నేను చెప్పబోయే విషయాలు వింటే, ఉన్నపళాన వచ్చి నా చెవులు మెలేస్తారేమొ. అయినా చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటారు. తెలుగుమాష్టారు మా సెక్షన్లో ఉన్న విద్యార్థులందరినీ కొన్ని గ్రూపులుగా విడదీసి, బాగా చదువుతారనే నమ్మకమున్న ఒక్కో విద్యార్థికి ఒక గ్రూపును అప్పగించారు. నాకు కూడా ఒక గ్రూపును అప్పగించారు. 'మీరు చదువుకోవటమే కాదురా, పదిమందికి మీ చదువును పంచండి' అని చెప్పి మరీ బాధ్యతలు అప్పగించారు. 'కొడతారో, తిడతారో, బట్టీయం వేయిస్తారో నాకు తెలియదు మీ గ్రూపు మొత్తం పాసవ్వటం మీ బాధ్యత సుమా' అని హెచ్చరించారు. గ్రూపులో ఉన్న విధ్యార్థుల్ని పిలిచి ఇక నుండి గ్రూపులీడర్ మాటే మీకు వేదం. కాదని ఎవడైనా తోక జాడించాడని తెలిసిందో తోలుతీస్తా అని అల్టిమేటం జారిచేసారు.

క్లాసులోనే కూర్చోవాలని నియమం లేదు. స్కూలు ఆవరణలో చెట్లకింద పుట్ల కింద ఎక్కడైనా గ్రూపుని కూర్చోబెట్టి చదివించొచ్చు. మాష్టారిచ్చిన ఈ స్వేఛ్ఛని కాస్త దుర్వినియోగం చేసాం. స్కూలు వెనుక చెట్ల క్రిందకు పోయి గ్రూపులో ఉండేవారికి వర్క్ ఇచ్చి, గ్రూపులీడర్లందరం అంటే నేను, శ్రీధర్, మధు, రత్నశేఖర్, అంజనీ ప్రసాద్ చేరి క్రికెట్ ఆడటం మొదలుపెట్టాం. ఈ విషయం బయటకు తెలిస్తే మాట వినటంలేదని మాష్టారికి చెబుతాం అని బెదిరించాం. ఇంకొంతమంది లీడర్లు ఇంకాస్త ముందుకుపోయి తమ హోమ్వర్కులు, పనులు కూడా గ్రూపులో ఉండే వారితో చేయించుకునేవారు. వేరే మాష్టార్లెవరైనా ఇలా ఆడుకోవటం చూసి మా తెలుగు మాష్టారికి చెప్పినా "మీమీద నాకు నమ్మకం ఉందిరా. పక్క క్లాసుల వాళ్ళది ఈర్ష్య" అనేవారు మాష్టారు. ఆయనకు మామీద ఉన్న నమ్మకమే తిరిగి మమ్మల్ని సరైన మార్గంలో పెట్టింది. ఆయన నమ్మకం నిలబెట్టడం కోసం పరీక్షలకు ముందు మాత్రం అందరినీ గట్టిగా చదివించి గట్టెక్కించాం.

స్కూల్లో పరిస్థితి ఇలా ఉంటే ఇంట్లో పరిస్థితి మరోలా ఉండేది. 'చదువులే మేము ఇవ్వగలిగే ఆస్థులు' అని డిక్లేర్ చేసేసి సబ్జెక్టి ఒకటి చొప్పున ట్యూషన్స్కి పంపేవారు. ఉదయాన్నే అయిదు గంటలకి నాన్న సన్యాసిరావు మాష్టారి దగ్గర మ్యాథ్స్ ట్యూషన్ కోసం నన్ను లేపి టీ ఇచ్చి, బద్ధకంగా అడుగులేస్తుంటే బలంగా బయటకి తోసేవారు. నాన్న చూస్తుండగా నాలుగడుగులు బయటకి వేసేవాడ్ని. వెళ్తున్నానని నమ్మకం కుదిరాక నాన్న లోపలికి వెళ్ళి తలుపేసుకునేవారు. తలుపు మూసిన శబ్ధం వినిపించగానే ఒకే పరుగులో మెట్లెక్కి మేడ మీద పడుకునేవాడ్ని. అటునుండి అటే వెళ్ళాల్సిన హిందీ ట్యూషన్ కూడా గోవిందా అయిపోయేది. బజారులో హిందీ మాష్టారు చందక సత్యాన్నారయణ గారు కనిపించి "మీ అబ్బాయి రావటం లేదేం?" అని అడిగే వరకూ నాన్నకు ఈ రహస్యం తెలియదు.

సాయంత్రం క్రికెట్ ఆడుతూ ఇనుగంటి వేణుగోపాల్రావు సార్ చెప్పే ఇంగ్లీష్ ట్యూషన్ కి నామం. రాత్రి కంబైండ్ స్టడీ అని చెప్పి ఊర్లో సైకిల్ వేసుకుని బలాదుర్ తిరిగేవాళ్ళం. ఆ టైములో అమ్మాయిలు ఇంట్లో టివి శబ్ధం వినిపించకుండా వీధిలో కుర్చీలు వేసుకుని శ్రద్ధగా చదువుకునేవారు. మేము సైకిల్ మీద అమ్మాయిల ఇంటిముందు అటూఇటూ తిరుగుతూ సైకిల్ బెల్ ఊరికే మోగిస్తూ సైట్ కొట్టేవాళ్ళం. ఊర్లో వేసే పిచ్చి వేషాలు ఎన్నాళ్ళు దాగుంటాయి. ఆ నోట ఈ నోట పడి అమ్మ, నాన్నకి తెలిసాయి. కొట్టలేదు, తిట్టలేదు. నీ బ్రతుకు నీ ఇష్టం ఎలా మలుచుకుంటావో అని మాత్రం చెప్పారు. ఒక్కసారి శ్రద్ధగా విన్న లేక చదివిన విషయం ఎప్పటికీ గుర్తుండిపోయే అదృష్టం నన్ను వెన్నంటే ఉండి నన్ను కాపాడింది, లేకుంటే జ్ఞాపకాలుగా ఇప్పుడు చెబుతున్న ఈ విషయాలే గుణపాఠాలుగా మరో తరానికి చెప్పాల్సొచ్చేది.

క్లైమాక్స్ కి వచ్చేసాం. క్లైమాక్స్ అంటే ఉత్కంఠత ఉండాలిగా. టెంత్క్లాస్ పరీక్షలంటే అప్పటికీ ఇప్పటికీ రాష్ట్రమంతా హడావుడీ చేసే ఘట్టం. నేను ఇంకా టైమ్ ఉందిలే చదువుదాం అనుకుంటుండగానే పరీక్షలు వచ్చేసాయి. చదవటానికి నా దగ్గర అసలు నోట్సులూకానీ, గైడ్స్ కానీ ఏమీలేవు. క్లాసులో విన్నది, ట్యూషన్లో విన్నది గుర్తున్నవరకూ రాస్తా అనుకున్నా. ఎప్పుడూ భయం అనిపించలేదు. ఏదో ఆత్మవిశ్వాసం.మధ్యాహ్నం పరీక్షంటే పొద్దునే తోటలో చదువుకుంటా అని వెళ్ళేవాడ్ని. అక్కడికి నాలానే చదువుకోవటానికి వచ్చిన వాళ్ళతో కబుర్లాడుతూ గడిపేసి సరిగ్గా ఒక గంట మాత్రమే ఏవో పేజీలు తిరగేసి పరీక్షలు ముగించేసాను.

రెండురోజుల్లో పదవతరగతి ఫలితాలు అని పేపర్లో వచ్చింది. నాకు కాస్త నమ్మకం, కాస్త బెంగ. ఎందుకన్నా మంచిదని సాయిబాబా కోవెలకి వెళ్ళి మొక్కుకుని వచ్చా. రిజల్ట్సు వచ్చే రోజు ఉదయం నుండి గుండెల్లో ఏదో దడ. మా ఇంట్లో అందరూ బాగా చదివే వాళ్ళే కావటంతో మరీ టెంత్క్లాస్ రిజల్ట్స్ అంత సీరియస్ గా తీసుకోలేదు. సాయంత్రం బులెటిన్ వచ్చింది. నంబరు వెతుకుతూ ఉన్నా. నా చేతికి పట్టిన చెమటతో పేపర్ తడిచిపోయింది. నంబరు కనిపించలేదు. ఫస్ట్ క్లాసుతో మొదలుపెట్టి ఆర్డినరీ వరకూ అన్నీ చూసేసా. ఎక్కడా నంబరులేదు.

నమ్మకాలు కూలిపోతున్నాయి. మొదటిసారిగా నా ఆత్మవిశ్వాసపు కళ్ళల్లోకి చూస్తూ నన్ను ఎగతాళి చేసే అవకాశం అందరికీ ఇచ్చేసాను. నేనే నా చేతులతో ఇచ్చేసా. నేను ఎందుకు శ్రద్ద తీసుకోలేదు? ఎందుకు నోట్సులు వ్రాయలేదు? నన్ను కాదు నాకు స్వేచ్ఛనిచ్చిన మమ్మీ, డాడీని అందరూ వేలెత్తి చూపిస్తారు. భగవంతుడా నా గర్వాన్ని అణచటానికి, మా వాళ్ళను ఇబ్బంది పెట్టకు అని మనసులోనే మొక్కుతున్నా. కళ్ళలో తిరుగుతున్న నీటిలో అస్పష్టంగా కనిపొంచింది విత్ హెల్డ్ అనే సెక్షన్. అందులో ఉంది నా నంబర్. అదేంటో కూడా నాకు తెలియదు. లోయలోకి జారిపోతున్న నాకు ఏదో ఆసరా దొరికింది అనిపించింది.

ఇంట్లో అందరూ పోయింది అనుకుని బాధలో ఉన్నారు. విత్ హెల్డ్ సెక్షన్లో నా నంబరు చూపించాను. అది ఏంటి అని తెలుసుకోవటం మొదలుపెట్టి, హైదరాబాద్ వెళ్ళి నా రిజల్ట్ తీసుకొచ్చేవరకూ నాన్న దాదాపు నెలరోజులు చాలా కష్టపడ్డారు. ఆ

నెలరోజులు అమ్మ నన్ను ఇంటి నుండి బయటకి పంపలేదు. అందరూ నన్ను ప్రశ్నలతో వేధిస్తారని. ఒక చంటిపిల్లాడిని చేయివదలకుండా కాపాడినట్టు నన్ను జాగర్తగా చూసుకునేది. నాన్న హైదరాబాద్ నుండి నా మార్కులతో వచ్చాక గర్వపడేంత గొప్ప రిజల్టేం కాదు కానీ గుండెల్లో నుండి ఒక భారం దిగిపోయింది. తర్వాత ఎప్పుడూ చదువు విషయంలో అమ్మ,నాన్నని బాధపెట్టలేదు.


గుడ్ల నాగేంద్ర, భద్రగిరి బాలాజి, మడక సతీష్, నాగ మురళీధర్.

ఈ అనుభవాలు నాకేం నేర్పాయో స్పష్టంగా గుర్తించలేను, కానీ పదవతరగతిని నా జీవితంలో నుండి తీసి పక్కనపెడితే ఏర్పడే వెలితేంటో మాత్రం స్పష్టంగా నా మనసుకి తెలుస్తుంది. ప్రపంచమనే పేద్ద థియరీకి ఒక చిన్న పాజిబుల్ శాంపిల్ ఆ నాలుగు గోడల మధ్యన మా క్లాసు. ఎన్నో కలలు, ఎన్నో ఆశలు, గొప్ప స్నేహాలు, చిన్న చిన్న త్యాగాలు, మధురమైన ప్రేమ కావ్యాలు. ఎక్కడెక్కడున్నారో ఆరోజు మాతో చదివిన మిత్రులంతా. అబ్బాయిలు కొందరు ఇప్పటికీ టచ్ లో ఉన్నారు. అమ్మాయిలు ఏమయిపోయారో తెలియదు. ఎప్పుడన్నా ఎవరైనా అనుకోకుండా ఎదురైతే అన్ని విషయాలు గుర్తుచేసేసుకుంటూ ఉంటాం.

ఎవరు ఎక్కడున్నా ఆ స్వచ్ఛమైన ఆశలు, ఆశయాలు నెరవేరాలని, ఆనాటి ఆ కలలు సాకారం కావాలని కోరుకుంటున్నా.

●●●



నా పేరు నామాల నాగ మురళీధర్. పౌరుషాల పోరుగడ్డ బొబ్బిలి మా స్వగ్రామం. నా చదవంతా మా బొబ్బిలిలోనే సాగింది. ఎం.సి.ఏ చేసి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. 'వ్రాత'కోతలు నా ప్రవృత్తి. ప్రస్తుతానికి న్యూజెర్సీ, పక్కాగా అయితే హైదరాబాద్ నా విలాసం.

http://muralidharnamala.wordpress.com/




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# వేణూశ్రీకాంత్ దార్ల

**నరసరావుపేటలో ఏడవ తరగతి వరకూ** ఉన్న మా ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నపుడు ఏడో తరగతి పిల్లలంటే అదో రకమైన ఈర్ష్య ఉండేది. ఎపుడెపుడు ఆ తరగతికి వెళ్తామా స్కూల్ మొత్తం ఆధిపత్యం చలాయిస్తామా అని ఎదురు చూసేవాళ్ళం కానీ

అనుకోకుండా ఆరోతరగతితోనే ఆ స్కూల్ నుండి బయటకి వచ్చి పిడుగురాళ్ళలో ఏడో తరగతిలో చేరాను. ఇది హైస్కూల్ కావడంతో ఆరు నుండి పదివరకూ మాత్రమే ఉండేవి, మళ్ళీ ఇక్కడ పదో తరగతి కోసం ఎదురుచూపులు మొదలు.

తీరా ఎనిమిది పూర్తయేసరికి మళ్ళీ నరసరావుపేట ట్రాన్సఫర్ అవడంతో వచ్చి అక్కడ గాలికోటయ్య హైస్కూల్లో తొమ్మిదో తరగతిలో చేరాను. ఇక్కడ ఒకటినుండి పదో తరగతి వరకూ ఉండడంతో కొంచెం మన హవా నడిచేది కానీ నరసరావుపేటకి చుట్టుపక్కల ఉన్న ఉప్పలపాడు, ఇసప్పాలెం లాంటి ఊర్లనుండి వచ్చే కొందరు పిల్లలు నాకన్నా బలంగా పొడవుగా ఉండి నాకు ఎక్కువ అవకాశం ఇచ్చేవాళ్ళు కాదు.




మా హైస్కూల్ కి చలామణిలో ఉన్నపేరు "గాలికోటయ్య హైస్కూల్" అనే అయినా రికార్డ్స్ లో మాత్రం అది ఎలిమెంటరీ స్కూల్ పేరు, హైస్కూల్ కి "SKRBR High School" అని పేరుండేది కానీ ఇది చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఇదిగో ఈ పక్క ఫోటోలోనిదే మా హైస్కూల్. తర్వాతెపుడో ఇలా కాంపౌండ్ వాల్ కట్టి పెద్ద గేటు పెట్టించినట్లున్నారు కానీ నేను చదివినపుడు నిలువెత్తు ప్రహరీ గోడకి చిన్న ఎలుక కలుగు అంత గుమ్మం ఉండేది. అందులో కేవలం ఇద్దరు పిల్లలం పక్క పక్కన నుంచోగలం అంతే అనమాట.

తరగతి గదులన్నీ కూడా చిన్న చిన్న రేకుల షెడ్డులవడంతో వేడి భరించలేకా ప్లస్ చోటు చాలకా మా మాష్టర్లు కూడా మమ్మల్ని తీసుకుని స్కూల్ కి ఆనుకుని ఉన్న మసీదు ఆవరణలోని చెట్టుకిందనో మసీదు నీడలోనో కూర్చోబెట్టి చదువుచెప్పేవాళ్ళు. అంత విశాలమైన గ్రౌండ్ లో ఉండే ఒకటి రెండు చెట్లకింద కూచుని చదువుకుంటూ అక్కడే పరీక్షలు రాస్తూ ఉంటే శాంతినికేతన్ గురించి చదువుకున్న పాఠాలు గుర్తొచ్చేవి.

చిన్నపుటినుండి ఏదో పెద్ద అల్లరిచేసేవాడిలా బిల్డప్ ఇవ్వడంతోనే సరిపోయేది కానీ పెద్దగా అల్లరి చేసే అవకాశాలు అంతగా దొరికేవి కాదు. అన్నిటికన్నా ముఖ్యంగా పదవతరగతిలో మాస్టర్లు కూడా మాకు కుంచెం భయపడతారు మేమే సీనియర్లం కనుక మేం విచ్చలవిడిగా అల్లరి చేస్కోవచ్చు అనుకునేవాళ్ళం కానీ ఆ ఆశలు అడియాసలే అని తెలియడానికి ఎక్కువరోజులు పట్టలేదు. మా స్కూల్ ఆవరణ చిన్నదవడంతో మసీదు గ్రౌండ్ నే స్కూల్ గ్రౌండ్ గా ట్రీట్ చేసేవాళ్ళం. ఆ గ్రౌండ్ ని ఆనుకుని ఒక వైపు జడ్జి గారి బంగళా ఉండేది. అపుడపుడు పోలీసులు కూడా కనిపించేవారు కాబట్టి అల్లరి చేయకుండా బుద్దిగానే ఆడుకునేవాళ్ళం.

అది చాలదన్నట్లు ఆ జడ్జిగారి బంగళా దాటి కొంచెం అవతలకి వెళ్తే మా మమ్మీ పని చేసే ఆర్ అండ్ బీ ఆఫీస్ ఉండేది. దీనివలన ఎంచక్కా లంచ్ అవర్లో వెళ్ళి అమ్మతో భోజనం చేసే సదుపాయమ్ ఎంజాయ్ చేసేవాడ్ని కానీ అంత అడ్వాంటేజ్ ని కూడా కవర్ చేసే గొప్ప డిజట్వాంటేజ్ తర్వాత తెలిసింది. అప్పట్లో అదేం చిత్రమో ఎపుడైనా క్లాస్మేట్స్ తో ఫైటింగ్ చేసేప్పుడో ఇంట్లో తెలియకుండా

ప్యాకెట్ ఐస్/ఐస్క్రీమ్ లాంటి చిరుతిళ్లు కొనుక్కున్నపుడో సరిగా అమ్మ కొలీగ్స్ కంట్లో పడేవాడ్ని దాంతో ఇంటికెళ్ళాక అమ్మ క్లాస్ పీకేది. నేనేమో "మీ ఆఫీసోళ్ళ కేం పనిలేదా కుదురుగా ఆఫీసులో కూర్చోకుండా మా స్కూల్ చుట్టూ ఎందుకు తిరుగుతున్నారసలు" అని రివర్స్ లో గొడవేసుకునేవాడ్ని.

ఇన్ని పరిమితులున్నా కూడా ఆటలకి కొదవుండేది కాదు. పదోతరగతి అని కొంచెం అపుడపుడు డిగ్నిటీ మెయిన్ టెయిన్ చేయడానికి ప్రయత్నించినా బుద్ది ఊరుకోనివ్వదు కదా సో మసీదు గోడలు ఎక్కి దూకడం, చెట్లు ఎక్కడం, ఏడుపెంకులాట, పిచ్చి బంతి, ఒంగుళ్ళు దూకుళ్ళు , కబడ్డి, కర్రాబిళ్ళా , రైటింగ్ పాడ్ ని బ్యాట్ గానూ రాళ్ళ ని బాల్స్ గానూ ఉపయోగించి క్రికెట్ ఇలా ఏ సీజన్ ఆటలు ఆ సీజన్ లో తెగ ఆడేసే వాళ్ళం.

నాకు కొంచెం లావుపాటి కళ్ళద్దాలుండడంతో హెవీ స్పోర్ట్స్ జోలికి వెళ్ళకూడదని రిస్ట్రిక్షన్ ఉండేది మా ఇంట్లో, కానీ మన కాలు నిలవదు కదా ఓసారి ఇలా రాళ్లతో క్రికెట్ కొంచెం ఆవేశంగా ఆడి సిక్సర్ కొట్టబోయి నా కొత్త రైటింగ్ పాడ్ ని అడ్డంగా విరగ్గొట్టుకుని ఇంటికి తీస్కెళ్ళా . అంతే ఆరోజు ఇంట్లో అమ్మా నాన్న కలిసి నాకు ఒక రేంజ్ లో క్లాస్ పీకి కొత్తపాడ్ కొనకుండా ఆ విరిగిన పాడ్ నే ఫెవికాల్ తో అతికించి ఇచ్చి "ఇదేవిటని అడిగినవారికి అందరికి నువ్ చేసిన ఘనకార్యం చెప్పు. ఇదే వాడితే కానీ నీకు నువ్వు చేసిన తప్పు తెలియదు బుద్దిరాదు" అని పెద్ద పనిష్మెంట్ ఇవ్వడంతో ఆ దెబ్బకి క్రికెట్ ఆడడం కాదుకదా చూడ్డం కూడా మానేశా.

పదో తరగతిలో ఆమాటకొస్తే బాల్యస్నేహితులందరి విషయంలో అనచ్చేమోలెండి, నాకు బాగా నచ్చే ఒక విషయమేంటంటే ఒకసారి ఫ్రెండ్ అయ్యాడంటే ఇక వాడితో ఎన్ని గొడవలున్నా ఆ స్నేహాన్ని మాత్రం అలాగే కొనసాగించేవాళ్ళం. మాది కో ఎడ్ క్లాస్. చిన్న తరగతి గదిని నిలువునా రెండు భాగాలు చేసి అమ్మాయిలు ముందు వరుసల్లో వాళ్లతర్వాత ఒక వరుస వదిలి ఒకేఒక వరుసలో అబ్బాయిలూ రెండో సగంలో అబ్బాయిలూ కూర్చునే వాళ్ళు . అయితే ప్లేస్ చాలక క్లాస్ కి అభిముఖంగా మాష్టారి కుర్చీ పక్కన ఒక బెంచ్ వేసి అక్కడకూడా ఒక ఐదుగురు పిల్లలం కూర్చోవలసి వచ్చేది.

ఇవి ప్రీమియం సీట్స్ అనమాట ఎందుకంటే సార్ తో సమానంగా క్లాస్ ని చూస్తూ అలా ప్రత్యేకంగా కూర్చోవడం బాగుండేదనేది ఒక కారణమైతే అసలు కారణం సార్ కి అంత దగ్గరగా సాధారణంగా ఇంటెలిజెంట్ స్టూడెంట్సే కూర్చుంటారనే భ్రమలో మా సార్లు అక్కడున్న మమ్మల్ని ఎక్కువ ప్రశ్నలు అడిగేవాళ్ళు కాదు. ఎదురుగా ఉన్న మిగతా క్లాస్ మీద ఉండేది వాళ్ళ ఏకాగ్రత. సో ఆ సీట్స్ కోసమ్ ఒకో రోజూ రామ రావణ యుద్దమ్ జరిగేది. చొక్కాలు చినిగిపోయే రేంజ్ కి దెబ్బలాడుకుని కాళ్ళతో తొక్కేసుకుని తోసేసుకుని సీట్ సంపాదించాల్సి వచ్చేది. అంత గొడవపడినా ఇంటర్వెల్ లో భుజాలమీద చేతులేసుకుని వెళ్ళి కలిసి ఆడుకునే వాళ్ళం. అలాగే మాలో మేము ఎంత గొడవ పడినా అక్కడ లోకల్ గ్యాంగ్ తో ఏవైనా తగవొస్తే మాత్రం మేమంతా కలిసిపోయేవాళ్ళం.

తొమ్మిదిలో ట్యూషన్ చేరకుండా తప్పించుకున్నా కానీ పదిలో మాత్రం నా ఆటలు సాగలేదు. తొమ్మిది చివరిరోజుల్లో అనుకుంటాను మా క్లాస్ టాపర్ స్వర్ణ గాడు ఓ రోజు కొత్త పెన్ను ఏదో తీసుకొచ్చి హడావిడి చేస్తున్నాడు. "ఎక్కడిదిరా అబ్బాయి?" అని అడిగితే "మా ట్యూషన్ లో టెస్టులు అవీ పెట్టి ఫస్ట్ వచ్చినవాళ్ళకి ఇలా గిఫ్టులు డబ్బులు ఇస్తారురా" అని చెప్పాడు. మనకి నోరు ఊర్కోదు కదా "ఓహో అయితే ఈ గిఫ్టులకోసమైనా మీ ట్యూషన్ లో చేరాలనమాట" అని ఒక డైలాగ్ వేసేసి ఆ విషయం అక్కడికక్కడే మర్చిపోయాను.

పదో తరగతి మొదటిలోనే మా మమ్మీకి ఎలా తెలిసిందో గానీ పాండురంగారావు గారి ట్యూషన్ గురించి తెలిసి అందులో చేర్పించేసింది. మా స్వర్ణగాడు చెప్పిన ట్యూషన్ అదేనన్నవిషయం నాకు అక్కడ వాడ్ని చూసేవరకూ తెలియదు. అక్కడ నన్ను చూడడం ఆలశ్యం మావాడు నా డైలాగ్ కాస్తా మా మాష్టారు దగ్గర ఊదేశాడు. ఈ ట్యూషన్ అదే అని నాకు తెలియదు మొర్రో అన్నా ఎవరూ వినిపించుకోలేదు. పైగా అప్పటివరకూ మన చదువులు అంతంత మాత్రమే అదీ కాక నిజాయితీకి మారుపేరుగా ఉండి జిమ్మిక్కులు చెయడం తెలీకపోవడంతో అప్పుచెప్పడమ్ అందరికన్నా ఆఖర్న ఎక్కువసేపు చెప్పేవాడ్ని, ఇచ్చిన హోమ్ వర్క్ కంప్లీట్ చేయలేక సార్ చెప్పేకన్నా ముందే బయట నిలబడేవాడ్ని.

దాంతో బొత్తిగా సిగ్గులేని మొద్దబ్బాయిగా నాకో స్ట్రాంగ్ ముద్ర పడిపోయింది. దానికి తోడు గిఫ్టుల కోసం చేరానన్న అపఖ్యాతి ఒకటి ఉండడంతో సార్ తో సహా టాపర్స్ బ్యాచ్ ఎగతాళికి గురయ్యేవాడ్ని. అలాగే ఫస్ట్ యూనిట్ అయ్యేవరకూ భరించాను, కాకపోతే ఆ పరీక్షలు ఎవరి ప్రమేయమ్ లేకుండా నా అంత నేను సొంతంగా రాయడం కనుక అందులో మంచి మార్కులు సాధించి టాపర్స్ బ్యాచ్ లో చేరి పెన్ను గెలుచుకోవడం మరువలేని జ్ఞాపకం. ఆ తర్వాత అదే బ్యాచ్ లో కంటిన్యూ అయి అక్కడ సంపాదించిన దబ్బులతో ఆడియో క్యాసెట్స్ కొనుక్కునేవాడ్ని.

స్కూల్ తో పాటు ట్యూషన్ కూడా కో ఎడ్యుకేషనే. అమ్మాయిలూ అబ్బాయిలూ కలిసి చదువుకునే వాళ్ళం, అవసరాన్నిబట్టి మాట్లాడుకోవడమ్ చేసేవాళ్లం. అందులో మనకి కొంచెం బుద్ధిమంతుడనే బ్రాండ్ కూడా ఉండడంతో మా ఇంటిదగ్గర చుట్టుపక్కల ఉండే అమ్మాయిలకి నేను తోడుగా ఉండి తీస్కురావాల్సి వచ్చేది. అలాటి డ్యూటీల వలన అప్పట్లో మా ఏరియాలోని కాలేజ్ కుర్రాళ్ళు కొందరితో లైట్ గా గొడవలు అయ్యేవి. నన్ను ఒంటరిగా పట్టుకుని బెదిరించడానికి చూసేవాళ్ళు. నేనేమో పేద్ద హీరోలా ఫీలైపోయే వాడ్ని. తలచుకుంటే నవ్వొస్తూ ఉంటుంది ఇపుడు.

అలాగే పదోతరగతిలో ఉన్నపుడే ట్యూషన్ లోనూ, స్కూల్లోనూ కూడా ఆగస్ట్ పదిహేను కీ, యానివర్సరీకి ఫంక్షన్స్ ఆర్గనైజ్ చేయడం, అలాగే మా ఎలిమెంటరీ స్కూల్ లో ప్రదర్శన ఇవ్వడానికి అపుడపుడు మెజీషియన్లు ఎవరైనా వస్తే ఆ ప్రదర్శనలు ఆర్గనైజ్ చేయడం లాంటివి మా అదనపు బాధ్యతగా ఉండేది. ఈ ఫంక్షన్స్ కోసం బేకరీ/స్వీట్ షాప్ వాడితో డీల్స్ మాట్లాడి, మా పలుకుబడి చాలకపోతే పేరెంట్స్ పలుకుబడి అయినా ఉపయోగించి తక్కువ రేట్ కి సంపాదించి ప్రిన్సిపల్ దగ్గర మార్కులు కొట్టేయడానికి పోటీలు పడేవాళ్ళం. అలాగే ఫంక్షన్స్ లో డాన్సులు, డ్రామాలూ, వాటికి రిహార్సల్సూ, అదో పెద్ద ప్రహసనం. చాలా ఎంజాయ్ చేసేవాళ్ళం.

వాటిలో నాకు బాగా గుర్తుంది ఒకటేమో పాండురంగారావు మాష్టారు ట్యూషన్ లో మా నజీర్ గాడు డిస్కోడాన్సర్ లో పాటకి చేసిన డిస్కోడాన్స్ ఒకటైతే ఇంకోటి కార్తీక వనభోజనాలు. ఇవి రెండిటి ఆర్గనైజింగ్ కమిటీలో నేనూ ముఖ్యమైన వ్యక్తిని. నరసరావుపేట ఊరి చివర్లో లింగంగుట్ల దగ్గర ఒక పేద్ద మామిడితోపు ఉండేది. అక్కడే ఓ పక్క పేద్ద చేపల చెరువు కూడా ఉండేది. అక్కడ గుబురుగా పెరిగిన పెద్ద పెద్ద మామిడి చెట్ల మధ్య కార్తీక మాసపు వనభోజనాలు చేయడం మంచి జ్ఞాపకం.

తినేసి ఆటలాడేసి చెట్లెక్కేసి ఒళ్ళుగుల్ల చేసుకునేవాళ్ళం. చేపల చెరువులో బొరుగులు వేసి చేపలని చూడ్డం కూడా సరదాగా ఉండేది. అక్కడే మొదటిసారి నేను సైకిల్ తొక్కాను. అదీ ఏకంగా త్రిబుల్స్ ని ఎక్కించేసుకుని అనమాట. చేపల చెరువు గట్టుమీదుగా

తొక్కేసి తోపులో దింపిన తర్వాత సైకిలెక్కిన ఇద్దరు ఫ్రెండ్స్ కీ “నేను సైకిల్ తొక్కడం ఇదే మొదటిసారిరా” అని చెప్తే భయపడిన వాళ్ళు ఆ తర్వాత చదువు పూర్తయ్యేవరకూ కూడా “వీడితో జాగ్రత్తరా బాబు, సైలెంట్ గా డేంజర్ లో పడేస్తాడు..” అని ప్రచారం చేసేవాళ్ళు.

ఇంకా నా పదోతరగతి జ్ఞాపకాలలో ముఖ్యమైనవి అప్పుడపుడే ప్రాచుర్యాన్ని పొందుతున్న టివిలు, అవి అప్పట్లో కొందరు ఫ్రెండ్స్ ఇళ్ళలో మాత్రమే ఉండేవి సో ఆ ఫ్రెండ్స్ ని మంచి చేసుకుని క్రికెట్ మ్యాచ్ లూ, చిత్రలహరి ప్రోగ్రాములూ, సినిమాలు చూడడం చేసేవాళ్ళం. అలాగే మా బ్యాచ్ అంతటికీ మంచి ఔటింగ్ ప్లేస్ ఈశ్వర్ కూల్ డ్రింక్స్. మా ఊరి కోర్ట్ బిల్డింగ్స్ దగ్గర ఉన్న ఈ స్వీట్ షాప్ కమ్ కూల్ డ్రింక్ షాప్ కమ్ బేకరీ నాకు చాలా ఇష్టమైన ప్లేస్. అక్కడ బాదంపాలు, గ్రేప్ జ్యూస్ చాలా బాగుండేవి. మంచి పొడవైన గాజు గ్లాస్ లో అడుగున బాగా ఊరిన ద్రాక్ష పళ్ళు వచ్చేలా చిక్కని జ్యూస్ ఇచ్చేవాడు. భలే రుచిగా ఉండేది. సమ్మర్ లో కేవలం అవి ఎంజాయ్ చేయడానికే దాదాపు కిలోమీటర్ పైగా ఎండలో నడిచి వెళ్ళి బాగా దాహమేశాక చల్లగా గ్రేప్ జ్యూస్ తాగేసి రిక్షాలో ఇంటికి వచ్చేవాళ్ళం.




నేను పదో తరగతి చదివిన రోజుల్లో కాంపిటీషన్ ఉన్నా హెల్తీ కాంపిటీషన్ కావడంతో ర్యాంకులూ టోటల్ మార్కులూ అంటూ పరుగులెట్టించక ఫస్ట్ క్లాస్ లో ఎందరు పాసయ్యారు అని లెక్కలేసుకునే రోజులు కావడంతో చదువులతో సమానంగా ఆట పాటలు అల్లర్లతో ఎంజాయ్ చేయగలిగాము.

అప్పటి మిత్రబృందమంతా చెట్టుకొకరు పుట్టకొకరముగా చెల్లాచెదురు అయినా ఎక్కడ ఉన్నా అందరూ సంతోషంగా ఉండుంటారని ఆశిస్తున్నాను.

నా పేరు వేణూశ్రీకాంత్ దొర్ల. పుట్టింది నరసరావుపేటలో. మధ్యలో ఒక్క రెండేళ్ళు తప్ప స్కూల్ చదువంతా అక్కడే చదివినా ఇంటర్మీడియెట్ విజయవాడ సిద్ధార్థ రెసిడెన్షియల్ లోనూ, ఇంజనీరింగ్ వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్ లోనూ చదివాను. ప్రస్తుతం సాఫ్ట్వేర్ రంగంలో పని చేస్తున్నాను, నివాసం గుంటూరులో. బ్లాగింగ్ హాబీగా ఒక ఐదేళ్ళగా కొనసాగిస్తున్నాను. నా బ్లాగులు
“నాతో నేను నా గురించి (http://venusrikanth.blogspot.in/)”
మరియూ “పాటతో నేను (http://sarigamalagalagalalu.blogspot.com/)”




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# పిన్నమనేని రాధిక (నాని)

మా ఊరి పేరు గాంధీనగరం! పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ చిన్న పల్లెటూరు. ఆంధ్రదేశంలోని చాలా పల్లెల్లో లాగానే మా ఊళ్ళోనూ చిన్న ప్రైమరీ స్కూల్ మాత్రమే ఉండేది. దాంతో హైస్కూల్ చదువు కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా పక్కూరి కి నడిచి వెళ్ళాల్సి వచ్చేది. ఇప్పట్లా స్కూల్ బస్సులేమీ ఉండేవి కాదు. ఆర్టీసీ బస్ ఐతే అప్పుడే కాదు ఇప్పటికీ లేదనుకోండి. అందుకని స్కూలుకి రోజూ నడిచే వెళ్ళేవాళ్ళం. మా ఊరినుంచి మొత్తం నలుగురైదుగురు పిల్లలం ఉండేవాళ్ళం. ఉదయం

ఎనిమిది గంటలకే బయలుదేరి అందరం కలిసి వెళ్ళేవాళ్ళం. వర్షాకాలం మా ఊరి చెరువు నిండిపోతే చుట్టూ తిరిగి వెళ్ళేవాళ్ళం. అదింకో రెండు కిలోమీటర్ల ఎక్కువ.

ఓ రోజు అనుకోకుండా అందరూ స్కూల్ కి రావడం లేదన్నారు. "ఒక్కదానివే వెళ్ళాలి కదా నువ్వు మానేయ్" అంది అమ్మ. కానీ పెద్ద సిన్సియర్ గా "ఒక్కదాన్నే వెళ్తాలే" అని వెళ్ళా. వెళ్ళేటప్పుడు బాగానే వెళ్ళా కానీ స్కూల్ నుండి ఇంటికి వచ్చేటప్పటికి వాతావరణం మారిపోయింది. ఆకాశమంతా నల్లటి మబ్బులతో వాన మొదలైపోయింది. దానికి తోడుగా ఉరుములు, మెరుపులు.. నాకేమో ఆ ఉరుముల శబ్దానికి దడ మొదలైపోయింది. ఓ వైపు హోరున గాలి, వాన.. మరోవైపు ఉరుములు.. చుట్టూ పొలాలే. ఆ రోజు ఇంటికి ఎలా వచ్చేనో నాకే తెలీదు! ఆ ఒక్కరోజు స్కూలుకి వెళ్ళినందుకు జ్వరం వచ్చి వారం రోజులు స్కూల్ మానేయవలసివచ్చింది. ఇప్పటికీ పెద్దగా గాలీ వానా వస్తే అవే జ్ఞాపకాలు మెదులుతూ వుంటాయి.

అలా ఎలాగో పడుతూ లేస్తూ మూడేళ్ళు స్కూలుకి వెళ్ళేను. మా పాట్లు చూడలేక తొమ్మిది, పదో తరగతులు ఇలాగే చదివితే కష్టమని, అప్పటికి మా చెల్లి కూడా హైస్కూల్ చదువుకు రావడంతో ఇంట్లోవాళ్ళు ఇద్దరినీ ఇంకో పక్కూరు యర్నగూడెంలోని "శ్రీ బొల్లిన గంగరాజు ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల" లో మావయ్య ఇంట్లో ఉండి వెళ్ళేలా చేర్పించారు. మావయ్య పిల్లల ముగ్గురికీ జత చెల్లీ, నేనూ కూడా కలిసాం. అక్కడ కూడా ఇంటి నుండి బడికి ఓ కిలోమీటర్ పైగా ఉండేది. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మొత్తం నాలుగు సార్లు స్కూలుకి వెళ్ళడం రావడం.. హ్మ్! మొత్తం మీద అక్కడా రోజుకి నాలుగు కిలోమీటర్లు నడక తప్పలేదు.




అయినా పాత బడి కన్నా కొత్త బడి బాగా నచ్చింది నాకు. ఎందుకంటే, కొత్తబడిలో పాత బడిలో ఉన్న షెడ్డుల్లా ఎప్పుడు కూలిపోతాయా అన్న భయం లేకుండా హాయిగా అన్నీ పక్కా బిల్డింగ్ లే. బడి చుట్టూ పెద్ద పెద్ద తురాయి, పున్నాగ, కానుగచెట్లు ఉండేవి. మధ్యలో పేద్ద ప్లే గ్రౌండ్ ఉండేది. ఆ స్కూల్లో నన్ను అన్నిటికన్నా ఎక్కువ ఆకర్షించింది అదే. పైగా మా అమ్మ, నాన్నగారు, మావయ్యలు అంతా ఆ స్కూల్లోనే చదవడంతో మొదటిరోజే ఏదో సొంతింటికి వచ్చేసానన్న భావన

వచ్చేసింది. మరి తరగతిలో తోటిపిల్లలెలా ఉంటారో అనుకుంటూ కాస్త సిగ్గుగా, భయంగా అడుగుపెట్టా క్లాస్ రూమ్ లోకి. ఆ ఏడు నేనొక్కదాన్నే కొత్తగా మా సెక్షన్ లో చేరింది. పరవాలేదు, మరీ అనుకున్నంత కొత్తగా ఏం అనిపించలేదు. అందరితో హాయ్ హాయ్ అంటూ పరిచయాలు, పలకరింపులతో మొదటిరోజు హాయిగా గడిచిపోయింది.

సాయంకాలం స్కూలు అయిపోయాక మొత్తం మా పిల్ల గ్యాంగ్ అందరికీ మాఇంటి పక్కనే లక్ష్మణస్వామి గారి దగ్గర ట్యూషన్ ఉండేది. మా క్లాస్మేట్స్ హేమ, వనిత, నళిని కూడా అక్కడికే ట్యూషన్ కి వచ్చేవారు. వాళ్ళు ముగ్గురూ ఎప్పుడూ ఒక జట్టుగా ఉండేవారు. తర్వాత్తరువాత వాళ్ళ ముగ్గురికీ నేను కూడా జతయ్యానన్నమాట! వాళ్ళ చొరవ తోటి తొందరలోనే స్కూల్లో క్లాస్ మేట్స్ కూడా చక్కగా అలవాటైపోయారు. మేం నలుగురం ఏం చేసినా కలిసి చెయ్యాల్సిందే, ఎక్కడికెళ్ళినా కలిసి వెళ్ళాల్సిందే! రోజూ స్కూల్ కి వెళ్ళడం, రావడం కూడా కలిసే చేసేవాళ్ళం.

మాలో ఎవ్వరు ఓ రెండు మూడు రోజులు స్కూలు మానేసినా పెద్ద కష్టంగా ఉండేది కాదు. రానివాళ్ళ కోసం మిగిలిన వాళ్ళం నోట్సులన్నీ సిద్ధం చేసేసేవాళ్ళం. మా నలుగురిలోకీ హేమ బాగా చదివేది. క్లాస్లో ఉన్న ఆడపిలల్లో హేమే టాప్! మొత్తం క్లాస్ లో మాత్రం రెండు, మూడు స్థానాల్లో ఉండేది. ఎలాగైనా క్లాస్ ఫస్ట్ రావాలని చాలా కష్టపడేది. దానికి తగ్గట్టే మా టీచర్ నైంత్ క్లాస్ లో ఎవరు క్లాస్ ఫస్ట్ వస్తే వాళ్ళే టెన్త్ క్లాస్ లో క్లాస్ లీడర్ అని యాన్యువల్ పరీక్షల ముందు ఎనౌన్స్ చేసారు. పాపం దాని కష్టానికి తగ్గ ప్రతిఫలం ఒక్క మార్క్ లో దక్కకుండా పోయింది.

స్కూల్లో అందరూ నీలం, తెలుపు యూనీఫారంలో రావాలని కొత్తగా రూల్ వచ్చిందని తొమ్మిదో తరగతి పరీక్షలప్పుడు వేసవి సెలవలకు ముందే చెప్పారు. అమ్మకి టైలరింగ్ వచ్చు. వేసవి సెలవలైపోయి మళ్ళీ బడి తెరిచేటప్పటికి చెల్లికీ, నాకూ నీలం కుచ్చిళ్ళ స్కర్ట్, తెలుపు షర్ట్ తో తనే యూనీఫారాలు రెడీ చేసేసింది. అలా కొత్త యూనీఫామ్ వేసుకుని, కొత్త కొత్త ఊహలతో చాలామంది జీవితాల్లో ఓ మేలిమలుపు, మైలురాయి అనదగ్గ పదోతరగతిలోకి (1987-88) అడుగుపెట్టేసాం మేమంతా!

స్కూలు తిరిగి మొదలైన వారానికనుకుంటా స్కూల్ కి హెడ్ మాస్టర్, మాకు లెక్కల మాస్టారు అయిన సీనయ్య గారు, అసలు పదో తరగతి విద్యార్థుల జీవితాలలో ఎంత ముఖ్యమైనదో, పదోతరగతి పాసయ్యాక ఏం చదవాలో, ఆ స్కూల్ నుండి పది పాసై వెళ్ళినవాళ్ళు ఇప్పుడు ఏమేం చదువుతున్నారో, ఫెయిల్ అయిన వాళ్ళు ఏం చేస్తున్నారో... ఇంకా చాలా చాలా చెప్పి, మమ్మల్నందరినీ ఎవరెవరు ఏం చదవాలనుకుంటున్నారో చెప్పమని అడిగారు. ఇప్పటి పిల్లలకైతే బళ్ళోకెళ్ళడం మొదలవ్వగానే వాళ్ళేం చదవాలి, పెద్దయ్యాక ఏమవ్వాలి అన్నది నూరిపోసేస్తున్నారు. అప్పుడు మాకేం తెలుసు! ఏదో అడుగుతున్నారు కదా అని అందరం తలోటి చెప్పేసేం. మా హేమ సైంటిస్ట్ అవుతానంది. వనిత లెక్చరర్ అవుతానంది. ఇంకా డాక్టర్, లాయర్ ఇలా అందరూ తలోటీ చెప్పేస్తున్నారు. నాకేం చెప్పాలో తెలియక నేను డ్రిల్ టీచర్ అవుతానన్నా. అన్నట్టే అయ్యాను కానీ, స్కూల్ పిల్లలకి కాదు మా అబ్బాయికి! :-)



స్కూల్లో క్రాఫ్ట్ ,డ్రాయింగ్ క్లాస్లంటే నాకు చాలా ఇష్టంగా ఉండేది. నా కుట్లు, అల్లికల హాబీకి బీజం అప్పుడే పడింది. మంచి శ్రద్ధగా నేర్చుకునేదాన్ని. అన్నీ క్లాసులు జరిగిపోతున్నాయి సిన్సియర్ గా.. మనదేమో కాస్త లేజీ లేజీగా చూద్దాంలే, చదువుదాంలే అనుకునే పద్ధతన్నమాట. మొదటి యూనిట్ పరీక్షల్లో వచ్చిన మార్కులు చూసి నాన్నగారి కోటింగ్ పడ్డాక అప్పుడు లైన్లో పడ్డా.

మా ఫ్రెండ్స్ కొంతమంది పొరుగూళ్ళ నుండి సైకిల్ మీద వచ్చేవారు. వాళ్ళను చూస్తుంటే నాకూ సైకిల్ నేర్చుకుంటే బాగుండుననిపించేది. ఎలాగో వాళ్ళ సాయంతో కిందా మీదా పడి దెబ్బలు తగిలించుకుని సైకిల్ తొక్కడం నేర్చుకున్నా. ఓ రోజు చాకలి దగ్గరున్న యూనీఫాం తీసుకురావడానికి ఎవరూ లేరని, కొత్తగా సైకిల్ నేర్చుకున్న మోజులో ఉన్నానేమో, అత్తయ్య వారిస్తున్నా వినకుండా సైకిలేసుకుని బయలుదేరిపోయా. స్కూల్ కి లేటవుతుందని స్పీడ్ గా వస్తూ ఎదురుగా ఉన్న కుక్కని తప్పించబోయి రాయిమీద పడేటప్పటికి మోకాలిచిప్ప పై చీరుకుపోయి బాగా దెబ్బతగిలి రక్తం కారిపోసాగింది. స్కూల్ కి టైం అవుతుందన్న కంగారు ఓ వైపు, పడిపోయి దెబ్బలు తగిలించుకున్నానని ఇంట్లో తెలిస్తే ఏమంటారో అన్న భయం ఓవైపు. ఎలాగో నెమ్మదిగా ఇంటికెళ్ళి చెల్లి సాయంతో ఎవరికీ తెలీకుండా మేనేజ్ చేసి స్కూల్ కి వెళ్ళి పోయా.

ఆ రోజు సాయంత్రం స్కూల్ నుండి వచ్చాక ట్యూషన్ కి వెళ్ళినప్పుడు అక్కడ కాలుజారిపడి మళ్ళీ అదే మోకాలి చిప్పకు దెబ్బ తగిలింది. ఈ సారి ఉదయం కన్నా గట్టిదెబ్బ తగలడంతో చూస్తుండగానే ఇంత లావు వాచిపోయి నడవలేకుండా ఐపోయింది. దాంతో అసలు విషయం ఇంట్లో తెలిసి ముందు చివాట్లు పడ్డాక తరువాత వైద్యం సంగతి చూశారు. ఆ తరువాత కొన్ని రోజుల వరకూ సైకిల్ జోలికి పోతే ఒట్టు.. అప్పటి ఆ గాయం మిగిల్చిన గుర్తు ఇప్పటికీ అప్పుడప్పుడూ నాకూ సైకిల్ తొక్కడం వచ్చు అని గుర్తుచేస్తూ ఉంటుంది.

ఓ రోజు నాన్నగారు, 'సిరివెన్నెల' సినిమా పాటల కాసెట్ తెచ్చారు. ఆ పాటలు వినగానే అందులో "విరించినై విరచించితిని" పాటకు పెద్ద ఫాన్ ఐపోయా. పాటని రాసుకుని స్కూల్ కి తీసుకెళ్ళి ఫ్రెండ్స్ కి చూపించి బ్రేక్ లో అందరం కలిసి సీరియస్ గా పాట ప్రాక్టిస్ లో ఉన్నాం. బ్రేక్ టైం అయిపోవడం మాస్టారు రావడం చూసుకోలేదు. ఇంకేముంది అంతే, మా చేతులపై

వాతలు తేలాయి. "ఊహలు గుసగుసలాడే", "ఏ దివిలో విరిసిన పారిజాతమో", "నెమలికి నేర్పిన నడకలు", "ప్రేమ ఎంత మధురం".. ఇలా చాలా పాటల ప్రాక్టిస్ లో పాటలతో పాటు వాతలు కూడా భాగం అయ్యాయనమాట!

మా హెడ్ కం లెక్కలు మాస్టారైన సీనయ్యగారు మహా స్ట్రిక్ట్. ఎప్పుడూ రూల్స్ రూల్స్ అంటూ మాట్లాడేవారు. నుంచుంటే రూల్, మాట్లాడితే రూల్ అన్నట్టుండేవారు. ఆయన రూల్స్ ధాటికి తట్టుకోలేక ఎందుకొచ్చిందని ఆయన క్లాస్ కొస్తే కిక్కురుమనకుండా ఉండేవాళ్ళం. లెక్కలు మాత్రం అరటిపండొలిచినట్టు ఎంత బాగా చెప్పేవారో. ఎవరైనా తప్పు చేస్తే మాత్రం అమ్మాయిలనైనా చూసేవారు కాదు. పడిపోయేయంతే! అలా... బాదేసేవారు. అందుకే ఆయనన్నా, ఆయన క్లాసన్నా వళ్ళు, బుర్ర అన్నీ దగ్గర పెట్టుకుని వుండేవాళ్ళం. లెక్కల్లో మా బ్యాచ్ ఎవ్వరూ ఫెయిలవలేదంటే అదంతా ఆయన ఘనతే!

గవర్నమెంట్ స్కూల్స్ లోనే కానీ, కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక చాలా స్కూల్స్ లో అసలు డ్రిల్ పిరియడే (ఇప్పుడు p.e.t అంటున్నారు. మేం డ్రిల్ అనేవాళ్ళం) ఉండటం లేదు కదా! మాకు రోజూ డ్రిల్ పిరియడ్ ఉండేది. గంగాధర్ గారు మా డ్రిల్ మాస్టర్. డ్రిల్ పిరియడ్లో గ్రౌండ్ కి వెళ్ళడం ఎగ్గొడితే మాకైతే అదే ఆడపిల్లలకి కాస్త కన్సెషన్ ఉండేది కాని అబ్బాయిల్ని మాత్రం గ్రౌండ్ మొత్తం పరిగెట్టించేవారు. ఈ ఒక్క విషయంలో కాస్త కఠినంగా వున్నా గంగాధర్ మాష్టారు పిల్లలందరితో చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు. త్రోబాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్ బాగా ఆడించేవారు. ఏ స్కూల్ లో పోటీలు జరిగినా మమ్మల్ని తీసుకెళ్ళేవారు. స్కూల్ లో ఏం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా ఆయన ఆధ్వర్యంలోనే జరిగేవి.

మేం పది చదివేటప్పుడే మా బళ్ళో జిలా స్థాయి ఆటల పోటీలు జరిగాయి. మన బళ్ళో జరుగుతున్నాయి కాబట్టి మనమే మొదటి స్థానంలో ఉండాలని అందరితో బాగా ప్రాక్టిస్ చేయించేవారు. మా స్కూల్లో కోకోకి, కబడ్డీకి మంచి టీములు ఉండేవి. వాటిలో మాకు తప్పకుండా బహుమతులు వస్తాయనుకున్నారు కానీ మిగతా అన్నిటిలోనూ గెలిచి, వాటిలో మాత్రం ఓడిపోవడంతో మా బడి మొదటి స్థానం కాకుండా రెండోస్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది.

పదో తరగతిలో ఉన్నప్పుడే నాకు షటిల్ ఆడటం అలవాటైంది. ఏమాత్రం కాస్త టైం దొరికినా షటిల్ ఆడటానికి వెళ్ళిపోయేదాన్ని. చాలా ఇష్టంగా ఆడేదాన్ని. ఇప్పుడూ ఎప్పుడన్నా పిల్లలతో ఆడితే అంతే ఇష్టంతో ఆడతా. అలాగే త్రోబాల్ కూడా. గంగాధర్ మాష్టారి ప్రాక్టిస్ ప్రభావంతో కావచ్చు త్రోబాల్ లో కాలేజ్లో నాకో సర్టిఫికెట్ కూడా వచ్చింది. మిగిలిన సబ్జెక్ట్ లు చెప్పిన టీచర్ల కన్నా నాకు వీరిద్దరే బాగా గుర్తున్నారు అంటే ఒకరు చండశాసనుడు అవ్వడం వలన, ఒకరు శాంతమూ, ఆప్యాయత గలిగిన వ్యక్తీ అవ్వడం వలన కావొచ్చు.

నేను పదో తరగతిలో ఉన్న సంవత్సరమే మాకు దగ్గరలో ఉన్న ఒక చిన్న టౌన్ లో జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ జరిగింది. ఆ సైన్స్ ఫేర్లో మా స్కూల్ తరపున ఎవరూ పాల్గొనకపోయినా మా మాష్టార్లే ఒక ఆర్టీసీ బస్సు మాట్లాడి పదోతరగతి పిల్లలందరి తల్లిదండ్రుల్నీ ఒప్పించి మరీ తీసుకెళ్ళారు.

ఆ సైన్స్ ఫేర్ ఒక  జూనియర్ కాలేజీలో పెట్టారు. అప్పటిదాకా ఎప్పుడూ మా చుట్టుపక్కల చిన్న చిన్న ఊళ్ళకి తప్ప ఎక్కడికీ వెళ్ళని మేము ఆ సైన్స్ఫేర్ కి వెళ్ళి ఏదో చూసామనిపించి అసలు వెళ్ళిన సంగతి వదిలి సుబ్బరంగా ఊరంతా తిరిగి ఎంజాయ్ చేసేసాం. పాపం మాస్టార్లు ఏమీ అనలేదు. తర్వాత్తర్వాత క్లాసులో చిన్న చిన్న అల్లర్లు, ఆనందాలు, తగాదాలు, మధ్య మధ్యలో పరీక్షలూ, మార్కులు తగ్గితే టీచర్లతో పాటు నాన్నగారితోనూ అక్షింతలు... వీటన్నీటితో చూస్తుండగానే టెంత్ క్లాస్ పబ్లిక్ పరీక్షలు నెల రోజుల్లోకి ముంచుకొచ్చేశాయి. సీరియస్ గా చదువుల్లో పడిపోయామంతా. పరీక్షలు దగ్గరకొచ్చేస్తున్నాయని ఉదయం నాలుగ్గంటల నుండి ఏడు గంటల వరకూ స్పెషల్ ట్యూషన్ పెట్టారు. సాయంత్రం ట్యూషన్ ఎప్పట్లానే ఉండేది. మరీ ఇప్పట్లా పూటలు పూటలు కాకపోయినా అప్పుడూ కరెంట్ కోతలుండేవి. కరెంట్ పోతే సాయంగా ఉంటుందని ట్యూషన్ కి కిరోసిన్ లాంతర్లు తీసుకెళ్ళేవాళ్ళం. రోజూ బడి నుండి రాగానే లాంతరు శుభ్రం చేసుకుని, కిరోసిన్ పోసుకుని, రెడీ చేసుకుని వుంచుకునేవాళ్ళం.

అప్పటికి మా బళ్ళో పదితరగతి సెంటర్ ఉండేది కాదు. మాకు ఆరు కిలోమీటర్ల దూరంలో స్కూల్ కి వెళ్ళి పబ్లిక్ పరిక్షలు రాయాలి.  పరీక్షలన్నిరోజులూ నాన్నగారు స్కూటర్ మీద తీసుకెళ్ళేవారు. చివరి పరీక్ష సోషల్ అయిపోగానే హమ్మయ్య దీనితో అయిపోతాయి అనుకుంటే సోషల్ పేపర్ లీక్ అయిందని మళ్ళీ రీ ఎక్జామ్ పెట్టారు. మాకు అదొక అదనపు తలనొప్పన్నమాట!

పరీక్షలైపోయాయి ! పదోతరగతి ఐపోయింది !

వేసవి సెలవలకి అమ్మమ్మా వాళ్ళూరు వెళ్ళాను. పరీక్షల ఫలితాలు ఎప్పుడొస్తాయో అని ఓ వైపు లాగుతున్నా, ఇంకో వైపు వేసవి సెలవల్ని  హాయిగా ఎంజాయ్ చేస్తుంటే, అమ్మ ఫోన్ చేసి రేపు మీ రిజల్స్ వస్తాయట అంది. అంతే, మర్నాడు పేపర్లో ఫలితాలు చూసుకునే వరకూ గప్ చిప్ అయిపోయా. నా చదువు గురించి నాకు తెలుసు కాబట్టి నేననుకున్నట్టే సెకండ్ క్లాస్ వచ్చింది.

అప్పటి వరకూ ఎంతో స్నేహంగా, ఒకే ప్రాణంగా మెలిగిన మా నలుగురు స్నేహితురాళ్ళదీ పదో తరగతి తరువాత ఎవరి దారి వారిదే ఐపోయింది. చాలా ఏళ్ళ తర్వాత హేమని ఎప్పుడో ఓసారి చూసా. ముంబాయ్ లో జాబ్ చేస్తుందని తెలిసింది. నళిని సంగతైతే చెప్పక్కర్లేదు. ఎక్కడుందో కూడా తెలీదు! ఇక వనిత, ఆ మధ్య వాళ్ళ  నాన్నగారు మా నియోజక వర్గానికి అనుకోకుండా ఎమ్మెల్యే గా ఎన్నికయ్యేరు. తరువాత వనిత అదృష్టం కొద్దీ మా నియోజకవర్గాన్ని స్త్రీలకి రిజర్వేషన్ చేయడంతో వనితకు అవకాశమొచ్చింది. అలా మా నియోజకవర్గానికి వనిత M.L.A అవ్వడంతో అస్తమానూ పేపర్లో చూస్తుంటాననమాట.

ఇవండీ నా పదోతరగతి జ్ఞాపకాలు!

*****************

నా పేరు పిన్నమనేని రాధిక (నాని). నేనొక సాదా సీదా ఆంధ్రా పల్లెటూరి గృహిణిని. పుట్టినూరుతో పాటు మెట్టినూరు అదే కావడంతో నాకెంతో ఇష్టమైన మా ఊరు 'గాంధీనగరం' లోనే నివాసం. రకరకాల మొక్కలు పెంచడం, సరదాగా ఫోటోలు తీయడం, అప్పుడప్పుడూ బ్లాగు రాస్తుండడం నా వ్యాపకాలు.
నా బ్లాగు 'సత్యప్రియ' http://saisatyapriya.blogspot.in




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# విశ్వామిత్ర

ఊ.. నిజమే, చాలా మందికి పదో తరగతి ఓ జ్ఞాపకం, మధురమయిన జ్ఞాపకం. అందుకే ప్రభుత్వం కూడా మన జీవితంలో ముఖ్యమయిన పుట్టినరోజు తేదీకి ఓ బెంచ్ మార్క్ చేసేసింది ప్రతి గుర్తింపు కోసం. అక్కడ పడ్డ పునాది మిగతా జీవితంలో అంతస్తులమీద అంతస్తులు కట్టుకుని నిలబెట్టుకోడానికి నాంది అవుతుంది మరి, కాదంటారా?

అందుకే అందరిలాగే నాక్కూడా పదోతరగతి జ్ఞాపకాలంటే మక్కువ ఎక్కువ. ఎందుకంటే పదయ్యాక మొట్టమొదటి సారి ఊరొదిలి అమ్మానాన్నల్ని, అక్కని, ముఖ్యంగా నానమ్మని వదిలి వేరే ఊరు చదువుకోడానికి వెళ్ళాల్సి రావడం, అలా అలా మొదలయిన దేశాటన, సర్కస్ జీవితం ఇంకా జరుగుతూనే ఉండటం విచిత్రం. పదికి ముందూ తర్వాతా భాగాల్లా జీవితం విడిపోతుందేమో మనకి.

సరే ఇంక జ్ఞాపకాల్లోకొస్తే...



అసలు నా చదువే ఓ విచిత్రం. మా పెద్దాయన మమ్మల్ని అందర్నీ జోడీలు చేసి చదివించేసేవారు ఖర్చు కలిసొస్తుందనో ఏమో తెలీదు కానీ, మా రెండో అక్కని మా అన్ననీ, నన్నూ నా పై అక్కనీ కలిపి ఇలా అన్నమాట. నేను తెలివయినవాణ్ణి (అని నాకూ ఓ గోప్ప అభిప్రాయం మరి) కావడంతో ఇన్‌టూ ఫస్ట్ ఫార్మ్ చదివేసి, పుట్టిన తేదీ ఓ రెండేళ్ళు పెంచేసి ఆరులోకి గెంతి అక్కడ్నించి మా అక్కతో కలిసి చదువుకుంటూ పదిలోకి వచ్చేసానన్నమాట.

మా “అనాతవరం” స్కూల్ “సోషల్ వెల్‌ఫేర్ హై స్కూల్” ఆ చుట్టుపక్కల నాలుగైదు గ్రామాలకి అదే స్కూల్ అన్నమాట. అందుకని ఆ గ్రామాల్నించి కూడా పిల్లలొచ్చేవారు చదువుకోడానికి. ఆడా మగా అందరూ కలిసే కూర్చోపెట్టేవారు క్లాసులో రెండు భాగాలు చేసి. పక్క ఊరు మాగాం నించి వచ్చే రాజులంతా తాటి చెట్లల్లా ఉండేవారు (అంటే అప్పటికే పెళ్ళయిపోయి ఒకరిద్దరు పిల్లలు ఉన్నవాళ్ళలా కూడా ఉండేవారనుకోండీ), వాళ్ళకి ఏదో ఈ పది అయిపోతే చాల్లే అని ఉండేది.

అప్పట్లో లెక్కలకి జెనరల్, కాంపోజిట్ అని ఉండేవి. తొమ్మిదయ్యాకో తొమ్మిదినించో రెండూ విడకొట్టి చెప్పేవారు. కాంపోజిట్ క్లాస్ కి మేం పన్నెండు మంది ఉంటే అందులో ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు (ఒకమ్మాయి వేరే స్కూల్ లెక్కల మేష్టారి కూతురే అనుకోండి). ఆ క్లాసుకి నందిగ అప్పారావు అని ఆయన వచ్చేవారు. పాపం పొట్టివాడే, ఎంతంటే లెక్కకి వేసే ఈక్వేషన్ కూడా ఆయనకంటే పొడుగ్గా ఉండేదేమో అనిపించేది. ఆయన చెప్పేది మాకు అర్థం అవ్వాలని తెగ ప్రయత్నించేవారు, కానీ మాకు అప్పటికే ప్రైవేట్లో చెప్పేసి ఉండడంతోనో, లేదా చెప్పించుకోవచ్చనో పట్టించుకునేవాళ్ళం కాదు. అసలే గోదారోళ్ళకి కొంచం వెటకార, గోరోజనంతో పాటు సహజ బూతు సాహితీ పాండిత్యం కూడా కవచ కుండలాలు కాబట్టి ఆయన ఇంటి పేరుని బూతు పేరుగా మార్చి పిలిచేవాళ్ళం. దాంతో ఆయనకి కోపం వచ్చేది. కాకపోతే ఎవరితో చెప్పుకుంటాడు ఏమని చెప్పుకుంటాడు. ఆ వయసుకి ఉత్సాహంగా అల్లరి చెయ్యడం, సరదాగా నవ్వుకోవడం తప్పితే అది మంచా చెడా అన్న ఆలోచన కూడా వచ్చేది కాదు.

మాకు ఇళ్ళల్లో చదివించే పరిస్థితి ఉండదు కాబట్టి ప్రై''వేటు'' తప్పకుండా ఉండేది. ప్రత్యేకించి లెక్కల కోసమే, మిగతా సబ్జెక్టు అన్నీ మేము చదివేసుకోడమే. మేము ఇలపకుర్తి సుబ్బారావు గారి దగ్గర ప్రైవేటు, ఇంకో బేచ్ ఏమో నడింపల్లి ఆయన దగ్గర ప్రైవేటు చెప్పించుకునేవాళ్ళు . ఆ ఇద్దరు మాష్టార్లు కూడా వేరే స్కూళ్ళల్లోనే పని చేసేవారు (చూసారా ఎంత నిజాయితీగా ఉండేదో, మన స్కూల్ మాష్టారయితే పరీక్షల్లో మార్కులు ఎక్కువ వేసే అవకాశం ఉంటుంది కదా మరి).

మా మాష్టారి దగ్గర నేనూ, బాబిగాడు, రాజాగాడూ, గోపిగాడూ (మాష్టారి తమ్ముడే), శ్యాం గాడూ, మా అక్కా, మాణిక్యాంబ, ఉష ప్రైవేటు చెప్పించుకునేవాళ్ళం. అదీ రాత్రి పూటే రెండు గంటలు (7-9) చెప్పేవారు. లెక్కలు గమ్మున చేసేస్తే పర్వాలేదు కానీ ఆలశ్యం అయితే అమ్మో స్కేలు అడ్డంగా పెట్టి చెయ్యి వెనక్కి తిప్పమని కొట్టేసేవారు. బాబోయ్ ఒక్క దెబ్బకి బూరెలా పొంగిపోయేది చెయ్యి. అది చూసి పక్క వాళ్ళు నవ్వితే వాళ్ళకీ వడ్డించేసేవారు. నాయనోయ్ ఎన్ని స్కేళ్ళు విరిగిపోయాయో బగమంతుడా (అదృష్టం ఏంటంటే రూళ్ళ కర్ర దాచేసేవాళ్ళం గుడ్డిలో మెల్లలా ఇదే బెటరని). ఆదివారం పొద్దున్నే చెప్పేసేవారు రాత్రి ప్రైవేటు ఉండేది కాదు (మాష్టారు పేకాటకో, ఒక్కోసారి సినిమాకో వెళ్ళేవారన్నమాట). కానీ మేము ఇంట్లో కంటే అక్కడే బెటరని వెళ్ళిపోయేవాళ్ళం.

ప్రైవేటు వదిలాక ఇంటికొచ్చేప్పుడు భలే ఉండేది. మేష్టారి ఇంటినించి అందరం ఇళ్ళకెళ్ళే దారికి ముందే ఒక పాడుబడ్డ మేడ (దెయ్యాల మేడ అని పిలిచేవారు, నాకు తెలిసి అందులోకి ఎవరూ వెళ్ళగా చూడలేదు, మేమోసారి ప్రయత్నించి భయమేసి పరిగెత్తుకొచ్చేసాం). ఆ పక్కనే కోతులకన్నమ్మ గారి పెద్ద తోట ఉండేవి. ఆ మేడా, తోటా దాటేంత వరకూ అందరం చెయ్యా చెయ్యి పట్టుకుని నడిచేవాళ్ళం. ఒక్కసారి అవి దాటగానే మా బాబిగాడు 'ఒరే దెయ్యంరోయ్' అని అరిచేవాడు. అంతే, అందరం ఒకటే పరుగు, దెబ్బకి వచ్చి ఇళ్ళల్లో వాలిపోయేవాళ్ళం.

వేసవి కాలం అయితే కరంటు కోత కాబట్టి ఎవరి లాంతర్లు వాళ్ళే పట్టుకెళ్ళేవాళ్ళం. శీతాకాలం అయితే అందరం విడిపోయే కూడలిలో చలిమంట వేసుకుని కాసేపు కబుర్లు చెప్పుకుని వెళ్ళేవాళ్ళం. మా ఇంటికి వెళ్ళేదారికి ఓ సందు ఉండేది. అక్కడ ఎప్పుడూ లైట్ ఉండేది కాదు. పైగా ఆ సందులో అన్నీ ధాన్యపు గిడ్డంగులే, అందుకని ఆ సందు తిరగ్గానే ఒకటే పరుగు లంకించుకుని సందు చివరిదాకా వచ్చేసేవాళ్ళం అక్కా, నేనూ, మణీ, శ్యాం గాడూ. ఆ సందు తిరగ్గానే మా ఇల్లు ఉండేది కానీ వాళ్ళిద్దరూ వెళ్ళేవరకూ ఉండి మేము ఇంట్లోకి వెళ్ళేవాళ్ళం.

అప్పట్లో ఓ పుకారు ఉండేది, ఆకాశంలో ఎవరో శవాన్ని మోస్తూ వెళ్తుంటే వెనకాల జనాలు జుట్లు విరబోసుకుని వెళ్ళడం చూసామని. అందుకని ఇళ్ళ తలుపుల మీద 'ఓ స్త్రీ రేపు రా' అని రాసుకోవాలని, లేకపోతే ఏవో అనర్ధాలు జరుగుతాయని భయపెట్టారు. ఇంక ఆ రోజుల్లో ప్రైవేట్నించి వచ్చేప్పుడయితే ఆకాశం కేసి చూస్తూ పరిగెట్టుకుంటూ వెళ్ళేవాళ్ళం.

ఇంక నవరాత్రులొచ్చాయంటే పండగే. ప్రతీ రాత్రీ మెయిన్ రోడ్డు మీద, నిమ్మకాయలారి మేడ దగ్గర పెద్ద పందిరి వేసి నాటకాలు, బుర్రకథలు, ఒక్కోసారి తోలుబొమ్మలాటలు అవీ వేసేవారు. అందుకని ప్రైవేట్నించి అవన్నీ చూసుకుని తీరిగ్గా ఇంటికి వెళ్ళేవాళ్ళం. అదో పేద్ద సంబడం. ఇంక దేవుడి పెళ్ళికయితే జ్వాలాతోరణం, రధోత్సవం పెద్ద ముచ్చటే.



మా స్కూలు పక్కనే ఊరునానుకుని పెద్ద చెరువుండేది. అందుకని స్కూలుకి వెళ్ళాలంటే ఊళ్ళోంచి మెయిన్ రోడ్డు మీదుగా దాన్ని చుట్టి వెళ్ళాల్సిందే. కాళ్ళకి చెప్పులుండేవి కావు. అందుకని రోడ్డు వారగా ఇసకపైన నడుచుకుంటూ వెళ్ళేవాళ్ళం. తారు రోడ్డు వేడికి కాళ్ళు కాలతాయని ఒక్కోసారి అడ్డదారిని శ్మశానం పక్కనించి వెళ్ళేవాళ్ళం. మా వీధి చివర్లో కుమ్మరోళ్ళ ఇళ్ళు దాటి సంతలోంచి వెళ్ళాలి. కాకపోతే ఆ సంత దాటగానే శ్మశానం, ఆ పక్కనే పంట కాలవ ఉంటాయి, ఆ మధ్యనించి వెళ్ళాలన్నమాట. ఇలా వెళ్ళేప్పుడు మాత్రం నలుగురైదుగురు కలిసే వెళ్ళేవాళ్ళం. కొంచం ఎండలు కాసే సమయానికి మాత్రం చెరువు మధ్యలో వారధిలా అయ్యేది (బహుశా ఎప్పుడో ఆ చెరువు కప్పెట్టడానికి ప్రయత్నించి వదిలేసారని అనుకునేవాళ్ళం) ఒక్కోసారి ఎవరూ చూడకుండా ఆ దారంట వెళ్ళేవాళ్ళం గుండె చిక్కబట్టుకుని, ఎందుకంటే ఎక్కడన్నా జారిపడ్డామో అంతే సంగతులు చిత్తగించవలెను. ఏడాదికోసారి ఆ చెరువులో చేపలు పట్టేవారు. మేము ఒడ్డున కూర్చుని వింతగా చూసేవాళ్ళం. తెలతెలవారుతుండగానే శివుడి గుడి మెట్ల దగ్గర్నించి మొదలుపెట్టి ఆ ఒడ్డంతా కవర్ చేసుకుంటూ పెద్ద వలని జారేసేవారు. గంటా రెండూ గంటలయ్యాక కొంతమంది ఈదుకుంటూ చుట్టూ వలయంలా ఏర్పడి ఆ వలని ఒక పక్క గట్టునున్న బండరాళ్ళకి కట్టేసి రెండో పక్కనించి లాక్కొచ్చేవారు. మొత్తం వల లాక్కొచ్చేసరికి దాన్నిండా ఎంతంత పెద్ద పెద్ద చేపలో, అన్నిటినీ తీసి డబ్బాల్లో వేసి పట్టుకుపోయేవారు, కొంచం చిన్నవి అనిపిస్తే మళ్ళీ చెరువులో వదిలేసేవారు.

మా క్లాసులో పక్కూరి నించి వచ్చే సర్వమంగళనరసనాగమణి అని అప్పటికే పెళ్ళయిన ఒకమ్మాయి ఉండేది. ఎప్పుడూ అమ్మాయిల్ని ఏడిపించడం అవీ ఉండేవి కాదు. అందరం కలిసి మెలిసి ఉండేవాళ్ళం, అందరం చిన్నప్పట్నించీ కలిసి పెరిగిన వాళ్ళం అవడం వల్లో, మరి అప్పటికి ఈ వెకిలి చేష్టలు అవీ తెలీకపోడం వల్లో ఏమో. అయితే స్కూల్ యానివర్సిరీకి ఏదన్నా నాటిక వేస్తే బాగుంటుందని అనిపించింది. ఈ లోపున "కడవెత్తుకొచ్చిందీ కన్నెపిల్లా" అన్న పాట రికార్డ్ డేన్సుగా వేద్దామని రిహార్సల్ వేశాం, నేనూ మా ఆత్కూరి శ్రీరామచంద్ర మూర్తీ కలిసి. కానీ అది బాగోలేదనిపించింది. అప్పుడు కథ సంపాదించారు వడ్లమాని శ్రీనివాస్, ఆత్కూరి శ్రీరామచంద్ర మూర్తీ, దాన్నే ‘‘ఎవర్నీ నమ్మకు’’ అని నాటికగా వేసాం. అందులో నాదో నమ్మకమయిన ముసలి నౌకరు వేషం సినిమాల్లో కాకరాల లాగ. బాగానే రెస్పాన్సొచ్చింది. ఎలాగూ నెరిసిన జుట్టే కాబట్టి పెద్దగా మేకప్ అవసరం పడలేదు నాకు, నెత్తిమీద కొంచం పౌడర్ జల్లేస్తే సరిపోయింది.

మొదటిసారి పబ్లిక్ పరీక్షలు జాగ్రత్తగా రాయండి అని హెచ్చరించినా మేము అలవోకగా మామూలు పరీక్షలు రాసినట్టే ఏ టెన్షన్లూ లేకుండా రాసాం. కాకపోతే అప్పుడే తెలిసింది కాపీ కొట్టేవాళ్ళని పట్టుకోడానికి ఓ స్క్వాడ్ వస్తుందని, చాలా జాగ్రత్తగా ఉండాలని, అఫ్‌కోర్స్ మనకెలాగూ కాపీ కొట్టాల్సిన అవసరం లేదనుకోండీ.

పరీక్షలు జరిగేది మాకు 4-5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాపురం హైస్కూల్లో కాబట్టి మా ఊరినించి బస్సులో వెళ్ళాలన్నమాట. అందుకని మా పెద్దాయన మా ఇద్దరికి రోజుకి రానూ పోనూ రూపాయి చొప్పున పది రూపాయలు ఇచ్చారు. అక్క బస్సులో వెళ్ళేది నేను మాత్రం మా ఇంకో స్నేహితుడ్ని వాడి సైకిల్ మీద ఎక్కించుకుని తొక్కుకుంటూ తీసుకెళ్ళి ఆ సొమ్ములు దాచుకుని పరీక్షలు అయిన ఆఖరి రోజున అన్నగారి సినిమా "ఆరాధన" చూసాను.



ఇంక అందరం విడిపోయే రోజొచ్చింది. అప్పుడు ఎవరు చెప్పారో ఏమో కానీ చిన్న నోట్ బుక్ లో సగం ఉంటుంది, అది కొనుక్కుని తెచ్చుకుని అందులో అందరం ఒక్కొక్కరి దగ్గరా ఆటోగ్రాఫ్ లు తీసుకున్నాం. ఆ తర్వాత గ్రూప్ ఫొటో మాష్టార్లూ, స్కూల్ ప్యూన్ తో సహా అందరం కల్సి తీయించుకోడం ఓ గొప్ప అనుభూతి. విశేషమేంటంటే ఆ ఫొటో ఈ మధ్యనే ముంబై లో మా చిన్ననాటి స్నేహితుడు వడ్లమాని శ్రీనివాస్ దగ్గర ఉంటే దాన్ని స్నాప్ తీసుకోడం జరిగింది. ఇప్పటికీ అందరం ఎక్కడో ఒక చోట ఏదో ఒకలాగ కల్సుకోడమో మాట్లాడుకోడమో చేస్తుంటాం. బ్రతుకుతెరువు కోసమో, భృతి కోసమో, క్షుత్తు కోసమో ఆ ఊరినించి వెళ్ళిపోయినా వీడిపోయే జ్ఞాపకాలు కావు అవి. నిత్యానుభూతులు, ఊటబావులు, ఓ జీవితానికి సరిపడే మధురానుభవాలు.

"ఇప్పటికీ నాకు మా పదో తరగతి క్లాస్‌మేట్లు అందరి పేర్లూ గుర్తే. పాతికేళ్ళ తర్వాత మా ఉషారాణి ఫోన్ చేసినా నేను గుర్తు పట్టేసాను ఆ గొంతుని. తను ఆశ్చర్య పోతుంది ఎలా గుర్తు పట్టావు శ్రీనూ అంటూ...ఏమో నాకేమెరుక!!!"

*****************

విశ్వామిత్ర గారు నిర్వహిస్తున్న వెబ్సైట్లు:

వేటూరి http://veturi.in

జంధ్యావందనం http://jandhyavandanam.com

కళాతపస్వి http://kalaatapasvi.wordpress.com

# టెంత్ క్లాస్
## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# "zoo-near" చిరు

**గడిచిన రోజులు తిరిగిరావని** చాలామంది చెప్తారు కానీ, వాటిని అనుభవించిన వారికి మాత్రమే ఆ రోజుల కమ్మదనం తెలుస్తుంది. ఆ రోజులకు దూరమవుతున్నామని భావిస్తున్నవారికి మాత్రమే నాటి రుచుల ఫ్లావర్ తెలుస్తుంది.

పదవతరగతిని తలుచుకోగానే ఒక నవలకు సరిపోయేటంత సన్నివేశాలు గుర్తొస్తాయి. కర్నూల్ జిల్లా, నంద్యాలలోని "విజయవాణి పబ్లిక్ స్కూల్' మా వానరమూకకు వేదికైంది.

ముందు బెంచీలో కూర్చుంటూ, రేపటి పాఠం ముందురోజే చదివేస్తూ, సైన్స్ మేడంతో అబ్దుల్ కలాం అనిపించుకోవాలనే ఉత్సాహంతో కొంతమంది, క్లాస్‌లో ఉన్నంతసేపు మనం ఎవరికీ దొరకకూడదు అని కళ్ళు మూసుకుని, కాళ్ళు ముడుచుకుని కూర్చుండే

జీవులు కొంతమంది. ఈ రెండూకాని ప్రత్యేక పరిజ్ఞానం మాది. తప్పుచేయాలి, పట్టుబడాలి, తప్పించుకోవాలి, రోజు మొత్తంలో ఒక్కసారైనా పనిష్మెంట్ తీసుకోవాలి. స్వీపరు నుండి హెడ్‌మిసెస్ దాకా మనకు గుర్తింపు రావాలి. అది మా అజెండా.

నాకు అలాంటి గుర్తింపు ఇచ్చింది నా డాన్స్. నా ఫర్‌ఫార్మెన్స్ చూసి చప్పట్లు కొట్టేవాళ్ళు కొంతమందైతే, వాళ్ళకు నచ్చిన పాటలతో వచ్చి డాన్స్ నేర్పించమని, అప్పటికే నన్ను కంపోజర్‌గా చేసిన వాళ్ళు కొంతమంది. ఆ స్కూల్లో నన్ను అందరికీ పరిచయం చేసింది, నన్ను నాకు పరిచయం చేసింది నా డాన్స్.




స్కూల్లో చేరిన మొదటిరోజు రాజు అనే అత్యుత్సాహి పరిచయం అయ్యాడు. పరిచయం ఒక బంధంగా మారే సమయానికి భాను, సూరి కూడా చేరిపోయారు. ఇప్పటికీ మేం నలుగురం ఫ్యామిలీ ఫ్రెండ్స్. మధురానుభూతుల్ని త్రవ్వగా మొదట గుర్తుకొచ్చేది నాకు నాన్-వెజ్ అలవాటైన విషయం. స్వతహాగా మేము శాఖాహారులం. మనకు ఒకచోట ఆగిపోవటం, ఒక దానికి అలవాటు పడడం తెలీని పనికదా! స్కూల్ నుండి ఇంటికి వెళ్ళే సమయంలో రోజూ ఆ బండివైపు చూస్తూ వెళ్ళేవాడిని, ఒకరోజు నా స్నేహితులతో నా హృదయవేదన చెప్పేశాను. ఇంకేముంది, నా జీవితంలో మొదటి నాన్ - వెజ్ ట్రీట్. వాటి రుచి కంటే అవి చేసే విధానమే నాకు చాలా రొమాన్‌టిక్‌గా అనిపించేది. చిన్న చిన్న మాంసపు ముక్కలను ఒక పొడువాటి కడ్డీకి గుచ్చి నిప్పుల మీద కాల్చి ఇస్తారు. అవేనండి 'చీకులు'. ఇప్పుడు కబాబ్‌లు ఉన్నాయి కదా, వాటికి మూలం మన చీకులే. అలా నా నాలుక మొదటిసారి గరంమసాలా రుచి చూసేసింది. (ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే, కాసింత ఓర్చుకోండి, ఏం చేస్తాం? పరిస్థితుల ప్రభావం మరీ!)

డాన్స్ పేరు చెప్పి క్లాసులకు డుమ్మా కొట్టాలని ఒక మహత్తరమైన ఆలోచన మా దిగ్గజాలలో ఒకడికి వచ్చింది. అందరూ కలిసి నాకు బలమైన ప్రోత్సాహం ఇచ్చి మాథ్స్ క్లాసులు మిస్ అయ్యేలా చూడమని విన్నపాలు అందజేశారు. మా హెడ్‌మిస్సెస్ ఏ టైములో డాన్స్ ప్రాక్టీసు చేస్తారని నన్ను అడిగితే నేను సరిగ్గా మాథ్స్ క్లాసులు మిస్ అయ్యేలా షెడ్యూల్ ఇచ్చాను. కరెక్టుగా మాథ్స్ పిరియడ్ మొదలవ్వగానే మేము డాన్స్ క్లాసులకి అంటూ బయలుదేరడం మిగతా వాళ్ళంతా కాసింత కుళ్ళుతో చూసేవారు. ఇదంతా చూస్తున్న మా రెడ్డి సర్ (మాథ్స్ సర్ నాగేశ్వర రెడ్డిగారిని మేమంతా ముద్దుగా రెడ్డి సార్ అని పిలుచుకునేవాళ్ళం) ఊరుకోడుకదా! నేను ఎప్పుడెప్పుడు దొరుకుతానా అని ఎదురుచూసాడు. మాస్టార్లు మనసు పెడితే మనలాంటి వాళ్ళు దొరికిపోవడం పెద్ద కష్టమా? అందులో మన కళానైపుణ్యం కూడా ఉందిలెండి.

ఒకరోజు లంచ్ బ్రేక్‌లో మా గిన్నెలు సుబ్బరంగా నాకేసి, తిన్నది అరగక 'సి' సెక్షన్‌లో ఉన్న మన అభిమానుల్ని ఎంటర్‌టైన్ చేయడానికి వెళ్ళా. అక్కడ కొంతమంది మహిళామణులు "మాథ్స్ సర్‌ని ఇమిటేట్ చేయవా ప్లీజ్..?" అని అడిగారు. ఇంక నా కళాతృష్ణ తీవ్రరూపం దాల్చింది. మా మాథ్స్ సర్‌ని ఒకసారి స్మరించుకుని వంకాయ్ = టెంకాయ్ (1కాయ్ = 10కాయ్) అనే గొప్ప థీరీని ప్రూవ్ చేసేశాను. చివర్లో అస్తమాను ఆయన మాపై రుద్దే ఒక లైన్ కూడా యాడ్ చేసేశాను. అదే L.H.S=R.H.S బ్లాక్ బోర్డ్ అంతా నా

లెక్కతో, క్లాస్ రూము అంతా నవ్వులతో నిండిపోయాయి. వారిచ్చిన అభిమాన ధనాన్ని మూటకట్టుకుని నా మానాన నేను 'బి' సెక్షన్ లోకి వచ్చేశాను.

As usualగా మధ్యాహ్నం క్లాసులు మొదలయ్యాయి. ఫిజిక్సోడు స్టడీ అవర్ డిసైడ్ చేశాడు. అందరం కారిడార్‌లో కూర్చుని తెగ ఊగిపోతున్నాం. ఇంతలో 'సి' సెక్షన్‌లో ఏదో అలజడి, పైగా అక్కడ మాథ్స్ క్లాస్ జరుగుతోంది. అందుకే నాలో అంత టెన్షన్. కిటికీలోంచి చూస్తే కొంచెం క్లియర్‌గానే కనపడుతుంది. నలుగురు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు నిలబడ్డారు. మా మాథ్స్ సర్ ఏమో "ఎవడ్రా వాడు! చెప్పండి. లేకపోతే ఈరోజు చస్తారు నా K ల్లారా!"

అంటూ డైలాగ్, డైలాగ్‌కి మధ్యలో ఒక్కొక్కడిని కొడుతూ మొహమంతా ఎర్రగా చేసుకుంటున్నాడు. అప్పట్లో చిరంజీవిగారి 'ఠాగూర్' కొత్త రిలీజ్. అందులో ప్రి క్లైమాక్స్‌లో ఠాగూర్ ఎవరని తెలుసుకోవడానికి ACF స్టూడెంట్స్‌ని హింసించే సీన్స్‌లో పోలీస్ అధికారి గుర్తొచ్చాడు. ఇంతకీ వీళ్ళంతా దెబ్బలు తింటోంది ఎవరికోసం, ఎవరో ఆ చిరంజీవి! అని నా సందేహం. ఇంతలో వాడెవడో తెలిసిపోయిన ముఖకవళికలతో మాథ్స్ సర్ గబగబా మా 'బి' సెక్షన్ ముంగిట్లో నిలబడి విశ్వగాడు ఎక్కడ అని అడిగాడు, అంతే... మొత్తం అర్థమైపోయింది. మధ్యాహ్నం జరిగిన నా కళావైభవానికి తీపి గుర్తులుగా బ్లాక్ బోర్డ్‌పై మిగిలిపోయిన అక్షరాలు (తుడిచేసినా, లైట్‌గా కనపడ్డాయి) మా మాస్టారు కంటపడ్డాయి. ఇంకేముంది, ఎప్పుడెప్పుడు దొరుకుతానా అని ఎదురు చూస్తున్న మావాడు విజృంభించాడు. గంటపాటు 20-20 మాచ్. మధ్యలో నేను మాచ్ డిక్లేర్ చేసినా ఆయన వినిపించుకోలేదు. సెంచరీలు బాదేశాడు.



ఆ తరువాత 'సి' సెక్షన్ అభిమానులంతా కలిసి 'సారీరా! లాస్ట్ మూమెంట్ లో నీ పేరు చెప్పక తప్పలేదు' అని నాపై సానుభూతి చూపడం తలచుకుంటే ఇప్పటికీ నవ్వు ఆగదు. స్కూల్ మేట్స్ అంతా కలిసిన ప్రతిసారీ ఈ "వంకాయ=టెంకాయ" టాపిక్ వస్తుంది. మా అందరినీ అప్పటి స్కూల్ వీధుల్లోకి నడిపిస్తుంది.

కొన్ని రోజుల తర్వాత స్కూల్‌కి వెళ్తుంటే, నా సైకిల్ వెంట ఆ వీధిలో ఒక కుర్రాడు పరుగెతుకుంటూ వచ్చి జూనియర్ చిరు.. అని అరుస్తూ వెళ్ళాడు. మనం ఒక లెవల్‌లో ఫీల్ అయిపోతూ వాడికి చేయి ఊపుతూ, గాల్లో తేలుతున్నా. ఇంతలో ఒక బైక్ నన్ను దాటి వెళ్ళింది. చూస్తే మా మాథ్స్ సర్, కాస్త ముందుకెళ్ళాక వెనక్కి తిరిగి చూసాడు. అంతే "క్లాస్‌కి రా! నీ పని చెప్తా" అన్నట్లు అర్థమైంది. ఏవిధంగా విజృంభిస్తాడో అని భయం

భయంగా ఎదురుచూశా. అనుకున్నది చేస్తే మా వాడు రెడ్డి సర్ ఎలా అవుతాడు. క్లాస్ అంతా నార్మల్‌గానే జరిగింది. చివరగా వెళ్ళిపోయేముందు ఒక చిన్న స్మైల్ విసిరాడు. దాని అర్థం అప్పుడు అర్థం కాలేదు. ఎప్పటికీ అర్థం కాదనుకుంటా..!

ప్రతి క్రిస్టమస్‌కి రవిమనోహర్ సర్ ఇంటికి వెళ్ళి భోజనం చేయడం, మా బోటనీ మేడం విజయలక్ష్మిగారిని అడ్మైరింగ్‌గా చూడడం, ఉదయం 6గంటలకే మా సోషల్ సర్ బెత్తం చూసి జడుచుకోవడం, పద్యాలు పాడితే మా తెలుగు మాస్టారు ఇచ్చే బహుమతుల కోసం ఎదురుచూడడం, ఇవన్నీ జీవితాంతం మిగిలిపోయే జ్ఞాపకాలు. పబ్లిక్ ఎగ్జామ్స్‌లో 97 మార్కులతో వచ్చాక కూడా మా మాథ్స్ సర్ కోపంగా చూసాడు. 97తో ఆగిపోకురా! అని ఆయన అన్న మాటల్ని తలచుకుంటే వెంటనే మా నంద్యాలకు పరుగెత్తాలనిపిస్తుంది. అక్కడున్న మా స్కూల్ ఆవరణలో ఆడుకోవాలనిపిస్తుంది. రాయలసీమ స్థాయి బెస్ట్ మేల్ డాన్సర్‌గా అవార్డ్ తీసుకున్నాక, మా స్కూల్ డే రోజు నాకు జరిగిన సన్మానం, ఆ తర్వాత లెక్కపెట్టుకోలేనన్ని షేక్ హాండ్లు, ఏరోజూ గీత దాటని అల్లరితో అమ్మాయిల చుట్టూ కొంటె హీరోల్లా తిరగడం, ఈమధ్య జరిగిన గెట్‌టుగెదర్ లో కూడా జూ.చిరు అంటూ పిలిచి నాతో చిరంజీవి సాంగ్ వేయించుకోవడం, నిజంగానే చిరంజీవిని అయినంత సంతోషం

**ఆ గుర్తులు పదిలం..!**

**ఆ మలుపులు మధురం..!**

కె.కాశీ విశ్వనాథ్ ప్రస్తుతం కడపజిల్లా జమ్మలమడుగులో గవర్నమెంట్ ఉద్యోగి. 2005లో నంద్యాల విజయవాణి హైస్కూల్లో చదువుకున్న తన పదోతరగతి అనుభవాలని ఇలా పంచుకుంటున్నారు. సెల్ నంబర్లు: 9052821871, 7396849086



# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

editor@koumudi.net

### డా. చిట్టే స్వర్ణలత

**బాల్యాన్ని ఒక్కడుగు వెనక్కి నెట్టి,** రేకులు విప్పుకునే గులాబిలాంటి అందమైన యవ్వనదశలోకి ఒక్క అడుగు ముందుకు వేయడం అనేది టెంత్ క్లాస్‌తోనే మొదలు అవుతుంది. తెలిసీ తెలియని వయసు, శరీరంలో వచ్చే మార్పులు, తల్లిదండ్రుల జాగ్రత్తలు హెచ్చరికలు ఒకవైపు. పరీక్షల వత్తిడి మరొక వైపు, విద్యార్థుల జీవితంలో ఈ టెంత్‌క్లాస్ ప్రముఖమైన పాత్ర వహిస్తుంది అని చెప్పవచ్చు.

పదిహేనేళ్ళ వయసు జీవితంలో ఎంతో అందమైనది. అద్భుతమైనది. ఈ వయసులో టెంత్ క్లాసు చదవడం, చదువు పట్ల శ్రద్ధ పెంచుకుని, భవిష్యత్తు పట్ల నిర్ణయాలు తీసుకోవడం సహజంగా జరుగుతుంది. టెంత్ క్లాస్‌లో పడిన పునాది జీవితాన్ని నిర్దేశిస్తుంది అనడంలో సందేహం ఏమీలేదు.

మాది కడప జిల్లాలోని రైల్వే కోడూరు. హైస్కూలు వరకు అక్కడే చదువుకుని, కాలేజీ చదువులకు తిరుపతి వెళ్ళి చదువుకునేవాళ్ళు. 1991 - 1992 విద్యాసంవత్సరంలో నేను రైల్వేకోడూరులోని బాలికోన్నత పాఠశాలలో టెంత్‌క్లాస్ చదివాను.

రాయలసీమలోని వెనుకబడిన ప్రాంతాలలో, మా పల్లెలలో ఆడపిల్లలను అప్పట్లో పెద్ద చదువులు చదువటానికి ప్రోత్సహించేవారు కాదు. మా నాన్నగారికి చదువుపట్ల ఉన్న ఆసక్తితో మా అందరినీ కాలేజి చదువులు చదివించారు. అప్పట్లో ఆడపిల్లలకు చదువెందుకు? ఉద్యోగాలు చేయాలా? ఊళ్ళు ఏలాలా? అనేవారు.

అప్పటి విద్యార్థుల మధ్య ఇప్పుడున్నంత పోటీ ఉండేది కాదు. మార్కులు, ర్యాంకుల ఒత్తిడి మాపై ఉండేది కాదు. టీచర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని, నోట్సు రాసుకుని అవే చదువుకునేవారం. ఆటపాటలతో చదువును హాయిగా సాగించే వాళ్ళం. ఇప్పటి పిల్లల వలె రాత్రింబవళ్ళు, ట్యూషన్సు, బట్టీ పట్టడాలు ఉండేవికావు. మా గురువులు కూడా ఎంతో శ్రద్ధగా పాఠాలు చెప్పేవారు. పాఠాలలో జీవితాల్ని, విలువల్ని కూడా రంగరించి చెప్పేవారు. మా బాలికల పాఠశాలలో టీచర్స్ ముఖ్యంగా ఆడవారే ఉండేవారు. వారిని చూసి, వారి పాఠాలు విని, వారి ప్రోత్సాహంతో ఆనాడే నాకు పై చదువులు చదవాలి, ఉద్యోగం చేయాలి అనే గట్టిపట్టుదల కలిగింది. చదువుపై శ్రద్ధ పెంచుకుని టెంత్‌క్లాసులో మంచి మార్కులు తెచ్చుకోవాలి అని నిశ్చయించుకున్నాను.

మా స్కూలులో అందరూ అమ్మాయిలే కావడంతో అల్లరి తక్కువగానే ఉండేది. గురువులను గౌరవించి వారు చెప్పినట్లు భయంతో నడుచుకుని పాఠాలు చదివేవాళ్ళం. మా అక్క "లలిత" కూడా అదే స్కూలులో చదివి ఉండటం వలన, మంచి స్టూడెంటుగా మాటీచర్స్‌కు తెలిసి ఉండటం వలన, నన్ను కూడా మా టీచర్స్ చాలా ప్రత్యేకంగా చూసేవారు.

మా గురువుల్లో ముందుగా చెప్పుకోవాల్సింది సైన్సు టీచర్ నాగమణెమ్మగారి గురించి - ఆమె పాఠాల్ని చక్కగా చెప్పేవారు. విద్యార్థుల సందేహాల్ని ఓపికగా విని జవాబులు చెప్పేవారు.

పరీక్షలు దగ్గరకు వచ్చినప్పుడు, సాయంత్రంపూట వారి ఇంటికి వచ్చి అందర్నీ చదువుకోమని చెప్పేవారు. అమ్మలాగా అందర్నీ ఆదరించేవారు.

ఒకరోజు ఇంటర్‌వెల్‌లో చిరుతిళ్ళు కొని తింటూ ఉంటే ఆమె చూసి, అవి తింటే ఆరోగ్యం పాడవుతుంది. రోజూ ఒక క్యారెట్ తిను అని సలహా ఇచ్చారు. అప్పటి నుండి క్యారెట్ తినడం అలవాటు చేసుకున్నాను.

స్కూల్లో ఎంత స్ట్రిక్ట్‌గా ఉండేవారో, బయట, ఇంట్లో దానికి భిన్నంగా చాలా స్నేహపూర్వకంగా మాట్లాడి మమ్మల్ని ప్రేమించి విద్యను బోధించేవారు. ఆ తరువాత ఆమె ప్రధానోపాధ్యాయురాలుగా అదే స్కూల్లో పని చేసారు. దాదాపు ఎనిమిది సంవత్సరాల తరువాత నా ఎం.ఏ పూర్తిచేసుకుని, తెలుగు పండిట్ కోర్స్ చేసి, తెలుగు టీచర్‌గా, నేను చదువుకున్న అదే స్కూలుకు వెళ్ళాను. అపుడు మా హెడ్ మాస్టరు నాగమణెమ్మగారు ఎంతగానో నన్ను అభినందించి, ఆనందించారు.

ముఖ్యంగా మా తెలుగు టీచరు రజియా బేగం గారు తెలుగు పాఠాల్ని వీనులకు ఇంపుగా పద్యాల్ని సొంపుగా, రాగయుక్తంగా పాడి, పాఠాల్ని ఆసక్తికరంగా చెప్పేవారు. ఛందస్సులోని గణాల్ని గుర్తుపెట్టుకోటానికి దాన్ని ఒక గేయంలా నేర్పించి ప్రాక్టీసు చేయించారు. ఆమె పాఠాలు వింటే చాలు, మరలా పుస్తకం కూడా తెరిచి చదవాల్సిన పని ఉండేది కాదు.

హిందీని భారతి మేడం శ్రద్ధగా బోధించేవారు. హిందీ అంటే అప్పట్లో అందరికీ అంత ఆసక్తి ఉండేది కాదు. పాస్ అయితే చాలు అని అనుకునేవారు. హిందీ చదవడం, రాయడం నేర్చుకున్నామంటే అంతా భారతి మేడం ఘనత అని చెప్పవచ్చు.

గణితం బోధించిన వెంకట నాయుడుసార్‌ని ఎన్నటికీ మరచిపోలేము. పదవతరగతిలో మాథ్స్ ఎంత ప్రాముఖ్యమైనవో, ఎంతగా అవి క్లిష్టమైనవో ప్రతి విద్యార్థికీ తెలిసి ఉంటుంది. మా సార్ ఎంతో చక్కగా, అర్థంకాని వారికి మరలా చెపుతూ అభ్యాసం చేయించేవారు. అంకిత భావంతో బోధించే గురువులను ఎన్నటికీ మరచిపోలేము.

పి.ఇ.టి (డ్రిల్) మేడం భాగ్యమాలగారు విద్యార్థినులను చాలా క్రమశిక్షణలో ఉంచేవారు. ఆమె క్లాసులోకి వస్తున్నారంటే ఎక్కడివాళ్ళు అక్కడే నిశ్శబ్దంగా కదలకుండా కూర్చునేవారు. ఆటలు ఆడించేవారు. వ్యాయామం చేయించేవారు. క్లాసులో పాటలు పాడించి బాగా పాడిన వారిని అభినందించే వారు. వారందరిలో నేనే ఫస్ట్ ప్రైజులు తెచ్చుకునేదాన్ని. మా నాన్నగారు కీర్తిశేషులు తిరుపాలయ్యగారు బాగాపాడి భాగవతార్‌గా హరికథలు చెప్పేవారు. ప్రజలకు ఆటవిడుపుగా నాటకాలు నేర్పించి ఎన్నో ప్రదర్శనలు కూడా ఇప్పించారు.

మా నాన్నగారు మంచి గాయకులు, రంగస్థల నటులు ఆయనకు పురాణాలు, భారతభాగవత, రామాయణాలు కంఠతా వచ్చు. పద్యాలు ఎంతో మధురంగా పాడేవారు సాయంత్రం అందరం భోజనాలు చేసాక పిల్లలందరికీ అన్ని పద్యాలు, రాగాలు నేర్పించేవారు.

మా నాన్నగారి ప్రతిభ వలన, మాకు అందరికీ కూడా రాగయుక్తంగా పాడటం వచ్చింది. అందుకే నేను తరువాత పద్మావతి మహిళా యూనివర్శిటీలో బి.ఏలో మ్యూజిక్‌ను సబ్జెక్టుగా ఎంచుకుని చదివాను.



మా స్కూలులో ఉపాధ్యాయినులు స్నేహపూర్వకంగా మాతో మెలిగేవారు. శుక్రవారం రోజున అందరు మేడమ్స్ ఒకే రకం చీరలు ధరించి స్కూలుకు వచ్చేవారు. విద్యార్థునులకు కనులకు ఆహ్లాదంగా ఉండేది. వారిని చూస్తుంటే. వాళ్ళని చూసి మేము కూడా వీలయినంతవరకు మ్యాచ్ అయే విధంగా డ్రెస్‌లు వేసుకునే వాళ్ళం.

బాలికల పాఠశాల కాబట్టి, ఉపాధ్యాయినులు ఇంట్లో అమ్మలకంటే ఎక్కువగా మాకు జాగ్రత్తలు చెప్పి సలహాలు ఇచ్చేవారు. భవిష్యత్తు ప్రణాళికలు చర్చించేవారు. బాగా చదివి ఉద్యోగాలు తెచ్చుకోవాలి అని ప్రోత్సహించేవారు.

అయితే మా సోషల్ టీచర్ రామకృష్ణారెడ్డిగారు చాలా కఠినంగా ఉండేవారు. క్లాసులో ప్రశ్నలు అడిగి, జవాబులు చెప్పకపోతే వంద గుంజీలు తీయించేవారు. చాలామంది ఆయనను చూడగానే భయపడి వచ్చిన జవాబులు కూడా చెప్పలేక, మరచిపోయి గుంజీలు తీసేవారు. మరుసటి రోజు అందరికీ జ్వరం కూడా వచ్చేది. అలా సోషల్ అన్నా, ఆ సార్ అన్నా భయంతో భయం ఏర్పడిపోయింది. ఆయనను చూస్తే చాలు మాకు వణుకు వచ్చేది.

మా పాఠశాలలో ఒక్కో తరగతిలో ఎనభై నుండి తొంభై స్టూడెంట్స్ ఉండేవాళ్ళం. ఇంతమందికి పాఠాలు చెప్పడమంటే మాటలు కాదు కదా! అయినా ఓపికగా మా అల్లరి భరించి పాఠాలు చెప్పి ఉన్నతమైన మా భవిష్యత్తుకు కారకులయ్యారు మా గురువులు.

సునీత, సుబ్బరత్న, సులోచన, కళ్యాణి, కవిత, విజయ, సుజాత, సుచరిత, జయ, రూప, సుధామాధురి, బాబి, రోజారాణి నా స్నేహితురాళ్ళు. మేము ఒక గ్రూపుగా ఏర్పడి చదివేవాళ్ళం. ఆటలు ఆడేవాళ్ళం. సెప్టెంబరు 5 వ తేదీన, గురుపూజోత్సవం రోజున మా పి.ఇ.టి మేడం సహాయంతో పూవులు సేకరించి, స్వయంగా మాలలు కట్టి మా ఉపాధ్యాయినులకు సమర్పించాము. విద్యార్థినులకి ఆటల, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇప్పించాం.

మా గురువుల గురించి ఉపన్యసించి, వారి గొప్పతనం కొనియాడాము. మాటీచర్స్ ఆ రోజు చాలా సంతోషించారు.

పదవతరగతి పరిక్షలు అయ్యాక వీడ్కోలు సభలో మా గురువులు మాట్లాడుతూ, విద్యార్థి దశ గురించి, భావి జీవితం గురించి చక్కిటి సలహాలు ఇచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. అందరం కలిసి ఫోటోస్ తీసుకున్నాం. విడిపోతూ, వీడ్కోలు చెప్పుకుంటుంటే 'అందరి కళ్ళల్లో ఆగని కన్నీరు.' ఎంతో బాధగా భారమైన హృదయాలతో హైస్కూలు నుండి బయటికి రావడం మరచిపోలేని జ్ఞాపకం.

తరువాత తిరుపతి పద్మావతి మహిళా కాలేజీలో బి.ఏ మహిళా యూనివర్శిటీలో ఎం.ఏ చేసి, తెలుగు పండిట్ కోర్సు చేసి తిరిగి నేను చదువుకున్న రైల్వే కోడూరు గర్ల్స్ హైస్కూలుకే తెలుగు టీచర్‌గా అపాయింట్ కావడం పూర్వ జనం సుకృతం. అదే స్కూలులో అదే క్లాసు రూముల్లో టీచర్‌నై విద్యార్థులకు విద్యను బోధించడం నాకు లభించిన అదృష్టం.

నన్ను టీచర్‌గా మరలా అక్కడ చూసిన మా గురువులు అందరూ చాలా సంతోషించి నన్ను అభినందించారు. మా నాన్నగారు తిరుపాలయ్యగారు ఆనంద భాష్పాలతో నన్ను ఆశీర్వదించారు. మా అమ్మ శాంతమ్మ, అక్క లలిత, చెల్లెళ్ళు కూడా నన్ను ఎంతగానో అభినందించారు. ఇప్పుడు తెలుగు సాహిత్యంపై పి.హెచ్.డి చేయటంలో కూడా మా కుటుంబం మరియు నా భర్త సురేష్ సహకారం మరువలేనిది.

ప్రస్తుతం కడపజిల్లా మైదుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూలులో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాను. నా భర్త సురేష్ కూడా టీచరే. శ్రీహిత, సాహితి అనే ఇద్దరు పాపలతో కుటుంబ జీవితం గడుపుతున్నాను.

ఒక టీచర్‌గా విద్యార్థులకు పాఠాలు బాధ్యతగా బోధించి, వారి జీవితాల్ని తీర్చిదిద్దటం గురువులుగా మా బాధ్యత. విద్యార్థుల ఉన్నతి కికారకులు అవుటకు ముఖ్యమైన పాత్ర పోషించడం నిజంగా ఆనందించ దగ్గ విషయం. ఇది హృదయానికి సంతృప్తి కలిగించే విషయం. అందులోని ఆనందం గొప్పది.

లేతతీవెల వంటి విద్యార్థులకు, విద్య అనేది పందిరి వంటిది. వారు పెరిగి విద్యాబుద్ధులు నేర్చుకుని ఆ భవిష్యత్తు అనే పందిరిని అల్లుకోవడానికి గురువుల సహకారం, ఉన్నతమైన శ్రద్ధ ఎంతో అవసరం. దాదాపు ఇరవై సంవత్సరాల తరువాత కౌముదిలోని ఈ టెంత్‌క్లాసు గుర్తు చేసుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. కౌముది మాసపత్రికకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.



డా.చిట్టే స్వర్ణలతగారు తెలుగు ఉపాధ్యాయురాలిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదుకూరులో పనిచేస్తున్నారు

# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

## భరత్ రెడ్డి పాతూరి

మాది ఖమ్మం జిల్లాలో, మారుమూలన, ఒక ప్రభుత్వ పాఠశాలతో పాటు ఏడవ తరగతి వరకు తెలుగు మీడియంలో చెప్పే రెండు స్కూల్స్ ఉన్న చిన్న పల్లెటూరు. నన్ను ఇంగ్లీష్ మీడియంలో చదివించాలనే మా నాన్నగారి పట్టుదల వల్ల, మా చుట్టుపక్కల ఉన్న మంచి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ వెతికే క్రమంలో రెండో తరగతి నుంచే మా ఊరికి ఓ గంట ప్రయాణం దూరం వరకూ ఉన్న అన్ని కాన్వెంట్లలోనూ ఒక్కొక్కేడు చదవడం, సంవత్సరం తిరిగేసరికి ఆ స్కూల్ స్టాండర్డ్స్ పడిపోయాయని కొత్తది వెతకడం పనిగా పెట్టుకున్నాం. టెన్త్ క్లాసుకి వచ్చేసరికి దూరపు ఊరికైనా సరే పంపించి మంచి స్కూల్లో చదివించాలని ఆలోచిస్తున్న సమయంలో మా నాన్నగారి స్నేహితులొకరు గుంటూరులో ఒక మంచి స్కూల్ ఉందని వాళ్ళ పిల్లలు కూడా అక్కడే చదివారని చెప్పారు. నన్ను అక్కడే చేర్చాలని నిర్ణయానికొచ్చారు నాన్న.

అప్పట్లో, ఆ మాటకొస్తే ఇప్పటికీ మంచి స్కూల్స్, కాలేజీలు అంటే గుంటూరు, విజయవాడ ముందు వరసలో ఉంటుందని, అక్కడ చదివే స్టూడెంట్స్ కి స్టేట్ ర్యాంకుల స్థాయి మార్కులు వస్తాయని చాలామంది అభిప్రాయం, నమ్మకం. చిన్నప్పటి నుంచీ హాస్టల్ నాకు కొత్త కాకపోయినా మొదటిసారినేను గుంటూరులో చదవబోతున్నానంటే సంబరపడ్డాను.

2000 ఏప్రిల్లో నా తొమ్మిదో తరగతి పరీక్షలు పూర్తి అయ్యాయి. గుంటూరు స్కూల్ లో మే మొదటి వారంలోనే అడ్మిషన్స్, క్లాసెస్ కూడా స్టార్ట్ అవుతాయని అమ్మ నాన్నతో కలిసి గుంటూరు బయల్దేరి కొరిటపాడులో ఉన్న అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాం. అడ్మిషన్ కోసం స్కూల్ కి వెళితే న్యూ అడ్మిషన్ అయితే అడ్మిషన్ టెస్ట్ రాయాలన్నారు. ఆఫీసు రూములోనే కూర్చోపెట్టి టెస్ట్ రాయించారు. ఆ గది గోడల మీద కనిపించిన క్రిందటి సంవత్సరం టాపర్స్ మార్కుల జాబితా, ఫోటోలు చూసి ఆసక్తిగా అనిపించింది. అడ్మిషన్ టెస్ట్ క్లియర్ చేసానని, క్లాసెస్ మరో రెండు రోజుల్లో స్టార్ట్ అవుతాయని చెప్పారు. అన్నట్టు మా స్కూల్ పేరు చెప్పలేదు కదూ... "సాయి ఆదిత్య స్కూల్".

ఈ రెండు రోజులు మా అంకుల్ వాళ్ళింట్లోనే ఉండి స్కూల్ స్టార్ట్ అయ్యే రోజున లగేజ్ అంతా తీసుకొని హాస్టల్ లో చేరడానికి అమ్మానాన్నతో కలిసి వెళ్ళాను. మా హాస్టల్ ఒక పెద్ద మూడంతస్థుల బిల్డింగ్ లో ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం ఒక వంద మంది ఒకేసారి భోజనం చేయడానికి అనుకూలంగా ఒక పెద్ద మెస్ ఉంది. ఆ మెస్ గుమ్మానికి కుడి పక్క ఉన్న కొంచెం ప్లేస్ లో విజిటర్స్ కోసం కొన్ని కుర్చీలు, ఒక రిసెప్షన్ టేబుల్ ఉంది. అక్కడికెళ్ళి మెస్ లో కనపడిన ఒకతన్ని అడగగానే టెన్త్ క్లాసు వాళ్ళకి థర్డ్ ఫ్లోర్ అని చెప్పి సామాను మోయడంలో సాయం చేస్తూ మూడో అంతస్థుకి తీసుకెళ్ళాడు. అక్కడ ఒక దాని తర్వాత ఒకటి వరుసగా నాలుగు విశాలమైన హాల్స్, ఒక మూలన అందరికీ కలిపి కొన్ని స్నానాలగదులు ఉన్నాయి. మమ్మల్ని మొదటి హాల్లోకి తీసుకెళ్ళారు. ఆ గదిలో రెండు వైపులా కలిపి ఇరవై బెడ్లు ఉన్నాయి. గోడలకి మా ట్రంక్ పెట్టెలు పెట్టుకోవడానికి ఒక్కరికి రెండు ర్యాక్ లు కేటాయించారు. నాకు చివరనుండి రెండవ బెడ్ కేటాయించారు. నాకున్న లగేజ్ అంత కలిపి ఒక పెద్ద ఎర్ర ట్రంక్ పెట్టె, ఒక బ్యాగ్. ఎప్పుడైనా ఇంటికి వెళ్ళేటప్పుడు ఆ బ్యాగ్ ఒక్కటి సర్దుకొని వెళ్ళొచ్చన్నట్టు. నా మంచం మీద దుప్పటి నీట్ గా పరిచింది అమ్మ. "ఇంతకుముందులా బట్టలన్నీ అలాగే పెట్టెలో కుక్కుకోకుండా, చక్కగా మడత పెట్టి పెట్టుకో" అంది అమ్మ. సరేలే అని విసుక్కున్నాను నేను.

నా సామాను సర్దాక మళ్ళీ క్రిందికి మెస్ లోకి వెళ్లాం. నాన్న మెస్ ఇంఛార్జ్ తో మాట్లాడుతూ "రోజూ ఏమేమి టిఫిన్స్, ఏమేమి కర్రీస్ పెడతారు?" అని అడిగారు. ఆయనొక పెద్ద లిస్టు చదివాడు. అదంతా విని నేను తెగ ఆనందపడిపోయాను. అప్పటికి భోజన సమయం కావడంతో మా అందరినీ భోజనం రుచి చూడమన్నారు.

"మీరెప్పుడు వచ్చినా ఒకటి రెండు రోజులు మా హాస్టల్లోనే ఉండొచ్చు, ఇక్కడే తినొచ్చు" అన్నారు మెస్ ఇంఛార్జ్. నాకు భలే ఆనందంగా అనిపించింది. వీళ్ళు భలేగా పేరెంట్స్ కి కూడా భోజనం పెట్టడమే కాకుండా, మనతో పాటే హాస్టల్ లో ఉండమంటున్నారు. ఇది ఎంత గొప్ప స్కూల్ కాకపోతే అలా చేస్తారు! అనుకున్నాను. అందరం కలిసి భోజనం చేశాం. రుచి అద్భుతంగా ఉంది. అంతటితో నన్ను హాస్టల్ లో వదిలేసి , మధ్యాహ్నం నుండి స్కూలుకి వెళ్ళమని చెప్పి అమ్మానాన్న ఇంటికి వెళ్ళిపోయారు. వెళ్తూ వెళ్తూ "మమ్మల్నందరినీ వదిలి ఇంత దూరం వచ్చావు చదువుకోడానికి. దానికి తగ్గ ప్రతిఫలం నీ మార్కుల్లో చూపించాలి నానా! నువ్వెంత కష్టపడతావో నాకు తెలియదు కానీ ఈసారి నేను మీ డైరెక్టర్ సార్ని కలిసినప్పుడు నువ్వు వన్ ఆఫ్ ది బెస్ట్ స్టూడెంట్స్ అని చెప్పాలి" అన్నారు నాన్న.

నాకు ఏడుపొచ్చేలా ఉంది. ఎన్నేళ్ళు హాస్టల్లో చదివినా, ఎన్నిసార్లు ఇలాంటి సందర్భాలు వచ్చినా నాది సేమ్ ఫీలింగ్. అతికష్టం మీద ఏడవకుండా వాళ్ళకి టాటా చెప్పేసి వెనక్కి తిరిగి చూడకుండా రూంకి వెళ్ళిపోయాను. వెంటనే ఒక పుస్తకం, పెన్ తీసుకుని స్కూలుకి బయలుదేరాను. మా క్లాస్ రూం ఎక్కడో అటెండర్ ని అడిగి వెళ్ళి బెంచి మీద తల వాల్చి కూర్చున్నాను. అందరూ ఉన్నట్టుండి అల్లరి మానేసి లేచి నిలబడి "gooooooood after noooooooon saaaaaar" అంటుంటే నాకూ అలవాటైన పనే కాబట్టి నేనూ లేచి శృతి కలిపాను.

"ఏంట్రా పాఠం మొదలు పెడదామా?" అన్నారు మాష్టారు మాంచి కంచు కంఠంతో. ఆయన గొంతు నాకు బాగా నచ్చింది. పక్కన చూస్తే అందరూ తెలుగు వాచకం తెరిచారు. ఆయనేదో ప్రశ్న అడిగితే ఎవరూ సమాధానం చెప్పలేదు. మొదటి బెంచ్ లో కూర్చున్న మల్లికార్జున్ ని "ఏంట్రా మల్లికార్జినా... చెప్పవేరా నోట్లో పందార పోసుకొచ్చావా?" అనగానే అందరూ నవ్వారు. అది వినగానే నాకింకో భయం పట్టుకుంది. ఇక్కడున్న వాళ్ళందరూ ఎప్పటినుంచో ఇక్కడే చదువుతున్నవాళ్ళు కాబట్టి మాష్టారికి అందరి పేర్లూ తెలుసు. ఈ లెక్కన నేను అందరు టీచర్లకీ తెలియాలంటే, అందరి దగ్గరా గుర్తింపు పొందాలంటే అంత వీజీ కాదని అర్థమైంది. ఇంతలో మాష్టారు "ఏంట్రా ఒక్కొక్కడూ సాంబారు బాగా లాగించారా? లాభం లేదు. అందరూ నాతో కలిసి ఈ పద్యం చెప్పండి. సుదతీ నూతన మదనా, మదనా తురంగ పూర్ణ మణిమయ సదన....." అని రాగం తీశారు. దెబ్బకి అందరి నిద్ర మత్తూ, నా ఏడుపూ అన్నీ వదిలిపోయాయి.

తర్వాత ఆయన మొదటి పాఠం కాకుండా నేరుగా మూడో పాఠంలోకి వెళ్ళిపోయారు. పక్కనబ్బాయి తన పుస్తకంలోకి చూడమని సైగ చేశాడు. 'ప్రవరుని స్వగతం' పాఠం పేరు. మాష్టారు పుస్తకం పక్కన పెట్టేసి అసలు ప్రవరుడంటే ఎవరు అని పద్యాల వెనుక నేపథ్యం కథలాగా చెప్పసాగారు. గంట కొట్టేదాకా అంతసేపు అయిందనే అనిపించలేదు. క్లాసు ముగిసిన తర్వాత పక్కనబ్బాయి పేరు సందీప్ అని తెలుసుకున్నాను. మా టీచర్లందరిలోనూ పిల్లలందరూ బాగా ఇష్టపడే వ్యక్తి మా తెలుగు మాష్టారు వెంకటేశ్వరరావు గారేనంటే నాకేం ఆశ్చర్యమనిపించలేదు.

సాయంత్రం హాస్టలుకి వెళ్ళాక రామకృష్ణ, సంతోష్, సునీల్, ప్రదీప్, శేషు, భరత్, హర్ష అందరితో పరిచయాలు అయ్యాయి.

ఇక హాస్టల్లో మా దినచర్య. పొద్దున్నే ఐదు గంటలకు లేచి ఆరున్నర దాక స్టడీ అవర్స్. పొద్దున్నే మా వార్డెన్ లేచి ఆ చివర నుండి మొదలుపెట్టి "ప్రదీప్ లే... ఉదయ్ లే... శేషు లే.. రామకృష్ణ లే... భరత్ లే....." ఇలా చదువుకుంటూ వెళ్ళేవారు. ఎవరి పేరు వినపడగానే వాళ్ళు లేచి కూర్చునేవారు. ఒకడి పేరు పిలిచినప్పుడు మిగిలినవారికి మెలకువ వచ్చినా వేరే వాళ్ళెవరూ లేచేవారు కాదు వాళ్ళ పేరు పిలిచేదాకా. ఆ ఒక్క నిమిషం కూడా నిద్రపోవచ్చనే కక్కుర్తి మరి. అందరం లేచి ఎవరి బెడ్ మీద వాళ్ళు పుస్తకాలు ముందేసుకుని కూర్చునేవాళ్ళం. సగం నిద్ర, సగం చదువు అలా గడిచేది ఆ గంటన్నర.

ఆరున్నర నుండి ఎనిమిదిన్నర దాక స్నానాలు టిఫిన్లు కానిచ్చుకోవాలి. ఇక ఎనిమిదిన్నరకి బిల్డింగ్ కిందకు వెళ్ళి రోడ్ మీద లైన్లో నిలబడాలి. మా వార్డెన్ వచ్చి పదమని చెప్పేదాకా అక్కడే ఉండాలి. ఆ పక్కనే ఒక చిన్నపాటి కిరాణా కొట్టు అందులో ఒక టెలిఫోన్ బూత్ ఉండేది. దాన్ని 'టక్ షాప్' అని పిలిచేవాళ్ళం. అక్కడ ఏదో ఒక చిరుతిండ్లు కొనుక్కొని తినుకుంటూ మా వార్డెన్ కోసం ఎదురు చూసేవాళ్ళం. వార్డెన్ రాగానే అందరం లైన్లో బయల్దేరి స్కూల్ చేరుకునే వాళ్ళం. తొమ్మిదింటి నుండి సాయంత్రం నాలుగింటి దాక స్కూల్. మధ్యాహ్నం ఒక గంట లంచ్ బ్రేక్. నాలుగింటికి హాస్టల్ కి రాగానే ఒక గంటన్నర విశ్రాంతి. ఆ గంటన్నరలోనే స్నానాలు ఇంకా స్నాక్స్ కూడా. ఆ టైం లోనే మా ట్రంక్ పెట్టెలు తెరిచి ఇంటి దగ్గర నుండి పంపించిన చిరుతిండ్లు బయటకి తీసి తినేవాళ్ళం. ఎవ్వరు ఏది తెచుకున్నా అందరం కలిసి పంచుకొని తినేవాళ్ళం.

సాయంత్రం ఐదున్నర నుండి ఎనిమిదిన్నర దాక స్టడీ అవర్స్. ఎనిమిదిన్నరకు డిన్నర్ టైం. ఆ తర్వాత అందరం ఇళ్ళకు ఫోన్లు చేస్కోడానికి టెలిఫోన్ బూత్ ముందు క్యూ లు కట్టేవాళ్ళం. పదిన్నర ప్రాంతంలో ఆ టక్ షాప్ మూసేసేదాకా అక్కడే తిరిగి అప్పుడు వెళ్ళి పడుకునేవాళ్ళం. మా స్కూల్ కి ముగ్గురు డైరెక్టర్స్ ఉండేవారు. జానకిరామ్ సార్, రవీందర్ సార్, రామ్మోహన్ సార్. ముగ్గురిలో జానకిరామ్ సార్ చాలా తక్కువ మాట్లాడేవారు. రవీందర్ సార్ అంటే అందరికి భయం. రామ్మోహన్ సార్ సరదాగా ఉండేవారు. ఎందుకంటే అయన పనిష్మెంట్లు ఇవ్వడంలో స్పెషలిస్ట్ మరి. మా జానకిరామ్ సార్ జేబులో ఒక సెల్ ఫోన్ ఉండేది. అప్పటికి 'సెల్ ఫోన్' అనే పదం చాలా కొత్త మా అందరికీ. దాని గురించి కథలు కథలుగా చెప్పుకునే వాళ్ళం. దాని నుండి ఎక్కడికైనా ఫోన్ చేసి ఎవ్వరితో అయినా మాట్లాడొచ్చట. కార్డ్లెస్ కన్నా అడ్వాన్స్డ్ అంట. దానికి ఎవరైనా ఫోన్ చేస్తే, మనం ఎత్తి మాట్లాడినందుకు కూడా మనకి బిల్ వస్తుందట. అప్పుడే మాలో ఒకడు ఒక విచిత్రమైన విషయం చెప్పాడు. ఆ ఫోన్ లో నుండి ఒక్కసారి మాట్లాడితే నిమిషానికి ఐదు రూపాయల పైనే పడుతుందని, ఆ ఫోన్ లో అవుట్ గోయింగ్ ఛార్జ్ కన్నా ఇన్ కమింగ్ ఛార్జ్ ఎక్కువ పడుతుందని. మేము మా టెలిఫోన్ బూత్లో అయ్యే రేట్ తో పోల్చుకొని ఆశ్చర్యపోయేవాళ్ళం. ఒకడేమో ఇలాంటి ఫోన్ చూసానంటే, ఒకడేమో ఇలాంటి దాంట్లో నేను మాట్లాడానని, లేదంటే కార్డ్లెస్ కి సెల్ ఫోన్ కి మధ్య తేడాలు ఏమిటని... ఇలా మా సార్ జేబులో ఆ ఫోన్ కనపడినప్పుడల్లా ఒక పావుగంటైనా దాని గురించి మాట్లాడకుండా ఊరుకోలేకపోయేవాళ్ళం.



హాస్టల్లో (ఎడమ నుండి కుడికి)
భరత్, రామకృష్ణ, సందీప్, శేషు, చందు

హాస్టల్లో నేను తప్ప మిగిలినవారంతా రామగుండం ప్రాంతం నుండి వచ్చినవారు. వాళ్ళందరి భాషలో ఒక యాస ఉండేది. నాకు చాలా కొత్తగా అనిపించేది. ఒకసారి మా స్నేహితుడొకడు మంచం నవారు సరిచెయ్యడానికి పిలిచాడు. వాడు ఒక పక్కపట్టుకొని "అటుకెల్లి ఇగ్గు" అన్నాడు. నాకేమీ అర్థం కాలేదు. "చూస్తవేమ బై.... ఇగ్గు" అన్నాడు. ఇంతలో పక్కవాడు వచ్చి నన్ను పక్కకి జరిపి ఆ నవారు లాగాడు. తర్వాత వాళ్ళ మాటల్లో నాకు అర్థమైంది 'ఇగ్గు' అంటే 'లాగు' అనే అర్థం అని. అప్పటిదాకా నాకు తెలుగులోనే ఇన్ని రకాలుగా మాట్లాడతారని తెలియదు. అక్కడ ఉన్న సంవత్సరం ఆ యాస బాగా నేర్చుకున్నాను. అప్పటి నుండి నాకు తెలుగు భాషలోని వివిధ రకాల మాండలికాలు అంటే చాలా ఇష్టం. ఇంచుమించు నాకు తెలిసిన అన్ని మాండలికాలు నేర్చుకున్నాను.. ఎంతో కొంతైనా! అది నాకొక హాబీగా మారిపోయింది.

స్కూల్ లో చేరిన కొత్తలో అక్కడి వాతావరణానికి అలవాటు పడలేక అప్పుడప్పుడూ ఒంట్లో నలతగా ఉండేది. వార్డెన్ ని అడిగి స్టడీ అవర్స్ లో నుండి మధ్యలో వెళ్ళిపోయేవాడిని. నాలుగైదుసార్లు ఇలా జరిగాక ఈ విషయం మా రవీందర్ సార్ దృష్టికి వెళ్ళింది. ఒక రోజు పిలిచి నన్ను అనుమానంగా చూస్తూ కోపంగా "నీ వేషాలు ఇక్కడ నడవవు" అన్నారు. నాకు చాలా బాధేసింది. నేను చెప్పేది ఎవ్వరూ నమ్మట్లేదు. వచ్చీ రాగానే ఇలా చెడ్డపేరు తెచుకున్నానేంటి అని బాధేసింది. తర్వాత తెలిసిన విషయం ఏంటంటే ఇంతకుముందు ఇలాగే మా ఊరు నుండి వచ్చి

ఇక్కడ చేరిన వాడు ఇలాంటి సాకులన్నీ చెప్పి, చివరకి హాస్టల్ నుండి పారిపోయాడంట. నేను కూడా సాకులు చెప్తున్నాను కాబట్టి అలాంటి వాడినేనని మా రవీందర్ సార్ ఒక నిర్ణయానికి వచ్చేసారు. హోం సిక్ హాలిడేస్ కోసం ఇంటికి వెళ్తున్న ఆనందంలో గంతులేస్తూ మా రవీందర్ సార్ కంటపడ్డాను. వెంటనే ఆయన "ఏం భరత్ ఇప్పుడంతా బాగానే ఉందా? స్టడీ అవర్స్ అంటేనే అన్నీ వస్తాయా.. యాషాలేస్తున్నావ్ యాషాలు. బాగుపడే లక్షణాలు లేవా" అన్నారు. ఇంటికి వెళ్ళే ఆనందంలో అప్పుడు పెద్దగా పట్టించుకోకపోయినా తర్వాత ఆలోచిస్తే చాలా బాధనిపించింది.

సెలవల నుండి తిరిగొచ్చాక ఆరోగ్యం కుదుటపడింది. ఎప్పుడు చెప్పినది అప్పుడు చదువుకొని ఫస్ట్ యూనిట్ టెస్ట్ కి బాగా ప్రిపేర్ అయ్యాను. మా బ్యాచ్ లో మొత్తం 234 మంది ఉన్నాం. మొత్తం నాలుగు సెక్షన్లు. స్కూల్ ఆనవాయితీ ప్రకారం ప్రతీ యూనిట్ టెస్ట్ లో టాప్ ముగ్గురి పేర్లు నోటీసు బోర్డులో పెడతారు. సంవత్సరం మొత్తంలో ఒక్కసారైనా నా పేరు అందులో వస్తే చాలు అనుకున్నాను. ఫస్ట్ యూనిట్ టెస్ట్ అయిపోయింది. టీచర్స్ పేపర్ కరెక్షన్ గురించి అందరూ కథలు కథలుగా చెప్పుకునేవారు. అందులో ప్రత్యేకంగా మా సోషల్ సార్. ఆయనంటే అందరికీ భయం. ఆయనెప్పుడూ నవ్వరు. కోపంగా కనిపించేవారు. ఆయనెప్పుడైనా నవ్వుతారేమోనని ఎదురు చూసేవాళ్ళం. ఒకసారి టీచర్స్ అందరికీ జరిగిన స్లో సైక్లింగ్ పోటీలలో ఆయన గెలిచినప్పుడు మాత్రం ఆయన నవ్వడం చూసాం. ఆయన గెలిచినదానికన్నా, నవ్విన విషయమే ఎక్కువగా మాట్లాడుకున్నాం. పేపర్ కరెక్షన్ విషయానికొస్తే ఎవరైనా ఆన్సర్ సొంతంగా రాస్తే ఆయనకి నచ్చదని, మక్కీకి మక్కీ మెటీరియల్లో ఉన్నట్టు దించాలని, ఎలా రాసినా 25 కి 20 దాటవని, ఒక్కొక్కడి పేపర్ చూపించి మరీ తిడతారని చెప్పుకునేవారు. నాకేమో మొదటి నుండి బట్టీ కొట్టే అలవాటు లేక సొంతంగానే రాసాను. నేను ఫెయిల్ గ్యారెంటీ. తిట్లు తప్పవనుకొని భయపడుతూ కూర్చున్నాను. సోషల్ పీరియడ్ వచ్చింది. తిట్ల దండకం మొదలైంది. 'మేరా నెంబర్ కబ్ ఆయేగా' అన్నట్టు ఎదురుచూస్తున్నాను. ఇంతలో నా పేరు పిలిచి నిలబడమని చెప్పి క్లాసు మొత్తానికి క్లాస్ పీకారు. ఆన్సర్ షీట్ అంటే ఇలా ఉండాలి, ఆన్సర్స్ ఇలా రాయాలి అంటూ. ముఖ్యంగా ఎలక్షన్ కమిషన్ డ్యూటీస్ గురించి నేను రాసిన విధానం బాగుందని నన్ను బాగా మెచ్చుకున్న విషయం ఇప్పటికీ బాగా గుర్తు.

మొత్తానికి ఫస్ట్ యూనిట్ టెస్ట్ మార్కులన్నీ వచ్చాయి. టాపర్ ఎవరా అని స్కూల్ నోటీస్ బోర్డు కోసం ఎదురు చూస్తున్నాం. నాకెన్ని వచ్చాయో తెలుసు. కానీ అందరి దృష్టి క్రిందటి సంవత్సరం (9వ తరగతిలో) టాపర్ ల మీదనే ఉంది. బోర్డు చూసి నా ఆనందానికి అవధులు లేవు. అందులో 'ఫస్ట్ ర్యాంక్ భరత్ రెడ్డి పాతూరి 163/175' అని ఉంది. తర్వాత మా రవీందర్ సార్ పిలిచి "భరత్ అంటే నువ్వా? నువ్వు బానే చదువుతావా?" అన్నారు. దేవుడి దయ వల్ల ఆ బోర్డులో నా పేరు సంవత్సరం మొత్తం అక్కడే ఉండేలాగా చూసుకున్నాను.

మా లెక్కల టీచర్ వెలుగు కుమారి గారు. మా టీచర్స్ అందరిలో కూడా సీనియర్ ఆవిడ. అప్పటికే యాభై సంవత్సరాల పైబడి ఉంటాయి. యూ ఎస్ రిటర్న్డ్. ఆవిడతో మాట్లాడాలంటే మా అందరికీ చాలా భయం. ఒకసారి క్లాస్ లో దిక్కులు చూస్తూ దొరికిపోయాను. "ఏంట్రా దిక్కులు చూస్తున్నావ్? ముందు చెప్పిన లెక్క సంగతి చూడు" అన్నారు. "అది చేసేసాను టీచర్" అన్నాను. "నువ్వు అంత పోటుగాడివా? నువ్వేమైనా వివేకానందుడివా? నీకు అన్నీ తెలుసా? రెండో సారి వినవా? యూనిట్ టెస్ట్ లో మార్కులొచ్చాక చూస్తా నీ సంగతి" అన్నారు. ఆ తిట్లు అంత బాగా గుర్తున్నాయి మరి. నాకు మ్యాథ్స్ మీద ఉన్న పిచ్చి వల్ల, అందులో ఎప్పుడూ ఫస్ట్ ఉండటం వల్ల ఆ టీచర్ కి నేనే ఫేవరెట్ స్టూడెంట్ అయ్యాను. ఆవిడకి నా మీద ఎంత నమ్మకం అంటే స్టడీ అవర్స్ లో ఒక సెక్షన్ మొత్తానికి డౌట్స్ నన్నే క్లియర్ చెయ్యమనేవారు. "నువ్వు తప్పకుండా 100 కి 100 మార్కులు తెచ్చుకుంటావురా!" అనేవారు.

ఒక రోజు అందరం స్టడీ అవర్స్ కోసం మా స్కూల్ గ్రౌండ్ లో కూర్చొని ఉండగా మా ఇంగ్లీష్ సార్ వచ్చి 'టీచర్స్ డే' కోసం ఎవరైనా ఏదైనా కల్చరల్ ప్రోగ్రామ్స్ చెయ్యాలనుకుంటే మీ పేర్లు ఇవ్వండి అన్నారు. ఎవ్వరూ స్పందించలేదు. నేను లేవాలా వద్దా అన్నట్టుగా ఆలోచిస్తున్నాను. ఇంతలో మా సార్ "ఇక్కడ పేర్లు ఇచ్చిన వాళ్ళందరూ ఒక రెండు రోజులూ స్టడీ అవర్ కి రానక్కరలేదు. వెళ్ళి ప్రాక్టీసు

చేస్కోండి" అన్నారు. ఆ మాటతో అందరూ ఒక్కసారిగా లేచి మా సార్ వైపు దూసుకెళ్ళారు. ఇంతలో మా రవీందర్ సార్ వచ్చి చూసి విషయం తెలుసుకొని "మీలో ఎవరెవరు ఏమేమి చేస్తారో నాకు వచ్చి చెప్పండి" అన్నారు. ఆ దెబ్బతో అందరూ వెళ్ళి కూర్చున్నారు. నేను మాత్రం వెళ్ళిఒక స్కిట్ చేస్తానని చెప్పాను. దానికి ఆయన "నీకు ఎవరెవరు కావాలో వాళ్ళని మాత్రం తీస్కెళ్ళు" అన్నారు. హాస్టల్లో నాతో సన్నిహితంగా ఉండే వాళ్ళంతా నాకు సైగలు చెయ్యడం మొదలు పెట్టారు. మొత్తానికి కొంతమందిని తీస్కొని వెళ్ళి ప్రాక్టీసు చేసి, స్టేజి మీద కూడా విజయవంతంగా ప్రదర్శించాం.

ప్రతి సంవత్సరం నా పుట్టినరోజు వచ్చిందంటే ఎక్కడ ఉన్నా నాన్న ముందురోజు వచ్చి నన్ను ఇంటికి తీసుకెళ్ళేవారు. కాని ఆ సంవత్సరం నేను ఇంటికి చాలా దూరంగా ఉండటం వల్ల పుట్టిన రోజు జరుపుకోనేమో అని నిరాశ పడ్డాను. ఆ రోజు పొద్దున్నే లేవగానే స్నేహితులంతా శుభాకాంక్షలు చెప్పారు. నాకు మాత్రం మనసులో ఎక్కడో ఆశ నాన్న వస్తే బావుండని. అయినా నా పిచ్చిగానీ వచ్చేటట్లయితే నాన్న ముందే చెప్పేవారు కదా అనుకున్నాను. స్కూల్ కి రెడీ అయ్యాను. పుట్టినరోజు నాడు స్కూల్ డ్రెస్ వేస్కోవాలంటే ప్రాణానికి వచ్చింది. అయినా తప్పదు కదా. రెడీ అయ్యి కిందకెళ్ళి లైన్ లో నిల్చున్నా స్కూల్ కి వెళ్దామని. అప్పుడే వెనక నుండి ఎవరో పిలిచారు "భరత్ మీ పేరెంట్స్" అని. తిరిగి చూస్తే నాన్న, అంకుల్ ఇద్దరూ వచ్చారు. నేను ఫుల్ ఖుషీ ఇంక. నాన్న నాకోసం యాష్ కలర్ వివాల్డి షర్టు, బ్లాకు ప్యాంటు తీస్కొచ్చారు. హాఫ్ డే పర్మిషన్ తీస్కొని అంకుల్ వాళ్ళింటికి తీసుకెళ్ళారు. కొత్త డ్రెస్, చాక్లెట్లు, స్వీట్స్ తో ప్రతి సంవత్సరం లాగానే ఎక్కడా తగ్గకుండా జరిగింది నా పుట్టిన రోజు.

ఒక రోజు మా టెన్త్ క్లాస్ వాళ్ళందరినీ ఎక్స్కర్షన్ కి టూర్ తీసుకు వెళుతున్నట్టు క్లాసురూంకి సర్కులర్ వచ్చింది. అందరం తెగ సంబరపడిపోయాం. ఒక గైడ్ వచ్చి "విశాఖపట్నంలో ఆర్.కె బీచ్, వుడా పార్క్, కైలాసగిరి, హార్బర్, అరకు, బొర్రా కేవ్స్, సింహాచలం, అన్నవరం" అని పెద్ద లిస్టు చదివాడు. సాయంత్రం అందరం ఇళ్ళకు ఫోన్లు చేసి డబ్బు పంపమని చెప్పాం. డిసెంబర్ 7,8,9 తేదీల్లో అందరం మూడు బస్సుల్లో మూడు రోజులపాటు ట్రిప్ కి వెళ్ళి అవన్నీ చూసి వచ్చాం. ఆ ట్రిప్ లో అందరం స్కూల్ డ్రెస్ వేస్కోవాలని రూల్ పెట్టారు. ఎవ్వరూ తప్పిపోకుండా ఉండాలని అలా చేసారు. ఎంచక్కా మూడు రోజులు బాగా ఎంజాయ్ చేసి మంచి మంచి డ్రెస్సుల్లో ఫోటోలు దిగొచ్చనుకున్న మాకు ఆ విషయం మింగుడుపడలేదు. అయినా తప్పలేదు. అలాగే అన్నీ చోట్లా స్కూల్ యునిఫామ్ లోనే ఫోటోలు దిగాం. ఆ ట్రిప్ మొత్తంలో శృంగవరపు కోట నుండి బొర్రా గుహలకు రైలులో ప్రయాణం ఒక మర్చిపోలేని అనుభవం.


కైలాసగిరి, విశాఖపట్నం (స్కూల్ డ్రెస్ లో)

అప్పటికే 500 మార్కుల మేనియా జనానికి బాగానే వంటపట్టింది. ఏ స్కూల్ రిజల్ట్స్ చూసినా మాకు ఇంతమందికి 500 మార్కులు దాటాయంటే మాకు ఇంతమందికి 550 మార్కులు దాటాయని చెప్పుకోవడం మొదలైంది. ఈ క్రమంలో ఏ స్కూల్ తొందరగా సిలబస్ పూర్తి చేస్తే వాళ్ళు బాగా చెప్పినట్టు. అన్నీ స్కూల్స్ లాగ మా స్కూల్లోనూ నవంబర్ కల్లా సిలబస్ పూర్తి అయింది. అర్ధసంవత్సర పరీక్షల బదులు మాకు మొదటి ప్రీ ఫైనల్ పరీక్షలు జరిగాయి. ఆ పరీక్షల్లో 500 దాటిన వారందరినీ ఒక సెపరేట్ సెక్షన్ గా చేసి వారికి ప్రత్యేకమైన రుబ్బుడు ప్రారంభించారు. ఆ తర్వాత పబ్లిక్ పరీక్షల లోపు మరో రెండు ప్రీ ఫైనల్ పరీక్షలు రాశాం. ప్రీ ఫైనల్ పరీక్షలు రాసేప్పటికి నా మీద బాగా

నమ్మకం పెంచుకున్నారు మా టీచర్లంతా. నాకు స్టేట్ ర్యాంక్ వచ్చినా ఆశ్చర్యం లేదని అనుకునేవారు. మా స్కూల్లో 550 మార్కులు ఖచ్చితంగా దాటే 5 మందిలో నా పేరు మొదట ఉండేది. మ్యాథ్స్ లో 100 కి 100 మార్కులు వచ్చే 20 మంది లో కూడా నాదే మొదటి పేరు.

పబ్లిక్ పరీక్షలు దగ్గరకొచ్చేసాయ్. పరీక్షల ముందు రోజు అందరికీ హాల్ టికెట్లు ఇచ్చేసారు. పరీక్ష వేరే సెంటర్ కి వెళ్ళి రాయాలి. దానికి బస్సులు ఏర్పాటు చేసారు. పరీక్ష రాసేముందు పెన్, పెన్సిల్ వగైరా కిట్ అంతా పక్కన పెట్టి, ప్రశ్నాపత్రం ఇచ్చేలోపు దేవుడా అన్నీ ఆన్సర్ తెలిసిన ప్రశ్నలే రావాలి, రాసేటప్పుడు ఆ ఆన్సర్ లన్నీ గుర్తు రావాలి, బిట్ పేపర్ లో తెలియక పెట్టే ఏబిసిడిలు కరెక్ట్ అవ్వాలి అని ఒకసారి తెలిసిన దేవుళ్ళందరికీ మొక్కేసి మొదలు పెట్టేవాళ్ళం. అంతేకాకుండా స్కూల్ లో టీచర్స్ ఇచ్చిన టిప్స్ గుర్తుంచుకుని ముందు స్కేల్ పెన్సిల్ తీస్కొని ఆన్సర్ షీట్ లో నాలుగు పక్కల బోర్డర్స్ కొట్టి ఆన్సర్ పేపర్ ని అందంగా తయారు చేసి, అప్పుడు అసలు పరీక్ష రాయడం మొదలుపెట్టేవాళ్ళం. ఎక్కువ మార్కులు రావాలంటే ప్రతీ సెక్షన్ లో కనీసం ఒక్క ప్రశ్నైన ఛాయస్ కి మించి రాయాలని మా టీచర్స్ చెప్పినది కూడా ఫాలో అయేవాళ్ళం.


అరకు లోయ పార్కులో (ఎడమ నుండి కుడికి) ఉదయ్, సంతోష్, భరత్, సందీప్, రామకృష్ణ

లెక్కల పరీక్ష ముందు రోజు జానకిరామ్ సార్ పిలిచి "ఈ అమ్మాయి నీ వెనకే కూర్చుంటుంది పరీక్ష హాల్లో. అవకాశం ఉంటే బిట్ పేపర్ లో హెల్ప్ చెయ్యి" అన్నారు. అది విని నాకు ఏమి చెప్పాలో అర్ధం కాలేదు. మా స్కూల్ లో అమ్మాయిలు అబ్బాయిలు మాట్లాడుకోకూడదు. ఒకరకంగా చెప్పాలంటే వాళ్ళ వైపు కూడా చూడకూడదు. వెంటనే ఆయన "తప్పులేదు. మీరంతా స్నేహితులే. అవకాశం ఉంటే సాయపడు. తను మ్యాథ్స్ లో కొంచెం వీక్" అన్నారు. నేను సరేనని ఒప్పుకున్నా కానీ అలా చెప్పే అవకాశం ధైర్యం నాకు రాలేదు.

ఒక్క హిందీ మినహాయిస్తే మిగిలినవన్నీ రెండు పేపర్లు. మొత్తం 11. అయినా పరీక్షలన్నీ చకచకా అయిపోయాయి. ఆఖరి పరీక్ష అవ్వగానే ఇంటికెళ్ళిపోతామని అన్నీ ముందే సర్దేసుకున్నాం. ఆ తర్వాత నుండి మేము కాలేజీ స్టూడెంట్స్ అయిపోతామనే ఆనందం. ఆఖరి రోజు కానీ గ్రహించలేదు స్నేహితులందరం విడిపోతామని. ఆఖరి పరీక్ష అయ్యి రాగానే మా వాళ్ళంతా పక్కన టక్ షాప్ లో 'స్లామ్ బుక్స్' కొనడం చూసాను. అప్పటికి అదేంటో కూడా నాకు తెలియదు. తర్వాత నాకూ అర్ధమయ్యి ఒకటి కొన్నాను. ఇంక ఆ రోజంతా ఒకరికొకరం స్లామ్ బుక్స్ నింపే పనిలో పడ్డాం. అందులో అందరి ఫోన్ నెంబర్లు, అడ్రస్లు పంచుకున్నాం. అందరం మళ్ళీ ఏదో ఒక రోజు కలవాలని, ఎక్కడున్నా ఒకరికి ఒకరం టచ్ లో ఉండాలని చెప్పుకొని, మాకు ఇంతకాలం చదువు చెప్పిన మా టీచర్స్ కి, మా హాస్టల్ వార్డెన్స్కి, మెస్ ఇంఛార్జ్ కి, అన్ని రోజులు మంచి భోజనం పెట్టిన ఆయమ్మలకి అందరికి కృతజ్ఞతలు తెలిపి ఇంటికి బయల్దేరాం. ఇప్పటిలా అప్పుడు ఫేస్ బుక్, ట్విట్టర్, కనీసం మొబైల్ ఫోన్ కూడా లేకపోయినా ఆ స్లామ్ బుక్ లో దాచుకున్న వివరాలతోనే అందరం టచ్ లో ఉన్నాం.

మా పబ్లిక్ పరీక్షల ఫలితాలొచ్చాక ఒకసారి స్కూల్ కి వెళ్ళి టీచర్స్ అందరినీ కలవాలనిపించింది. తీరా అవి చూస్కొని చాలా నిరాశపడ్డాను. 550 కి బాగానే దూరంగా.... 514 దగ్గరే ఆగిపోయింది నా బండి. ఇంకా ఏం మొహం పెట్టుకుని వెళ్తాంలే అనుకున్నా మళ్ళీ ఎందుకో వెళ్ళాలనే నిర్ణయించుకున్నాను. అక్కడికి వెళ్ళగానే మొదట మా లెక్కల టీచర్ కనిపించారు. నన్ను చూడగానే ఆవిడ ఆనందంగా వచ్చి

"నువ్వొక్కడివే నా పేరు నిలబెట్టావు రా! ఐ యాం వెరీ హ్యాపీ" అన్నారు. అప్పుడు అర్థం అయింది స్కూల్ మొత్తంలో మాథ్స్ లో 100 కి 100 మార్కులు నా ఒక్కడికే వచ్చాయని. మా టీచర్ ఆనందం చూసాక నేను స్కూల్ కి వచ్చి మంచి పని చేశాననిపించింది. మా డైరెక్టర్ జానకి రామ్ సార్ ని కలిసాను. స్కూల్ అయ్యాక కూడా మళ్ళీ వచ్చి కలిసినందుకు చాలా ఆనందపడి నాకొక పేపర్ ఇచ్చి చూడమన్నారు. అందులో నా ఫోటో , మ్యాథ్స్ 100 కి 100 మార్కులు అని ఉంది. వెంటనే మా సార్ ని అడిగి ఆ పేపర్ కటింగ్ తీస్కున్నాను. లైఫ్ లో ఫస్ట్ టైం నా ఫోటో పేపర్ లో చూస్కున్నాను మరి. అది ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి.

ఇలా చాలామంది జీవితాల్లో లాగానే టెంత్ క్లాస్ నాక్కూడా ఎన్నో అమూల్యమైన అనుభవాలని, జ్ఞాపకాలని సొంతం చేసింది.

★★★★★★★★★★★



నా పేరు పాతూరి భరత్ రెడ్డి. మా ఊరు గోదావరి ఒడ్డున శ్రీరాముడు కొలువై ఉన్న భద్రాచలం. నా స్కూలు చదువంతా భద్రాచలం, పాల్వంచ, గుంటూరుల్లో జరిగింది. ఇంటర్ విజయవాడ, ఇంజనీరింగ్ హైదరాబాదులో చదివాను. సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాను. ప్రస్తుత నివాసం బెంగళూరు.




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే ‘టెంత్ క్లాస్‘ ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి ‘టెంత్ క్లాస్‘ రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. ‘కౌముది‘ లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ ‘టెంత్ క్లాస్‘ అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని ‘కౌముది‘ ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# రాధిక బుక్కా

ఇండియాలో స్టేట్ సిలబస్ లో చదువుకుంటున్న / చదువుకున్న పిల్లలకి టెంత్ క్లాస్ అంటే ఒక పెద్ద మెట్టు. జీవితాన్ని దిశానిర్దేశం చేసే సంవత్సరం. అలాగే, స్కూల్ లో ఆఖరి సంవత్సరం కూడా. ఇంకా ఆ తరవాత నించీ కాలేజీ స్టూడెంట్స్ అయిపోతాము. నా మటుకు నాకు, కాలేజీ కంటే కూడా బాగా నచ్చేవి స్కూల్ రోజులే. అందులోను, నైన్త్ అండ్ 10థ్ క్లాసెస్. మాది హైదరాబాద్ లోని హోలీ మేరీ గర్ల్స్ హై స్కూల్!! చాలా పెద్ద భవనం, స్కూల్ గ్రౌండ్స్. కాన్వెంట్ కూడా లోపలే ఉండేది! స్కూల్ లోపలికి అడుగు పెడితే, అది మా సామ్రాజ్యం!

మేము మహరాణుల్లా అనుకునే వాళ్ళం. చాల క్రమశిక్షణ, పద్ధతులు ఉండేవి. పొద్దున్నే ప్రేయర్ బెల్ తో రోజు మొదలయ్యేది. "అవర్ ఫాదర్ ఇన్ హెవెన్" ప్రేయర్ , మరికొన్ని ప్రేయెర్స్ చెప్పి , క్లాసెస్ కి రెడీ అయ్యే వాళ్ళం. టీచర్స్ అంత చాల బాగా శ్రద్ధగా పాఠాలు చెప్పేవారు. మా క్లాసులో ప్రైవేటు tution చెప్పించుకున్న వాళ్ళు చాల తక్కువ. ప్రీ ఫైనల్స్ ముందరే, అన్ని సబ్జక్ట్స్ ఒకసారి పూర్తిగా తిరగేయ్యటం అయిపోయింది. సోషల్ లెసన్స్ కథలు కథలుగా మా ఇంట్లో చెప్పేదాన్ని. తెలుగు 2nd లాంగ్వేజ్. క్వశ్చన్ పేపర్ లో ఎక్కడైనా వివరింపుము అని వస్తే, మా ప్రతాపం చూపించే వాళ్ళం. ఇంగ్లీష్ నాన్ డీటెయిల్ క్లాస్సెస్ అప్పుడు టి.వి సీరియల్ టైపు లో చాల ఉత్కంఠగా వినే వాళ్ళం. అప్పటికే ఒక 2-3 సార్లు ఆ బుక్ చదివేసి ఉన్న కూడా. మాది C సెక్షన్. చాల అల్లరి క్లాసు అని పేరు. అలాగని చదువుల్లో కూడా ఫస్ట్ ఏ. మా క్లాసులో అందరికి విడివిడిగా చైర్స్ అండ్ డెస్క్స్ ఉండేవి. ఆ డెస్క్ లోనే మన బుక్స్ అన్నీ పెట్టుకుని తాళం వేసుకోవచ్చు. ఏ రోజుకారోజు ఏ హోంవర్క్ ఉందొ, లేక టెస్ట్ ఉందొ, ఆ బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్ళే వాళ్ళం. రోజూ పెద్ద పెద్ద బాగ్ మోతలు ఉండేవి కాదు. సాయంత్రం క్లాసెస్ అయ్యాక మళ్ళీ ప్రేయర్ బెల్.



సాయంత్రం ప్రేయర్ అయ్యాక ఒక ఇంటరెస్టింగ్ కార్యక్రమం ఉండేది. మా స్కూల్ లో 4 స్క్వాడ్స్ ఉండేవి – సత్య, విజయ, వినయ, నిర్మల. ప్రతి క్లాసు నించి నాలుగు స్క్వాడ్స్ లోకి విద్యార్థినులు విభజింపబడతారు. స్పోర్ట్స్, ఈవెంట్స్ లో తలపడటమే కాకుండా విధులు కూడా ఈ నాలుగు స్క్వాడ్స్ మధ్యా విభజించేవాళ్ళు. ప్రతి వారం, స్కూల్ ఫైనల్ బెల్ కొట్టేసాక, క్లాసు రూమ్స్ తుడిచి చైర్స్ అనీ సర్ది, బోర్డు తుడిచి మర్నాడు పొద్దున్న క్లాసుకి అన్నీ తాయారు గా పెట్టి వెళ్ళాలి. ఒక్కో వారం ఒక్కో స్క్వాడ్ డ్యూటీ అది. ఇంట్లో ఏ పనీ చేయని మేము, స్కూల్ లో మాత్రం తెగ తుడిచేసి, క్లాసు రూంని శుభ్రమ్ గా క్లీన్ చేసేవాళ్ళము! అదో సరదా పనిగా ఉండేది! ఈ పని అయ్యాక, అప్పుడప్పుడు ఒక నలుగురైదుగురు ఉండిపోయి, స్పిరిట్ గేమ్ ఆడేవాళ్ళం!! స్పిరిట్ గేమ్ అంటే, ఒక పేపర్ మీద అల్ఫాబెట్స్, నంబర్స్ వేసి, మధ్య లో ఒక రూపాయి నాణెం పెట్టి, అందరూ దానిమీద చూపుడు వేలు పెట్టి, కళ్ళు మూసుకుని, ఆత్మని ప్రార్థించి, పిలవాలి. ఒకసారి ఇలా 2-3 రోజులు రోజూ ఉండి ఆడాము. ఎలా కదిలిందో, ఎవరు కదిపారో తెలియదు కానీ, కాయిన్ కదిలింది!! ఏదో ఒక పేరు చెప్పింది. తనని ఎవరో చంపేసారు అని చెప్పింది!! భయం వేసి వేళ్ళు తీసేసాము ! అలా మధ్యలో తీసేస్తే ఆ ఆత్మ ఎవరినో ఒకరిని పట్టుకుంటుంది అని ఎవరో అన్నారు. అంతే, ఇంక తర్వాత కొన్ని రోజులు భయం భయం గా తిరిగాం!!! ఇంక మళ్ళీ ఎప్పుడూ ఆడకూడదు అని నిర్ణయించుకున్నాం !!

పదవ తరగతిలో ఒక అదనపు బాధ్యత ఉండేది నాకు. నేనే క్లాసు లీడర్ ని. ఒక ముఖ్యమైన బాధ్యత ఏమిటంటే, టీచర్స్ రాకపోతే క్లాసు అంతా అల్లరి చెయ్యకుండా చూడాలి, వాళ్లకి ఏదైన చదవటానికి ఇవ్వాలి. ఇక్కడ వచ్చిన చిక్కేమిటంటే నేనే బోలెడు అల్లరి చేసేదాన్ని. ఒకసారి ఇలాగే క్లాస్ రూం తలుపు దగ్గరవేసి అందరమూ ఒకటే అల్లరి, గోల. పక్క క్లాసులో సరళ టీచర్ ఉన్నారని తెలియదు. ఆవిడ మా హిందీ టీచర్. చాలా స్ట్రిక్ట్. మా అందరికి హడలు!! ఆవిడ వచ్చారు. క్లాస్ లీడర్ ఎక్కడ అని అడిగారు. భయం భయంగా

నించున్నాను. మొత్తం క్లాసు అందరిని బెంచెస్ మీద నించోపెట్టారు. నాకు అడిషనల్ పనిష్మెంట్ ఏమిటంటే, బెంచ్ పై నించుని, చేతులు కూడా పైకి పెట్టాలి :). ఆ పీరియడ్ అంతా అలాగే నించున్నాము! ఒకళ్ళని చూసి ఒకళ్ళు నవ్వుకుంటూ ఉన్నాం. ఇంకా ఇలాంటి అల్లర్లు ఎన్నెన్నో!! తలుచుకుంటే ఇప్పటికి కూడా భలే నవ్వొస్తుంది.





మా స్కూల్ హెడ్మిస్ట్రెస్ ( ప్రధానోపాధ్యాయురాలు)ని, మేము మదర్ అని పిలిచే వాళ్ళం. సిస్టర్ ఫిలోమినా మాకు ఇంగ్లీష్ చెప్పేవారు. తంగమణి టీచర్ సోషల్ చెప్పేవారు. బోర్డు మీద రాజులు, సైనికుల బొమ్మలు వేసి మరీ పాఠం చెప్పే వారు. భలే సరదాగా ఉండేది! లెఖ్ఖలకి జ్యోతి టీచర్ వచ్చేవారు. చాల సీరియస్ గా చెప్పేవారు. ట్రి గోనోమేట్రీ భలే సులువుగా అర్ధం అయ్యేలా చెప్పేవారు. మా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, మాతో త్రో బాల్ ఆడించేవారు. మమ్మల్ని "రవడీల్లారా" అనే తిట్టేవారు!! మా క్లాసు టీచర్ అంటే మా అందరికీ చాలాచాలా ఇష్టం ఉండేది. ఆవిడ పేరు "శాంత" టీచర్. పేరుకు తగట్టే ఉండేవారు. మమ్మల్ని అస్సలు తిట్టేవారు కాదు. "లిసన్, యు ఆర్ టాకింగ్ అ లాట్" అన్నారంటే అది పెద్ద తిట్టు కింద లెఖ్ఖ మాకు!!! సైన్స్ చెప్పేవారు. అద్భుతంగా చెప్పేవారు!! సైన్స్ టెక్స్ట్ బుక్స్ లో ఏ పేజీలో ఏముందో మాకు కళ్ళకి కట్టినట్టు గుర్తుండేది! ఆవిడని మళ్ళీ ఇంటర్మీడియట్ లో ఉండగా ఒక సారి వెళ్లి కలిసాను. తర్వాత ఎప్పుడు చూడలేదు. ఈ సారి ఇండియా వెళ్ళినప్పుడు కుదిరితే కలవాలి. ఎక్కడున్నారో!ఆవిడని అస్సలు మర్చిపోలేము!!!



స్లిప్ టెస్ట్స్, యూనిట్ టెస్ట్స్, క్వార్టర్ ఫైనల్స్, హాఫ్ ఇయర్లీ, ప్రీ ఫైనల్స్, అన్నిటికీ భలే హడావిడి పడేవాళ్ళం. సెలవలు వస్తే, స్కూల్ ఎప్పుడు మొదలవుతుంద అని ఎదురు చూసేవాళ్ళం. స్కూల్ లైబ్రరీలో మంచి మంచి బుక్స్ రెంట్ తీసుకుని హాలిడేస్ లో చదివేదాన్ని. స్కూల్ లో పెరేడ్ లు, మార్చ్ ఫాస్టు్లు, పాటల పోటీలు, ఎస్సే, ఎలక్యూషన్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అన్నిట్లో సరదా సరదాగా పోటీ పడేవాళ్ళం!! ఇంకా అప్పటికి సెల్ ఫోన్స్, వీడియో గేమ్స్ ప్రభంజనం మొదలు కాకపోవటంతో, స్కూల్ పిల్లలం, పిల్లలాగే ఉండేవాళ్ళం!! చివరిసారి క్లాసులో కలుసుకున్నప్పుడు ఆటోగ్రాఫ్ బుక్స్ పట్టుకుని, ఎప్పుడూ నవ్వుతూ ఉండే అందరూ, భలే బాధ పడ్డాము!!

మా 10th ఎగ్జామ్స్ సెంటర్ ఏదో ఒక పాత స్కూల్ లో పడింది! ఒక మాథ్ పేపర్ లీక్ అయ్యిందని మళ్ళీ పరీక్ష పెట్టారు! అప్పుడు అదొక పెద్ద టెన్షన్!! రోజూ పరీక్ష అయ్యాక, మా బాబాయ్ వచ్చి ఇంటికి తీసుకెళ్ళేవారు! ఒక్కో ఎగ్జామ్ రాసి వస్తుంటే ఏదో సాధించాము అన్నట్టు ఉండేది!! పరీక్షలు అయిపోయాక మొట్టమొదటి సారి నేను నా ఫ్రెండ్స్ తో కలిసి సినిమా కి వెళ్ళాను!! తరవాత తరవాత, అందరమూ వేరే వేరే ప్రొఫెషన్స్ లో, లాయర్స్ గా,డాక్టర్స్ గా , సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ గా , ఇంజనీర్స్ గా, చార్టెడ్ అకౌంటెంట్స్ గా, బిజినెస్ గ్రాడ్యుయేట్స్ గా స్థిరపడ్డాము. ఇప్పుడు, ఫేస్ బుక్ పుణ్యమా అని చాలమందిమి టచ్ లోనే ఉన్నాము! అప్పటి అనుభూతులు అన్నీ చెప్పాలంటే ఎన్నో ఎన్నెన్నో!! ఎప్పటికీ మనసులో తాజాగా నే ఉంటాయి. అందులో కొన్ని జ్ఞాపకాలని ఇలా కౌముదిలో కలబోసుకోవటం చాల ఆనందంగా ఉంది!

వృత్తిరీత్యా సాఫ్ట్వేర్ ఇంజినీర్ ఐన రాధికగారు హాబీగా రేడియో ప్రయోక్తగా కార్యక్రమాలు చేస్తుంటారు. జర్నలిజమ్‌లోను, రచనలు చేయడంలోనూ కూడా అనుభవం ఉంది.



# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే `టెంత్ క్లాస్` ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి `టెంత్ క్లాస్` రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. `కౌముది` లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ `టెంత్ క్లాస్` అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని `కౌముది` ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**



# జ్యోతి వలబోజు

పదోక్లాసు.... ప్రతీ విద్యార్థి జీవితంలో ఒక పెద్ద మలుపు. తెలిసీ తెలియని వయసులో చదువు సాగించినా ఈ క్లాసునుండి కాస్త సీరియస్సుగా, బాధ్యతగా ఆలోచించవలసిన వయసు. ఒకటి తర్వాత ఇంకో క్లాసు పెరుగుతూ, పుస్తకాలు మారుస్తూ, పరీక్షలు రాస్తూ చివరికి పదోక్లాసులో స్కూలులో ఆఖరు, పబ్లిక్ పరీక్ష అనే టెన్షన్ ఎక్కువే ఉంటుంది.. స్కూలులో చాలా స్ట్రిక్టు. డ్రెస్ వేసుకోవాలి, రెండు జడలు రిబ్బన్లు కట్టాలి. షూస్, గేమ్స్ అనే స్కూలు లైఫ్ నుండి విముక్తి కలిగించేది ఈ పదోక్లాసు. తర్వాత కాలేజీ అంటే

పెద్దవాళ్లమైపోయామనిపిస్తుంది.. ఇష్టమొచ్చిన డ్రెస్ వేసుకోవచ్చు. స్టైలుగా రెండు పుస్తకాలు బాగులో వేసుకోవచ్చు. హాయిగా ఎంజాయ్ చేయవచ్చు అనుకుంటారు పిల్లలు. కానీ ఇన్నేళ్లుగా కలిసి చదువుకున్న స్నేహితులకు దూరమవ్వాల్సి వస్తుంది అనే బాధ కూడా తప్పదు.. అందుకే తర్వాత చాలా ఏళ్లకు తలుచుకుంటే మాత్రం ఈ పదోక్లాసు అనుభవాలు, అనుభూతులు మరపురానివి. మధురమైనవి కూడా... నిజంగా స్కూలు జీవితం మధురమైనది. మరపురానిది. ఎటువంటి కల్మషాలు లేనిది కూడా. అందుకే ఆ పాత జ్ఞాపకాలు మరోసారి గుర్తు చేసుకోవాలనిపించింది. అసలు మర్చిపోతే కదా గుర్తు చేసుకోవడానికి.. ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటాయి. ఇప్పటి బిజీ లైఫ్ లో ఇలా చిన్నప్పటి జ్ఞాపకాలను తడిమిచూస్తుంటే మనసు చల్లబడి, సేద తీరుతుంది. ప్రశాంతంగా ఉంటుందని నా నమ్మకం. అనుభవం కూడా..




నేను చదివింది St.Anns Girls High School. Vijayanagar Colony.. కాన్వెంట్ స్కూలు. ఇంగ్లీషు మీడియంలో చదవాలని ఐదో క్లాసులో చేర్పించారు నన్ను. ఇప్పటి పిల్లలకు ఆరో క్లాసునుండే చదువుల టెన్షన్, ఒత్తిడి ఉంటున్నాయి. తల్లిదండ్రులకు ఇంకాస్త ఎక్కువ. కాని నేను చదువుకునేటప్పుడు మాత్రం ఆడుతూ పాడుతూ, డాన్సులు, నాటకాలు వేసుకుంటూ గడిపేసాను. తొమ్మిది పాసై, పదో క్లాసులోకి వచ్చాము అనగానే మనసులో భయం, దడ మొదలయ్యింది. దానికి పోపు పెట్టినట్టు మా ట్యూషన్ సార్ మా అమ్మకు సెలవుల్లోనే ఎన్నో జాగ్రత్తలు చెప్పాడు. నో టివి. నో సినిమాలు, నో పెళ్ళిళ్ళు పార్టీలు, పొద్దున నాలుగుకే లేచి చదువుకోవాలి. అది చాలదన్నట్టు అల్లరి చేస్తే కొట్టడానికి, చింతబరికెలు కొనమని అవి హైదరాబాదులో ఎక్కడ దొరుకుతాయో కూడా చెప్పారు. అప్పుడు నేను ,మా తమ్ముళ్ళూ ఎంత తిట్టుకున్నామొ ఆ సార్ని. కాని దాని అవసరం మా పెద్ద తమ్ముడికే ఎక్కువ పడేది. స్కూలు లైఫంతా ఆటలు, పాటలు, చదువు, పోటీలు అంటూ బిజీ బిజీగా గడిచిపోయింది.. స్నేహితులందరూ పరీక్షలయ్యాక ఫలితాలు వచ్చేవరకు టెన్షన్ గా ఎదురుచూసి పాస్ అయ్యామని తెలిస్తే హమ్మయ్యా తర్వాత క్లాసులో కలిసే ఉంటామన్న సంతోషం కలిగేది. ఒకదాని తర్వత మరో క్లాసుకు ఎదుగుతున్నా పదో తరగతికి రాగానే అందరికీ టెన్షన్.. మాకు స్కూల్లో కూడా ఆంక్షలే కాని మాకు పనికొచ్చే సడలింపులు కూడా ఉండేవి... పదో క్లాసు వాళ్ళకు ఎటువంటి పోటీలు పాల్గోనే పని లేదు. ఆటలైనా, డాన్స్ పోటీలైనా ఐనా మనల్ని తీసికెళ్ళరు. నాకు మాత్రం సంతోషంగా ఉండేది. ఎందుకంటే ఎప్పుడు తప్పించుకుందామన్నా వీలు పడేది కాదు. పొడుగ్గా ఉన్నవాళ్ళని ముందు పట్టుకుపోయేవారు. ఇంకో విషయంలో కూడా నాకు పదో క్లాసు అంటే ఇష్టముండేది. అది ఉపాధ్యాయ దినోత్సవం రోజు పదో క్లాసు పిల్లలు చీరలు కట్టుకుని టీచర్లవడం. కాని అసలు రోజు భయమేసి స్కూలుకే దుమ్మా కొట్టా.( చీర కట్టుకుని పిల్లల క్లాసులు తీసుకునే ధైర్యం లేక ). మా అమ్మతో జ్వరంగా ఉంది అని ఫోన్ చేయించా. లేకుంటే ఊరుకుంటారా..? ఇంట్లో స్ట్రిక్ట్ , స్కూల్లో ఎప్పుడు చదువు. తప్పదు కదా.

అప్పట్లో లెక్కలలో జనరల్, కాంపోజిట్ అని రెండు ఆప్షన్స్ ఉండేవి.నాకేమో లెక్కలు ఇష్టమే. కాని ఆల్జీబ్రా అంటే గుండె గాబ్రా గా ఉండి, ఎక్కడ ఫెయిల్ అవుతానో అని జనరల్ తీసుకున్నాను. నిజం చెప్పాలంటే నేను ఎపుడూ చదువును చాలా సీరియస్ గా తీసుకోలేదు. అలాగే పెద్ద పెద్ద రాంకులు తెచ్చుకుని ఏదో ఉద్ధరించాలనే సదుద్దేశ్యం నాకెప్పుడూ లేదు. రెండు నెలల వేసవి సెలవులు చాలా భారంగా గడిచేవి. అందుకే ఫలితాలు రాగానే తర్వాతి క్లాసు లెక్కల పుస్తకం కొనేసి , ఇంట్లోనే చెయడం మొదలుపెట్టేదాన్ని. మా ట్యూషన్ సార్

పూర్ణానందంగారు ప్రభుత్వ పాఠశాలలో లెక్కలు చెప్పేవారు. నేను పదో క్లాసుకు రాగానే , తనదగ్గరున్న అంతకుముందు పది సంవత్సరాల పరీక్షా పేపర్లు తెచ్చి టైప్ చేయించమన్నారు. అప్పటికి మాది SSC పదో బ్యాచి.. నేను మొదటి పేపర్ , మా ఫ్రెండ్ ఇంకో జ్యోతికి రెండో పేపర్ ఇచ్చి టైపింగ్ చేయించుకున్నాము. అప్పుడు జెరాక్స్ అంటే తెలీదు మరి. ఆ పేపర్లు చేయడంతో లెక్కలలో మంచి పట్టు దొరికింది. అందుకే లెక్కల క్లాసులో ఎప్పుడు టీచర్ చెప్పే పాఠాల కంటే ఎంతో ముందు ఉండేదాన్ని. లెక్కలు మాత్రమే కాదు తెలుగు అంటే కూడా నాకు చాలా ఇష్టంగా, అభిమానంగా ఉండేది. మా తెలుగు టీచర్ లక్ష్మిగారు చాలా సున్నితంగా, మృదువుగా ఉండేవారు. ఆవిడంటే మాకు అస్సలు భయముండేది కాదు. కాని తెలుగులో ప్రతీ పాఠం అందరికీ అర్ధమయ్యేలా చెప్పేవారు. ఒకవేళ తెలుగు క్లాసు మధ్యాహ్నం తర్వాత వస్తే టీచర్ గారు కాస్త కునికిపాట్లు పడేవారు. అప్పుడు మేము నవ్వుకునేవాళ్లం కాని ఇప్పుడు తలుచుకుంటే పాపం అనిపిస్తుంది. ఇంట్లో పనంతా చేసుకుని పొద్దున తొమ్మిదికల్లా స్కూలుకు వచ్చి సాయంత్రం మూడున్నర వరకు గంటకో క్లాసు తీసుకోవడం ఎంత కష్టమో కదా.. ఇక హిందీ టీచర్ కమలకుమారిగారిని, సైన్స్ టీచర్ స్వర్ణకుమారిగారిని కూడా ఇప్పటికీ గుర్తు చేసుకుంటాను. స్వర్ణ టీచర్ చాలా అందంగా, యాక్టివ్ గా ఉండేవారు.. అస్సలు విసుక్కునేవారు కాదు. కాని చెప్పింది వినకుంటే కోపం వచ్చేది..



నేను మాత్రం లెక్కలు , తెలుగు, హిందీ ఇష్టంతో చదివితే సైన్సు, సోషల్ కష్టంతో చదివా. ఎందుకో ఆ సోషల్ లో మ్యాపులు, నదులు, యుద్ధాలు , ఫార్ములాలు, చచ్చినరోజు, కొట్టుకున్న రోజు గుర్తుపెట్టుకోవాలంటే చచ్చే చావొచ్చేది. అందుకే క్లాసులో నాలాంటి మేధావులు కలిసి, కొన్ని కొండ గుర్తులు పెట్టుకునేవాళ్ళం. పాస్ మార్కులు తప్పకుండా వచ్చేవి. లెక్కల్లో మాత్రం అర మార్కు తగ్గినా మా ట్యూషన్ సారుతో తధిగినతోం తప్పేది కాదు. ఆడపిల్లను కాబట్టి ఘాటుగా తిట్టేవారు. అందుకే జాగ్రత్తగా చేసేదాన్ని. స్కూలులో నాకు చాలా ఇష్టమైన టీచర్ లెక్కలు చెప్పే సిస్టర్ మేరీ. ఆవిడ మా ట్యూషన్ సార్ కి కూడా పరిచయమవడం, నేను లెక్కలు బాగా చేయడంతో నన్ను కాస్త ఎక్కువ అభిమానంగా చూసేవారు. ఎప్పుడూ టీచర్(సిస్టర్) కంటే ముందే లెక్కలు పూర్తిచేస్తుండడంతో అప్పుడప్పుడు బోర్డ్ మీద లెక్క రాయమనేవారు. అబ్బో! అప్పుడెంత గర్వమో.. సంబరమో. ఇంత పెద్ద బ్లాక్ బోర్డు మీద చాక్ పీస్ తో రాయడం అంటే నాకు చాలా ఇష్టంగా ఉండేది. ఎందుకంటే అదీ టీచర్లు మాత్రమే చేస్తారు కాబట్టి .. మనకు రాసే అవకాశం రావడం మాత్రం గొప్పే అని నా ఖచ్చితమైన అభిప్రాయం ఉండేది పిల్లల్లో...

ఇక పదో క్లాసు అంటే స్కూలు మొత్తంలో ఎంతో గౌరవం కూడా.. చిన్న క్లాసు పిల్లలు అందరు మనముందు చాలా వినయంగా ఉండాలి. టీచర్లు కూడా పెద్ద తరహా పనులు పదో క్లాసు వాళ్ళకే చెప్పేవారు. అందులో ఒకటి ప్రతి రోజు జరిగే ప్రార్ధన సమావేశంలో పదోక్లాసు అమ్మాయిలు రోజుకొకరు ఆ రోజు వార్తలు చదవాలి. మనం క్లాసులో నలుగురైదుగురు ముందే వాగుడుకాయ, కాని ఇక స్కూలు మొత్తం ముందు స్టేజీ మీద నిలబడి వార్తలు చదవాలి. అసలే మా ప్రిన్సిపాల్ చండీరాణి. చావుకు దగ్గరైన రోగి లెక్కబెట్టుకున్నట్టు నేను రోజు నా రోల్ నంబర్ వచ్చేవరకు రోజులు లెక్కబెట్టేదాన్ని. నాది చివర్లో ఉండేది 64 ఇంకా టెన్షన్ ఎక్కువ. కాని ఏ దేవుడు కరుణించాడో ఆ రోజు ఎవరో లీడర్ చనిపోయాడని స్కూలు మూసేసారు. ఆ చచ్చిపోయిన నాయకుడికి థాంక్స్ చెప్పుకున్నా. ఇక పదో తరగతి జీవితంలో

చివరి ఘట్టం. పబ్లిక్ పరీక్షలు.... యుద్ధకాండ అనుకోవచ్చు. అన్ని చదువుకున్నట్టే ఉంటాయి. మళ్ళీ ఏదీ గుర్తుకురాదు. సైన్సు ప్రశ్నలకు సోషల్ పుస్తకంలోని జవాబులు గుర్తొచ్చేవి. లెక్కలు పర్వాలేదు. తెలుగులో ప్రతిపదార్ధం , గణవిభజన అంటె నాకు ఒకటే వణుకు. అర్థం చేసుకుని రాస్తే మొత్తం మార్కులు రావొచ్చు. అంత ఈజీ. కాని మా తెలుగు టీచర్ మా బుర్రల కెక్కేలా చెప్పలేదు .. ఏదో మాకు మాత్రమే అర్ధమయ్యే చిట్కాలు గుర్తుపెట్టుకుని పరీక్షకు తయారవుతున్నాము. ఇక హాల్ టికెట్ కోసం పాస్‌పోర్ట్ ఫోటో దిగడం అదే మొదటిసారి. ఇంట్లో ఉన్న కొత్త డ్రెస్ వేసుకుని స్టూడియోకెళ్ళి లైట్లు, గొడుగు పెట్టి ఫోటో దిగడం భలే అనుభవం. తలుచుకుంటే నవ్వొస్తుంది ..

నేను పదోక్లాసు పరీక్షలు రాసేటప్పుడు ఒక తమాషా జరిగింది. పరీక్షాపత్రాలు ఉన్న గోడౌన్‌లో దొంగలు పడి కొన్ని పేపర్లు ఎత్తుకుపోయారని తెలిసింది. పరీక్ష సెంటర్‌లో గంట ముందే చేరుకునేవాళ్ళం. అక్కడ ఎవరో గెస్ పేపర్ అని చెప్పేవాళ్ళు. కాని ఒకోసారి అవే వచ్చేవి, ఒకోసారి రాలేదు. కాని శనివారం లెక్కల పరీక్ష మొదటి పేపర్. అదే రోజు మొదటి పేపర్, సోమవారం జరగబోయే రెండో పేపర్ కూడ తెలిసిపోయింది.నేను మాత్రం అన్నీ చదువుకుని చివర్లో ఆ పేపర్ ఒకసారి చూసుకునేదాన్ని. అశ్చర్యంగా లెక్కల పేపర్ మొత్తం అచ్చు గుద్దినట్టుగా అలాగే వచ్చింది. రెండో పేపర్ కూడా అంటే. తర్వాతి రోజు సైన్స్ పేపర్ . ఉదయం ఈనాడు పేపర్లో ఇలా పరీక్షా పెపర్లు లీక్ అయ్యాయి . ఇది ఒక సాంపిల్ అని ప్రచురించారు. ఇక అదేం వస్తుంది లెమ్మని నేను లైట్ తీసుకున్నా. తీరా చూస్తే ఏముంది మొత్తం పేపర్ అలాగే వచ్చింది. ఇక బిట్ పేపర్ ఐతే ప్రశ్నలు కాకుండా సమాధానాలు ఔట్ అయ్యాయి. తర్వాతి రెండు పేపర్లు కూడా తెలిసిపోయాయి. కాని నేను ఎప్పుడూ వాటి మీద ఆధారపడలేదు. ఆ తర్వాత ఈ పేపర్ లీక్ విషయమై చాలా గొడవ జరిగింది. చివరి మూడు పరీక్షలు మళ్ళీ పెట్టాలని కూడా అనుకున్నారు ,కాని ఈ పేపర్లు కొన్ని జిల్లాలలో మాత్రమే లీక్ అయ్యాయి కాబట్టి అక్కరలేదు అని తీర్మానించేసారు. అప్పుడు కాని నేను కుదుటపడలేదు. మళ్ళీ అన్ని పరీక్షలు , అందునా నాకు పడని సబ్జెక్టులు. ఒక్కో పరీక్ష ఐపోతుంటే ఒక్కో బండరాయి తల మీదనుండి తీసేసినట్టు ఫీల్ ఐపోయేదాన్ని . హమ్మయ్య ఇక ఆ పుస్తకం చదివే పని లేదు . ఏడాది నుండి చదువుతున్నాము అని.... ఇప్పుడు పిల్లలకు 90% కి పైగా మార్కులు ఉంటేనే కళ్ళకు కానరావట్లేదు. అదే నేను చదువుకునే రోజుల్లో ఐతే 60% కంటే ఎక్కువ వస్తే చాలా గొప్ప. ఇక 70% దాటితే ఇక చెప్పక్కర్లేదు డిస్టింక్షన్.. పదో తరగతి ఐపోయిందంటే మాకందరికి ఒక పెద్ద రిలీఫ్ ఏంటంటే ఇక స్కూలు డ్రెస్సు, రెండు జడలు వేసుకునే పని లేదు. ఇంచక్కా రోజుకో డ్రెస్ వేసుకుని, హాయిగా ఒక జడ వేసుకోవచ్చు అని ఎదురు చూసేవాళ్ళం..

కాని ఇప్పుడు తలుచుకుంటే నిజంగా స్కూలు జీవితం. స్కూలును వదిలిపెట్టే పదోక్లాసు జీవితం, అనుభవాలు మరపురానివి. చదువు మాత్రమే కాక టీచర్లు, స్నేహితులతో ఎంత అనుబంధం. తెలిసీ తెలియని అమాయకత్వం. తెలుసుకోవాలనే ఆసక్తి అప్పటి పిల్లల నైజం. అన్నీ కొత్తగా ఉండేవి. ఒక్కసారి రింగులు తిప్పుకుంటూ ఆ పదోక్లాసుకు వెళితే మర్చిపోయామనుకున్న ఎన్నో విషయాలు ఇంకా మన మనసులోని మూలలో భద్రంగా ఉన్నాయనిపిస్తుంది. ప్రతీ సబ్జెక్ట్ కి ఒక టీచర్ ఉండేవాళ్లు. కాని ప్రతీ టీచర్ కి ప్రతీ క్లాసులో కొందరు పిల్లలు చాలా ఇష్టంగా ఉండేవారు. వాళ్లు చదువులో ముందుండడమే వాళ్లకు ముఖ్యం. తెలియనిది తెలుసుకోవాలనుకునే పిల్లలంటే మరీ ఇష్టం. నాకు మాత్రం లెక్కల టీచర్ అంటే చాలా ఇష్టం.ఎందుకంటే నాకు లెక్కలు ఇష్టం కాబట్టి.. తెలుగు, హిందీ టీచర్లను ఇప్పటికీ మర్చిపోలేదు. చిన్న చిన్న తప్పులను ఎలా సరిదిద్దేవారు కదా అవి ఇప్పటికీ గుర్తుండిపోయాయి అనిపిస్తుంది. ఆ టీచర్లు వేలమంది విద్యార్ధులకు చదువు చెప్పడంవల్ల మేము గుర్తుండకపోయినా. మాకు మాత్రం కొందరు టీచర్లను ఇంకా మర్చిపోలేదు. వాళ్ల ప్రోత్సాహం, ప్రేమ ఇంకా కళ్లముందు కనిపిస్తూనే ఉంటుంది. అప్పుడు ఇష్టపడి చదివాం కాబట్టే ఇప్పటికీ గుర్తుంది అనుకుంటా నేనైతే. పదోక్లాసు తర్వాత ఎవరికి వారు వేర్వేరు కాలేజీల్లో చేరి , తర్వాత ఎవరికి వారు చెల్లాచెదురయ్యారు. ఎప్పుడైనా కలుసుకోవాలన్నా వివరాలు తెలీవు . కాని ఈ మధ్య ఫేస్ బుక్ ద్వారా ఆనాటి పదోక్లాసు స్నేహితులను కలుసుకోవడం ఒక అద్భుతంగా అనిపిస్తుంది. నిజంగా ఈ సాంకేతిక విప్లవం ఎంత ఉపయోగకరం. అసాధ్యం అనుకున్నది కూడా సాధ్యమే అని నిరూపించింది.. ఎప్పుడో ముప్పై ఐదేళ్ల క్రింద విడిపోయిన స్నేహితులను ఇలా మళ్లీ కలుసుకోవడం ఎంత

మధురం..ఒక్కొక్కరిని పర్సనల్ గా కలుసుకుని ఆనాటి స్కూలు ముచ్చట్లని మరోసారి నెమరేసుకోవడం..ఆ స్కూలు గేటు, క్లాస్ రూమ్స్, స్టేజ్, గ్రౌండ్... తలుచుకుంటూ ఉంటే .. ఓహ్.. అద్భుతః ....



శ్రీమతి జ్యోతి వలబోజుగారు అంతర్జాల పాఠకులకే, తెలుగుదేశంలోని పాఠకులకే కూడా చిరపరిచితురాలే. రచయిత్రిగా, కాలమిస్టుగా, సంపాదకురాలిగా, ప్రముఖ బ్లాగర్ గా నిత్యచైతన్యంతో ముందుకి సాగుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.



# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నొ అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

## డా. స్రవంతి ఐతరాజు

పెరటి తోటలో విరబూసిన ముద్దమందారంలా ఎర్రటి రంగుమీద తెల్లని చుక్కలున్న పంజాబీ డ్రెస్స్ వేసుకుని, పొడవాటి రెండు జడలు వదులుగా అల్లుకుని వడివడిగా అడుగులేస్తూ, తొందరపెడ్తుంటే, తమ్ముడు సైకిలుపై ఎక్కించుకుని స్కూల్ గేటు ముందర దింపాడు.చుట్టూ చూసాను. ఆవరణ అంతా నిశ్శబ్దంగా ఉంది. అటు నా స్నేహితులు కానీ టీచర్లు గానీ ఒక్కరూ లేరు. అప్పుడే నాకర్థమైపోయింది అందరూ ప్రార్థనా మందిరంలో సమావేశమైనారని. ఒక్కసారిగా అరచేతులు చల్లబడ్డాయి. కాళ్ళు వొణకడం మొదలెట్టాయి. మనసులో (అప్పట్లొ నాకిష్టమైన దేవుడు) శ్రీ రాముడిని పదే పదే " స్వామీ నేను వెళ్ళేదాకా ఎవరూ ప్రేయర్ కు వెళ్ళకూడదు. నేను వెళ్ళిన తరువాతనే ప్రేయర్

మొదలెట్టాలి.మా ప్రిన్సిపల్ గారు నన్ను కోప్పడకూడదు. ఈ సారికి సహాయం చెయ్ స్వామీ నీకు సహస్రనామం చదువుతా సాయంత్రం" అని మీద మీద వేడుకుంటూ, భుజానికి తగిలించుకున్న బ్యాగు జారిపోతుంటే పైకి లాక్కుంటూ, ఇంకొక ప్రక్కన ఎర్రటి తెల్ల చుక్కలున్న చున్నీని సర్దుకుంటూ హడావుడిగా విభీషణుని అంగలతో ఆఫీసు గది దాటుకుని ప్రేయర్ హాల్ వైపు దాదాపు పరుగెట్టుతున్నానా..ఇంతలో స్కూల్ కాపలాదారు..నన్ను చూసి "ఏంటమ్మా!..ఇంత ఆలస్యం చేసావ్? వెళ్ళు అందరూ నీకోసమే ఎదురుచూస్తున్నారు. నువ్వొచ్చేదాకా ప్రేయర్ మొదలెట్టనివ్వడుగా ప్రిన్సిపల్ సారు!" అంటూ ఇంకా ఏదో చెప్తూనే వున్నాడు.




నా దృష్టంతా కొంచెం దూరంలో నిశ్శబ్దంగా సువిశాలమైన గ్రౌండులోని ఇసుక మీద మట్టసంగా పొందికగా ముదురు నీలం రంగు పావడలు తెల్లటి జాకెట్టులూ తొడుక్కున్న అమ్మాయిలు, తెల్లటి చొక్కాలు ఖాకీ రంగు ప్యాంటులు నిక్కర్లూ తొడుక్కున్న అబ్బాయిలు.. వారి వెనుకనే ఆయా తరగతి క్లాస్ టీచర్లు ఎంతో క్రమశిక్షణతో బారులు తీరి కూచుని వున్నారు. దాదాపు 500 మందికి పైగా పిల్లలు చదుకునేవారు మా పాఠశాలలో. అప్పట్లోనే కాదు ఇప్పటికీ మా పి.సి.ఆర్ (P.C.R) పాపుదేశి చిన్నమరెడ్డి కళాశాల (అప్పట్లో అది ఉన్నత పాఠశాలతో కూడుకున్న జూనియర్ కళాశాలగా ఉండేది)జిల్లాలోనే అతి ప్రాచీన ఘనచరిత్ర గల పాఠశాల.

అప్పుడే గుర్తుకు వచ్చింది. అయ్యో! నేను ఈరోజు శనివారమనుకున్నానే..యూనిఫారం వేసుకోకుండా కలర్ డ్రెస్సు వేసుకొచ్చానే అని. అప్పట్లో పంజాబీ డ్రెస్స్ వేసుకోవడం అంటే అదో ఫాషన్ డ్రెస్స్ కింద లెఖ్ఖ. ఇంకా కొంచెం ఆందోళన ఎక్కువైంది. అంతా సిద్ధంగా ఉంది. వేదిక మీద మా ప్రిన్సిపాల్ గారు శ్రీ కేశవులు నాయుడు గారూ, ఆ రోజు గౌరవ అతిథి( ప్రతి శుక్రవారము జెండా ఎగురవేసేవారు) ఇంకా ఇద్దరు ఉపాధ్యాయులు, స్కూల్ ప్యూపిల్ లీడర్, స్కౌట్స్ అందరూ అసీనులై ఉన్నారు. మైకు రెడీ గా ఉంది.

ఒక్కవుదుటున స్టేజి మీదకు ఎక్కి బ్యాగుతోకూడా నిల్చున్నాను. మా ప్రిన్సిపాల్గారిని చూడాలంటే కూడా భయంగా ఉంది.మళ్ళీ "స్వామీ స్వామీ.." అని ప్రార్థన మనసులో మొదలెట్టా..ఇంతలో నన్ను చూసేసరికి మా ప్రిన్సిపాల్ గారి ముఖం విప్పారింది. సంతోషంగా నా దగ్గరికి వచ్చి "రామయ్యా! బ్యాగ్ పక్కనపెట్టు" అని నా భుజాన్నుండీ జారిపోతున్న సంచిని తనే కాపలాదారుకు అందించారు.

హమ్మయ్యా! నా మనసు కొంచెం కుదుటబడింది. అరచేతుల్లోని చెమటను చున్నీ కొసలకు తుడుచుకుంటున్నా..

"రామ్మా స్రవంతీ! ప్రార్థన మొదలుపెట్టు" అని పిలిచారు ప్రిన్సిపాల్ గారు.

మొదట ఒక భక్తి గీతం..."జయవాణీ భువనజననీ "అన్న లలితగీతం కల్యాణి రాగంలో మొదలెట్టా..మొదటి చరణం ఎలాగొ బాగానే పాడేశా..రెండో చరణం గురించిన అలోచన ముందుగానే మెదడును చేరడం వల్లనేమో ఠక్కున మర్చిపోయా..వెంటనే నా పక్కనే ఉన్న మా ప్రిన్సిపల్ గారు ఇంకోక చరణానికి వెళ్ళిపోమ్మా అంటూ సూచన ఇవ్వడంతో చక్కగా పాడేశా! దాని తరువాత శంకరంబాడిగారి "మా తెలుగు తల్లికీ మల్లెపూ దండ " కూడా ఆలపించా..

( ఇక్కడ ఇంకొక అతిముఖ్యమైన సంఘటన మీతోపంచుకోకుండా ఉండలేకపోతున్నా.స్వర్గీయ శ్రీ శంకరంబాడి సుందరాచారి వారూ అందరికీ ఒక గీతకర్తగా మాత్రమే పరిచయం ఉండొచ్చు. కానీ నా బాల్యం ఆయాన చేతులని దండాలుగా పట్టుకుని వూగుతూ సాగింది.ఆయన

4 –5 సంవత్సరాల వయసున్న నన్ను తన భుజాలపై మహారాణిలా ఎక్కించుకుని అటూ ఇటూ నా బుజ్జి బుజ్జి కాళ్ళను తన రెండు భుజాపైనా వేయించుకుని నా చిట్టి చిట్టి పాదాలను తనచేతుల్తో తను నడిచేటప్పుడు నేను కిందపడిపోకుండా పట్టుకునే వారు. ఇప్పటికీ ఆ చేతులస్పర్శ గుర్తుంది. అదే సమయంలో మా నాన్నారు సత్యవేడులోని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్  గా పనిచేస్తున్నారు. నాకు దాదాపు 4 లేక 5 సంవత్సరాల వయసుంటుంది. సుందరాచారి బాబాయ్ గారితో (తనని అలా పిలిచేదాన్ని)పాటూ శ్రీయుతులు మొక్కపాటి వారు(పూర్తిపేరు గుర్తులేదు)శ్రీయుతులు Y.K.V.N అచార్యుల వారూ అందరి ఒడిలోనూ ముద్దుపాపాయిగా పెరిగిన అదృష్టం చేతనేమో.. ఈ సాహిత్యపు వాసన అంటింది. అంతే కాదు ఒకసారి మా నాన్నారు కాంచీపురానికి వెళ్ళి మా తల్లిగారికి పుట్టినరోజుకు కానుకగా పట్టుచీరె తీసుకున్నప్పుడు సుందరం బాబాయిగారు ఎంపిక చేసిన (M.S Blue saree with black boarDer)పట్టుచీరె ఇప్పటీకీ మా తల్లిగారు శ్రీమతి చక్రవర్తి విమలమ్మ గారి వద్ద వుంది.

ఇంకొక ముఖ్యమైన తీపిగురుతు..శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారి (రాజాజి) వారు మా అమ్మకు మామయ్య.. అంటే నాకు తాతయ్య.శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు కూడా వేలువిడిచిన తాతయ్య. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ మా అమ్మకు తండ్రితరపు మామయ్య. ఈ జన్యువులన్ని కలిసి నాన్నిలా తయారుచెయడం నిజంగా నా జన్మజన్మల అదృష్టంగా చెప్పుకోవాలి.)

అందుకే అలా అలా 100 సంవత్సరాల ఘనచరిత గల PCR పాఠశాలలో చదువగలిగే అదృష్టం కలిగింది. అలా అంత ప్రాముఖ్యతనిచ్చేవారు మా ప్రిసిపాల్ గారు నాలోని కళకు. అప్పట్లో మా పాఠశాలలో తెలుగు తమిళం మరియు ఉర్దూ మీడియంలు మాత్రమే వుండేవి. ఇంగ్లీషు మీడియం మాతోనే మొదలైంది.ఆ విధంగా అంతటి ఘనచరితగల పాఠశాలలో మేమూ ఒక మైలురాయిగా నిలిచిపోగలిగాం. ఎ నుండీ ఐ sections దాకా తరగతులుండేవి.

అందరూ ఎంతో అనుభవమగలిగిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండేవారు. వారిలో మా అమ్మగారు చక్రవర్తి విమలమ్మ గారు కూడా ఒకరు. నా తరగతి కి వచ్చే ఉపాధ్యాయులు..శ్రీ రాజశేఖర్ జోసెఫ్ గారు (ఆంగ్లం), శ్రీమతి శారదా మేడం(సాంఘిక శాస్త్రము), శ్రీమతి ధనలక్ష్మి మేడం(జీవశాస్త్రము), శ్రీ సత్యమూర్తి గారు (తెలుగు), హిందీకి పి.ధనలక్ష్మి మేడంగారూ, లెక్కలకు శ్రీ వెంకట్రమణ సారు గారూ వచ్చే వారు. 500 వందలమందికి పైగా విద్యార్థులు చదువుకునేవాళ్ళం. అందులోనే జూనియర్ కళాశాల కూడా నడిచేది. తరగతి గదులు చాలనప్పుడు చక్కగా ఆరుబైట చెట్లకిందా కూచుని చదువుకునేవాళ్ళం.

ఆ ఇప్పుడొ చక్కటి అందమైన జ్ఞాపకం...నాకు చాలా వత్తైన పొడవాటి జడవుండేదని ఇందాకే చెప్పానా! అలా కింద ఇసుకలో కూచుని చదువునేటప్పుడు ఆ జడ కిందపడేది ఆ ఇసుకలో ఉన్న ఎండుటాకులు..పూల రెమ్మలు అన్నీ దానిలో చిక్కుబడేవి. నా స్నేహితురాండ్రరంతా దాన్ని చూపుతూ వెనుకనుండీ నా జడ లాగుతూ ఎగతాళి చేసేవాళ్ళు. అది చూసి అటుపక్కన కూచున్న అబ్బాయిలు “చక చక లాడే..” అంటూ పాటలు మొదలెట్టేవాళ్ళు. నేను కొరకొరా చూసేసరికి ఏమీ తెలియనట్టుండిపోయేవారు. ఇంతలో మా ఇంగ్లీషు మాస్టారు జోసెఫ్ గారు వచ్చేవారు. "వాట్ మై డియర్ ఫెయిర్ లేడీ"అని పిలిచేవారు నన్ను. అందరూ ఎగతాళి చేసేవారు!

నేను నా school days లొ చాలా అల్లరి పిల్లని. ఉపాధ్యాయులందరికి ఇష్టమైన విద్యార్థిని అని కూడా కొంచెం గర్వమేమో సరిగా తెలీదు. అబ్బాయిలందరికీ nik namess పెట్టిపిలుస్తూ ఏడిపించేదాన్ని. నాకింకా బాగా గుర్తుంది నేను విజయలక్ష్మి, ఉమ, రమ (కవలలు), సత్యభామ, ఉష ఇలా కొంతమందిమి ఒక గ్రూప్.

ఓ రోజు ఇంగ్లీషు మాస్టారు రాలేదని తరగతి ఫ్రీగా వదిలేసారు.. ఇక మా అల్లరి మొదలైంది. మొదటి డెస్క్ లో మా గ్రూప్ కూచున్నాము. అప్పట్లొ అప్పుడే "టిక్ టిక్ టిక్"..అనే తమిళ సినిమా రిలీజ్ అయింది. ఆ టైటిల్ నాకు బాగా నచ్చింది. అందుకని తరగతి గదిలోకి వచ్చే ప్రతి ఆబ్బయిని టిక్ టిక్ టిక్ 1,టిక్ టిక్ టిక్ 2...ఇలా వరుసపెట్టి గట్టిగా లెక్కపెట్టడం మొదలెట్టాము. ఏంజరుగుతోందో

వాళ్ళకు అర్థం కాలేదు.కొంతమందైతే అమాయకంగా మాతో కలిసి వాళ్ళూ అలా అరవడం మొదలెట్టారు. ఆ గోల నేరుగా ప్రిన్సిపల్ గదికి చేరింది. కొందరు ఉపాధ్యాయులు వెళ్ళి "అయ్యా మీరు ఆ అమ్మయిని చాలా నెత్తినెక్కిచ్చుకుంటున్నారు. చాలా అల్లరిపిల్ల." అని నా మీద పితూరీలు చాడీలూ కూడా మొదలెట్టారట. వెంటనే ఆయన నన్ను తనగదికి పిలిచి " ఏరా స్రవంతీ! అలా మగపిల్లల్ని ఆటపట్టించొచ్చా..?" అని మృదువుగా మందలించారు. నా మొహం చిన్నబోవడం చూసి "హ హ హ" అని నవ్వేస్తూ.."అలా అంటానని అనుకున్నావ్ కదూ..వూహూ నువ్వు చాలా మంచి అమ్మాయివి. తెలివైనదానివి. నీ దృష్టి అంతా చదువుమీదేకేటాయిస్తావని నాకు తెలుసు" అని పంపేసారు.

అంతే! అది నా మీద బాగా ప్రభావం చూపింది. క్రమంగా 8వ తరగతిలో స్కూల్లో 3వ ర్యాంక్ తో మొదలు పెట్టి, 9లో 2వ ర్యాంకు. ఏకంగా 10వ తరగతిలో అప్పట్లో 743 మార్కులతో ఇంగ్లీషు మీడియం నుండీ మొత్తం పాఠశాలకు మొదటి ర్యాంకులో ప్యాస్ అయ్యాను. అక్కడే ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న మా అమ్మకు కూడా ఎంతో ఆనందాన్ని పంచాను.

మొదట్లో నాకు మా శారదా మేడం (సాంఘిక శాస్త్రం)అంటే చాలా అభిమానం. అందుకనే ఆ సబ్జెక్ట్ లో చాలా ఎక్కువ మార్కులు సాధించాను.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో తీపిగురుతులూ.. జ్ఞాపకాలు పంచుకోవాలంటే ఒక జీవితకాలం సరిపోదు.

మేమెంత అదృష్టవంతులమో అంతమంచి విశాలమైన ఆంగ్లేయుల కాలం నాడు నిర్మించిన ఎంతో ఘన చరితగల పాఠశాలలో చదవగలిగాం! ఇప్పటి ఈ ఇరుకుగదులున్న అగ్గిపెట్టెల్లాంటి కార్పొరేట్ స్కూళ్ళలో కుక్కిన నల్లిపిల్లలా కదలడానికీ మెదలడానికీ వీలులేక కనీసం పరుగెత్తడానికి గ్రౌండు కూడా నోచుకోక వున్న ధనిక "మనీశాల సంస్కృతికి" చాలా దూరంగా ఎంతో అరోగ్యకరంగా ఆనందకరంగా బంగారు బాల్యాన్నీ యవ్వనపు తొలిరోజుల్నీ మరపురాని విధంగా గడిపాము.

మా పాఠశాల నిజంగా నాజీవితంలో ఒక తీయని భాగం. ప్రపంచ అందమైన కట్టడాలన్నిటిలోకీ అందమైనది, అలా మనసుమీద ముద్రించబడిన ఘనసౌధం.

ఇప్పటికీ చిత్తూరుకి ఆఫీసు పనుల మీద వెళ్ళినపుడల్లా మా పాఠశాలమీదుగా బస్ వెళ్ళినప్పుడు "look up aim high" అని పురాతన "Greecian style"లో కట్టబడిన మా పాఠశాల శిరస్సు మీద చెక్కివున్న ఆ పదాలు అప్రయత్నంగా నాలో ఆత్మ విశ్వాసాన్ని తట్టిలేపుతుంటాయ్.

ఈనాటి రోజున నన్నింతటిదాన్ని చేసిన నా ఉపాధ్యాయులకూ నా ప్రియ పాఠశాలకూ పదే పదే ప్రణమిల్లుతూ..నాటి నా గురువుల అకాంక్షలనూ ఆశయాలనూ సంపూర్ణంగా ఫలింపజేసే ప్రయత్నంలో మనసా వాచా కర్మేణా ఆనందిస్తున్నాను.. గర్విస్తున్నాను.. జీవిస్తున్నాను!

బహుముఖ ప్రజ్ఞత్వానికి ప్రత్యక్షనిదర్శనం స్రవంతిగారు. నృత్యం, గాత్రం, వీణావాదనం... అన్ని రంగాల్లోనూ పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న స్రవంతిగారు చక్కటి రచయిత్రి కూడా. ప్రభుత్వోద్యోగినిగా పనిచేస్తున్న వీరు మానసిక శాస్త్రజ్ఞురాలుగా ఎంతోమందికి సలహాలిస్తున్నారు. శ్రీచందనస్వరాలు అనే తన గాత్రసంగీత కేసెట్ ని, 'మనసు తలుపు తెరిస్తే ' , సౌగంధికా జాజరలు ' అనే స్వీయరచనలని కూడా వెలువరించారు.






ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# డొక్కా శ్రీనివాస ఫణికుమార్

నిన్నటి జీవితం నేటికి జ్ఞాపకం. నేటి జ్ఞాపకం రేపటికి ఆలంబన అవుతుంది, నాలాంటి వాడికి. ఈ ప్రపంచమంతా తనదే అనుకునేవాడికి, అన్నిటినీ ప్రేమించే వాడికి గడచిన ప్రతి క్షణము ఒక జ్ఞాపకమే. నా జీవితంలో ప్రతిరోజూ ఒక అందమైన కావ్యమే. పూచే పూలనీ, పచ్చని ప్రకృతిని, హాయిగా నవ్వే అమ్మాయిలని, పాలపిట్టలనీ, మామిడి పూతని, పాడే కోయిలనీ, పచ్చని గోరింటనీ, పలకరించే ప్రతి చినుకునీ అన్నింటినీ జ్ఞాపకం పెట్టుకునే వరం ఇచ్చి పంపాడు దేవుడు. ఈ వరం ఒక్కోసారి నా అదృష్టం, మరోసారి అదే నా దురదృష్టం. నా

జ్ఞాపకాల పుస్తకంలో రిక్తమైన పుట ఒక్కటీ లేదు. ఎన్నో తెల్లని కాగితాలు కనిపిస్తాయి. కానీ, ఒక్కమాటు ఆ తెల్లని పుటని ఆప్యాయంగా తడిమి చూస్తే, అక్కడి అక్షరాలు అతి స్పష్టంగా అగుపడతాయి, ఆనాటి జ్ఞాపకాలు సుతి మెత్తగా పలకరిస్తాయి.

1986, నా పదో తరగతి రోజులు. అన్ని సముద్రాల అవతల, హైదరాబాదులో తప్పిపోయిన నా కౌమారం ఒక్కమాటు ఎదురుగా నిలుచుని "నన్ను గురించి రాయవూ" అని అడిగి, నా చెయ్యి పట్టుకుని అక్కడికి ఎగరేసుకు పోయింది. కలం ఆగలేదు, కన్నూ ఆగలేదు.

విద్యానగర్ లో 3టి బస్టాపు పక్కన సందులో ఆ చివర దాకా నడిస్తే, కుడిచేతివైపు అటునించి రెండో మేడ చల్లా సీతారావమ్మ గారిది. పైన వున్న మూడు వాటాలలో రెండిట్లో మామ్మగారు, కొడుకు వుండేవారు, మూడోది ఒకటే చిన్న గది లాంటి వాటా, అదీ అద్దెకిచ్చేసారు. కింద ఆరు గదుల్నీ అచ్చంగా మూడు వాటాలు చేసేసి అద్దెకిచ్చేసారు మామ్మగారు. మధ్యవాటాలో మేము. మొదటి గది ఫామిలీ రూమ్ కం డ్రాయింగ్ రూమ్ కం లివింగ్ రూమ్ కం మాస్టర్ బెడ్ రూమ్ అన్నమాట. వెనకాల గది కిచెన్ కం డైనింగ్ రూమ్ కం, స్టడీ రూమ్. దానివెనకాల పెరట్లో బిక్కు బిక్కు మంటూ పెరిగి పెద్దదైన దానిమ్మ చెట్టు పక్కన వున్న కట్టడం బాత్రూం కం లాండ్రీ కం రెస్ట్ రూమ్ అన్నమాట. అదీ మా పేలస్సు. నిజంగానే పేలస్ లాగానే వుండేది. ఆ రెండు గదులలోనూ మేము ఐదుగురము, నా ఫ్రెండ్సు కనీసం ఇద్దరు ముగ్గురు, వచ్చే పోయే చుట్టాలు, ఇంతమందిమి. అయినా ఎన్నడూ ఇరుకు అనిపించలేదు. మాకు ఎడంపక్క వాటాలో ఎన్.ఎఫ్.సి లో పనిచేసే స్వామినాధన్ గారు, కుడి వాటాలో భయంకరంగా బేరాలు ఆడే మామ్మగారు, మనవడు బాలాజీ వుండేవారు. ఇంటి ఎదురుగ హఫీజ్ అంకుల్ వాళ్ళ మేడ. అ పక్కన సిద్ధాంతి గారి మేడ.

మా సందు మొదట్లో ద్రాక్ష తోట వుండేది. అందుకని అటువైపు ఎత్తైన సిమెంటు గోడ కట్టేశారు, కనపడ నీయకుండా. ఆ తోటకి అటువైపు మా ఫ్రెండొకడు వుండేవాడు. పేరు గేపకం లేదు గాని, అచ్చం వెన్ ట్రలాక్విస్టు  చేతిలో వుండే మాట్లాడే బొమ్మలా వుండేది వాడి ఫేసు. వాడొక సారి పెద్ద ద్రాక్ష గుత్తులు రెండు తెచ్చి ఇచ్చాడు. అమ్మ జ్యూస్ చేసింది. తాగాము. పళ్ళు పులిసిపోయి, ఓ నాలుగు రోజులు మరేమీ తినలేకపోయాము. అందిన ద్రాక్షపళ్ళు కూడా పుల్లనే అని అప్పుడు తెలిసింది. ఇంటిముందు క్రికెట్టు ఆడేవాళ్ళం. ఒక్కోసారి మా పెరట్లో జానెడు జాగాలోనే ఆడేసే వాళ్ళం. సాయంత్రాలు కేరమ్స్ ఆడేవాళ్ళం ఎప్పుడైనా కాస్త తీరిక దొరికినప్పుడు. ఆటలు ఆడిన ప్రతిసారీ, "పదవతరగతి పరీక్షలు, వాటి ప్రాముఖ్యత, భవిష్యత్తుపై ప్రభావము, ఆనక అడుక్కు తినవలసిన ప్రమాదము " అనే కుంకుడుకాయ పులుసుతో తలంటు అంటేసేది అమ్మ.

అన్న నృపతుంగ జూనియర్ కాలేజీలో ఇంటర్ మీడియట్ రెండో సంవత్సరంలో ఉండేవాడు. తమ్ముడు జ్యోతి బాల మందిర్ లో మూడో క్లాసు. నేను నల్లకుంట గవర్నమెంటు హైస్కూల్లో పదో క్లాసు, ఎ సెక్షను. మా హైస్కులు ఉదయం ఏడున్నరనించి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఉండేది. హెడ్మేష్టారిపేరు చారి గారు. అయన ఎంతో క్రమశిక్షణ తో నడిపేవారు స్కూలు. ఎడమ చెయ్యి మెడ వెనక, కుడి చెయ్యి కుడి చెంప మీద పెట్టుకుని నిశ్శబ్దంగా వెనకాతలే నడిచివచ్చి, అల్లరి పిల్లల రెండు చెవులు పట్టి లాగుతూ "ప్రైవేటు" చెప్పేసేవారు. మాకు తొమ్మిదో తరగతి వరకు క్లాసులన్ని ఆరుబయట చెట్లక్రింద నడిచేవి. పదోతరగతిలోకి వచ్చాక క్లాసురుములోకి మారాము.

వెంకటేశ్వరరావు సారు, కామేశ్వరి టీచరు లెఖ్ఖలు, నాగేశ్వరి టీచరు, యాదగిరి సారూ  సోషలు, దేవకీదేవి టీచరు బయాలజీ, భాగ్యలక్ష్మి టీచరు, శాస్త్రి సారూ తెలుగు, రెడ్డి సారు సైన్సు, హనుమంతరావు గారు ఇంగ్లీషు, ధనవంతరావు గారు, శ్యాం సుందర్ సారూ హిందీ చెప్పేవారు. యాదగిరి సారు కళ్ళద్దాలకి నాలుగు అద్దాలు వుండేవి. పైవి కూలింగు, లోపలివి రీడింగు. జెండా పండుగ రోజున అయన అచ్చం నెహ్రూ గారిలాగా తయారై వచ్చేవారు. బి సెక్షన్లో నాలుగక్షరాల పేరున్న ఓ అమ్మాయి "హింద్ దేశ కే నివాసి సభీ జన ఏకహై" అని పాట కూడా పాడేది. ఆ అమ్మాయిని చూస్తే, అచ్చం వైష్ణవదేవీ మాత పటం గుర్తొచ్చేది.

రామానుజ, రాఘవ అనే కవలలు నా క్లాస్మేట్లు. వాళ్ళ తమ్ముడు రంగ కూడా బాగా పాడేవాడు. ఇంక నజీర్, దేవేందర్, అతిక్ అహ్మద్, శ్రీనివాసచారి, సి.శ్రీనివాసు, మధుకర్, వినయ్, శ్రీశైలం,ఎ.వి.ఎల్.ఎన్ మూర్తి గాడు వీళ్ళంతా నా క్లాసుమేట్లు. శ్రీనివాసచారి భలేగా బొమ్మలు వేసేవాడు. వాడు బయాలజీ రికార్డులో మొట్టమొదట వేసిన జిరాఫీ బొమ్మ నాకింకా గుర్తే. విష్ణుభొట్ల నారాయణ ,దుర్గాప్రసాదు బి.సెక్షన్లో వుండేవారు. చాలా బాగా చదివేవారు. హనుమంతరావు సారు గ్రామరు చెప్పే తీరు గమ్మత్తుగా వుండేది. అందరినీ నవ్విస్తూ "కెన్ను, కుడ్డు, షల్లు, షుడ్డు" అంటూ చెప్పేవారు. రెడ్డి సారు కాపీలు ఎలా కొట్టకోడదో, సోదాహరణంగా వివరించి నవ్వించేవారు. అలా ఆడుతూ పాడుతూ గడిచేది స్కూలు. స్కూల్లో బాగానే చెప్పినా, నాకు ఎప్పుడెప్పుడు స్కూలు అవుతుందా, ఇంటికిపోయి కాస్త తిని, అప్పుడు హాయిగా మనమే చదువుకుని నోట్సులు రాసేసుకుందామా అని వుండేది. నాకంత ఫోకస్ వుండేది కాదు. కారణం చెబుతాను.

నేను పుట్టడమే పెద్దవాడిగా పుట్టాననిపిస్తుంది. ఒక్క ఆటలప్పుడు తప్ప, మిగితా సమయాలలో నా మనసు ఎక్కడో ఉండేది. చుట్టుపక్కల జరుగుతున్నదంతా చూస్తున్నా, గ్రహిస్తున్నా, అనుభవిస్తున్నా, తెలియని ఒక బెంగ నన్ను అనునిత్యమూ వెంటాడేది. నేను ప్రకృతి లో మారిపోయే ప్రతి ప్రాణి తోనూ అనుబంధాన్ని పెంచుకున్నాను. పరిణామం చెందడం ప్రకృతి ధర్మం. నాకు మార్పు అంటే బెంగ. మరణం అంటే భయం. తుమ్ము వస్తే భయం. ముల్లు గుచ్చుకుంటే పాము కరిచిందని భయపడి సాయంత్రానికల్లా విషం గుండెలకి చేరి చనిపోతానని, భయంతో అసురసంధ్య వేళ ఆకాశం కేసి చూస్తూ ఒంటరిగా గడిపిన సాయంకాలం ఇంకా గుర్తే. మరణాన్ని గురించి, ఆ తరువాత ఏమి జరుగుతుంది అనే విషయాలు ఆ వయసులో ఎవరిని అడగలేనివి, అందుకే అడగలేదు. అక్కడక్కడా కాస్త చదివినా, నా ఉనికి లేకపోవడం అనే ఊహే నన్ను అనునిత్యమూ భయపెట్టేది. అందరితో ఆటలు ఆడుతున్నప్పుడో, క్రికెట్టు, సినిమాలు చూస్తున్నప్పుడో, నవ్వుతున్న అమ్మాయిలతో మాట్లాడుతున్నప్పుడో, మేం ఐదుగురమూ ఇంట్లో వుండి, ఫ్రెండ్సు, చుట్టాలు వుండి అందరం హాయిగా కబుర్లు చెప్పుకున్నప్పుడో మాత్రం ఆ భయం తెలిసేది కాదు, బెంగ అనిపించేది కాదు. ఎక్కువసమయం అలా గడపడానికే ఇష్టపడేవాడిని. అందుకే స్కూలు పుస్తకాలు చదివినా గుర్తుపెట్టుకునేవాడిని కాదు. రాక కాదు, చెయ్యాలని అనిపించక. ఇది ముందే గ్రహించిన అమ్మ,అన్న నన్ను బౌద్ధనగర్ లోని బాలాజీ టుటోరియల్ లో జేర్పించేశారు తొమ్మిదో క్లాసు లోనే.

వి.ఎస్.టి బస్సు స్టాపు దగ్గర 86 నెంబరు బస్సు ఎక్కితే, సుమారు అరగంట తరువాత దింపేది బౌద్ధనగర్ లో. అక్కడినించి ఎదురు సందులోకి వెళ్లి, ఎడం వైపు సందులోకి తెరిగితే కుడివైపు నాలుగో ఇల్లు మా రమణారెడ్డి సార్ ది. అమలాపురంలో వున్నప్పుడు హాయిగా "మేష్టారు" అనే పిలుపుకి అలవాటు పడిన నాకు, ఈ "సార్" అన్న మాట పట్టుబడడానికి కాస్త సమయం పట్టింది. అచ్చం యంగ్ సునీల్ గవాస్కర్ లాగా వుండేవారు మా రమణారెడ్డి సార్. చెంపల పైన జుట్టు కూడా పొడుగుగానే వుంచేవారు. అయన ఇంటిలోను, మేడమీద పాక లోను ప్రైవేట్లు చెప్పేవారు. ఒక యజ్ఞంలా పగలనక, రాత్రనక పాఠాలు చెప్పి పిల్లలని తీర్చిదిద్దేవారు. వీరేశ్వర రావు గారు సైన్సు, నాగేశ్వర రావు గారు, శ్రీను(సార్ తమ్ముడు) లెఖ్ఖలు, మేడం జగన్మోహిని గారు బయాలజీ చెప్పేవారు. మిగిలిన సబ్జెక్టులన్నీ రమణారెడ్డి సారే చెప్పేవారు. ఒక టైము అంటూ వుండేది కాదు. సాయంత్రం నాలుగుకి వెడితే మళ్ళీ ఏ రాత్రి పది గంటలకో చేరేవాడిని ఇంటికి. నాకు కష్టపడడం, కృషి చేయడం నేర్పినది, ఏదో సాధించాలనే తపన నాలో రగిలించినది మా రమణా రెడ్డి సారు. పుస్తకంలో పాఠాల తో పాటు ఎన్నో జీవితపాఠాలు చెప్పేవారు. తన జీవితమే ఒక పాఠంగా చెప్పి, మా మనసులని చదువులపైకి మళ్ళించి, మా భవిష్యత్తుకి పునాదులు వేసిన గురువు మా రమణా రెడ్డి గారు. "మై లైఫ్ ఈజ్ నాట్ ఎ బెడ్ ఆఫ్ రోజెస్" అని మొదలు పెట్టి ఆయన చెప్పిన జీవిత పాఠం ఇంకా నా చెవులలో రింగుమని మారుమోగుతూనే వుంది.

86 నెంబరు బస్సులకి భయం ఎక్కువ పాపం. ఒకేసారి నాలుగు బస్సులు వచ్చేసి వెళ్ళిపోయేవి. నేను ఇంకా స్టాపుకి అంత దూరంలో ఉండగానే ఉరేగింపుగా వెళిపోయేవి బస్సులన్నీ. అంతే, ఇంక స్కూలు బేగ్గు భుజాలకి తగిలించి, పుస్తకలమోపు నడ్డిన మోసుకుంటూ

యిసురో మని, సుమారు ఐదు ఆరు మైళ్ళు వుంటుందేమో, అలాగే నడిచి వెళిపోయేవాడిని టుటోరియల్ కి, అడ్డదారిన రాంనగర్ మీదుగా. రాంనగర్ దాటాక, రామాలయం వీధి వచ్చే ముందు, ఒక పాడుబడ్డ మైదానం, పిచ్చి చెట్లు ఉండేవి. అక్కడ ఒక సంచి ఆకారంలో వున్న సిమెంటు బండ వుండేది, బయాలజీ రికార్డులో వేలరస్ చేప లాగ. దాన్ని చూస్తే తెలియని భయంగా వుండేది. అందుకే దానిని చూడకుండా, ఇంకో వైపు చూస్తూ వెళ్లేవాడిని. రాత్రీ అంతే. అడికిమెట్ట దగ్గిర కల్లు కాంపౌండ్ పక్కనించి నడిచి వస్తుంటే భయం వేసేది. ఎప్పుడూ కిక్కిరిసిపోయి వుండేది అది. అక్కడి వాసనలతో కడుపు తిప్పేసేది. ఏదో కోలుపోయినట్లున్న కళ్ళతో, బేల చూపులతో, పారేసుకున్న వస్తువుకోసం వెతుక్కున్తున్నట్టుగా వుండే ఎంతో మంది లోపలి వెడుతూ వుండేవారు. వాళ్ళని చూసి పాపం అనిపించేది నాకు. ఇంటికొచ్చి, నాకోసం కనిపెట్టుకుని ఉండే అమ్మతో కలిసి రాత్రి పదిన్నరకి భోజనం చేసేవాడిని. ఒక రాత్రి నేను వెనక్కి బయల్దేరే సరికి పది అయిపోయింది. బస్టాండులో ఒక బుడగలు అమ్మేవాడు కనిపించాడు. వాడు ఇంటికి వెళిపోతున్నాడు. వాడి దగ్గర వున్న ఒక పెద్ద ఏపిల్ కాయ బుడగ నాకు నచ్చేసింది. తమ్ముడికి బుడగలంటే చాల ఇష్టం. వాడికోసం కొందామని అడిగాను. రూపాయి చెప్పాడు. నా దగ్గర ఎనభై పైసలే వున్నాయి. మా తమ్ముడికని చెప్పాను వాడికి. వాడు నవ్వుతూ నాకు బుడగ ఇచ్చాడు ఎనభై పైసలు తీసుకుని. ఇంతలో బస్సు వచ్చింది. బస్సెక్కితే జనంలో పడి బుడగ పగిలిపోతుంది కదా. అందుచేత రాత్రి నడుచుకుంటూ ఇంటికి వచ్చేసరికి పదకొండు. అమ్మ ఖంగారుగా వీధిలోనే నిలబడింది. విషయం తెలుసుకుని నవ్వి, లోపలి తీసుకెళ్లింది. తమ్ముడు అప్పుడికే పడుకున్నాడు. మర్నాడు స్కులునించి వచ్చి కాసేపు అ బుడగతో ఆడుకున్నాడు. లేత నీలం రంగు ఆపిల్ బుడగ పైన ముదురు చాక్లెట్ రంగు రింగు. ఆ మరునాడు అది పగిలిపోయింది. కానీ నాకు జ్ఞాపకంగా మిగిలిపోయింది.

ఆదివారం వచ్చిందంటే ఉదయం ఎనిమిది గంటలకి బాక్సు తీసుకుని బౌద్ధనగర్ వెడితే, మళ్లీ రాత్రి ఏ తోమ్మిదికో రావడం. ఎన్ని వండే ఇంటర్ నేషనల్స్, సినిమాలు, టీ.వీ ప్రోగ్రాములు మిస్సయ్యానో. చాల సార్లు కోపం, ఉక్రోషం వచ్చేసి, ఏడుపు వచ్చేసేది. ఈ జీవితానికి చదువు తప్ప మరేమీ లేదా? అనిపించేది. అయినా ట్యూషన్ కి వెళ్ళగానే, మా రమణారెడ్డి సార్ ని చూడగానే అన్నీ మరచిపోయి, హాయిగా చదివేసుకునేవాడిని. పరీక్షలముందు కొన్ని వందల టెస్టు పేపర్లు చేయించారు. మళ్లీ మళ్లీ చదివించారు. పబ్లిక్ పరీక్షలముందు బాలాజీ టుటోరియల్ వాళ్ళు హైదరాబాదు మొత్తం మీద నిర్వహించిన ప్రిపబ్లిక్ పరీక్షలలో నాకు సైన్సులో అత్యధిక మార్కులు వచ్చాయి. ఇంట్లో వాళ్ళు ఎంత సంబరపడ్డారో. అంతకన్నా ఎక్కువ సంబరపడ్డారు మా రమణారెడ్డి సార్. కోట శ్రీనివాస రావు గారు వచ్చి బహుమతి ఇచ్చారు. అంతవరకు ఎప్పుడు కళ్ళతోనే నవ్వేసి వెళిపోయిన ఓ సీగేన పెసూనాంబ లాంటి కాటుక కళ్ళ, రెండు జెళ్ళ అమ్మాయి, ఫేర్వెల్ రోజున వచ్చి నాతో మాట్లాడి ఆటోగ్రాపు తీసుకున్న క్షణం ఇంకా కళ్ళముందు కదలాడుతోంది. ఇంగ్లీషు మీడియం అమ్మాయిలు కూడా వచ్చి పలకరించి, ఆల్ ద బెస్ట్ చెప్పి వెళ్లారు.

మా రమణారెడ్డి సార్ తపస్సు, అమ్మ, నాన్న, అన్నల సహకారం, దీవెనలు, అ అమ్మాయిల అభినందనలు ఇన్ని ఫలించి, 508 మార్కులు వచ్చాయి 600కి. ఎవ్వరూ నమ్మలేకపోయారు. అమ్మ,నాన్న,అన్నల ఆనందం వర్ణనాతీతం. బాలాజీ స్వీట్ హవుస్ నించి మిఠాయిలు, కోవా కజ్జికాయలు తెప్పించి అందరికీ పంచింది అమ్మ. నా చదువుల విషయమై అందరూ ఆనందించిన తరుణం అది. పైకి చెప్పకపోయినా, నాన్నగారు వాళ్ళ కొలీగ్స్ దగ్గర చాలా గొప్పగా చెప్పారట నా గురించి. మన గూఢచారుల ద్వారా నాకు తరవాత తెలిసింది. చుట్టాలందరికీ నా మీద కాస్త గురి, వీడు దారిలో పడుతున్నాడన్న నమ్మకమూ కలిగాయి.

కాలేజిలో చేరేముందు, అన్న, నాన్నగారు నన్ను తీసుకెళ్ళి, నాకు ఆల్విన్ వాచీ కొనిపెట్టారు. జీవితంలో మొదటి అగ్ని పరీక్షలో నిలిచి, నిగ్గుతేలి బైటికొచ్చిన కుమారుడు, నూతన యవ్వన దిశగా అడుగులు వేయడం మొదలుపెట్టాడు. ఎన్నడూ లేనిది, భవిష్యత్తు అంటే తెలియని ఆశ మొదలైంది. మనసు కొత్త కలలు కనడం మొదలుపెట్టింది. నూనుగు మీసమేదో అస్పష్టంగా మొలిచి, అమాంతం నన్ను కలవరపెట్టింది. అక్కడినించీ మరో కొత్త కథ మొదలైంది.

జీవితం అంటే అమ్మ,నాన్న, అన్న, చిన్న తమ్ముడు, మా చదువులు, ఆటలు, అల్లరులే అనుకున్న అమాయకపు కౌమార్యం అది. ఎప్పటికీ ఇలాగే వుంది పోతుంది అనుకున్న రంగుల కల అది. అది నా టెన్త్ క్లాస్ జీవితం. నేటికీ వసివాడని కుసుమం. అ జ్ఞాపకాల ఆనవాళ్ళు బాహ్య ప్రపంచంలో ఇప్పుడు అట్టే కనపడవు. మా హైస్కులును ఎవరో తీసేసుకున్నారు, ఆ బిల్డింగు పడగొట్టేసారు. చూసి మనసు చివుక్కుమంది, నాలుగేళ్ళ క్రితం. ఆ నేస్తాలు ఇప్పుడు ఎక్కడున్నారో తెలియదు. తెలిసినదల్లా ఒక్కటే. ఉన్నదల్లా ఒక్కటే.

ఆ బంగారు కాలానికి సాక్షిగా నేను, ఆపాత మధురమైన నా ఆ పాత జ్ఞాపకాలూను.




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నొ అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# భారతీ ప్రకాష్

మా రోజుల్లో పదో క్లాసుతో కాకుండా పన్నెండో క్లాసుతో స్కూలు వదిలేవాళ్ళం. మా నాన్నగారి బదిలీల వల్ల నేను వేరే వేరే స్కూళ్ళల్లో, వేరే వేరే ఊళ్ళల్లో చదివాను. చిన్న చిన్న సంఘటన్లు కొన్ని ప్రతి ఊళ్ళోవీ గుర్తున్నాయి.

మేము తణుకులో ఉండగా నేను ఒకటో క్లాసులో స్కూల్లో జేరాను. అది కూడా మా తాతగారు మా నాన్నగారిని పిలిచి, " అది లెక్కలు చేసేస్తోంది ... దాన్ని స్కూల్లో వెయ్యవా? " అని గట్టిగా చెప్తే నాన్న నా ఐదో ఏట అక్షరాభ్యాసం చేసి, స్కూల్లో వేసారు. ఎందుకంటే నేను మా చిన్నక్క లెక్కల పుస్తకం తీసికుని, సుద్ద ముక్కతో నేలమీద లెక్కలన్నీ రాసేదాన్ని.



పదోతరగతిలో మధ్యలో నేనూ, యెడమవైపు లీలాలక్ష్మి, కుడివైపు నాగమణి.

నన్ను మా పెద్దక్క నీటుగా తయారుచేసి, బాగా పౌడర్ రాసి, మా ప్యూనుతో స్కూలుకి పంపించేది. ఎప్పుడూ లేటే.... మా మాష్టారు నవ్వుతూ, " వచ్చేవా.. బూడిద బుస్సన్న కాయ్ " అంటూ నన్ను క్లాసులోకి రానిచ్చేవారు.

రెండో క్లాసులో రాజమండ్రి నివేదితా స్కూల్లో " పుత్తడిబొమ్మ పూర్ణమ్మ" నృత్య నాటకం వెయ్యడం గుర్తుంది. అందులో నేను ముందుగా వచ్చి, ఆ కథ గురించి డాన్స్ చేస్తూ, వివరిస్తూ ఉంటే, ఆపాత్రధారులు వచ్చి అభినయం చేసారు. దాంట్లో పూర్ణమ్మగా నా ఫ్రెండు, ఉష వేసింది. ...తను శ్రీ బుచ్చయ్య చౌదరి గారి సతీమణి, శ్రీమతి ఝూన్సీగారి చెల్లెలు.

మూడు, నాలుగు చదివేనో లేదో తెలియదు. ఎందుకంటే ఆరోజుల్లో ఏ క్లాసులో పడితే ఆక్లాసులో కూర్చోబెట్టేవారు. ఆఖరుగా వయస్సు ఎక్కువ వేసి," ఇంటూ ఫస్ట్ ఫాం " ఎంట్రెన్స్ టెస్ట్ రాయించి, ఆరోక్లాసులో కూర్చోబెట్టేవారు.

యలమంచిలిలో ఐదో క్లాసు చదువుతూ దసరాల్లో పిల్లలందరూ మాస్టారితో కలసి,

" ఏదయా ... మీదయా ... మామీద లేదు
ఇంతసేపుంచుట ఇది మీకు తగునా..
..................
అయ్యవారికిచాలు ఐదువరహాలు
పిల్లవాళ్ళకిచాలు పప్పుబెల్లాలు ... " అంటూ తిరిగింది గుర్తుంది.

ఆరవక్లాసులో సిటీ హైస్కూల్, రాజమండ్రిలో, మాచిన్నక్క క్లాసులో ఎప్పుడైనా కూర్చుంటే ( తొమ్మిదో తరగతి) వాళ్ళ స్నేహితురాళ్ళు పెన్సిల్ ని నాబుగ్గల్లో గుచ్చి, ఎంత లోతుకెల్తుందో చూసి నవ్వి, బుగ్గలు గిల్లడం, మా చిన్నక్క వద్దని బతిమాలడం గుర్తుంది. ఏడు, ఎనిమిది, తొమ్మిదో క్లాసుల్లో, దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో లెక్కలు బాగా చేస్తానని మాస్టారు అందరిచేతా చప్పట్లు కొట్టించడం గుర్తుంది.

ఇంక పది, పదకొండు క్లాసులు నిడదవోలు స్కూల్లో చదివాను. అక్కడ స్కూల్లో ప్రొద్దున్న ప్రార్ధన పాడడం, జాతీయ పండుగలలో మా నాన్నగారు వ్రాసిన పాటలు పాడడం గుర్తుంది. మా ఇంగ్లీషు మాస్టారు, శ్రీ పరమహంస గారు చాలా స్ట్రిక్ట్. ఆడపిల్లలు గాజులు వేసుకుంటే ఆగాజుల శబ్దం కూడా వినపడకూడదు. ఎన్నో లాంగ్వేజ్ స్కిల్ గేమ్స్ ఆడించేవారు మాచేత. తెలుగు మాస్టారు శ్రీ కొంపెల్ల రామశాస్త్రి గారు మేము రాసిన ఆటవెలది, తేటగీతి పద్యాలన్నీ చక్కగా దిద్ది, మాకు అర్ధమయ్యేలా చెప్పేవారు. ఇక్కడ ఒక తమాషా సంఘటన చెప్పాలి. మా ఫ్రెండ్ నాగమణి అని ఉండేది. వాళ్ళ తల్లితండ్రులకది మూడో కూతురు. మొగపిల్లలు లేరని తొమ్మిదోతరగతి దాకా దానికి మగపిల్లవాడి దుస్తులే వేసేవారట. అందుకనేమో ఎప్పుడూ గెంతుతూ ఉండేది. ఒకసారి మా తెలుగు మాస్టారి దగ్గరికి గెంతు కుంటూవెళ్ళి, " మాస్టారూ! నాబావ సౌందర్యానికి కన్నా భారతి బావ సౌందర్యానికి ఎక్కువ మార్కులు వేసా" రంది.

ఆయన వెంటనే " నీబావ సౌందర్యానికి నేనెందుకు వెయ్యాలమ్మా మార్కులు?" అనగానే మేమంతా గొల్లున నవ్వేసాం. కంగారులో అది భావసౌందర్యానికి ఒత్తు తీసేసి బావసౌందర్యం అంది. ఇంక నేచురల్ సైన్స్ టీచరు, రామరాజు గారు ఎంత బాగా



పన్నెండో తరగతి, షాడే గర్ల్స్ హైస్కూల్, రాజమండ్రి.
క్రింద కూర్చున్నవారిలో మధ్యనున్నదాన్ని నేనే.

చెప్పేవారంటే ... ఆకు ఎన్ని విధాలుగా ఉపయోగ పడుతుందంటే .... అనాసిన్ మాత్ర గుర్తుంచుకోండి ... నాలుగు విధాలు... ( ఆరోజుల్లో అనాసిన్ ఎడ్వెర్టైజ్మెంట్ లో మనిషి నాలుగు చేతివేళ్ళు చూపిస్తున్నట్లుగా వుండేది.)

మాస్కూల్ లాబ్ చాలా పెద్దగా వుండేది. ఫిజిక్స్ టీచరు, శ్రీ ఎ.ఎస్.ఎన్.మూర్తి గారు కూడా లాబ్ కి తీసికెళ్ళి ఎంతో బాగా చెప్పేవారు. ప్రతీ నెలా ఎస్ట్రో లాజికల్ మాగజైన్ తీసి, " మీ తాతగారి వ్యాసం ఇదిగో " అంటూ చూపించేవారు. లెక్కల మాష్టారయితే ( శ్రీ ప్రెక్కి నరసింహమూర్తి గారు ) అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లే. సోషల్ మాష్టారికి ( శ్రీ బ్రహ్మానందం గారు) ఆడపిల్లలు బాగా రాస్తారని వుండేదేమో ... మా జవాబులు కొలిచి వేసినట్లు మార్కులు వేసేవారు... అంతగా పట్టించుకోకుండా ... అది తెలిసినా మేము చాలా జాగ్రత్తగా రాసేవాళ్ళం. ఏదో ఒకటి అని రాసే వాళ్ళం కాదు. హిందీ టీచరు మటుకు రోజూ ఒక పేజీ కాపీ రైటింగ్ రాసుకు రమ్మనేవారు. ఇక్కడేవచ్చేది మాకు బద్ధకం. అంతే... స్కూలికి వచ్చేక గబగబా తెలుగు సినిమా పాటలన్నీ హిందీ లిపిలో రాసేసి ఆయన చేత సంతకం పెట్టించేసుకునేవాళ్ళం. మా డ్రిల్ మాష్టారు మా చేత ఎన్నో ఆటలు ఆడించేవారు. జాతీయగీతం పాడే కాంపిటీషన్‌కు కూడా మమ్మల్ని తీసికెళ్ళారు. దాంట్లో ప్రత్యేక బహుమతి వచ్చింది.

ఇక్కడే మా స్కూల్ మాగ్‌జైన్‌కి నా కథ సెలెక్ట్ అయింది.అప్పటికి కథ అంటే సరైన అర్ధం కూడా నాకు తెలీదు. కాని అందరూ చదివి మెచ్చుకుంటుంటే ఎంతో ఆనందం.

అక్కడినుండి పన్నెండో తరగతికి రాజమండ్రీ వచ్చేసాం. అక్కడ schade girls' higher secondary schoolలో నాకు సీటు ఇవ్వనన్నారు. వాళ్ళ రూల్స్ ప్రకారం, అన్ని క్లాసుల్లో ఖాళీ ఐన సీట్స్ కి మాత్రం టెస్ట్ పెట్టి తీసికునేవారు. ఆవిధంగా మా చెల్లెలు ఉమకి పదో క్లాసులో సీటు వచ్చింది. పన్నెండో క్లాసులో ఖాళీలు లేవని నన్ను జేర్చుకోలేదు. మా నాన్న గారు ఎన్నిసార్లు వెళ్ళినా హెడ్మిస్ట్రెస్, Miss. solomon కలవనేలేదు. ఆవిడ చాలా స్ట్రిక్ట్. డి. ఇ. ఒ. దగ్గరనుంచి లెటర్ తీసికుని వెళ్ళారు నాన్నగారు. ఆలెటరు చూసి కూడా నాన్నగారిని కలవకుండా నాలుగు రోజులు ఆగి రండని ప్యూనుచేత కబురంపిందావిడ. నాన్నగారికి కోపం వచ్చి ఇంక ఆస్కూలుకి వెళ్ళనన్నారు. ఆతర్వాత మా పెద్దన్నయ్య వెళ్ళి కలిస్తే," డి.ఇ.ఒ. లెటరు చూసి ఇవ్వటం లేదు, ఏదో మీరు ఇన్నిసార్లు వచ్చారనీ " అంటూ సీటిచ్చింది.

మాకందరికీ క్లాసుల్లో సింగిల్ చైర్స్, డెస్క్స్ ఉండేవి. మీ నాన్నగారు దెబ్బలాడి సీటు ఇప్పించుకున్నారంటూ కింద కూర్చోబెట్టారు కొన్నాళ్ళు. ఎవరైనా రాకపోతే ఆ కుర్చీలో కూర్చునేదాన్ని. అది ఎప్పుడోకాని జరిగేదికాదు. ఈ గొడవంతా జరిగి నేను స్కూలికి

వచ్చిన రెండురోజులకే మొదటి యూనిట్స్ మొదలయ్యాయి. దాంట్లో లెక్కల్లో వందకి వంద, మిగిలినవన్నీ మంచి మార్కులే. కాని హిందీ, నాచురల్ సైన్స్ లో మాత్రం వందకి ముప్ఫై. అంటే పాసవలేదు. ఈ రిజల్టు చూసేక నాకు నా ప్లేస్ దొరికింది.

షాదేలో చదివే పిల్లలకి కూడా కొంచెం ఈగో ఉండేది. ఎక్కువగా నాతో మాట్లాడేవారు కాదు. తీరాచూస్తే చాలామంది చిన్నప్పుడు నాతో వీధుల్లో ఆడుకున్నవాళ్ళే. ఎప్పుడైతే లెక్కల్లో నా మార్కులు తెలిసాయో ఒక్కక్కళ్ళూ నెమ్మదిగా దగ్గరకి వచ్చి మాట్లాడడం మొదలుపెట్టారు.

మా తెలుగు మాష్టారు, శ్రీ పేరయ్య శాస్త్రి గారు, " పిడపర్తి వారి అమ్మాయి " అంటూ నవ్వుతూ మాట్లాడేవారు. ఇంగ్లీష్, రోడా టీచరు, "ఇంకా బాగా ఇంప్రూవ్ చేసుకో భారతీ! బాగా రాస్తున్నావు." అనేవారు. సిల్వియా టీచరు

(లెక్కలు) బోర్డు మీద లెక్క రాస్తూ, " భారతీ! ఆన్సర్ అనేవారు. వెంటనే చెప్పేదాన్ని. ఫిజిక్స్ టీచరు, ఇందిర గారు, " భారతీ! నిన్నే తెలిసింది... నువ్వు పి.డి. చెల్లెలివా?! ఏమైనా తెలియకపోతే అడుగు." అన్నారు ఆప్యాయంగా. ఆవిడ తమ్ముడు, మా చిన్నన్నయ్య మంచి స్నేహితులు.

మా చిన్నన్నని అందరూ పి.డి. అనేవాళ్ళు. సోషల్ సత్యవతి గారు... సగం క్లాసు మమ్మల్ని తిట్టి, బుద్ధులు చెప్పడానికే సరిపోయేది. ఇంక హిందీ టీచరు, శేషమ్మ గారు, "ఓసి! నువ్వా భారతీ! ఎంత చక్కగా మారిపోయావే... హిందీ కూడా బాగా చదువు మరి... చిన్నప్పుడు ఎన్ని పేచీలు పెట్టేదానివి!? ఇప్పుడు ఎంత బుద్ధిమంతురాలివైపోయావే?! అంటే చిన్నప్పుడు పేచీ పెట్టేవాళ్ళు పెద్దయితే బుద్ధిమంతులవుతారని ప్రతీవాళ్ళకీ చెప్పి, నీ ఉదాహరణ ఇవ్వాలి." అన్నారు.నేను ఆరో క్లాసులో ఉన్నప్పుడు ఆవిడ మా ప్రక్కవాటాలో అద్దెకుండేవారు. ఇంక మా నాచురల్ సైన్స్ టీచరు, సుగుణ గారు నన్ను బాగా ఎంకరేజ్ చేసేవారు. కాని బొమ్మలు వెయ్యాలంటే నాకు ఏడుపొచ్చేసేది. ఇంట్లో ఐతే చిన్నక్క, స్కూల్లో నా క్లాస్ మేట్, శోభ నాకు బొమ్మలు వేసి ఇచ్చేవారు. టీచరుకి తెలియకుండా నెమ్మదిగా నా రికార్డ్ ని శోభకి ఇచ్చేదాన్ని. తనుకూడా నెమ్మదిగా బొమ్మవేసి నాకు పంపించేది.

మా జెర్సీ టీచరు మాచేత ఎన్నో ఆటలు ఆడించేవారు. ముఖ్యంగా త్రోబాల్. మా డ్రాయింగ్ మాష్టారు మమ్మల్ని మొక్కల దగ్గరకి, బైట ఖాళీ జాగాకి తీసికెళ్ళి, మీకు నచ్చిన సీనరీని డ్రా చేయమనేవారు. అవి దిద్ది చక్కగా తెలియజెప్పేవారు. మా సంగీతం టీచరు, తిమ్మాయమ్మగారు నా చేతా, నా ఫ్రెండ్, అల్లు శేషారత్నం చేతా పాటలు పాడించుకుని ఎంతో మెచ్చుకునేవారు. మాక్లాసుని నాలుగు స్క్వాడ్స్ కింద విభజించేవారు. ఒక్కక్కవారం ఒక్కక్కళ్ళది డ్యూటీ. క్లాస్ రూం క్లీను చేసేవాళ్ళం. ఎవరైనా ఏదైనా మర్చిపోతే జాగ్రత్త చేసేవాళ్ళం. చార్టులు తయారుచేసేవాళ్ళం.



ప్రతీ క్లాసుకీ కొంత ఖాళీ స్థలం ఇచ్చి, మొక్కలు వేయమనేవాళ్ళు. పూలమొక్కలు, కూరగాయల మొక్కలు కూడా వేసి, అవి పూసి కాయలు కాస్తుంటే చూసి, అందరం ఎంతో ఆనందించేవాళ్ళం. మా హెడ్మిస్ట్రెస్ రూం మా క్లాసుకి ఎదురుగా ఉండేది. ఆవిడ చాలా స్ట్రిక్ట్ గా ఉండేవారు. ఆవిడంటే అందరికీ చాలా భయం, గౌరవం. భోజనానికి ఆవిడ హాస్టల్‌కి వెళ్ళేవారు. అప్పుడు

ఆరూం తలుపులు మూసేసేవారు. అప్పుడు మేము చాలా గోల చేసేవాళ్ళం. ఆ తలుపులు తెరుచుకోగానే " భూలోకం లో యమలోకం" తలుపులు తెరుచుకున్నాయి, గప్ చిప్. అనేవారు అంతా.

ఇలా నా స్కూల్ జీవితం గురించి ఎంత రాసినా తక్కువే అనిపిస్తుంది.



ఆగష్టు నెల, 2014 లో మా "పూర్వ విద్యార్ధుల సమైక్య" నిడదవోలులో అయితే వెళ్ళి ఎంత ఆనంద పడ్డానో మాటలలో చెప్పలేను. సుమారు 45 ఏళ్ళ తర్వాత మా స్కూల్ ఫ్రెండ్స్ ని కలిసి, మా పాత క్లాస్ రూం లో, మా ఫ్రెండ్స్ తో కూర్చుని అప్పటి కబుర్లు చెప్పుకుంటూ. ఫొటోలు తీసుకుని ఒక రోజంతా సంతోషంగా గడిపాం.

ఇలా నా స్కూలు విషయాలు మీ అందరితో పంచుకోవడం నాకు ఇంకా ఆనందంగా ఉంది.



నా పేరు భారతి. మావారు శ్రీ బి. కె. ప్రకాష్. నేను 1972 లో బి. ఎ. కర్ణాటక సంగీతం లో చేసాను. తరువాత రెండు ఎం. ఎ. లు (హిస్టరీ, సోషియాలజీ) చేసాను. పెళ్ళి తరువాత హైదరాబాదు వచ్చి, ఇద్దరు పిల్లలు స్కూలుకి వెళ్ళడం మొదలుపెట్టాక బి. ఎడ్. చేసి, టీచరు గా కొన్నాళ్ళు పని చేసి, హైస్కూల్ ప్రిన్సిపల్ గా రిటైరయి, ప్రస్తుతం ఇంట్లోనే సంగీతం క్లాసులు తీసుకుంటున్నాను. మీ పత్రికలో టెంత్ క్లాస్ శీర్షిక చూసి, ఎంతో ఉత్సాహంతో నా స్కూల్ డేస్ గురించి రాసాను. నా అదృష్టం కొద్దీ అదే సమయానికి నా నిడదవోలు ఫ్రెండ్స్ ' పూర్వ విద్యార్ధుల సమైక్య ' అంటూ ఆహ్వానించారు. ఇంతకన్న నా గురించి ప్రత్యేకంగా చెప్పేదేమి లేదు.

# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ  ఓ  చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ.  పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు,  సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!"  అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని,  గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# ఫణీంద్రబాబు కామిరెడ్డి

టెన్త్ క్లాస్ జీవితం లో టర్నింగ్ పాయంట్ అని అందరూ అంటారు.  జీవితం సంగతి తెలియదు గాని , 1స్ట్ క్లాస్ నుంచి టెన్త్ క్లాస్ వరకూ ఒకే ఇంటిలో నివసిస్తూ ఒకే  స్కూల్ లో చదవడం  వలన, 10th క్లాస్ ఫినిష్ అయ్యిన తరువాత లైఫ్ రొటీన్ మటుకు చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది.  అలా పది సంవత్సరాలూ చదివిన స్కూల్ మున్సిపల్ స్కూల్ . రత్నంపేట, రామచంద్రాపురం. తూర్పుగోదావరి జిల్లా. మొదటి ఐదేళ్ళూ ఎలిమెంటరీ స్కూల్ అండ్  మిగిలిన ఐదేళ్ళు హైస్కూల్.



నాకు వూహ తెలిసినప్పటినుంచీ పుస్తకాలు చదివే అలవాటు బాగా ఉండేది. చందమామ, బాలమిత్ర, జానపద కథల పాకెట్ బుక్స్, డిటెక్టివ్ నవలలు,న్యూస్ పేపర్స్ , వీక్లీస్, నవలలు, పుస్తకం కనిపిస్తే చాలు చదివేసేవాడిని. కొట్టునుంచి పొట్లాంతో వచ్చిన కాగితాలు, నడుస్తుంటే రోడ్ మీద దొరికిన కాగితాలు. అగ్గిపుల్ల కుక్కపిల్ల సబ్బుబిళ్లా కాదేవీ కవితకనర్హం అన్నట్టు, అక్షరాలుంటే చాలు చదివేసేవాడిని. దానికి తోడు ఇంట్లో ఉంటే అల్లరి ఎక్కువ చేసేస్తున్నాను అని (నాకు గుర్తున్నంతవరకూ నేనసలు అల్లరే చేసేవాడిని కాదు), మా అమ్మగారు, తన బాల్యమిత్రురాలు , మా స్కూల్ లోనే టీచర్ అయిన నాగమణి టీచర్ గారి వద్దకు హిందీ పరీక్షల కోసం పంపటం తో 10త్ క్లాస్ 1స్ట్ హాఫ్ కి వచ్చేటప్పటికి రాష్ట్రభాష హిందీ ప్రవీణ కంప్లీట్ చేశాను. ఆ పరీక్షల పేరు చెప్పి, కోతికి కొబ్బరికాయ దొరికినట్లు , హిందీ లోని కొన్ని అద్భుతమయిన కథలు చదివే అవకాశం కలిగింది. ఇవన్నీ కలిసి కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు అనే కవిత వినగానే , మన గురించే చెప్పుతున్నాడు అనిపించేలా తయారు చేశాయి. నాలెడ్జ్ ఈజ్ పవర్ అన్నట్టు, చాలా పవర్ అయితే వచ్చింది కానీ, ఇగ్నోరెన్స్ ఈజ్ బ్లిస్ అన్నట్టు, బ్లిస్ లేకుండా పోయింది.

వెనక్కి తిరిగి చూసుకొంటె నాకు బాగా నచ్చే విషయం మా స్కూల్ లైఫ్ గురించి, డైవర్సిటీ. రెండు పూటలూ తిండి కష్టం అయిన వాళ్ళ నుంచీ చాలా ధనవంతుల వరకూ నా క్లాస్ మేట్స్ లో వున్నారు. ఆ విషయం అప్పట్లో తెలియలేదు. తల్లిదండ్రులు రోజు కూలీలుగా పనిచేసేవాళ్ల దగ్గరనుంచీ, లెక్చరర్స్ , బాంక్ ఎంప్లాయీస్, ల్యాండ్‌లార్డ్స్, మున్సిపల్ కమిషనర్స్ పిల్లల వరకూ మా క్లాస్‌మేట్స్. ఇంత డైవర్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వాళ్ళని ఆకర్షించడానికి మూలకారణం, నిబద్దత ఉన్న మా ఉపాధ్యాయులు.

నాకు అక్షరం తో ఉన్న అనుబంధం వల్ల, పాఠాలు చదివితే అర్ధం అయిపోయేవి. దానితో ఫలానా టీచర్ గారు బాగా చెప్తారు అనే ఫీలింగ్ నాకు ఎప్పుడూ కలగలేదు. కానీ అందరు టీచర్స్ చాలా నిబద్ధతతో పని చేసేవారు, మమ్మల్ని క్రమశిక్షణలో ఉంచేవారు. జీతాల చెల్లింపులో మునిసిపాలిటీలో అప్పట్లో ఉండే సమస్యలు తెలిసిన తరువాత వాళ్ల మీద గౌరవం మరింత పెరిగింది.

మా ప్రధానోపాధ్యాయుడికి వూరంతా మంచిపేరు చాలా క్రమశిక్షణతో నడుపుతారు అని. 10త్ క్లాస్ పిల్లలకి స్టడీ అవర్స్ పెట్టడం, స్కూల్ లో ఆక్టివిటీస్ కోసం ఒక మంచి స్టేజ్ కట్టించడం లాంటివి చాలా చేసేవారు. అయితే ఆయన గురించి నాకు తెలిసిన విషయాలవల్ల ఆయనని చూడగానే, తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు పద్యం గుర్తుకు వచ్చేది. అదే సమయం లో స్కూల్ కి సంబంధించి ఆయన కృషి గుర్తించగలగడం వలన, సంఘర్షణ అనే అంత పెద్దపదం సూట్ అవ్వదు కానీ , ఒక అన్‌కంఫర్టబల్ ఫీలింగ్ ఉండేది. ఇలాంటివి గుర్తు వచ్చినప్పుడే knowledge ఎక్కువ అయ్యిపోయి ఆ కష్టాలు అనిపిస్తుంది. కానీ better be knowledgeable and unhappy than be ignorant and blissful అని సర్దుకుపోతాను.

మా హిందీ టీచర్ నాగమణి గారు, కల్చరల్ ప్రోగ్రామ్స్ అన్నీ హ్యాండల్ చేసేవారు. మనకి కళాపోషణ అస్సలు లేదు. దానితో ఆ కోణం కంటే, హిందీ పరీక్షల కోసం ఆవిడ ఇంటికి వెళ్తూ ఉండడం వల్ల, ఆవిడి తన తల్లిని , చెల్లెళ్లను, తమ్ముళ్లను చూసుకున్న తీరు నాకు బాగాతెలియడం వలన , ఆ కోణంలో నాకు ఆవిడ అంటే అభిమానము ఎక్కువ.

మాకు తెలుగు టీచర్ గారు అనంత లక్ష్మీ దేవిగారు, ఆవిడ దగ్గర్ ఒక లావుపాటి వెదురు బెత్తం ఉండేది. గబ్బర్సింగ్ తిక్కకి ఉన్నట్లే ఆవిడ దెబ్బలకి కూడా లెక్క ఉండేది.యూనిట్ టెస్ట్ లో 15కి తక్కువ ఉన్న ఒక్కో మార్క్ కి ఒక దెబ్బ. 10కి తక్కువా ఉన్న ఒక్కో మార్క్ కి రెండు దెబ్బలు. 5 కంటే తక్కువ ఉన్న ఒక్కో మార్క్ కి 3 దెబ్బలు. ఎవడికయినా 4 మార్క్స్ వచ్చాయంటే వాడికి 1★3 + 5★2+5★1=18 దెబ్బలు .పడేవి. ఆవిడ కొట్టే తీరు చూస్తే గుండెలవిసిపోయేవి. ఆ దెబ్బ రుచి చూడాల్సి వస్తుంది అని ఎప్పుడూ అనుకోలేదు. కానీ అనుకొన్నవన్నీ అనుకొన్నట్టుగా అయితే అదిజీవితం ఎందుకు అవుతుంది?



10th క్లాస్ 1st యూనిట్ టెస్ట్ లో రెండు మర్చిపోలేని సంగతులు జరిగాయి. నేనెప్పుడూ కష్టపడి, లక్ష్యం తో చదవలేదు. పరీక్షలు కాబట్టి చదవాలి కాబట్టి చదివి రాయాలి కాబట్టి రాసి వచ్చేవాడిని. మన అదృష్టానికి ఎప్పుడూ ఏ పరీక్ష లోనూ సెంట్ పర్సెంట్ వచ్చేవి కాదు. ప్రతీ పరీక్షలోనూ ఒక హాఫ్ మార్కో వన్ మార్కో తగ్గి పొయ్యేవి. సైన్సు లో ఎలాగయినా 100% కొట్టాలి అని 1st టైమ్ , 1st యూనిట్ సిలబస్ మొత్తం బాగా ప్రిపేర్ అయ్యి. పరీక్షకి వెళ్ళాక తెలిసింది– అయ్యా, ఆ సైన్స్ బుక్ మధ్యలో లో మొదలయ్యే కెమిస్ట్రీ అస్సలు టచ్ చెయ్యలేదు అని. 25 లో 12.5 మార్క్స్ కి దాని నుండే ప్రశ్నలు వస్తాయి. అలవాటు లేని పనులు చేస్తే ఇలాగే ఉంటుంది అనుకోని, ఇంజినీరింగ్ పూర్తి అయ్యాక, మారుతి కంపెనీ లో జాబ్ ఇంటర్వ్యూ కి ప్రిపేర్ అయే వరకూ మరలా లక్ష్యం పెట్టుకొని చదివితే ఒట్టు. రెండవది తెలుగు 14 మార్క్స్ వచ్చాయి. అరె పాపం ఎప్పుడూ బాగా మార్క్స్ వచ్చేవి వీడికి అని కన్సెషన్ కూడా ఇవ్వకుండా, నా కోటా (ఒక దెబ్బే అనుకోండి ) నాకిచ్చేశారు.

లెక్కలు అప్పారావు మాస్టర్ చెప్పేవారు. ఆయన క్లాస్ సబ్జెక్ట్ తో పాటు పాలపుంతలు లాంటి ఎతర విషయాలు కూడా చెప్పడంతో, ఆయన క్లాస్ బాగా ఆసక్తిగా ఉండేది. ఆయన ఎంట్రీ అదరగొట్టేవారు. చాలా స్టైల్ గా , హుషారుగా (with a spring in his step అనే ఎక్స్ప్రెషన్ కి అర్థం లా) క్లాస్లోకి ఎంట్రీ ఇచ్చేవారు. ఇంకా ఇంగ్లీష్ టీచ్ చేసే వైకిళ్ఫ్ మాస్టర్,సైన్స్ టీచ్ చేసిన సుబ్బారావు మాస్టర్, నాగేశ్వరార్ మాస్టర్ అందరూ బాగా కేర్ తీసుకొనేవారు. మా డ్రిల్ మాస్టర్ సలాది వెంకట్రావు అని, చాలా మంచి గైడెన్స్ ఇచ్చేవారు విద్యార్థులకు అని ఈ మధ్య స్నేహితులతో మాట్లాడుతూంటే తెలిసింది. మనకి ఆటలలో పెద్ద ప్రావీణ్యత లేకపోవడంతో ఆయన పెద్ద టచ్ ఉండేది కాదు.

ఇక నా సహవిద్యార్థుల దగ్గరకి వస్తే, చాలా మంది స్మార్ట్ కిడ్స్ ఉన్నారు. మా తెలుగు టీచర్ గారి చిన అబ్బాయి కూడా మా క్లాస్మేట్. ఆవిడ పెద్దబ్బాయి క్లాస్మేట్స్ కూడా చాలామంది తెలివయినవాళ్లు ఉండేవారట. ఆవిడ , 'మా కృష్ణ బ్యాచ్ లో ఎవ్వరికీ 500 దాటలేదు. ఈ బ్యాచ్ లోకూడా చాలా మంది తెలివయినపిల్లలు ఉన్నారు' అని ఒక నవ్వు నవ్వారు. ఆవిడ వూహించినట్టే, మా బ్యాచ్ కూడా ఎవ్వరికీ 500 టచ్

కాలా. ఆవిడ కాలజ్ఞానం మెచ్చుకోవాలో, లేక ఆవిడ నోటి దెబ్బే అని తిట్టుకోవాలో అర్ధం కాలేదు. మా స్కూల్ ఫస్ట్ వచ్చిన కృష్ణమోహన్‌కి 481/600 వాళ్ల డాడ్ టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ లో చేసేవారు. ఆయన కొలీగ్ వాళ్ళు మా ఇంట్లో అద్దెకుండేవారు. ఆవిడ మన ఆటపాటలు చూసి, 'కృష్ణమోహన్ చాలా పట్టుదలగా మొదటిరాంక్ కొట్టాలని చదువుతున్నాడు. నువ్వూ చదువు' అని ఇన్‌స్పైర్ చెయ్యడానికి బాగా ట్రై చేసేవారు. కానీ నాకు పట్టుదలగా చదవడం అనే కాన్సెప్ట్ అర్ధం అయ్యేది కాదు. చదివాము. నేర్చుకున్నాము. వచ్చింది రాశాము. అన్నట్టు ఉండేది. మా అమ్మగారు అయితే, 'అన్నయ్య ఏదో ఒక పని చేసుకు బతికేస్తాడు.నీకు ఏ పనిచెయ్యడమూ సరిగ్గా రాదు. నువ్వు చదవకపోతే, ఇక అడుక్కు తినాల్సిందే' అని భవిష్యత్ దర్శనం చేయించి ఇన్‌స్పైర్ చెయ్యడానికి ప్రయత్నించేవారు.



10th పరీక్షల టైమ్ లో బాగా గుర్తున్న ఒక విషయం. రాష్ట్ర భాషా ప్రవీణుడిని అయిన నన్ను, మా క్లాస్‌మేట్ ఒక అమ్మాయి హింది పరీక్ష రాయగానే ఎన్ని వస్తాయి అని అడిగితే, 98 అని చెప్తే ఫీల్ అవ్వుద్దేమో నని, ఒక అర డజన్ తగ్గించి 92 చెప్పా. దిద్దిన వాడు 50 వేసి పంపాడు. ఆ దెబ్బకి 500 కి ఆమడ దూరంలో ఆగిపోయాను. 50 వచ్చాయన్న బాధకంటే, ఇంటర్ లో Sanskrit తీస్కోవచ్చు అనే ఆనందం ఎక్కువ అయ్యింది నాకు. ఈ వంక లేకుంటే, మా హింది టీచర్ గారిని ఒప్పించడం చాలా కష్టం అయ్యేది.

ఉదయం 6 నుంచి 8 వరకూ నరసింహమూర్తి మాస్టారి దగ్గర ప్రైవేట్. ఆయన వేరే స్కూల్ లో టీచర్ గా పనిచేసేవారు. ఆయన దగ్గర ఆ స్కూల్ లో చదివే పిల్లలే ఎక్కువమంది. వర్మ,శ్రీధర్, ఆలీ. వీళ్ళు కాకుండా మా స్కూల్ నుంచి పేరుకి పూర్తిగా వ్యతిరేకి అయిన హరిశ్చంద్ర, బోణం నాగ సుజాత, VSRK ప్రసాద్ ఉండేవారు. హరిశ్చంద్ర , నేను ఒకసారి హోమ్‌వర్క్ చేసేశాం గానీ బుక్ ఇంట్లో మర్చిపోయాము అని జంట కవుల్లా చెపితే, 'వెళ్ళి పట్టుకొచ్చెయ్యండిరా' అని ఒక నవ్వు నవ్వి ఇంటికి పంపారు. అదే మొదటి అండ్ చివరిసారి హోమ్ వర్క్ చెయ్యకపోవడం. లెక్కలు మాత్రం అమ్మాయిలకి, అబ్బాయిలకి కలిపి చెప్పేవారు. మిగిలిన అన్ని సబ్జెక్ట్స్ స్ట్రిక్ట్ సెపరేషన్.

సహవిద్యార్థుల గురించి చెప్పాలి అంటే , మా స్కూల్ లో 2 సెక్షన్స్, A and B. B సెక్షన్ అంతా అబ్బాయిలు. A సెక్షన్ లోనే అమ్మాయిలు ఉండేవారు. దానిలో బాగా చదివే వాళ్ళు అనగానే నిశ్చలా,శ్రీలక్ష్మి, కిరణ్మయి,రుద్రరాజు పద్మావతి, సరస్వతీ గుర్తొస్తారు. ఎక్స్‌ట్రాకరిక్యులర్ ఆక్టివిటీస్ అనగానే క్లాసికల్ డ్యాన్స్ చేసే సరస్వతి(చదివే లిస్ట్ లో కూడా ఉంది), ఫోక్ సాంగ్స్ కు డ్యాన్స్ చేసిన కిరణ్మయి (చదివే లిస్ట్ లో కూడా ఉంది). స్పోర్ట్స్ అంటే పోతుల పద్మావతి, స్పోర్ట్స్‌లో బాగా ప్లే చేసి వోడిపోతే, కన్సొలేషన్ బహుమతి యొక్క ఆవిర్భావము, దాని ఆవశ్యకత గురించి చక్కగా explain చేసే శ్రీలక్ష్మి (చదివే లిస్ట్ లో కూడా ఉంది), చూడగానే భలే ఉన్నారు అనిపించేవాళ్ళు అంటే లలితకళా,పాప,విజయలక్ష్మి, కిరణ్మయి (చదివే లిస్ట్ లో కూడా ఉంది) గుర్తొస్తారు.

ఇంకా మా మిల్ మీదుగా వెళ్తూ, సైకల్ చైన్ లో డ్రెస్ చిక్కుకుపోయినప్పుడు , చాలా elegant ga హ్యాండల్ చేసిన బోణం సుజాత (వీళ్ళ డాడ్ మునిసిపల్ కమిషనర్ చేసేవారు అని రీసెంట్ గా రీయూనియన్ కి ప్లాన్ చేస్తుంటే ఎవరో అన్నారు), అలాగే వాళ్ళ డాడ్ ను కామెంట్ చేశారని, డ్రిల్ మాస్టర్ తో దెబ్బలాట వేసుకొన్న సుబ్బలక్ష్మి గుర్తొస్తారు.

ఇక అబ్బాయిల విషయానికి వస్తే గుర్తు తెచ్చుకోవడానికి, చెప్పుకోవడానికి సమయం వేస్ట్. జోకాను లెండి. చదువులో పోటీపడే మా భాస్కరరావు మాస్టారి అబ్బాయి మధు (polytechnic 131 ర్యాంక్), ఇంటర్ లెక్కలు సబ్జెక్ట్ లో 150 కొట్టిన EMSN శేఖర్, నాతో పాటు హింది పరీక్షలలో విజయకాంత్, ఇంతకముందు చెప్పిన కృష్ణమోహన్, వరాహగిరి శ్రీనివాస్, చాడ విజయసారధి, అనూహ్యంగా Polytechnic 81 ర్యాంక్ సాధించిన సుంకర నాగభూషణం. ఆటల విషయంలో నల్ల నగదుర్గ శ్రీనివాస్, చీమలకొండ శ్రీనివాస్,చీరత్ల రాంబాబు గుర్తొస్తారు. ప్రత్యేకించి చెప్పుకోవాల్సింది వైట్ల సూర్యప్రకాశ్ అని, పాపం ప్రతీ సబ్జెక్ట్ తక్కువే మార్కులు వచ్చేవి. వెళ్ళి దెబ్బలు తిని వెనక్కి తిరగగానే ఒక నవ్వు చిందించేవాడు. ఆ దెబ్బల తర్వాత నవ్వగలిగే వాడి టఫ్నెస్ నాకెప్పుడూ ఆశ్చర్యం కలిగించేది. అలాగే నా జన్మభూమి పాట అద్భుతంగా పాడే క్రిస్టొఫర్ మార్టిన్, మికీ మౌస్ బొమ్మలు గీసే సుంకర శేషగిరి, అమ్మాయి ప్రొఫైల్ బొమ్మ అద్భుతంగా గీసే విజయకాంత్, పొరపాటున కూడా పరుషమయిన మాట మాట్లాడని విశ్వనాథ్, ఇంకా ఎంతో మంది. ఎన్నో స్మృతులు. తోరాటి సుధాకర్, పోతంసెట్టి రాంబాబు, కృష్ణారెడ్డి, దొడ్డిపట్ల రామకృష్ణ, రవిశంకర్, చవాకుల సుబ్బారావు, జేజెరావు, వీరమళ్ళరాంబాబు, కలిదిండి మురళీకృష్ణం రాజు, భగవాన్ చౌదరి, మా బావ గోపిశెట్టి చిన్నా... టూ మెనీ మెమొరీస్. 2015 మా సిల్వర్ జూబిలీ సంవత్సరం. సంక్రాంతి రోజున గెట్‌టుగెదర్ చేసుకోవడానికి ఏర్పాట్లు. అందరూ ఆ వేడుక కి వస్తారనీ , మరల ఎంజాయ్ చేస్తామనీ అనుకొంటున్నాను.

★★★

నా పేరు ఫణీంద్ర బాబు కామిరెడ్డి. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేస్తూ,వాషింగ్టన్ డీసీ దగ్గర నివసిస్తున్నాను. పుస్తక పఠనం,connecting the dots నా హాబీస్.






ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# స్ఫురిత మైలవరపు

పదవ తరగతి.... చాలా మందికి మరిచిపోలేని జ్ఞాపకం. నాక్కూడా అందరిలాగే. అప్పటివరకూ ఆ గేటు లోపలిదే ప్రపంచం. అది దాటి వెళ్ళాక ఏమవుతుందీ, ఏముంటుందీ అన్న అలోచన మనసులో చేరి వొక పక్క వుక్కిరిబిక్కిరి చేస్తూ వుంటుంది. అలా అని నేను దాటను. ఇక్కడే వుండిపోతాను అనే ఛాయిస్ లేని పరీక్ష.



నేను పదో తరగతి వరకూ, తూర్పు గోదావరి జిల్లాలో దంగేరు అనే వొక అందమయిన పల్లెటూరిలో, ప్రభుత్వ ప్రాధమిక ఉన్నత పాఠశాలలో చదువుకున్నాను. తొమ్మిదో తరగతి వరకూ ఎప్పుడూ ఆడుతూ పాడుతూనే చదివేదాన్ని. అన్ని సబ్జెక్టులూ బాగానే మార్కులొచ్చేవి. కొన్ని సబ్జెక్టులు క్లాసు ఫస్ట్ కూడా వచ్చేవి. కానీ ఆ వొక్క 'లెక్కలు' మాత్రం నా బుర్రకి అస్సలు ఎక్కేవి కావు. మా నాన్నగారు యజ్ఞనాథం గారు అదే స్కూల్లో తెలుగు మాస్టారుగా పని చేస్తూ వుండడంవల్ల మొహమాటానికి పాస్ మార్కులేసేవారనుకుంటా మా లెక్కల మాస్టారు. బుక్కునిండా ప్రోబ్లమ్సే, ఎందుకు దాన్ని ముట్టుకుని తలనొప్పి తెచ్చుకోవడం అన్నట్టు వీలయినంత దూరంగా పెట్టేదాన్ని ఆ సబ్జెక్టుని.

నేను వచ్చే ఏడాది పదో తరగతి లోకి వస్తున్నా అంటే ముందు సంవత్సరం నుంచే టెన్షన్ స్టార్ట్ అయ్యింది... నాక్కాదు.... మా అమ్మగారికి. నా కజిన్స్ అందరూ మంచి మంచి స్కూళ్ళల్లో చదువే ప్రాణం అన్నట్టూ చదివేస్తూ వుండేవారు. నన్ను చూస్తే నాకేల చింతా, జరిగేది జరుగుతుంది అన్నట్టు బేఫికర్ గా వుండేదాన్ని. సెలవల్లో కలిసినప్పుడల్లా వాళ్ళ చదువుల వివరాలు తెలిసి బీ.పీ పెరిగేది తనకి. ఇంకో పక్క మా స్కూలు చరిత్ర చూస్తే, అప్పటి దాకా టీచర్ల పిల్లలెవరూ పదో తరగతి గట్టేక్కలేదన్న రికార్డ్ వుంది.ఆ రికార్డుకి భయపడి చక్కగా చదివే పిల్లలే అయినా, నాకంటే ముందు ఇద్దరు ముగ్గుర్నితొమ్మిదో తరగతి లోకి రాగానే వేరే వూళ్ళు పంపించేసారు కొంతమంది టీచర్లు. మా అమ్మా, నాన్నగారూ, నన్ను విడిచిపెట్టి వుండలేక అక్కడే కంటిన్యూ చేసారు.

తొమ్మిదో తరగతి అయ్యాకా వేసవి సెలవల్లోనే అమ్మమ్మగారింటికి వెళ్ళినప్పుడు నా లెక్కల పుస్తకం తీసుకొచ్చి, మా అమ్మాయి లెక్కల్లో పూర్, కాస్త చెప్పండే అని మా బంధుగణంలో లెక్కల మాస్టార్లని, లెక్కలు చదివేవాళ్ళని, గణితంతో ఏ మాత్రం సంబధం వున్నా వదిలేది కాదు. వో అరగంటో, పావుగంటో ఏదో చెప్తున్నాం అని మా అమ్మ తృప్తి కోసం కూచుని, ఏ సినిమా ప్రోగ్రామో వెయ్యగానే చక్కా పోయేవాళ్ళం.



స్కూలు తెరవడానికి యిరవై రోజుల ముందే మా వూరికి వచ్చేశాం. అప్పుడు మా అమ్మగారి కంట్లో పడ్డాడు, ఆ సంవత్సరమే పదో తరగతి పరీక్షలు రాసి, ఇంకా రిజల్ట్ రాక, ఇంట్లో మిగిలిన చుట్టాలంతా వెళ్ళిపోయేసరికి ఏం చెయ్యాలో తోచక గోళ్ళు గిల్లుకుంటున్న ఎదురింటి అమ్మమ్మగారి మనవడు. ఏం బాబూ తోచడంలేదా, మా ఇంటికి రా అని పిలిచి వొక గ్లాసుడు జ్యూస్ ఇచ్చి నెమ్మదిగా లెక్కలు చెప్తావా మా అమ్మాయికి అని అసలు విషయం అడిగారు. ఆ పిల్లాడికి లెక్కలంటే పిచ్చి ట. ఎగిరిగంతేసి పదా తక్షణం మొదలెట్టేద్దాం పాఠాలు అన్నాడు. అది మొదలు, మా అమ్మగారికి టెన్షన్ తగ్గి నాకు మొదలయ్యింది. అప్పటివరకూ అతన్ని స్కూల్లోనూ, ట్యూషన్ లోనూ టీచర్లు పెట్టిన అష్టకష్టాలన్నీ నా మీద ప్రయోగించేసేవాడు. రోజూ ముందురోజు చెప్పినదాని మీద టెస్ట్లు. అరమార్కులే తెలుసు అప్పటిదాకా, అతను పావు మార్కులు కూడా వేసేవాడు. మొత్తం మీద ఆ 20 రోజుల్లో బీజ గణితం (ఆల్ జీబ్రా) అని

అందరూ గుండెలు బాదుకునే చాప్టర్ మీద నాకు భయం పోగొట్టి వాళ్ళూరు వెళ్ళిపోయాడు. అప్పుడు ఎంత తిట్టుకున్నా పాపం లెక్కలు కూడా నా బుర్రలోకి ఎక్కగలవ్ అన్న నమ్మకం తీసుకొచ్చిన వాళ్ళల్లో మొదటివాడు అతనే.




స్కూళ్ళు తెరిచారు. ట్యూషన్ కి ఎవరిదగ్గరకి పంపాలి అని వేట మొదలెట్టారు. ఏ ట్యూషన్ చూసినా అన్ని సబ్జెక్టులూ కలిపే చెప్పేవారు. మా అమ్మగారికి నమ్మకం నాకు లెక్కలొక్కటీ చెప్తే చాలు అని. నిజంగానే మిగిలినవ సబ్జెక్టులు ఏ ట్యూషన్ అక్కర్లేకుండా బాగానే చదివేదాన్ని. ఇంగ్లీషు అంటే ఇష్టం కొద్దీ, సెలవల్లో మా పిన్ని చేత, మమ్మల్ని చూడ్డానికొచ్చినప్పుడల్లా తాతగారి చేత చెప్పించేస్కునేదాన్ని. హిందీ అంటే నాకు ప్రత్యేకాభిమానం. మా హిందీ మాడమ్ విజయలక్ష్మి గారికి ప్రిన్సిపల్స్ రాసిచ్చే ప్రియ శిష్యురాలిని కూడా నేనే. మా సైన్స్ మాస్టారు వీర భద్రం గారంటే మాకు హడల్. ఆయన చెప్పాక రాకపోతే ఇంకేమన్నా వుందా. సోషల్ ఎలాగోలాగా వచ్చేస్తుంది. ఇంక ఎప్పుడూ నా పాలిట రాకాసి సబ్జెక్ట్ ఆ లెక్కలే. మా లెక్కల మాస్టారు సుబ్రహ్మణ్యం గారు, బాగా చెప్తారనే పేరు వుండేది ఆయనకి గానీ, నా బుర్ర లెవెల్ కి ఆయన క్లాస్ లో చెప్పేది సరిపోయేది కాదు.

అలాంటి టైమ్ లో, మా వూరికి కొత్తగా వచ్చిన పోస్ట్ మాన్ 'కృష్ణ మూర్తి' గారు ట్యూషన్స్ చెబుతున్నారహో అన్న వార్త మా అమ్మగారి చెవిన పడింది. ఆయన మా నాన్నగారి ఓల్డ్ స్టూడెంటే. బీ.ఎస్.సీ చదివి...నా చదువుకి తగ్గ వుద్యోగమే రావాలి అని ఎదురు చూడకుండా పోస్ట్ మాన్ గా జాయిన్ అయ్యారు. ఆయన ఇల్లు వూరి చివర వుండేది. ఆయన ట్యూషన్ లో మళ్ళీ యధాతధం గా అన్ని సబ్జెక్ట్లూ అన్న కాన్సెప్ట్ నడిచేది.

ఒకరోజు పోస్ట్ ఇవ్వడానికి వచ్చినాయన్ని ఆపేసి మా అమ్మ, “బాబూ మా అమ్మాయికి లెక్కల ట్యూషన్ చెప్పాలి. నువ్వే మా ఇంటికొచ్చి చెప్పాలి. వేరే ఏ సబ్జెక్ట్లూ వద్దు” అని అడిగేసారు. పాపం మా మాస్టారు, మహా వీర మొహమాటస్తులు. మా నాన్నగారంటే చాలా గౌరవం. అడిగినది గురువుగారి భార్య. కాదని ఎలా అనగలరూ? వొప్పేసుకున్నారు. రోజూ ఇంటిదగ్గర ట్యూషన్స్ అయ్యాక, సాయంత్రం ఆరున్నరా, ఏడు మధ్యలో వచ్చి తొమ్మిదింటిదాకా చెప్పేవారు. నాతో పాటు మా పక్కింటి ఆరోతరగతీ, ఐదోతరగతీ పిల్లకాయలు కూడా కూచునేవారు.

మా మాస్టారు పెద్ద మాటకారి కాదు.లెక్కలు అంటే ఇదీ అదీ అని లెక్చర్లేం దంచేవారు కాదు. ప్రతీ లెక్కా చేసి చూపించేవారు. నాకర్ధం కాకపోతే ఎన్నిసార్లయినా వోపిగ్గా చేసి ఇలా చెయ్యాలి అని చెప్పేవారు. ప్రతీ ఆదివారం టెస్టు పెట్టేవారు. పేపర్ పట్టుకొచ్చి, మన ట్యూషన్ లో హైఎస్ట్ ఇంతొచ్చిందమ్మా, నీకు ఇంకా ఎక్కువ వస్తాయ్ అని బెట్ కట్టి వచ్చాను అని బాగా ఎంకరేజ్ చేసేవారు. ఆయన చెప్పేసాకా, స్కూల్ లో వినేసరికి లెక్కలు కూడా ఇంటరెస్టింగ్ సబ్జెక్టుల లిస్ట్ లో చేరిపోయింది నాకు. ఎప్పుడూ 25 కి 15 మార్కులొస్తే అబ్బో అనుకునే నాకు, మొదటి యూనిట్ టెస్ట్ లో 20 వచ్చేసరికీ, ఇంట్లో అందరం సంబరపడిపోయాం. మాస్టారు మాత్రం అలా తృప్తి పడేవారు కాదు.

క్లాసులో ప్రతీ యూనిట్ కీ, క్వార్టర్లీ కీ మార్కులని బట్టీ సీటింగ్ మార్చేవారు. నేనూ ఇంకొక అమ్మాయి తెగ పోటీ పడేవాళ్ళం. ఇద్దర్లో వొకసారి వొకళ్ళకి ఫస్ట్ వస్తే, వొకళ్ళకి సెకండ్ వచ్చేది. ఇద్దరికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వున్నా చచ్చినట్టూ వొకే బెంచీ లో కూచోవాల్సొచ్చేది. ఇప్పుడు తల్చుకుంటే ఎంత చిన్న విషయాలో అనిపించినా, అప్పట్లో అవే ప్రాణాంతక సమస్యలు మాకు. అప్పటిదాకా, చదువంటే పెద్ద సీరియస్ గా తీస్కోని నాకు ఈ పోటీ వల్ల, వొకసారి మార్కులు బాగా వచ్చి మళ్ళీ సారి బాగా రాకపోతే బావుండదన్న టెన్షన్ మొదలయ్యీ, మా అమ్మగారి పోరుతో పనిలేకుండా శ్రద్ధగా చదవడం మొదలెట్టాను.

హమ్మయ్యా పిల్ల దారిలో పడింది అని మా అమ్మా, నాన్నా వూపిరి పీల్చుకోబోయేసరికీ, దీపావళి వారం రోజులుందనగా పెద్ద తూఫాన్ వచ్చింది. అప్పటికి మాకు తెలిసిన చరిత్రలో అదే పెద్ద భీభత్సం. తూఫాన్లకి పేర్లు పెట్టే ఆచారం అప్పటికి ఇంకా రాక, పాపం దానికి పేరు లేకుండా మిగిలిపోయింది గానీ, ఆ రోజు రాత్రి ఇప్పుడు తల్చుకున్నా వొళ్ళు జలదరిస్తుంది. గాలి వేసిన ఈలలు ఇప్పటికీ చెవుల్లో మోగుతూనే వుంటాయి. మేమొక పెద్ద పెంకుటింట్లో వుండేవాళ్ళం. పైన పెంకులు చాలా వరకూ గాలికి ఎగిరిపోయాయి. మా ఇంటిపక్కనే వుండే రెండు పూరిపాకలు మొత్తం ఎగిరిపోయాయి. ఆ ఇళ్ళవాళ్ళంతా మా ఇంటికొచ్చాకా కాస్త ధైర్యం వచ్చింది. అర్ధరాత్రి రెండూ, మూడింటికి కాస్త తీవ్రత తగ్గింది. అప్పుడందరూ బయటికొచ్చారు. చూస్తే క్రితం రోజు వరకూ మేము చూసిన అందమైన వూరేనా అన్నట్టు వుంది. కొబ్బరిచెట్లతో కళకళ్ళాడుతూ వుండే వూరంతా ఆ కొబ్బరిచెట్లే ఇళ్ళమీద పడిపోయి, కొన్ని ఎలాగో ఆగినా ఆకులన్నీ వూడిపోయి మొండిగా నిలబడి వున్నాయి.

మా స్కూలు నిండా అశోకం చెట్లనీ, పొడవాటి బలమైన చెట్లు వుండేవి. అవన్నీ స్కూలు బిల్డింగ్ మీద పడిపోయాయి. దాదాపు యిరవై రోజులు స్కూళ్ళు మూసేసారు. మధ్యలో పిల్లలమే కొంతవరకూ స్కూలు బాగు చేస్కున్నాం. పైన పెంకులు లేకుండానే క్లాసులు మొదలెట్టాం. చాలా మంది టీచర్లు సహాయక చర్యల్లో భాగంగా, పక్కనున్న పల్లెలకి వెళ్ళిపోవాల్సొచ్చేది. స్కూలు తీసాకా, ఇంచు మించూ ఇంకో యిరవై రోజులు చాలా మంది మాస్టార్లు రాలేదు. ఈ లోపు ఇంకా పెంకులు నేయించడం అవలేదమ్మా అన్నా వినకుండా కొబ్బరాకులు కప్పుకున్న మా కృష్ణ మూర్తిగారింట్లోనే అందరం ట్యూషన్ మొదలెట్టేశాం. సర్పంచ్ దగ్గర కి దండులా వెళ్ళి, మా మాస్టార్లని మాకు పంపండి, మాకు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయ్ అని మొర పెట్టుకుని మరీ మా టీచర్లందర్నీ లాక్కొచ్చుకున్నాం.

పబ్లిక్ పరీక్షలు దగ్గరకొస్తున్నాయనగా, మా నాన్నగారు నాతో, మిగిలిన సబ్జెక్టులన్నీ వదిలెయ్. పెద్ద చదవకపోయినా పాస్ మార్కులు తెచ్చేసుకోగలవు. వున్న టైమ్ అంతా లెక్కలొక్కటీ చదివి ఎలాగైనా పాస్ అవ్వమ్మా చాలు అన్నారు. అదేంటీ నేను స్కూలు ఫస్ట్ కోసం ప్రయత్నిస్తుంటే నాన్నకి నా మీద నమ్మకం లేదా అని బాధేసింది. ఇంకా కష్టపడి చదివాను.

సెవెంత్ క్లాస్ లో మా స్కూల్ ఫస్ట్ వచ్చిన అబ్బాయి, టెంత్ లో చాలా డల్ ఐపోయాడు. హమ్మయ్యా మాకు పోటీకి వొకళ్ళు తగ్గారు అని మనసులో ఎవరికి వాళ్ళం సంతోషించే వాళ్ళం. మా క్లాసు టీచర్ రామకృష్ణ గారు వొక రోజు ఆ అబ్బాయిని పిలిచి క్లాసందరి ముందే అడిగేశారు, "ఏవిటీ సంగతీ, ఇలా వెనకబడిపోతున్నావ్?" అని. దానికా అబ్బాయి, తల వంచుకుని "పది తరవాత మా నాన్న చదివించనన్నాడండి. ఇంకెందుకు లే అనీ..." అని నసిగాడు. అప్పటిదాకా పోటీ తగ్గిందని సంబరపడ్డా, ఆ గేటు లోపల అందరిదీ వొకటే ప్రపంచంలా వున్న మాకు, అది దాటగానే వొక్కొకళ్ళ దారీ మారిపోతుందన్న విషయం అర్ధమైన క్షణం, గుండె బరువెక్కింది.

పరీక్షలకి సెంటర్ మా వూళ్ళో లేదు. పక్క వూరు గంగవరం వెళ్ళాలి. అబ్బాయిలు సైకిళ్ళమీదా, బస్సులోనూ వెళితే, అమ్మాయిలం మాత్రం ఆ పది రోజులకోసం గుర్రం బళ్ళు కుదుర్చుకుని వెళ్ళేవాళ్ళం. ఏ బండి లో ఎవరెక్కాలి అని పెద్ద గొడవ. లాంగ్వేజ్ పరీక్షలన్నాళ్ళూ కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళినవాళ్ళం కాస్తా, ఆఖరి పరీక్షలకి ప్రయాణం మొత్తం పుస్తకాల్లోంచి తలెత్తేవాళ్ళం కాదు. వెళ్ళేదారిలో నందనవనం లాంటి వొక ఇల్లు వచ్చేది. పువ్వుల తాతగారిల్లు అని పేరు పెట్టాం దానికి. మా బళ్ళు వెళ్ళేటప్పుడు చూసి ఆయనా పలకరింపుగా

నవ్వేవారు. ఆఖరి పరీక్ష అయ్యి వచ్చేసే రోజు, అక్కడ బండి ఆపించుకుని దిగి, “పువ్వులు కోసుకోవచ్చాండీ?” అని అడిగితే, “కనకాంబరాలు మీ ఇష్టం వచ్చినన్ని కోసుకోండి” అన్నారు. అక్కడనుంచి బయల్దేరి, దార్లో వొకమ్మాయి పొలం లో ఆగి కొబ్బరి బొండాలు తాగి ఇళ్ళకి చేరాం. అదే మా ఆఖరి పరీక్ష పార్టీ.



మా వూరి చివర, గోదారి గట్టున రాములవారి గుడి వుండేది. రామ ఘట్టాలు అని పిలిచేవారు దాన్ని. పరీక్షలైపోయాకా, మా కృష్ణ మూర్తి మాస్టారు అక్కడ పిక్నిక్ ఏర్పాటు చేశారు. పైకి ఎప్పుడూ మొహమాటంగా వుండే మాస్టారు కూడా ఆ రోజు మాతో సమానంగా అల్లరి చేసారు. ఆయనకి మా బాచ్ మొదటి బాచ్. మేమెప్పటికీ స్పెషల్ అని చెప్తున్నప్పుడు ఆయన గొంతు జీరబోయింది. మా కళ్ళు తడయ్యాయి.

రిజల్ట్ వచ్చాకా నాకు 76% వచ్చింది. నాతో పోటీ పడే అమ్మాయికి నాకన్నా 9 మార్కులు ఎక్కువ వచ్చాయి. తను స్కూల్ ఫస్ట్, నేను సెకండ్. నాకప్పుడు కలిగిన సంతోషం, తర్వాత వేరే ఏ పరీక్షలప్పుడూ కలగలేదు.

మా హెడ్ మాస్టారు, నేమాని నాగేశ్వర రావు గారు. ఆయనకి మాదే చివరి బాచ్. ఆ సంవత్సరం తో రిటైర్ ఐపోతున్నారు. మాకు ఆయన నాచురల్ సైన్స్ చెప్పేవారు. క్లాసులో పాఠం కన్నా ఎక్కువగా, ఆయన చివరి బాచ్ ఎక్కువ పాస్ పెర్సెంటేజ్ తో ఆయనకి పేరు తీస్కురావాలని పదే పదే చెబుతూ వుండేవారు. ఆయన కోరుకున్నట్టుగానే, రికార్డ్ పాస్ పెర్సెంటేజ్ తీసుకొచ్చింది మా బాచ్.

నిన్నా మొన్నా జరిగిన విషయాలు కూడా మర్చిపోతూ వుంటాను గానీ, పదో తరగతిలో జరిగినవి రాస్తున్నకొద్దీ గుర్తొస్తూ నా కలం ఆగకుండా పరిగెత్తింది. ఇంకా బోలెడు జ్ఞాపకాలు వుక్కిరిబిక్కిరి చేస్తుంటే అవన్నీ రాసేస్తే వొక వారం లో సరిపోదని చాలా తగ్గిస్తేనే ఇన్ని కబుర్లు దొర్లిపోయాయి. ఆ రోజులు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా అనిపిస్తుంది, మా స్కూలూ, ఆ టైమ్ అన్నీ అక్కడే పదిలంగా వున్నాయి, మేమే వాటిని దాటుకుని వచ్చేశామేమో అని.

**కొసమెరుపు:** తనకన్నా ఎత్తుకి ఎదిగిన కొమ్మని చూసి ఆనందించే అదృష్టం, వొక్క ఉపాధ్యాయ వృత్తికే వుంటుందేమో. నేను ఎమ్.సి.ఏ ఎంట్రన్స్ రాసినప్పుడు, మా కృష్ణమూర్తి మాస్టారు మేం వున్న వూరికి బదిలీ అయ్యి అక్కడ పనిచేసే వారు. నా ర్యాంక్ కార్డ్ రాగానే, మిగిలిన పోస్ట్ అంతా పక్కన పెట్టి మా ఇంటికి మొదట వచ్చి,’ పాప రాంక్ కార్డ్ వచ్చిందండీ’ అని యిచ్చారు. తన దగ్గర చదివిన స్టూడెంట్ అన్న గర్వం ఆయన కళ్ళల్లో స్పష్టంగా కనపడిందారోజు.

★★★



నా పేరు, స్ఫురిత మైలవరపు. డాలస్ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. దైనందిన జీవితంలో తప్పకుండా చెయ్యాల్సినవి రొటీన్ పనులైతే, మనల్ని మనం మర్చిపోయేంత తృప్తినిచ్చే పనులు హాబీలు. నేనా తృప్తిని, రాయడం లోనూ, బొమ్మలెయ్యడంలోనూ వెతుక్కున్నాను. నా రాతలూ, గీతలూ కలిపి ఆరేళ్ళుగా నా రాతలు naarathalu.blogspot.com అనే బ్లాగ్ నిర్వహిస్తున్నాను.




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే `టెంత్ క్లాస్` ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి `టెంత్ క్లాస్` రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. `కౌముది` లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ `టెంత్ క్లాస్` అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని `కౌముది` ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# కర్రా నాగలక్ష్మి

మా చెలి జి.సుబ్బలక్ష్మిగారు రాసిన కథ చదువుదామని "కౌముది" అంతర్జాల పత్రిక సైట్ లోకి వెళ్లి అన్ని కథలు వ్యాసాలూ చదువుతూ వుంటే "పదవతరగతి" అనే పాఠకులు పాల్గొనే శీర్షిక చదివేను. నేను పాఠకురాలినేగా, నేనూ రాయవచ్చు అని అనిపించింది. అయితే నా "పదవ తరగతి" అనుభవాలు ఖచ్చితంగా వేరు అని నేను చెప్పగలను మీరు కూడా చదివి చెప్పండి.



మా నాన్నగారు ఇండియన్ రైల్వేస్ లో అకౌటెంట్ గా పని చేసేవారు. ఉద్యోగరీత్యా ఒరిస్సా లో వుండేవారు ,అందుకని నా పుట్టుక , స్కూల్ ఫైనల్ వరకు చదువు ఒరిస్సాలోనే అయేయి.

మా వూరు ఓ చిన్న టౌను,90 శాతం వూరు రైల్వే కి చెందినదే, ఇలా అనే బదులు మా వూరు ఒక రైల్వే కాలనీ అంటే సరిపోతుందేమో?

మావూరు పేరు "ఖుర్దారోడ్ ", ఒరిస్సా రాజధాని భువనేవర్ కి 12కిమి ల దూరంలో వుంది. ఏ మహానుభావుడి కృషో తెలీదుగాని మా స్కూల్లో తెలుగు,బెంగాలి,ఒరియా మాధ్యమాలలో చదువుకొనే వీలుండేది. మాతృ భాషని చంపుతున్న సెంట్రల్ స్కూళ్ళు అప్పటికి మావూరు చేరలేదు కాబట్టే మాకు తెలుగు రాయను, చదవను వచ్చు.

అక్షరాభ్యాసం జరిగిన దగ్గర నుంచి అదే స్కూలు అవడంతో ప్రతి తరగతి లోను పాత పిల్లలమే వుండేవారం. మాది కోఎడ్యుకేషన్ స్కూలు. ఒకటవ తరగతి నుంచి కలసి చదువుతున్న నుంచి ఏదో అభిమానం వుండేది మామధ్య .

మా స్కూలు ఫైనల్ ని H.S.C అనేవారు. పదవ తరగతికి ప్రత్యేకత వుండేదికాదు. పదకొండుకి బోర్డు పరీక్షలుండేవి.అంటే మాది 11 +2+ 2 స్కీము. 9,10,11 మూడు సంవత్సరాల సిలబస్ లోంచి ఫైనల్స్ లో ప్రశ్నలు వచ్చేవి అందుకు మాకు 11వ క్లాస్ లో చాలా ప్రెషర్ వుండేది.

మా టీచర్స్ కుడా మా కుటుంబ సభ్యులలాగానే వుండేవారు. ఇంకా చెప్పుకోవాలంటే మొత్తం వూరు ఊరంతా ఒకే కుటుంబం లా వుండేవాళ్ళం. కులం, మతం ప్రసక్తే వుండేదికాదు. ఇదేమి అతిశయోక్తి కాదు. ఇప్పుడు అతిశయోక్తిలా కనిపించినా అప్పట్లో అలాగే వుండేవాళ్ళం. నేను చెప్తున్నది 1960 ల మాట. ప్రతి యింట్లో వీధిలో పూల మొక్కలు పెరట్లో బెండ,దొండ,బీర మొద. .పాదులు తప్పకుండా ఉండేవి. సాయంత్రం అవగానే పిల్లలం దొంగాటలు వీధులలో ఆడుకొనేవాళ్ళం. మగ పిల్లలతో సమానంగా చెట్లెక్కటం ,గోలీలు,బొంగరాలు ఆడటం చేసేవాళ్ళం.

1971 లో అంటే నేను తొమ్మిదోక్లాసు కి వచ్చేకా మా తోటి మగపిల్లలు సైకిలు నేర్చుకోడం మొదలు పెట్టేరు,వాళ్ళతో పోటీగా నేను కుడా మా రెండో అన్నయ్య సైకిలు తీసుకోని నేర్చుకోడం మొదలు పెట్టేను. నలుగురు అన్నల తరవాత పుట్టేనని కాస్త ఇంట్లోవాళ్ళు గారాబం చేసేవారు. అది అర్ధమయ్యేది కాని ఊర్లో అందరూ ఎందుకు గారాబం చేసేవారో అర్ధమయ్యేది కాదు. తొమ్మిదోతరగతి లోనే మాకు ఆప్షనల్ సబ్జెక్ట్ తీసుకోవాలి ఆడపిల్లలు "ఫిజియాలజీ హైజిన్" అనే విషయం తీసుకునే వారు,మగపిల్లలు "లెఖ్ఖలు" తీసుకొనేవారు. నాకు లెఖ్ఖలంటే యిష్టం అందుకే నేను లెఖ్ఖలు తీసుకున్నాను. దాంతో తోటి విద్యార్ధులలోను, టీచర్ల లోను ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. మార్కులు కుడా నూటికి ఎనభై ,ఎనభైఅయిదు వచ్చేవి. రోజూ స్కూలికి వెళ్ళాలంటే ఒకటిన్నర కిలోమీటర్లు నడచివెళ్ళేవాళ్ళం. అందులో అర

కిలోమీటరు పెద్ద మామిడి తోటలోంచి వెళ్ళవలసి వచ్చేది.మామిడి సీజనులోమామిడి పిందెలు యేరుకోవడం, మత్తెకించే నాగమల్లి పూలవాసనలకి మైమరచి కోసుకోబోతే నాగుపాముల దర్శనాలు,పాములకి భయపడి ఓనాలుగు రోజులు పూల జోలికి వెళ్లకుండా వున్నా తరవాత మళ్ళా మామ్మూలే. ఇలా ఆడుతూ పాడుతూ తిరిగే నాకు కాళ్ళకి బేడీలు పడ్డాయి. ఆకాశంలో ఎగురుతున్న నాకు రెక్కలు విరిచి పంజరంలో పెట్టినట్టయింది. 1972 లో నాకు వివాహం జరిగింది. ఎందుకు అంత తొందరగా వివాహం చేసేరో నాకు యిప్పటికి అర్ధం కాదు.

వివాహం తరువాత చదువు కొనసాగించాలా? మెడలో మంగళ సూత్రాల తో స్కూలుకి వెళ్ళాలా?చదువు మానేయాలా? ప్రైవేట్ గా చదువు కొనసాగించాలా? అనేది అప్పుడు నా ముందువున్న ప్రశ్న, ఇంట్లో అందరు స్కూలుకి వెళ్ళమని ప్రోత్సహిస్తున్నారు,కాని నాలో ఏదో జంకు, మునుపటిలా నన్ను తోటివిద్యార్ధులు ఆదరిస్తారా? టీచర్లు యేమంటారో? అన్ని సందేహాలే. నాకేదో పెద్దరికం కట్టబెట్టినట్టు,నేను పెద్దదాన్ని అయిపోయినట్లు ఫీలింగు . మనసులో పెద్ద సంఘర్షణ.

ఆ సమయంలో నాతోటి విద్యార్ధులు, టీచర్లు అందించిన సహకారం మరువ లేనిది. అలా మళ్ళా నాచదువు కొనసాగింది. ఎప్పుడూ తరగతిలో ఒకటి,రెండు స్థానాల్లో వుండేదాన్ని. ఆటలు పాటలు తగ్గి ఆ స్థానం అల్లికలు కుట్లు చోటు చేసుకున్నాయి. బోర్డ్ ఎక్జామ్స్ మూడు నెలల్లో ఉన్నాయనగా మళ్ళా మరో షాక్, మామిడి తోటలలోంచి ఒక్కర్తిని వస్తూవుంటే మెడలోని మంగళసూత్రాలు, గొలుసుతో సహా ఎదురుకుండా సైకిలు మీద వచ్చిన దొంగ తెంపుకు పోయేడు. దాంతో మళ్ళా పెద్ద అయోమయంలో పడ్డా. ఆ సంఘటనతో చదువు మీద నాకున్న ఆశ, ఆశక్తి చచ్చిపోయింది. వీధి లోకి వెళ్ళడానికి పిచ్చి భయం పట్టుకుంది. అప్పుడు మాకు లెఖ్ఖలు చెప్పే A.Bhaskar rao టీచర్ గారు మా యింటికి వచ్చి నేను పోగొట్టుకున్న ఆత్మవిశ్వాసాన్ని తిరిగి నాలో నింపి, విద్య పట్ల ఆసక్తిని కలిగించేరు. అప్పట్లో మాకు తొమ్మిది గంటల నుండి ఒంటిగంట వరకు ఒక పరీక్ష ,ఒకటిన్నర నుంచి అయిదు గంటల వరకు రెండో పరీక్షా వుండేవి .అందు నుంచి వుత్తీర్ణత శాతం చాలా తక్కువగా అంటే అయిదు లేక ఆరుగా వుండేది.

ఆ తరవాత పరీక్షలు రాయడం కొత్తకాపురానికి కలకత్తా వెళ్ళిపోవడం, పరీక్ష పాస్ ఆవడం జరిగి పోయింది. పది సంవత్సరాలు సంసార సాగరంలో మునిగి పోయేను. పిల్లలు ఇద్దరు స్కూల్స్ కి వెళ్ళడం మొదలు పెట్టిన తరవాత గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చెయ్యడానికి కూడా మా టీచర్ గారు ఆ రోజు యిచ్చిన ప్రోత్సాహమే కారణం.

ఈ రోజుకి కూడా ఆ జ్ఞాపకాలు ఇంకా తాజాగానే వున్నాయి.

ఈ" కౌముది " ద్వారా మళ్ళా నా టీచర్స్ ని సహావిద్యార్ధులని జ్ఞాపకం చేసుకొని వారికి నా కృతజ్ఞతలు చెప్పుకొనే అవకాశం కలుగ చేసినందుకు అనేక ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను . ★★★



పుట్టింది ఒరిస్సా లోని "కటక్ "పెరిగింది "ఖుర్దారోడ్" లో, విద్యనేది అనంతం అని నేర్చుకోవడానికి వయస్సుతో నిమిత్తం లేదనేది నా నమ్మకం. అందుకే సంసార బాధ్యతలు నిర్వర్తిస్తూనే విద్యని కొనసాగించేను.M.com, N.I.I.T నుంచి advanced diplomaa course చేశాను 1992 లో. తరవాత advanced diplomaa in banking,advanced diplomaa in co-oparetive mng చేసేను.2007 -2008 లో gemmology డిప్లొమా ,national institute of jewallary disign నుంచి చేశాను .శ్రీవారి ఉద్యోగరీత్యా దేశంలో వివిధ ప్రాంతాలలో నివసించడం వల్ల ఆ ఆ ప్రాంతీయ భాషలు నేర్చుకునే అవకాశం కలిగింది. ఏదో రాయాలనే కోరికతో చిన్న,చిన్న ట్రావెలాగ్స్ రాసి వెబ్ మాగజైన్స్ కిపంపడం వారు ప్రచురించడం జరిగింది. "తండ్రి తనయ"అనే శీర్షికన యిరవై నలుగురు ప్రఖ్యాత రచయిత్రుల కథలతో పాటు నా తొలి కథ చోటు చేసుకుంది. ఇది నా పరిచయం.




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# శ్రీనివాసరావు దేవబక్తుని

నేను జీవించే ప్రతి క్షణం , నేర్చుకుంటునే వుంటాను (As long as I live- So long do I learn) , అనే రామకృష్ణ పరమహంస చెప్పిన సూక్తి మా స్కూల్ శ్రీ రామకృష్ణ విద్యాలయ పాల్వంచ వారి ప్రధాన నినాదం.

జీవిత లక్ష్యాలని అందమగా,ఆనందంగా, ప్రధానముగా మానవీయత తో (వితౌట్ బిఎంగ్ రుత్లేస్) ఎలా చేరుకోవాలో మాకు మా స్కూలు నేర్పింది అంటే సందేహం లేదు, దీనికి మాకు ప్రత్యేకమైన క్లాసులు గట్రా ఏమి తీసుకోలేదు. ఇదంతా చెప్పిన టీచర్స్ కూడా పెద్ద మానసిక నిపుణులు కూడా కాదు, కేవలం వారి వృత్తిని వారు ఎంతో ప్రేమతో, నిబద్ధతతో నిర్వర్తించారు కాబట్టి , కొన్ని వందలమంది విద్యార్థులా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసారు.



స్కూల్ నేపథ్యం చెప్పాలంటే– స్థలాభావం వలన సెకండరీ సెక్షన్స్ అన్నిటిని (ఆరు నుండి పదో క్లాసు వరకు) ఊరికి దూరంగా ,ఒక మూల నిర్మానుష ప్రశాంతతో వుండే 'సి ' కాలనీకీ మార్చారు. ఎత్తుగా ఉండే వేప,కుంకుడు, సరుగుడు లాంటి చెట్లతో ప్రాంగణం నిండి ఉండేది. స్కూల్ని అనుకోని అప్పుడే బాగా పలుచబడిన అడవి, దానిని అనుకోని ఒక పెద్ద గుట్ట, స్కూల్ కి మంచి బ్యాక్ డ్రాప్ గా ఉండేవి. పచ్చికుంకుడు కాయల్ని హ్యాండ్ వాష్ గా వాడే వాళ్ళం. వర్షకాలం స్కూల్ చుట్టూ ఆకు పచ్చని బెనారస్ చీర పర్చినట్టు పచ్చదనం పరిచి ఉండేది.

ఆరుద్ర పురుగుల్ని అగ్గిపెట్టెలో పెట్టుకోవడం, గుంపులు గుంపులుగా తిరుగుతున్న సీతాకోకచిలుకలని పట్టుకొని స్క్రాప్ బుక్ లో అతికించు కోవడం లాంటి పాషాణ అభిరుచులతో పాటు స్టాంప్ కలెక్షన్,చందమామ,బాలజ్యోతి మరియు బొమ్మరిల్లు లాంటి పుస్తక సేకరణలతో అలవారే వాళ్ళం.

కాలనీలో ఇళ్ళ ముందు బాగా కనిపించే పుల్ల మామిడి,జామ,సపోటా,సీమాచింతా కాయలు,నేరుడు పళ్ళు చిలిపి దొంగతనాలు చేయమని ఊరించేవి. వెనువెంటనే మాస్టర్ లతో దెబ్బలు కూడా కొసరుగా వేయంచేవి. దొంగ పండ్లుకు, కొసరు దెబ్బలుకు రుచి,చురుకు రెండు బాగా ఎక్కువే.

స్కూల్ గేటు ముందు అమ్మడానికి వచ్చే పిచుమిఠాయి,బొంబాయి మిఠాయి, జీళ్ళు ,బాటనిలు పుల్ల ఐస్ , పాలఐస్ లాంటి మా జంక్ ఫుడ్స్ ,ఇంకా రేగు పళ్ళు, అడవిలో దొరకె పరిక పళ్ళు,తునిక కాయలు మా జేబుల్లో చిల్లర పైసలకు చిల్లులు పెట్టేవి.

నలభై, యాభై డిగ్రీల ఎండా మాకు మాత్రము వెన్నలగా అనిపించి క్రికెట్ ,వాలీబాల్,షటిల్ బాడ్మింటన్ లాంటి ఆటలు,పాల్వంచ చుట్టువున్న కరకా వాగు,ముర్రేడు వాగు ల్లోకి ఈతకు వెళ్ళడాలు, ఆరు కిలోమీటర్ల దూరంలో వున్న పెద్దఅమ్మ గుడికి సైకిల్ రేస్లు మా కున్న కొన్ని 'క్రీడ'భిరామాలు.

ఇంతా సరదాగా తొమ్మిది నుండి పదో తరగతి లోకి గాంభీరంగా అడుగు పెటాం. మాలో కొంతమంది వేసవి కాలం సెలవల్లో నవత టూషన్స్ లో జగన్ మోహన్రావు గారి దగ్గరా కాస్ తీటా ,సైన్ తీటాలను నూరటం మొదలు పెట్టారు. నేను మాత్రం ఎండా కాలం సెలవల్లో చదువు ఎక్కదన్న నమ్మకముతో పుస్తకాల జోలికి వెళ్ళలేదు.

అప్పటికే అల్ట్రా మోడరన్ ఉండే కృష్ణకుమారి మేడం గారు సోషల్ స్టడీస్ కి, స్వర్గీయ యడవల్లి కృష్ణమూర్తి గారు సైన్స్ కి, లెక్కలకి ఉపేంద్ర గారు, ఇంగ్లీష్ కి స్టెల్లకుమారి మేడం గారు , ఆల్ ఆర్ ఆల్ వి ప్రసాద్ గారు మాకు గట్టి పునాది వేసి వుంచారు.



కాని హిందీ సబ్జెక్ట్ లో మాత్రం మాలో కొంతమంది 'భాషా ప్రవీణ' లకు తప్ప అందరికి మింగుడు పాడనీ 'హడ్డి' అయింది. హిందీ చెప్పే సూర్యకుమారి మేడం గారికి ఊతపదం 'ద్రాష్టుడా'. ఇంకా మేము అందరమూ ద్రాష్టులము అయ్యిపోయి,సూరదాస్ ,తులసీదాస్ పద్యాలూ చదవటం రాక క్లాసు బయట సరుగుడు చెట్ల క్రింద నిలుచొని హిందీ తో కుస్తీ పట్టేవాళ్ళం. అవి కంఠతా వస్తేనే క్లాసు లోకి రీఎంట్రీ మరి.

పదో తరగతి కి మాత్రం సూర్యకుమారి మేడం బదులు లక్ష్మి మేడం గారు రావటం తో మాకు హిందీ 'శిక్ష'ణ పర్వం తప్పింది. లెక్కలు కంటే హిందీ కోసం చాల కష్టపడి వలసి వచ్చింది. అది 18 పాస్ మార్కుల కోసం.

శోభా మేడం గారు ఫిజిక్స్ క్లాసు తీసుకొనేది, ఆమె చెప్పే విధానం వలన పదో తరగతిలోనే కాకుండా ఇంటర్మీడియట్లో కూడా ఫిజిక్స్ లో మంచి మార్కులు వచ్చాయి. చిన్న క్లాసులో వున్నపుడు యడవల్లి కృష్ణమూర్తి గారు మాతో చిన్న చిన్న సైన్స్ ప్రాజెక్ట్స్ చేయించే వారు. జిల్లా సైన్స్ ఫెయిర్ కి మోడల్స్ తయారు చేయించేవారు. డిబేటింగ్ పోటీ లకు బాగా తయారు చేసి పంపే వారు. మొత్తం ఎనభై మందినీ రెండు సెక్షన్స్ గా విడదీసారు. 'ఏ' సెక్షన్ అమ్మాయిలకు, 'బి' సెక్షన్ బాయ్స్ కి. కానీ కొన్ని క్లాసెస్ ఉమ్మడి గా జరిగేవి. టెన్త్ కి వచ్చేసరికి మాకు వాలీబాల్ పిచ్చి పట్టుకొంది. వుంటే క్లాసు లో లేకుంటే వాలీ బాల్ కోర్ట్ లొ. టీచర్స్ ఏమైనా ఎక్స్ ట్రా క్లాసులు పెట్టాలన్న పి ఇ టి సర్ రాజు గారు నుండి కోర్ట్ ఇప్పించిండి అని కండిషన్ పెట్టవాళ్ళం. కొన్నిసార్లు రెండు సెక్షన్ లు వాళ్ళు కలిసి ఆడేవాళ్ళం,గెలిచిన టీం కోర్ట్ లో వుండేది ,ఓడిన టీం స్థానం లో కొత్త టీం వచ్చేది.

టామ్ సాయర్ కి ఏమి తక్కువ అని! వెనుకనే వున్నా గుట్ట మీదకి సాహస యాత్ర చేసి, దిగేటప్పుడు షరా మాములుగా మాలో కొంత మంది జారిపడి దెబ్బలు తగిలించుకొని 'బ్యాండ్ ఎయిడ్ ' బాబులు అయ్యారు.!!

రామకృష్ణ మిషనరీ స్కూల్ అయినందు వలన, వివేకానంద, రామకృష్ణ పరహంస గార్లకు సంబంధించిన పుస్తకాలు ఎటువంటి పోటీలు అయిన బహుమతులుగా ఇచ్చేవారు, దానిలోనూ 'వివేకానందాస్ కాల్ టు నేషన్' మాత్రం చాల ఎక్కువసార్లు వచ్చేది. ఏ ఫంక్షన్ జరిగిన రామకృష్ణ మఠం నుండి స్వామిజీలు ముఖ్య అతిథిలు గా వచ్చేవారు.

ఆనవాయితీగా ఎప్పుడు దగ్గరలో వుండే కిన్నెరసాని ప్రాజెక్ట్ కి పిక్నిక్ కి కాకుండా, సీలేరు కు మూడు రోజుల ట్రిప్ వేసారు ఓసారి. అక్కడ వున్న హైడేల్ పవర్ ప్లాంట్స్ చూపించారు. అదనంగా అందమైన ప్రకృతి మమ్మల్ని తన వశం చేసుకొంది. కానీ మా దగ్గర ఎవరికీ కెమెరా లేదు, అందుకని ఫోటోలు ఏమీ తీసుకోలేకపోయాం. అ బాధ చాలా రోజులు ఉండిపోయింది, ఫోటోల కోసం మళ్ళీ చాల ఏళ్ల తరువాత తిరిగి మతరోసారి సీలేరు ట్రిప్ కి వెళ్ళాం.



ఫిబ్రవరి వచ్చేసరికి మాకు పబ్లిక్ పరీక్షల జ్వరం పట్టుకుంది. ఇక అప్పటినుండి కంబైన్డ్ స్టడీస్ మొదలు పెట్టాం. సాధరణంగా ఈ సమిష్టి చదువుల్లో చదువు తప్ప అన్ని పనులు చేస్తూ వుంటాం. అందుకు మా బృందం కూడా ఏమి మినహాయింపు కాదు. రెండో ఆట సినిమాలు, అర్ధరాత్రి టీ బ్రేకులు, దోర మామిడికాయల తెంపుళ్ళు.. మా చదువుని పలచన చేశాయనే చెప్పాలి.

మార్చ్ చివరి వారంలో మా ఎగ్జామ్స్ స్టార్ట్ అయ్యాయి. పరీక్ష అయిపోగానే ,వాటికీ సబ్జెక్టుకి సంబంధించిన పుస్తకాలన్నీ తిరిగే ఫ్యాన్ కి వేసి పోగులు పెట్టసేము, కానీ మధ్యలో పేపర్ ఔట్ అయిందని కొన్ని సబ్జక్ట్స కి పరీక్షలని రద్దు చేసి మళ్ళీ ఎగ్జామ్స్ పెట్టారు , ఇక చూడాలి అప్పుడు మా చిత్తుపొత్తు చదువుల దుస్థితి. అలా జూన్ మొదటి వారం వరకు ఎగ్జామ్స్ రాస్తూనే ఉన్నాం. సుదీర్ఘమైన పరీక్షా ప్రహసనంతో 1987లో పదో తరగతిని ఆహ్లాదమైన జ్ఞాపకాలతో దాటేశాం.

ఏ దేశం వెళ్ళినా ముందు అక్కడ వుండే క్లాస్మేట్స్ ని కానీ స్కూల్ మేట్స్ ని కానీ ఎంత కష్ట మైన కలుసుకుని మా స్కూల్ సంగతులు ఊరు సంగతులు డ్రింక్స్ మధ్యలో మంచింగ్ చేసుకోవడం ప్రసుత్తం ఒక పెద్ద హాబీ గా పెట్టుకున్నాం.

మళ్ళీ 2000 సంవత్సరం లో ఎన్నారైలు గా స్కూల్ లోకి అడుగుబెట్టి , పరిసరాలని , టీచర్స్ని పలకరించి రావటమే కాకుండా,ప్రతి సంవత్సరం టీచర్స్ డే నాడు మా 1986-87 బ్యాచ్ కి క్లాసెస్ చెప్పిన టీచర్స్ ని, ఏడాది కి ఒకరి చొప్పున సన్మానించుకున్నాం. ఇప్పటికి కూడా అప్పుడప్పుడు వాళ్ళని కలసి బాగుగోగులు తెలుసుకొంటున్నాము.

మా అందరికి మంచి జ్ఞాపకాలు పంచిన పాల్వంచ కి 'యునైటెడ్ స్టేట్స్ అఫ్ పాల్వంచ' కి జే' అంటూ, మీది ఏ ప్రాంతం అంటే మాది 'యునైటెడ్ స్టేట్స్ అఫ్ పాల్వంచ' అని గర్వంగా చెప్పుకొంటు జయప్రదంగా సాగుతున్నాం.!!

ఇదే నా మొదటి తెలుగు రచన
పేరు: శ్రీనివాస్ రావు దేవబక్తుని
ప్రస్తుత నివాసం:హైదరాబాద్
వృత్తి : సాఫ్ట్ వేర్ కన్సల్టెంట్
ఇష్టాలు:మల్లాది,పొత్తూరి విజయలక్ష్మి,పిలక గణపతి శాస్త్రి రచనలు.
పాత పాటలు,పాత సినిమాలు పాత మిత్రులు , ఇంకా టైం దొరికేతే nostalgic విషయాలు (http://devabaktuni.blogspot.com ) బ్లాగ్ లో వ్రాసుకోవటం.






ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే ʻటెంత్ క్లాస్ʻ ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి ʻటెంత్ క్లాస్ʻ రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. ʻకౌముదిʻ లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ ʻటెంత్ క్లాస్ʻ అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని ʻకౌముదిʻ ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# దామరాజు నాగలక్ష్మి

మా వూరు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం. నా చిన్నప్పటి నుంచి డిగ్రీ వరకు నా చదువు అక్కడే పూర్తయింది. ఈ పది తరగతులలోపు ఎన్నో రకాల అనుభవాలు, చిలిపి చేష్టలు, ఆటలు, పాటలు చెప్పాలంటే చాలా వున్నాయి. నేను 1 నుండి 4 వరకు మున్సిపల్

స్కూల్ లో చదివాను. తరవాత ఇల్లు మారడంతో బోర్డుస్కూలు అని అందులో 1 నుంచి 7వరకు వుండేది. నన్ను మా నాన్నగారు 5వ తరగతి అక్కడ చేర్పించారు. మా చెల్లెలు ప్రభావతిని 3వ తరగతిలో చేర్పించారు. నాకు 5వతరగతి అవ్వగానే మా అక్కలు చదివే గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూలో చేరదామనుకున్నాను. నా పై అక్క ఉమ నన్ను ఆ స్కూలుకి తీసుకెళ్లి చూపించింది. దారిలో వాళ్ళు వెళ్ళేటప్పుడు ఎలా నడిచేవారో, ఎలా అల్లరి చేసేవారో చెప్పింది. నేను కూడా చాలా ఉత్సాహ పడ్డాను. పిల్లలందరితో చెప్పేశాను. మర్నాడు ఆ స్కూలులో చేరదామనుకున్నాను. సర్టిఫికెట్ కూడా ఇస్తామన్నారు. కానీ మా నాన్నగారు వద్దన్నారని మా మాస్టారు చెప్పారు. "ఏం ఎందుకని నాన్నా వద్దన్నావుట?" అని అడిగాను. నా తరవాత చెల్లెలు ప్రభావతి చిన్నపిల్ల ఒక్కత్తీ స్కూలుకి వెడుతుందని, దానికి సాయం వుండాలని వద్దన్నాను అన్నారు. చాలా నిరాశపడ్డాను. కానీ తప్పదుగా మళ్ళీ అలవాటు పడిపోయాను.

మా వూళ్ళో ఒక గవర్నమెంట్ గరల్స్ హైస్కూలు, ఒక జెడ్.పి.హెచ్ స్కూలు వుండేవి. మా అక్కలు ముగ్గురూ ఆ స్కూలులోనే చదువు హైస్కూలు పూర్తి చేశారు. వంశపారంపర్యంగా నేను, మా చెల్లెలు ప్రభావతి కూడా అదే స్కూలులో చేరాం. మేము స్కూలులో చేరే సమయానికి రంగమ్మారెడ్డిగారని ఒక హెడ్మిస్ట్రస్ వుండేవారు. ఆవిడ ఎక్కువరోజులు లేరు. తరవాత పీటర్ సన్ అని క్రిస్టియన్ హెడ్మిస్ట్రస్ వచ్చారు. ఆవిడ చాలా ప్రేమగా, అభిమానంగా వుండేవారు. మాకు ఇంగ్లీషు క్లాసుకి ఆవిడే వచ్చేవారు. మా క్లాసులో నేను, రాజ్యలక్ష్మి, సరస్వతి, బేబీ సరోజిని మంచి మిత్రులుగా వుండేవాళ్ళం. కొంచెం క్లాసులో యాక్టివ్ గా వుండేవాళ్ళం. ఆవిడకి మేమంటే చాలా ఇష్టంగా వుండేది.

మమ్మల్ని దగ్గరుండి రెండుమూడు కాంపిటీషన్స్ కి కూడా తీసుకెళ్ళారు. ఏదైనా పని చెప్పాలంటే మాకే చెప్పేవారు. ఒకసారి స్కూలు యాన్యువల్ డేకి మా చేత పోస్ట్ మాన్ అని ఇంగ్లీషు నాటకం వేయించారు. ఆ నాటకంలో సరస్వతి పోస్ట్ మాన్. నేను ఆఫీసులో క్లర్క్, రాజ్యలక్ష్మి పోస్టు మాస్టర్. అయితే స్టేజి మీద ఎక్కి దగ్గర నుంచి సరస్వతి నా డైలాగ్స్ తను చెప్పేది. నేనేమో "అది నీది కాదు నాది" అనేదాన్ని. "అయితే నేనేం చెప్పాలి చెప్పు" అంది. "నేనేమో నువ్వు వచ్చి లెటర్స్ తీసుకుని వెళ్ళడమే. నువ్వెందుకు నా డైలాగ్స్ చెప్తావు?" అన్నాను. ఇదంతా మైక్ మూసి చెప్పాలని మాకు తెలీదు. అందరూ నవ్వుతుంటే ఎందుకు నవ్వుతున్నారో మాకు అర్థం కాలేదు. పోస్ట్ మాస్టర్ రాజ్యలక్ష్మి తల పట్టుకుని కూర్చుంది. ఇంక మా మేడమ్ సైగ చేస్తే మళ్ళీ ఎవరి డైలాగ్స్ వాళ్ళు చెప్పాము. మొత్తానికి నాటకం సుఖాంతం అయ్యింది. తలుచుకుంటే బాగా నవ్వు వస్తుంది.

మాకు మాథ్స్ కి మస్తాన్ రావుగారని మాస్టారు వుండేవారు. ఆయన చాలా బాగా చెప్పేవారు. అయితే పరీక్షలు దగ్గరికి వస్తున్నాయని అందరిచేతా సమ్స్ చేయిస్తున్నారు. క్లాసంతా చాలా నిశ్శబ్దంగా లెక్కలతో కుస్తీపడుతున్నారు. నేనూ సరసస్వతి ఒక బెంచీలో కూచుని సమ్స్ చేస్తున్నాము. తను ఉన్నట్టుండి **...పాండవులు పాండవులు తుమ్మెద...** అని గట్టిగా పాడేసింది. లెక్కకి ఆన్సర్ వచ్చేసిందిట. నేను ఒక్కసారి ఉలిక్కిపడి గట్టిగా నవ్వేసాను. తను కూడా నవ్వింది. అందరూ పని మానేసి మావంకే చూస్తున్నారు. మా మస్టారు"ఇద్దరూ నుంచోండి" అన్నారు. కారణం చెప్తుంటే కూడా వినలేదు. క్లాసయ్యేవరకూ గంటసేపు నుంచునే లెక్కలు చేశాము. ఈ పాట విన్నప్పుడల్లా అది గుర్తు వచ్చి నవ్వువస్తుంది.

మా హెచ్.ఎమ్. మా టెన్త్ పూర్తయ్యే లోపునే రిటైర్ అయ్యి వెళ్ళిపోయారు. కానీ ఆవిడ మా మీద అభిమానంతో మాకు ప్రతి లెసన్ కి నోట్స్ ప్రిపేర్ చేసి పంపించారు. మేము ఆవిడ ఇచ్చిన నోట్స్ ప్రిపేర్ అయ్యి ఎగ్జామ్స్ రాశాము.

మా హిందీ టీచర్ కృష్ణవేణిగారు హిందీ లెసన్స్ బాగా చెప్పేవారు. ఆవిడకి దేశభక్తి ఎక్కువ. ఆవిడ శివాజీ పాఠం ఆవేశంగా చెప్తున్నారు. అంతేకాకుండా వాళ్ళు చైనా యుద్ధమప్పుడు మన వాళ్ళకి కొంతమందికి భోజనం అవీ తీసుకెళ్ళి ఇచ్చి చాలా సాయం చేశామనిచెప్పారు. చైనా యుద్ధం గురించి ఆవిడ చెప్తుంటే మేమందరం పిన్ డ్రాప్ సైలెన్స్ తో విన్నాం.

మా స్కూలులో ఏన్యువల్ దేకి కాంపిటీషన్స్ పెట్టేవారు. అయితే రన్నింగ్ రేస్, నీడిల్ అండ్ థ్రెడ్, మ్యూజికల్ ఛైర్స్ మొదలైన ఆటలన్నింటిలోనూ పేరు ఇచ్చాను. ఇక్కడ ఒక సంగతి తెలుసా. అందులో పార్టిసిపేట్ చేసినవాళ్లందరూ నాకన్నా పెద్దవాళ్ళు, పొడుగు వాళ్ళు. నేను చాలా చిన్నపిల్లలా పొట్టిగా వుండేదాన్ని. తీరా కాంపిటీషన్ మొదలైంది. వాళ్ళు పొడుగు కదా నేను నేను రెండు అడుగులు పరిగెత్తేసరికి, వాళ్లు నాలుగు అడుగులు పరిగెత్తేవారు. ఓడిపోయాను. కానీ నేను ఎక్కడి కెళ్ళినా మ్యూజికల్ ఛైర్స్ లో ఫస్టే. కుర్చీ నాదే. మా పిల్లలకి కూడా అదే చెప్తాను. కుర్చీ మీద దృష్టి పెట్టమని. వాళ్లూ నన్ను ఫాలో అవుతున్నారు.

మాకు టెన్త్ క్లాస్ లో ఫేర్ వెల్ పార్టీ ఇచ్చారు. మస్తాన్ రావుగారి తరవాత మాకు ఒక మాథ్స్ టీచర్ వచ్చారు. మా క్లాస్ లో కొంతమంది అల్లరి చిల్లరగా వుండే అమ్మాయిలు వుండేవారు. అందుకని మాథ్స్ టీచర్, మా సైన్స్ టీచర్ ఇద్దరికీ ఆ పార్టీకి రావడం ఇష్టం లేక రాలేదు. ఎంత బతిమాలినా రాలేదు. మా హెడ్ మాస్టారు, మా తెలుగు టీచరు గారు, మా సైన్సు టీచరుగారు, మా సోషల్ మాస్టారు మాత్రమే మా పార్టీకి వచ్చారు.

సరే స్కూలులో పోర్షన్ లు అయిపోయాయి. ఎగ్జామ్స్ మొదలయ్యాయి. చదువుకుంటున్నాం. మా యింటిదగ్గర యద్దనపూడి వాళ్ళ ఇంట్లో ఏదో హడావిడి వినిపిస్తోంది. ఏంటో అనుకుని వెడితే వాళ్ల పెద్దమ్మాయి భాగ్యలక్ష్మి అమ్మవారి వేషం వేసుకుని ఒంటినిండా నగలన్నీ దిగేసుకుని కూర్చుంది. చుట్టూరా చాలా కొబ్బరి కాయలు కొట్టి ఉన్నాయి. ఏమిటో అనుకుంటే "నేను అమ్మవారిని నాకు అందరూ దణ్ణం పెట్టండి. కొబ్బరి కాయలు కొట్టండి. నేను విజయవాడ కనక దుర్గని" అని అందరిమీదా అరుస్తోంది. ఇదే సందు కదాని నేను, వాళ్ళ చెల్లెలు సరస్వతి కలిసి టెన్త్ క్లాస్ పుస్తకాలన్నీ పట్టుకుపోయి ఆవిడ కాళ్ళ దగ్గిర పెట్టి, ఇద్దరం చెరో కొబ్బరికాయ కొట్టి రెండు చేతులూ జోడించి " అమ్మా మాకు అన్ని పుస్తకాల్లో ఇంపార్టెంట్ క్వశ్చన్స్ చెప్పు టిక్ పెట్టుకుని మేము అవే చదువుకుని పరీక్షలు రాస్తాము" అన్నాము. వెంటనే ఒక అరుపు అరిచి"నేను కనకదుర్గని అని చెప్పానుగా, నేను సరస్వతీ దేవిని కాదు." అంది.

అంతే పుస్తకాలు తీసుకుని ఒకటే పరుగు. మొత్తానికి పరీక్షలన్నీ బాగానే రాశాం. టెన్త్ పాసయిపోయాం.

ఆ తరవాత ఆ అమ్మాయికి ఏదో దయ్యం పట్టిందని, ధూళి తగిలిందని నానా తిప్పలు పడి మొత్తానికి మామూలు మనిషిని చేశారు.

# టెంత్ క్లాస్ - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# ఆనందరావ్ పట్నాయక్

**పచ్చని చీర కట్టుకుని ప్రకృతి కన్య** పలకరిస్తుంటే మా వాహనం ముందుకు పోతోంది. ఫ్రంట్ సీట్లో డ్రైవరుతో పాటు నేనూ, నా క్లాసుమేట్ మన్మథరావు కూచుని ఉన్నాం. సాయంత్రం కావొస్తోంది. సూరీడు పడమటింట పరుగెత్తి పడిపోయాడు. దెబ్బ తగిలి ఎర్రని రక్తం కారి నలుదిశలా పాకినట్లు అరుణారుణ కాంతులు ఆకాశం నిండా అలుముకొన్నాయి.



అది 1964వ సంవత్సరం, మార్చి నెల. మా ఊరిపేరు రాయగడ. ఒడిశా రాష్ట్రంలో ఒక మోస్తరు పట్టణం. అంతవరకు సజావుగా ఏటా మెట్రిక్యులేషను పరీక్షలు మా జి.సి.డి హైస్కూల్లో జరుగుతుండేవి. కానీ కాపీలు నిరోధించేందుకుగాను ప్రభుత్వం పరీక్షా కేంద్రాలను మార్చింది ఆ ఏడాదినుంచే. ఫలితంగా మాకు గుణుపూర్ టౌను హైస్కూలు ఎగ్జామ్ సెంటరు అయింది. రాయగడకి సుమారు నూరు కిలోమీటర్ల దూరాన ఉంది గుణుపూర్. అప్పటికింకా ఇప్పుడున్న ఘాట్‌రోడ్డు తయారుకాలేదు. ఒక బస్సు రాయగడ నుండి బయలుదేరి గుణుపూర్ మధ్యాహ్నంకల్లా చేరుకుని తిరిగి రాత్రికి రాయగడ చేరుకునేది. బస్సు టికెట్ వెల మూడురూపాయలు. ఆ సొమ్ముని మిగుల్చుకునేందుకు నేను, నా మిత్రుడు లారీలో రెండురోజులు ముందుగా బయల్దేరాం. మన్మధరావు లక్షాధికారి బిడ్డ. వాళ్ళకు రైసుమిల్లు ఉండేది. గుణుపూర్ నుండి ధాన్యం తెచ్చేందుకు వాళ్ళ ట్రక్కు బయల్దేరడంతో మేమూ అందులోనే ప్రయాణించాం.

సత్రంలో మా బస. విద్యుత్ సదుపాయం లేదక్కడ. పెట్రోమాక్సు లైటు సంపాదించి లేట్‌నైటు వరకు చదువుకునేవాళ్ళం. మాకు ఎస్కార్ట్‌గా మా క్లాసు టీచరు పంతుల శ్రీరామశాస్త్రిగారు వచ్చారు. ఆయన మాకు సైన్స్ మాష్టారు. సిగరెట్స్ తెగ కాలుస్తూ ఉండేవారు. ఆ మర్నాడు దిగింది కిష్కింద మూక. లక్ష్మణ, రాఘవ, కృష్ణ, రామచంద్రరాజు, దుక్క ప్రకాష్, పొడుగు ప్రకాష్, వెంకట్, రామస్వామి తదితరులు. జీవితంలో మొదటిసారి జన్మభూమి విడిచి కుటుంబసభ్యుల తోడు లేకుండా వచ్చాం. పొద్దున్నే సూర్యోదయం కాకముందే లేచి వంశధార నదికి వచ్చేవాళ్ళం. పరుగెడుతున్న నీరు వెచ్చగా ఉండేది. నీటిలో కేరింతలు కొడుతూ, ఇసుకలో పరుగెడుతూ సరిగంగ స్నానాలు చేసేవాళ్ళం. కన్నవారుంటే ఎంత కట్టడి చేసేవాళ్ళు!

హోటల్‌లో టిఫిను చేసి పరీక్ష హాలుకి వెళ్ళాం. ఇడ్లీప్లేటు ఖరీదు అణా. ఉల్లి చట్నీ, కొబ్బరి చట్నీలతో పాటు రెండు పెద్ద పెద్ద తెల్లని ఇడ్లీలు తినేస్తే చాలు కడుపు నిండిపోయేది. మొదటి సిట్టింగు పరీక్ష రాసి లంచ్‌కి కంజాక్షి హోటల్‌కి వెళ్ళాం. అన్నం, పప్పు, ఏటిచేపల కూర, సాదా కూర, బంగాళదుంపల వేపుడు, అప్పడం - మెనూ. వెల చెపితే నమ్మరు. అర్ధరూపాయి మాత్రమే. ఓనరు పేరు వినడానికి తమాషాగా ఉండేది - పద్మం వంటి కన్నులుగలవాడని అర్థం, కానీ మిడిగుడ్లు వేసుకుని జడుసుకునేటట్లు ఉండేవాడు. రాత్రికి అలానే కోడిగుడ్డు కూరతో, ఆలూ కుర్మాతో పరోటాలకి అర్ధరూపాయి ఛార్జి.

మర్నాడు ఉదయాన్నే సత్రం మేడమీద బ్రష్ చేస్తున్నాం. ప్రకాష్‌ద్వయం మా దగ్గరకు వచ్చి ఒక సీను చూపించాడు. దూరాన గోడచాటున ఒక మగ, ఆడ జంట మాట్లాడుకుంటున్నారు.

'బేరం సెటిలయిపోయినట్లుంది. ఈ రాత్రికి పండగే' అన్నాడు దుక్క ప్రకాష్ అప్పటికే వాడు దేశముదురు. వాడు అన్నమాటలకి అర్థం నాకు పదేళ్ళ తర్వాత తెలిసింది.

ఆరోజు శనివారం పరీక్ష వేగంగా ముగించుకుని కంజాక్షి హోటల్‌కి వచ్చాం. ఆజాద్ కూచుని ఉన్నాడు. వాడి ముందున్న టేబుల్ మీద పూరీల దొంతర ఉంది. ఆలూ, ఉల్లిపాయల కూర నిండుగా ఉన్న గిన్నె ఉంది. నింపాదిగా ఆరగిస్తున్నాడు. వాళ్ళ నాన్న స్వాతంత్ర్య సమరయోధుడు. కొడుక్కి దేశభక్తుడి పేరు పెట్టుకున్నాడాయన. మా చంద్రశేఖర్ కూడా అలుపెరుగని అజాత శత్రువు. గత రెండేళ్ళుగా అదే క్లాసు కొనసాగిస్తున్నాడు. బహుశా వచ్చే ఏడాదికూడా మా తమ్ముడితో మెట్రిక్యులేషన్ పరీక్ష ఇచ్చేందుకు రావచ్చు.

మా క్లాసుమేట్స్‌లోని ఆడపిల్లలు లీల, లైలా, ఝూన్సీ, జానకి తదితరులు కూడా పరీక్షలకు హాజరయ్యేవారు. తర్వాత ఎలా రాసామో చర్చించుకునేవాళ్ళం. ఈర్ష్యాద్వేషాలు లేని తెల్లకాగితంలాంటి జీవితాలు మావి. మాకు ట్యూటరుగా ఉండే గంగాధరం మాష్టారుకూడా గుణపూర్ వచ్చి మా యోగక్షేమాలు విచారించేవారు. ఇప్పుడేవీ ఆ ఆదరణ ఆప్యాయతలు.!? అంతా యాంత్రికం, చదువు 'కొనడం' పెద్ద వ్యాపారం అయిపోయింది నేడు కార్పొరేటు స్కూళ్ళమూలాన.

పరీక్షలయిపోయాయి. పెద్ద రిలీఫ్. మన్మథరావు చెల్లాయికి పెళ్ళి. గుణపూర్‌లోనే. వివాహానికి 'ఆహ్వానం' అందినా అబ్బే.. జననీ, జన్మభూమి దగ్గరకు వెళ్ళిపోదామన్న ఆరాటం మమ్మల్ని మధ్యాహ్నం బస్సులో వెళ్ళేటట్లు చేసింది. ప్రకాష్ ద్వయం వాళ్ళ లగేజ్ కాకుండా ఎక్స్‌ట్రా పట్టుకొస్తున్నారు.

'ఏంట్రరా ఎర్రినాయనలూ! ఆ మూట?' అని అడిగితే

'కలక్టరు మామిడికాయలు' అని గుసగుసగా చెప్పారు. అవి తెలుగు పండిట్‌గారికి అని తెలిసింది. ప్రకాష ద్వయం షావుకార్ల పిల్లలు. వాళ్ళకి డబ్బుంది కానీ మేధలేదు. వాళ్ళబలహీతని క్యాష్ చేసుకున్నారు గురువుగారు. పరీక్షలయిన తర్వాత ఆన్సరు పేపర్సు వెళ్ళిన చోటుకి తను స్వయంగా వెళ్ళి పాసుమార్కులు వేయించి పరీక్ష గట్టెక్కేటట్టు చేస్తానని కూడా హామీ ఇచ్చాడాయన. ఇంకేం బస్సు ఛార్జీలకు డబ్బు, ఆవకాయ పెట్టేందుకు పప్పునూనె, ఎండుమిర్చి ఆవాలు ఇచ్చి వచ్చారు. తెలుగు మాష్టారిగారికి తనుంటున్న ఇల్లు కాకుండా మరో అరడజను ఇల్లుండటం గమనార్హం. కానీ జీవిత శేషమంతా దుక్క ప్రకాష్ పచారీకొట్టులో ఉప్పు, పప్పులు అమ్ముకుంటూ, పొడుగు ప్రకాష్ దుకాణాల్లో పద్దులు రాస్తూ గడపడం నాకు తెలుసు. మేరా భారత్ మహాన్!!

రాయగడ రాత్రికి చేరుకున్నాం. అమ్మ పెట్టిన కమ్మని భోజనం కడుపారా ఆరగించి గుణుపూరు పట్టణం విశేషాలు చెప్పనారంభించాను. కుటుంబ సభ్యులందరూ చెవులప్పగించి శ్రద్ధగా విన్నారు. నేనేదో విదేశాలకి వెళ్ళి వచ్చినట్లు వాళ్ళు అనుకుంటున్నట్లనిపించి కాస్త బడాయిగా అనిపించింది. ఉన్న ఊర్లో పరీక్ష రాసి ఉంటే ఆ వి.ఐ.పి ట్రీట్‌మెంటు దొరక్కపోను కదా!

మర్నాడు మా హెడ్మాష్టరు పి.వి.రత్నంగారింటికి వెళ్ళాను. ఆయన కవి, పండితుడు, పరిపాలనా దక్షుడు. ప్రశ్నాపత్రాలు చూసి ఎలా రాసానో అడిగి నాకు సెకండు డివిజను వస్తుందని చెప్పారు. ఫస్ట్ డివిజనుకి దూరమయినందుకు బాధ ఆయన మొహంలో ప్రస్ఫుటంగా కనిపించి. రిజల్ట్స్ వచ్చాయి. మెట్రిక్యులేషనులో మావి రెండు సెక్షన్స్. 'ఏ' సెక్షను ఒరియా విద్యార్థులది, 'బి'సెక్షను తెలుగు విద్యార్థులది. మా సెక్షనులో నేనొక్కడినే సెకండు డివిజను సాధించాను. అప్పట్లో అదొక పెద్ద విజయం.

ఆ సంవత్సరమే గుమాస్తా ఉద్యోగంలో చేరాను. నైటు కాలేజీలో బి.ఎ.ఎల్.ఎల్.బి చదివి, డిపార్ట్‌మెంటు పరీక్షలన్నీ పాసయి గ్రిడ్ కార్పొరేషను ఆఫ్ ఒడిశాలో అంచెలంచెలుగా ఫైనాన్సు మానేజరుగా ఎదిగాను. పదేళ్ళ క్రితం రిటైరయి పెన్నుని గన్‌గా చేసుకుని తెలుగు పాఠకుల మీద నా రచనల తూటాలు వదులుతూ ఉంటుంటాను. ఎందుకంటే తెలుగువాళ్ళకు సహనం జాస్తి. కౌముది సంపాదకులకయితే మరీ జాస్తి.

# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే `టెంత్ క్లాస్` ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి `టెంత్ క్లాస్` రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. `కౌముది` లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ `టెంత్ క్లాస్` అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని `కౌముది` ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

# ఉషారాణి మా తుంపాటి

**నల్గొండ జిల్లాలోని కోదాడ** (ఇప్పుడు మండలం అయ్యింది) మా ఊరు. ఊరు అనేకంటే చిన్న టౌను అనొచ్చు. నిజానికి కోదాడ దగ్గర (ఎనిమిది మైళ్ళ దూరం)లో ఉన్న, త్రిపురవరం అనే గ్రామం మాది. మా హైస్కూల్ చదువులకోసం నాన్న, కుటుంబాన్ని కోదాడకి మార్చారు. మేము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నాము. ఇప్పుడు దాన్ని బాలుర ఉన్నత పాఠశాల (ZPHS for Boys, KODAD) గా మార్చారు. బాలికల పాఠశాల వేరేప్రదేశానికి మార్చారు(ట)

విశాలమైన ప్రాంగణంలో 'U' ఆకారంలో ఉండేది పాఠశాల భవనం. పెద్ద, పెద్ద క్లాసు రూములు మంచి గాలి వెలుతురుతో, విశాలమైన లాబొరేటరీ, డ్రాయింగ్ రూమ్, క్రాఫ్ట్ రూమ్, లైబ్రరీ ఉండేవి. మాస్కూల్‌లో ఉన్న లాబొరేటరీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిందే అంత పెద్ద లాబ్, ఈ రోజుల్లో జూనియర్ కాలేజీల్లో కూడా ఉండవు. పొడవుగా, విశాలంగా ఉన్న గదిలో, మధ్యన పొడవాటి బల్ల, ఒక చివరన డయాస్, గోడకి పెద్ద బ్లాక్ బోర్డ్, అన్ని వైపులా పెద్ద కిటికీలు, గోడలకి సైన్సు పాఠాలకి సంబందించిన చార్టులు, ఒక గోడ పొడవునా గ్లాస్ డోర్స్‌తో పెద్ద అలమరలు వాటినిండా గాజు సీసాలలో భద్రపరిచిన స్పెసిమన్స్, రసాయన పదార్థాలు గాజు కుప్పెలు, ఇతర పరికరాలూ భద్రపరచి ఉండేవి. మానవ పిండాలు, జంతువుల మెదడు ,కాలేయము ఇతర అవయవాలు, రకరకాల పాములు ఉండేవి స్పెసిమన్ జార్స్‌లో. అస్తిపంజరం, ఎముకలు, పుర్రె కూడా ఉండేవి. మాకు పదవతరగతిలోనే వానపాము, బొద్దింక, కప్ప మొదలైన ప్రాణుల నాడీ, జీర్ణవ్యవస్థలను ప్రాక్టికల్‌గా (డిసెక్షన్ చేసి) చూపించారు ఆరోజుల్లో. మాకు సైన్సు పాఠాలు బోధించే మాష్టారు పాండురంగారావుగారు చాలా స్ట్రిక్ట్. కేవలం తొమ్మిది, పదవ తరగతులకి మాత్రమే ఆయన చెప్పేవారు పాఠాలు అద్భుతంగా బోధించేవారు,



చదివించడంలో కూడా అంతే స్ట్రిక్ట్‌గా ఉండేవారు. ఫార్ములాలు, ప్రశ్నలకి జవాబులు ఏరోజు చెప్పినవి ఆరోజే అప్పచెప్పాలి. అందర్నీ ఆయన ఒక్కరే చూడలేరు కాబట్టి, క్లాసు లీడర్స్ ఉండేవారు. బాగా చదివే నలుగురైదుగుర్ని లీడర్లుగా ఉంచి, క్లాసులోని మిగిలిన పిల్లల్ని ఒక్కొక్కరికి పది, పదిహేను మందిని అప్పచెప్పించుకోమని పురమాయించేవారు. పాఠం అప్పచెప్పేవరకూ ఎండలో నిలబడి చదవాలి. క్లాసురూముల బయట పొడవైన వరండా, ఎత్తుగా ఉండేది. అక్కడ లీడర్ నిలబడితే, కింద పెద్దలైన్లో పాఠం రాని పిల్లలు. నేను పొడుగ్గా ఉంటానని నాకు వెనక బెంచీల్లోని మొద్దుల బాచీని అప్పగించేవారు మాష్టార్లు. వాళ్ళు తొందరగా నేర్చుకోరు. వారివల్ల నేనూ పీరియడ్ అంతా ఎండలోనే ఉండాల్సి వచ్చేది. ఒకసారి ఎండకి కళ్ళు తిరిగి పడిపోయాను. దాంతో మా హెడ్మాష్టారుగారు "పాపం బాగా చదివే అమ్మాయికి పనిష్మెంటు ఎందుకండీ..? తను లోపల నీడకి కూర్చుంటుంది. ఈ వెధవలు పాఠం నేర్చుకుని తనకి అప్పచెప్పేస్తారులెండి. ఆడపిల్లల్ని ఎండలో నిలబెట్టకండి" అని గట్టిగా చెప్పేశారు. ఆ తరువాత అలాగే చేసేవాళ్ళం.

మరోసారి లాబ్‌లో "సల్ఫ్యూరిక్ యాసిడ్" తయారీ చూపించారు పాండురంగారావు సార్. దాని లక్షణాలను వివరిస్తూ దీనికి కాల్చేగుణం ఉంది, అత్యంత ప్రమాదకరమైనది అని చెప్తూ, ఒక బీకర్లో కొద్దిగా యాసిడ్ పోసి, దానికి కొద్దిగా నీళ్ళు కలిపి, "డైల్యూట్ చేసాను. ఎవరైనా ముందుకు రండి. చేతిమీద పోస్తాను. కొద్దిగా చురుక్కుమంటుంది అంతే" అన్నారు. ఎవ్వరూ ముందుకు రాలేదు భయంతో. నేను ముందుకు వచ్చి "నేను రెడీ సార్" అన్నాను. సరే అని నా ఎడమచేతి బొటనవేలి మీద యాసిడ్ పోసారు. అది ఎక్కువగా డైల్యూట్ అవకపోవడం మూలంగా, వేలు బాగా కాలి బొబ్బ వచ్చింది. వెంటనే నీళ్ళు పోసినా కాలిన మచ్చ శాశ్వతంగా నా బొటనవేలిమీద నిలిచిపోయింది. తరువాత అటువంటి ప్రమాదకర ప్రయోగాలు, పిల్లల మీద ప్రయోగించరాదని, హెడ్‌మాష్టరుగారు ఆయనకు వార్నింగ్ ఇచ్చారట. అదే ఈరోజుల్లో అయితే స్కూల్ మీద, మాష్టారు మీదా కేసు పెట్టేవారేమో?

మాకు లెక్కలు చెప్పే మాష్టారు వెంకయ్యగారు. ఎంతో ప్రేమగా ఉండేవారు. చాలా ఓపికగా అర్థం అయ్యేలా విపులంగా నేర్పించేవారు. ఇంగ్లీషు ప్రకాశం సారు, తెలుగు గుర్నాథంగారు, హిందీ యూసఫ్ సార్, బయాలజీ ఇక్బాల్ సార్, సోషల్‌లో చరిత్ర కృష్ణారావు సార్, భూగోళం మా హెడ్మాష్టారు లక్ష్మీనారాయణగారూ చెప్పేవారు. అందరూ ఉద్దండులే. డ్రిల్ మాష్టారు వెంకటరెడ్డిగారు,

విశాలంగా ఉన్న మైదానంలో, అన్ని ఆటలూ ఆడించేవారు. నేను వాలీబాల్, ఖోఖో, టెనీ కాయిట్ బాగా ఆడేదాన్ని. మా డ్రాయింగ్ మాష్టారి పేరు వెంకటాచారిగారు. బొమ్మలు అద్భుతంగా వేసేవారు. క్రాఫ్ట్ సార్ సాయిలుగారు నవ్వారు నేయించేవారు. ఎవరు నేసిన ముక్క మీద వాళ్ళ పేరు రాసుకునే వాళ్ళం క్లాసు సెక్షన్‌తో సహా.

మా స్కూల్లో కల్చర్ యాక్టివిటీస్ కూడా బాగా జరిగేవి, డ్రామాలు, డాన్సులు, దేశభక్తిగీతాలు అన్నిటిలోనూ పాల్గొనేదాన్ని. "జయ జయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి" పాటంటే నాకు చాలా ఇష్టం. బాగా పాడేదాన్ని కూడా.

పదవ తరగతిలో ఉన్నప్పుడే నేను రాసిన ఒక ఆర్టికల్ ఈనాడు దినపత్రికలో, నా ఫొటోతో సహా వచ్చింది. మా వెంకయ్య సార్, ఆ పేపరు అన్ని క్లాసులకి తిరిగి చూపిస్తూ మన ఉషారాణి రాసిన వ్యాసం ఇందులో వచ్చిందని గర్వంగా చెప్పారు. మర్నాడు అసెంబ్లీలో నాకు ప్రత్యేక అభినందనలు కరతాళధ్వనుల ద్వారా ఇప్పించారు.

ఒకరోజు "ఉషారాణి హెడ్మాష్టార్ పిలుస్తుండు" అని ప్యూన్ వెంకటయ్య పదవతరగతి బి సెక్షన్‌కి వచ్చి పిలిచాడు.

మా క్లాసులో ఇద్దరు ఉషారాణిలు. ఒకరు నేను అంటే కె. ఉషారాణి, మరొకరు వై. ఉషారాణి. అది ఎప్పుడూ డుమ్మాలు కొడుతూ, అన్ని సబ్జెక్ట్స్‌లో ఫెయిల్ అవుతూ ఉంటుంది. హెచ్.ఎమ్ గారు పిలిచారంటే నన్నెందుకు పిలుస్తారు అనే పొగరు.

"నిన్నే.. వెళ్ళు" అని వై.ఉషని తరిమాను.

అది భయంగానే వెళ్ళి రెండు నిముషాలలో తిరిగొచ్చి, "నన్నుకాదు సార్ పిలిచింది, నిన్నే" అని వెక్కిరించింది.

"నన్నా? ఎందుకబ్బా? నిన్న సినిమా హాల్లో చూసారా ఏం?" అని టెన్షన్. తీరా వెళ్ళేసరికి అనుకున్నంతా అయ్యింది.

హెచెఎమ్ సారుతోపాటు కృష్ణారావుసారు కూడా ఉన్నారు. నిన్న సినిమా హాల్లో ఆయన నన్ను చూసారు. భయంతో నాలుక పిడచకట్టి, బయట నించున్నా. నన్ను చూసి లోపలికి రమ్మన్నారు. కృష్ణారావు సార్ (మా బంధువు కూడాను) "ఉషా, నాన్న ఉన్నారా?" అన్నారు.

"లేరు సర్, హైదరాబాద్ వెళ్ళారు రాత్రి" అన్నాను.

"ఎప్పుడు వస్తారు?"

"తెలియదు సార్ నాలుగురోజులు అవుతుందేమో" అన్నాను.

"సరే నువ్వు వెళ్ళు" అన్నారు.



ఎందుకు పిలిచారో అర్థంకాలేదు. ఆ సాయంత్రం మా రెండో అన్నయ్య ఇంటికి వచ్చి తిట్టేవరకు ..."800 రూపాయలు చేదా? నాన్నలేకపోతే ఏం? పెద్దన్నయ్య వచ్చేవాడు సంతకం పెట్టడానికి. వెంకయ్య సార్ చెప్పారు ఈరోజే ఆఖరు తేదీ అట, వెనక్కు పంపించేసారట" అది 7,8,9 తరగతుల్లో వచ్చిన మార్కులకి స్కాలర్ షిప్ అన్నమాట. తెలియకుండానే డబ్బులు రావడం, పోవడం అయ్యింది ప్రాప్తం లేక.

ఆ రోజుల్లో పది ఇరవై పైసలు పావలా దొరకడం మహాకష్టంగా ఉండేది. ఎప్పుడైనా అమ్మ చిల్లర డబ్బులు ఇస్తే, ఇంటర్వెల్‌లో స్కూల్ వెనుక కొద్దిదూరంలో ఉన్న మిఠాయి కొట్టుకి పరుగెత్తేదాన్ని. అక్కడ 'దాల్‌మోడ్', (నానబెట్టి వేయించిన పచ్చి శనగపప్పు),

'టమోటా' అనే స్వీట్ కొనుక్కునేదాన్ని. ఒక్క టమోటా పావలా ఉండేది. ఎర్రగా అచ్చు టమోటాలాగే ఉండేది. లోపలంతా తియ్యగా పంచదార పాకం. అసలు లోపలకి ఆ పాకం ఎలా వెళ్ళిందా అని ఆశ్చర్యం. నేను తరువాత అలాంటి స్వీట్ ఎక్కడా చూడలేదు, తినలేదు కూడా. కంపాస్ బాక్స్‌లో వేయించిన పల్లీలు, కారప్పుస, మురుకులు పోసి తెచ్చే ఫ్రెండ్స్ ఉండేవాళ్ళు. నోరు మెదపకుండా భలే తినేవాళ్ళం, కానీ సౌండ్ ఎక్కడినుండి వస్తుందో ఎవ్వరికీ తెలిసేదికాదు.

పరీక్షలు రాసేటప్పుడు అందరికీ సహాయం చేసేదాన్ని. నన్ను అడగని వారిదే పాపం. మొత్తం పేపర్ చూపించేదాన్ని. అది గమనించిన మాష్టార్లు నన్ను దూరంగా, విడిగా కూర్చోపెట్టేవారు. బంగారు బాల్యం పాఠశాలలో చదువుకున్న రోజులు అత్యంత మధురం. 1976లో పదవతరగతి మొదటి శ్రేణిలో 68శాతంతో ఉత్తీర్ణత పొందటం ఆ రోజుల్లో విశేషమే.



నా పేరు నూతులపాటి ఉషారాణి . మావారి పేరు నూతులపాటి కృష్ణారావు . మాకు ఇద్దరు పిల్లలు అమ్మాయి , అబ్బాయి . మా నాన్న గారి పేరు కొమరగిరి వెంకట లక్ష్మీ నరసింహారావు . మా అమ్మ గారి పేరు సులోచనా దేవి . నేను M .A Bed చేసి , కాలేజీ లెక్చరర్ గా , స్కూల్ ప్రిన్సిపాల్ గా పనిచేసాను . స్వల్ప అనారోగ్యం వల్ల జాబ్ మానేసాను . ఇప్పుడిపుడే రచనా వ్యాసాంగం మొదలుపెట్టాను . చిత్ర సచిత్ర మాసపత్రికలో నా వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. అచ్చంగాతెలుగు , సారంగ వెబ్ మాగజైన్లలో కూడా నా రచనలు ప్రచురింపబడ్డాయి .

# టెంత్ క్లాస్


## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

*సాయిభాస్కర్ అంకరాజు*



**నేను 1958వ** సంవత్సరం కేశవ స్మారక ఉన్నత విద్యాలయం, హైదరాబాదులో పదవ తరగతి చదివాను. ఖండేరావు కులకర్ణి ప్రధాన ఉపాధ్యాయులు. గంభీరమైన వ్యక్తిత్వం - మృగరాజులా విద్యాలయ ముఖద్వారం వద్ద పచార్లు చేస్తూ ఆలస్యంగా వచ్చేవారిని గుర్తించేవారు. అప్పా కలంకార్ (డ్రిల్ మాష్టారు) మాత్రం పేము బెత్తం పట్టుకుని ఉచిత రీతిలో స్వాగతించేవారు - క్రమశిక్షణకు మారుపేరు ఉన్నత ప్రమాణాలకు మరోపేరు మా విద్యాలయం.

ఖద్దరు దుస్తులతో తెలుగు ఉపాధ్యాయులు నారాయణరావుగారు, ఆంగ్ల వస్త్రధారణతో

సీతాపతిరావుగారు (ఆంగ్ల ఉపాధ్యాయులు) తెల్ల పైజమా, లాల్చీతో హిస్టరీ, జాగ్రఫీ ఉపాధ్యాయులు. భుజంగరావుగారు (పిదప కేంద్రీయ విద్యాలయ సంస్థలో జాయింట్ డైరక్టరుగా పదవీ విరమణ చేసారు), ధోవతి, తెల్లచొక్కాతో హిందీ ఉపాధ్యాయులు ఋషికేశ శర్మగారు, ప్యాంటు, షర్టుతో లెక్కల మాష్టారు డి.వి.శాస్త్రిగారు, మరియు గ్లాస్కో పంచె, లాల్చీ (నెహ్రూ జాకెట్)తో సంస్కృత పండితులు కేశవ ఆర్య శాస్త్రిగారు ఇదీ మా తెలుగు మీడియం ప్రమదగణం.

ఇక తప్పులు చేస్తే సత్కరించే విధానాలు వారి వారి శైలిలో ఉండేవి.



స్కేలుతో ఒకరు కొడితే, డస్టర్ వెనక్కి తిప్పి ఒకరు కొడితే, చెవులు చిల్లులు పడేటట్లు తన వాడైన నరసింహస్వామి గోళ్ళతో గిల్లే ప్రక్రియతో ఒకరు, ఉంగరం వేలుతో మొట్టికాయతో ఒకరు, తొడపాశంతో తనదైన ప్రత్యేక శైలితో ఒకరు ఈ మధుర విన్యాసాలు అనుభవిస్తూ, పది, క్లాసులు పూర్తిచేసాము.

క్లాసుకి క్లాసుకి మధ్య సమయంలో మా లీలలు యధాశక్తి - ఉపాధ్యాయుల్ని అనుకరించడం. మారుపేర్లు పెట్టడం - కొత్తిమీర కట్ట అని ఒకర్ని, లారెల్, హార్డీ అని కొందరిని, నరసింహ స్వామి అని ఒకర్ని గండు పిల్లి అని మరొకర్ని, బృహన్నల అని ఒకర్ని, కొండముచ్చు అని ఒకర్ని - వారి వారి చేష్టల్ని బట్టి, వేషాల్ని బట్టి నామకరణాలు చేసి మురిసిపోయేవాళ్ళం.

లీజర్ పీరియడ్ వస్తే బోర్డు మీద మా ఆస్థాన మిత్ర చిత్రకారునితో వ్యంగ చిత్రాలు (మాష్టార్లవి) వేసి ఆనందించడం మా ప్రవృత్తి. ఒకరోజు ఈ ప్రక్రియలో భాగంగా పట్టుపడ్డాం - విచారణ కమిటీ, నిర్దారణ కమిటీల నివేదికల ఆధారంగా నేనేనని నిర్ధారించి, - దోషిలా నిలబెడితే నా నిర్దోషిత్వాన్ని నిరూపించడానికి నా ఎత్తు సహకరించింది - (ఆ బొమ్మ నాకంటే ఎత్తుగా ఉండడం నన్ను రక్షించింది) పాపం! ఒక పొడుగు విద్యార్థి వైపు నేరం మళ్ళింది - వాడు చతురతతో " నేను అంతసేపు వంగి ఎలా వేస్తాను సార్!" అని తప్పించుకున్నాడు. ఆఖరి అవకాశం ఇచ్చి నిజం చెప్పాలని ఉగ్రరూపంతో అనడంతో శివరావనే విద్యార్థి (నేను వాడికి జామకాయ ఇవ్వలేదనే గత కక్షతో) నేనే వేసానని (పొడుగు పాపారావు నన్ను ఎత్తుకుని వేయించాడని) నిర్ధారించడం రెండు రోజులు గోడకుర్చీ శిక్ష అనుభవించడం తప్పలేదు - కానీ శివరావు మీద కోపం, ప్రతీకారం కోసం ఎదురుచూపులు.

అవకాశం కోసం నిరీక్షణ - సఫలీకృతం.

వాడికి ఒక అలవాటు ఉంది - ఇంటర్వెల్‌లో వేరుసెనగపప్పు కొనుక్కుని, ఒక్కడే తింటాడు. ఎవరైనా ఎదురైతే జేబులో ఉమ్మేసుకుంటాడు (ఎంగిలికదా! ఎవడూ అడగరు -)

ఒకరోజు నేనూ, నా ఇష్ట స్నేహితులం ఒక ప్లాన్ వేసి వాడు జేబులో పల్లీలు పోసుకోగానే కొందరు వాడ్ని వెనకనుండి పిలవడం. నేను వెంటనే వెళ్ళి వాడి జేబులో ఉమ్మి వేయడం. " అన్యాయం...అన్యాయం" అంటూ వాడు శివతాండవం చేయడం - " నీవు చేసిన పని ఏంటి నాయనా" అని బుద్ది చెప్పా - (వాడు డిఫెన్స్ ఆర్డినెన్స్ ఫాక్టరీలో వర్క్స్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసాడు).

మా పాత స్నేహితులం పదిమంది ఇప్పటికీ ఫోను చేసుకుంటూ పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటాం. అప్పుడప్పుడు కలుసుకుంటాం.

2013వ సంవత్సరంలో మేము చాలా కష్టపడి పాతస్నేహితుల్ని ముప్పయి మందిని ప్రోగుచేసి, అదే పాఠశాలలో "స్నేహ షష్టిపూర్తి" కార్యక్రమం దిగ్విజయంగా జరుపుకున్నాం - విశేషం ఏమంటే బతికి ఉన్న పదిమంది ఉపాధ్యాయుల్ని సన్మానించుకున్నాము - పట్టుబట్టలు, ఆపిల్ పండ్లు, గులాబీదండతో, పండిత శాలువాలు సమర్పించుకున్నాము. వాళ్ళను ఇళ్ళనుండి తీసుకురావడం మళ్ళీ దింపిరావడం వాళ్ళకి మహానందాన్ని కలిగించింది. మా స్నేహితులం 30 మంది తమకుటుంబ సభ్యులతో (మనవలూ, మనుమరాళ్ళతో కొందరు) సాయంత్రం వరకు గడిపాము.

లంచ్‌లో ఉపాధ్యాయిలకు సాత్వికాహారం (అందరూ 85 దాటినవాళ్ళు కదా!).

సభలో గొప్ప విశేషం ముఖ్యఅతిధిగా మా ఆత్మీయులు అక్కినేని నాగేశ్వరరావుగారు రావడం. పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నరసింహారెడ్డిగారు, అధ్యక్షులుగా పాల్గొనడం సభకు వన్నెతెచ్చింది. అలా మా స్నేహ షష్టిపూర్తి జరగడం, చాలా ప్రముఖ పత్రికల్లో ప్రముఖంగా రావడం చాలా ఆనందాన్ని కలగ చేసింది. మధుర క్షణాలు మిగిల్చాయి.

ఆ తర్వాత మరో మరువలేని సంఘటన. మా కార్యక్రమం చూసిన మా పాఠశాల కార్యవర్గం (ప్రస్తుతం ఆ ఆవరణలో ఒక కళాశాల, పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాలేజ్ ఇంజనీరింగ్ కాలేజ్ వెలిసాయి) స్వాతంత్రదినానికి, నన్ను ముఖ్య అతిధిగా పిల్చి, ఒక పూర్వ విద్యార్థిగా నాకు గౌరవస్థానాన్ని కలగచేసారు. జండావందనం. జండా నేను ఎగరవేయడం. అందులోని పుష్పాలతో పాటు నా కళ్ళలో ఆనంద బాష్పాలు రావడం మరువరాని, మరువలేని మధురాతి మధుర క్షణాలు.

ఆఖరుగా 31-05-2015 నాడు మా పాఠశాల ప్లాటినం జూబ్లీ (75 ఏళ్ళ ఉత్సవం) జరుపుకున్నా, విశేషం ఏమంటే ఆనాటి కార్యక్రమాలన్నీ పాత విద్యార్థులచే నిర్వహింపబడడం. వయోభేదాలు లేకుండా, తమ వయస్సును మర్చిపోయి ఎవరికి వచ్చిన కళను వారు ప్రదర్శించడం -పాటలు, ఆటలు, సమావేశాలు పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం "నభూతో న భవిష్యతి" అనే రీతిలో జరిగింది. చక్కని సాయంకాల భోజన కార్యక్రమంతో కార్యక్రమాలు ముగించాం.

కొసమెరుపు - 200 పేజీల సావనీరు అత్యంత సుందరంగా, పాతవిద్యార్థుల గురువుల వ్యాసాలతో, ఫోటోలతో ప్రచురించి 1940 బ్యాచ్ పూర్వ విద్యార్థిచే ఆవిష్కరింప చేయడం ఓ గొప్పప్రక్రియ. ఆనాటి పూర్వ విద్యార్థుల సంగీత కార్యక్రమానికి వ్యాఖ్యాతగా నేను వ్యవహరించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ.

అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఆహ్లాదంగా ఉండాలి.

BE HAPPY MAKE OTHERS HAPPY!!!

# టెంత్ క్లాస్

## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

## *అంకరాజు శ్రీకాంత్ మురళి*



**1972 ఏప్రిల్** నెలలో మా పదవతరగతి చదువు పూర్తయ్యింది. నేను చదివింది ముషీరాబాద్ ప్రాంతంలో ఎం.బి.హైస్కూల్ అనే ఓ మిషనరీ స్కూల్. స్కూల్ బిల్డింగ్‌తోపాటే చర్చ్ కూడా కలిసి ఉండేది. ప్రతి శనివారం మాకు ఓ గంట చర్చ్ క్లాస్ ఉంటూ ఉండేది. (ఒక్కోసారి అక్కడ కూర్చున్నప్పుడే ఇంగ్లీష్ కాపీ రైటింగ్ రాసేవాళ్ళం. లేకపోతే జెస్సి సర్ తోలు తీసేస్తారని భయం.) మాకు బైబిల్ క్లాసు శాంతమ్మ టీచర్ తీసుకునేవారు. ఆ క్లాసులోనే నాతోపాటు నా కజిన్ రాము, వాణి కూడా చదివేవారు. మేం కనక బైబిల్ క్లాసులో మాట్లాడితే, శాంతమ్మగారు మమ్మల్ని గట్టిగా

బెదిరించేది. పరలోకంలో శిక్ష తప్పదని తను మాత్రం కాపాడనని అనేది. ఇక తెలుగు క్లాస్ చిల్లర ప్రభాకర్ రావుగారు, హింది నీతిదేవ శాస్త్రి (కర్కోటకంగా బాదేవాడు), సైన్స్ మార్తప్రభ, సోషల్ టీచర్ విద్యావలి, మాత్స్ టీచర్ విక్టోరియా మొదలగు టీచర్స్ చెప్పేవారు. సంవత్సరం మొదలయిన దగ్గరినుంచే ప్రతి టీచరూ, ఇది టెంత్ క్లాస్ చాలా జాగ్రత్తగా చదవాలి. పబ్లిక్ ఎగ్జామ్ అని భయపెట్టేవారు. మాకు ఈ పబ్లిక్ ఎగ్జామ్ అంటే ఏమిటో తెలిసేదికాదు.

ఓసారి హిందీ మాష్టర్ నన్ను, రాముని ఎందుకో ఉతికేసాడు. అంతే మా అమ్మమ్మ హిందీ పిరియడ్ జరిగే టైముకి మర్నాడు క్లాస్ కొచ్చింది. మరోసారి మా పిల్లల్ని కొడితే ఊరుకునేది లేదని, తను బెత్తం తీసుకుని రావాల్సి ఉంటుందని ఆయన్ని గట్టిగా వాయించి వెళ్ళింది. ఇహ ఆయన ఎప్పుడూ మమ్మల్ని కొట్టే ధైర్యం చెయ్యలేదు.




తెలుగు మాష్టారు ప్రభాకర్ రావుగారు పాఠం చాలా బాగా చెప్పేవారు. ఎక్కడైనా శృంగారానికి సంబంధించిన పదాలు వస్తే, చాలా ఉత్సాహపడిపోయేవాడు. నాకు ఈ రోజుకి కూడా చంపకమాల, ఉత్పలమాల, గణ విభజన గుర్తుందంటే, అది ఆయన చలవే. ఈ మధ్యే విన్నాం ఆయన శాయి ధామం అనే ఆశ్రమం స్థాపించారనీ, సన్యాసిగా మారారని. ఓసారి మమ్మల్ని "ఆంధ్రసారస్వత పరిషత్‌తో తెలుగు సాహిత్యం గురించి ప్రోగ్రాం అవుతుందని తీసుకెళ్ళి వినిపించారు. కృష్ణదేవరాయలు వాళ్ళ గురించి, ఆ సభలో చాలా సేపు విన్నాం. హెడ్ మాస్టర్ గారి పేరు జార్జ్‌గారు. పొద్దున్న గేట్ దగ్గర తొమ్మిదిగంటలకు బెత్తంతో ప్రత్యక్షం అయ్యేవాడు. లేట్‌గా వస్తే, రెండు తగిలించి క్లాసులోకి పంపేవాడు. ప్రేయర్ అవుతూనే ఓ కథ చెప్పేవాడు ఎప్పుడూ అదే కథ. (పచ్చిపులుసు బాలయ్య కథ)

"ఓ స్టూడెంట్ సంవత్సరం అంతా చదవకుండా ఆటలు ఆడేవాడు. ఎగ్జామ్స్ దగ్గరపడగానే పరీక్షలు భయంవేసింది వాడికి. అన్ని పుస్తకాలు చదివే టైం లేక వాటిని కాల్చి బూడిద చేసి నీళ్ళతో కలిపి త్రాగాడు. అన్నీ పరీక్ష హాల్లో వస్తాయని అనుకున్నాడు. కానీ, పరీక్ష హాల్‌లో ఏం వచ్చిందో తెలుసా? వాంతి వచ్చింది. ఫెయిల్ అయాడు" అని కథ ముగించేవాడు.

నేను ఎం.కాం, నాగపూర్‌లో చదివేటప్పుడు, జార్జ్‌గారు ఢిల్లీ వెళ్ళి నాగపూర్‌లో ఓ గంట ఆగారని తెలిసి, నేను స్టేషన్ కెళ్ళి కలుసుకుని లంచ్ చేయించి ఢిల్లీ ట్రైయిన్ ఎక్కించాను. చాలా సంతోషించారు. ఆ రోజుల్లో టీచర్స్ అంటే అలాంటి గౌరవం, భయంకూడా ఉండేది. ఆయన ఆషీర్వాదం, షోత్రం అని పలికేవాడు ఎందుకో పాపం. సైన్స్ టీచర్ కూడా ఓసారి సరిగ్గా పాఠం చదవకపోతే, పరలోకంలో శిక్ష తప్పదని బెదిరించింది. నూనెలో మమ్మల్ని వేయిస్తారని భయపెట్టింది. ఆరాత్రి ఆ సీన్ ఊహించుకుని భయపడ్డాం కూడా. సైన్స్ టీచర్ ఓసారి లాబ్‌లోంచి ఏదో పరికరం తెమ్మంటే బోలెడు కలర్ చాకోపీస్‌లు జేబుల్లో నింపేసుకున్నాం ఎవరూ చూడడం లేదని. అప్పుడు అది దొంగతనం అని పించలేదు. ఓ విలువైన వస్తువు దొరికిందని సంబరపడ్డాం

ఇక మా తోటి స్టూడెంట్స్ మాటకి వస్తే శ్రీధర్‌గాడు తెలుగు సినిమాలోకి హీరోగా వెళ్తానని చెప్తూండేవాడు. ఇంటర్వెల్‌లో గ్రౌండ్‌లో ఉత్తుత్తి కెమెరాతో షూటింగ్ అదీ చేసేవాళ్ళం. పండరి, దామోదర్, కుమార్ స్వామి డైరక్టర్, కెమెరా, మేకప్ వాళ్ళుగా నటించేవారు.

1971లోనో ఎప్పుడో మా స్కూల్ ప్రక్కనే రామకృష్ణా సినీ స్టూడియో మొదలుపెట్టారు. ఈ శ్రీధర్ గాడు ఎన్.టి.ఆర్‌ని కలవాలని ఒకటి రెండు సార్లు ప్రయత్నాలు కూడా చేసాడు. వీలు కాలేదు. మోహన్‌దాస్ అనేవాడు, వాడి శక్తితో ఫైట్ మాష్టర్‌గా చాలాకాలం సినిమాల్లో నటించాడు. ఓ ఫైటింగ్‌లో పెద్ద దెబ్బ తగిలిపోయాడని విన్నాం.

శ్రీధర్‌గాడు మా స్కూల్ నుంచి వచ్చేదార్లో ఓ దిగుడు బావిలో ఈత కొడ్తానంటే, నేనూ రాము వాడి బట్టలు పట్టుకుని గట్టున కూచున్నాం. ఎలా తెలిసిందో, ఎప్పుడు వచ్చిందో మా అమ్మమ్మ వెనుక నుంచి వచ్చి నాలుగు అంటించింది. వాడి బట్టలతోపాటు ఇంటికి పరిగెత్తాం (తర్వాత తడి లాగూతో వాడు ఇంటికొచ్చి తన బట్టలు తీసుకెళ్ళాడనుకోండి)

శ్రీధర్‌గాడి అన్నయ్య యుగంధర్ అని ఉండేవాడు. ఇప్పుడు రిటైర్ అయిపోయాడు ఆర్.టి.సి నుంచి. మా అక్కల్ని ఎవరైనా ఏడిపిస్తే యుగంధర్‌గాడు అదే సాయంత్రం వాళ్ళకి పాఠం చెప్పేసేవాడు. మాకు వాడిని చూస్తుంటే ఆశ్చర్యం వేసేది. వాడి ఫైటింగ్ మమ్మల్ని అబ్బురపరిచేది.

చాలా అల్లరి ఆటలతో సంవత్సరం అంతా గడిచిపోయింది. కానీ, చదువు దగ్గర ఎక్కడా కాంప్రమైజ్ లేదు. ఏ రోజు పాఠం ఆరోజు చదవకపోతే ఇంటిదగ్గర అమ్మమ్మ రాత్రి పదయినా పడుకోనిచ్చేదికాదు. పాఠం చదవడం అయ్యాకా అన్నం తినమన్న రోజులు కూడా లేకపోలేదు. అమ్మమ్మ దగ్గర పదకొండుమంది మనవలం చదువుకున్నాం. చాలా స్ట్రిక్ట్‌గా చదివించేది. మేం చదువుతున్నంతసేపు ఇంటిపని చేసుకుంటూ వింటూ ఉండేది. ఇంగ్లీష్ గ్రామర్‌లో తప్పు దొర్లిందంటే ఇమీడియట్‌గా కరెక్ట్ చేసేది. ఆవిడ ఓల్డ్ మెట్రిక్యులేటర్.


యుగంధర్‌తో

ఓసారి మా క్లాస్‌లో మదన్ అనే స్టూడెంట్ యూనీఫాం కుట్టించుకోలేక పోతున్నాడని తెలిసింది. రహస్యంగా అందరం రూపాయి, రూపాయి వేసుకుని 26 రూపాయలు పెట్టి వాడికి రెండు జతల యూనీఫాం కొనిఇచ్చాం. హెడ్ మాష్టర్ కూడా 2రూ ఇచ్చారు. వాడి కళ్ళలో కనిపించిన ఆనందం ఇంతా అంతా కాదు.

ఓ రోజు మా అమ్మమ్మతో ఆగస్ట్ 15కి మా స్కూల్లో స్పోర్ట్స్, రన్నింగ్ అవీ కండెక్ట్ చేస్తున్నారు అని చెప్పి వెళ్తూంటే - పరుగులు అవీ పెట్టక, ఓ చోట కూర్చుని చూడండి. ఒకవేళ పరిగెత్తాలంటే నెమ్మదిగా పరిగెత్తండి అంది.

మా స్కూల్లో స్కూల్ డే రోజున నాటకం వేసేవాళ్ళం. కరెంట్ పోయేది. చీకటిలో కుర్చీలు ఎత్తి కొట్టుకునే వాళ్ళు రౌడీగాంగ్.

మంచి నీళ్ళ టాంక్ మీద ఏసు ఇచ్చు నీరు. త్రాగువాడు దప్పిగొనడు. అని ఉండేది. అయినా మాకు ప్రతి పిరియడ్ తర్వాత దాహం వేసేది. మంచి లైబ్రెరీ ఉండేది. బాడ్జి పోయినప్పుడల్లా పావలా పెట్టి కొనుక్కోవాలి. స్కూల్ గ్రౌండులో చింతచెట్టు ఉండేది. గూర్ఖా చింతకాయలు అమ్మేవాడు.

ఈ విధంగా ఆడుతూ, పాడుతూ చదివినా మంచి మార్కులతోనే టెంత్ క్లాస్ పాస్ అయ్యాం అందరం. ఆ రోజులు తల్చుకుంటే ఇప్పటికీ చాలా ఆనందంగా ఉంటుంది. పొరపాటున టీచర్ రోడ్డుమీద కనిపిస్తే, ఒదిగిపోయేవాళ్ళం మా అమ్మల వెనుక. ఇంతకి మా టెంత్ క్లాస్ మంత్లీ ఫీజ్ ఎంతో తెలుసా జస్ట్ ఆరు రూపాయలు. (అదికూడా ఫస్ట్ రాంక్, సెకండ్ రాంక్ వాళ్ళకి సగమే కలెక్ట్ చేసేవాళ్ళు)

ఈ విధంగా ఓ మధురమైన అనుభూతి మా టెంత్ క్లాస్. ఒక్క మాటలో చెప్పాలంటే జేబులో డబ్బులు "నిల్" మనస్సులో ఆనందం "ఫుల్".

*అంకరాజు శ్రీకాంత్ మురళి హైదరాబాదులో మంచుకొండ ఇండస్ట్రీస్‌లో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య జయశ్రీ వారికి ఇద్దరు కుమారులు.*




ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**

## శివనాగేశ్వరరావు



**దశావతారాలు.. దశాబ్దం...** దశకంఠుడు.. దశదిశలు.. ఇలా 'దశ' అనే మాటకి చాలా ప్రత్యేకత ఉంది. తెలుగులో ఎవరినైనా ఆశీర్వదిస్తున్నప్పుడు "పదికాలాల పాటు చల్లగా ఉండు" అంటాం. అంటే 'పది' అనే సంఖ్యకి ఉన్న ప్రాముఖ్యత అది. అలాగే విద్యావ్యవస్థలో కూడా పదోతరగతికి అంతే ప్రాముఖ్యత ఉంది. దానినే టెంత్ క్లాస్ అంటారు. దీనినే ఎస్.ఎస్.సి అనేవాళ్ళు. దీనికి ముందు ఎస్.ఎస్.ఎల్.సి అని ఉండేది. అంటే "సెకండరీ స్కూల్ లివింగ్ సర్టిఫికెట్". దానిలోంచి "లివింగ్" అనే మాటను తీసి, ఒక సంవత్సరం తగ్గించి దానిని "సెకండరీ స్కూల్ సర్టిఫికెట్" ఎస్.ఎస్.సి అని మార్చారు.

ఇక నా టెంత్ క్లాస్ గురించి చెప్పాలంటే మాది గుంటూరుజిల్లా. గుంటూరు తాలూకా ఉప్పలపాడు గ్రామం. గమ్మత్తేమిటంటే మేమూ, మా స్కూలు అంచలంచెలుగా పెరుగుతూ వచ్చాం. నేను అయిదో తరగతి చదువేటప్పుడు 'అప్పర్ ప్రైమరీ స్కూలు' అని ఉండేది. తరువాత 6,7,8 పెంచారు. మేం టెంత్ క్లాస్‌కి వచ్చేటప్పుడు జిల్లా పరిషత్ హైస్కూలు చేశారు. కానీ మా స్కూలు పేరు మాత్రం "అంజయ్య స్కూలు" "అంజయ్య బడి".

చెరుకూరి అంజయ్య అని ఒక మోతుబరి రైతు. ఆయనకు ఇద్దరు భార్యలు. కానీ పిల్లలు లేరు. ఒక అబ్బాయిని దత్తు తీసుకున్నాడు. పాపం అతను కూడా పెళ్ళయి పిల్లవాడు పుట్టాక చనిపోయాడు. దాంతో ఆయన పూర్తి వైరాగ్యానికి లోనై, తనకున్న ఆస్థిలో కొంత ఖర్చు పెట్టి శ్రీ కోదండ రామాలయం కట్టించాడు. తరువాత మా స్కూలుని జిల్లా పరిషత్ హైస్కూల్‌గా మార్చే క్రమంలో ఊళ్ళోవాళ్ళ సహకారం కూడా ఉంటే బాగుంటుందని అనిపించి, ఆయనే ముందుకు వచ్చి కొంత పొలం, అప్పటి వరకు పొగాకు బ్యారన్‌లుగా ఉన్న అయిదు షెడ్లు కూడా స్కూలుకి ఇచ్చాడు. ఆ పొలం మాకు ఆటస్థలం. దానిలో ఫుట్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్ ఆడేవాళ్ళం. స్కూలు వార్షికోత్సవానికి అక్కడే పెద్ద వేదిక కట్టించేవాళ్ళు. తర్వాత తర్వాత ఊర్లో ఏ కార్యక్రమమైనా అదే వేదిక అయ్యేది. హరికథ, బుర్రకథ, పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలు, రాజకీయ మీటింగులు.. ఇలా. ఈ అంజయ్యగారిని మేమందరం అంజయ్య తాత అనే పిలిచేవాళ్ళం. రామాలయం వెనకాల ఒక మంచినీటి చెరువుకూడా తవ్వించాడు ఆయన పొలంలోనే. మంచినీళ్ళు అంజయ్య చెరువునుంచి కావడులతో తీసుకెళ్ళేవారు. ఆ చెరువు పరిశుభ్రతని కాపాడటానికి ఆయనే స్వయంగా పూనుకునేవాడు, మసిబారిన కడవలు, బిందెలతో వచ్చిన వాటిని చెరువులో ముంచనిచ్చేవాడు కాదు. ప్రత్యేకంగా ఒక కడవ అక్కడ ఉంచి, దానితో ముంచుకుని వాటిల్లో పోసుకోమనేవాడు.




మాకు ఆ విధంగా, ఊర్లో అంజయ్య గుడి, అంజయ్య బడి, ఏర్పడ్డాయి. అంజయ్య తాత గురించి చివరిగా ఒక వాక్యం తను బ్రతికి ఉండగానే తన శిలా విగ్రహం ఒకటి చెక్కించుకున్నాడు. అంతకు ముందే చనిపోయిన తన పెంపుడు కొడుకుకి ఒక విగ్రహం చెక్కించాడు. దానిపక్కనే ఈయన విగ్రహం కూడా పెట్టించుకున్నాడు. ఇది మా స్కూలు నేపథ్యం. మా టెంత్ క్లాస్ బాచ్‌లో అందరికంటే నేనే చిన్నవాడిని. అందుకే నా ఎస్.ఎస్.సి రిజిష్టర్‌లో నా అసలు వయసుకంటే మూడు సంవత్సరాలు ఎక్కువగా ఉంటుంది. మా ఇంట్లోనే నేనూ, మా అక్కయ్య, మా బాబాయ్‌గారి అబ్బాయి, మా అన్న, మా చెల్లి. నాకంటే కొన్ని రోజులు చిన్నది. అందరం టెంత్‌క్లాస్‌లో ఉండేవాళ్ళం. మా అంజయ్య గుడి చెప్పాలంటే ప్రతిసంవత్సరం ఒక ఏడురోజులపాటు 'అఖండ రామనామము' అనే పేరుతో సప్తాహాలు జరిగేవి. ఆ ఏడురోజులు మా స్కూల్లో హాజరు మాత్రం పడేది మేమంతా గుళ్ళోనే ఉండేవాళ్ళం. పెద్ద మైకు సెట్ లోంచి "హరేరామ హరేరామ, రామ రామ హరే హరే.. హరేకృష్ణ హరే కృష్ణ, క్రిష్ణ క్రిష్ణ హరే హరే" రాముడు గుడికదా మరి కృష్ణుడిని కూడా భజనలో ఎందుకు ఉంచాం అనే నా ప్రశ్నకు సమాధానం ఎవరూ చెప్పేవారు కాదు, ఒకవేల క్లాసు రూములో కూర్చున్నా, చెవులు పగిలిపోయేంత హోరుతో రామనామం వినిపించేది. అందుకని స్కూల్ బంద్. ఊర్లో ఒక భజన బృందం ఉండేది. కొంతమంది ఆడవాళ్ళు నలభై దాటి ఇంట్లో పనులు పనివాళ్ళకి, కోడళ్ళకి అప్పగించి వీళ్ళంతా ఈ బృందంలో చేరి భజన చేస్తూ ఉండేవారు.

ఈ భజన బృందానికి టీం లీడర్‌లాగా ఒక 50, 55 మధ్య వయస్సుగల ఒక వ్యక్తి. ఆయన హార్మోనియం వాయించేవాడు. మొదట ఆయన పాడితే తర్వాత బృందం అంతా కోరస్‌లాగా పాడేవారు. నేను చాలా జాగ్రత్తగా ఆ హార్మోనియం వ్యక్తి పాడేటప్పుడు గమనిస్తే అతని నోటి వైపు చూసేవాడిని. నథింగ్ బట్ విండ్ అన్నట్టు గాలి మాత్రమే వచ్చేది, శబ్దం వచ్చేది కాదు. కానీ హార్మోనియం శబ్దం ఎక్కువగా వచ్చేది. తర్వాత నేను కనిపెట్టిన కారణం ఏమిటంటే అతనికి ముందు పై మూడు పళ్ళు లేవు. కానీ ఆయన పేరు

"దంతాల లక్ష్మీనారాయణ" కానీ నాకెందుకో ఆయన పేరు 'దంతాలు లేని లక్ష్మీనారాయణ' అంటే బాగుండేది అనిపించేది. మొత్తానికి అతను ఒక నేతిబీరకాయ.

ఈ రామనామాన్ని అప్పట్లో వచ్చి సూపర్ హిట్టైన పాటల బాణీల్లో పాడేవారు. మా ఊర్లో లోకల్ బృందం కాకుండా, వేరే ఊర్లనుండి మరికొన్ని భజన బృందాల్ని పిలిపించేవారు. వారికి బస, భోజన సదుపాయం అన్నీ దేవాలయం కమిటీనే చూసుకునేది. ఆ బృందాలతో ఒకామె మాత్రం ప్రతిసంవత్సరం వచ్చేది. ఆమెతో ఎప్పుడన్నా మేం మాట్లాడేవాళ్ళం. "ఎలా ఉన్నాయి అవ్వా.. భోజనాలు బాగున్నాయా" అని అడిగితే

"ఏం భోజనం బాబూ తినలేక చచ్చిపోతున్నాం" అంది.

"అదేంటి.. వండేవాళ్ళు సరిగా వండటం లేదా? అంజయ్య తాతతో చెప్పమంటావా?" అంటే.

"అంజయ్య తాతేం చేస్తాడు బాబూ!" అంది.

"ఎందుకలా బాధపడతావు విషయమేంటో చెప్పు" అంటే

"సొరకాయ పచ్చడి, సొరకాయ ఇగురు, సొరకాయ వేపుడు, సొరకాయ పులుసు, సొరకాయ సాంబారు, సొరకాయ రసం. ఒక్క మజ్జిగలో తప్ప అంతా సొరకాయేగా బాబూ" అంది.

తర్వాత విషయం ఏమిటి అని ఆరా తీస్తే ఊళ్ళోవాళ్ళు ఇచ్చిన కూరగాయలతోనే వంటచేసేవారు. అందరికి పొలాల్లో సొరకాయలు పండేవి. అవే తలా నాలుగు సొరకాయలు ఇచ్చేవారు.

ఈ కోదండ రామాలయానికి ఒక ప్రధాన అర్చకుడు ఉండేవారు. ఆయనపేరు మాకు తెలియదు. 'ఆచార్లుగారూ' అని పిలిచేవాళ్ళం. ఆయనకో మనవరాలు ఉండేది. ఆ అమ్మాయి మా క్లాసే. పేరు 'దిట్టకవి శతపత్ర సుందరి'. పేరుకు తగ్గట్టుగా అందంగా ఉండేది. కాశ్మీరీ యాపిల్‌లా బుగ్గలు, కొంచెం బొద్దుగా ఉండేది. ఆ అమ్మాయికి ఎప్పుడైనా హోం వర్క్ విషయంలో హెల్ప్ చేసేవాడిని. ఆ కారణమో, నేను అందరికంటే చిన్నవాడిలాగా ఉండే కారణమో నాకు తెలియదు గానీ అందరికంటే ప్రసాదం నాకు కొంచెం ఎక్కువ పెట్టేవారు. చక్కర పొంగలి అద్భుతంగా ఉండేది, వాళ్ళింట్లోనే చేసేవారు. ఒక్కోసారి ప్రసాదం కోసం మళ్ళీ వెళితే చిన్న 'భడవా' అని నవ్వుతూ మళ్ళీ పెట్టేవారు. కొంచెం జులాయిల్లాగా తిరిగేవాళ్ళకు, ఆయనకి నచ్చని వాళ్ళకు కొద్దిగానే పెట్టేవారు.

మా హెడ్‌మాష్టర్ పేరు 'మోటూరి కట్టయ్య'గారు. మేం టెంత్ క్లాస్‌లో ఉండగా కత్తుల చెన్నకేశవరావ్ అనే క్రాఫ్ట్ మాస్టర్ ఉండేవారు. ఆయన నాటకాల్లో వేషాలు వేసేవారు, బ్యాట్‌మెంటెన్ బాగా ఆడేవారు. ఆ సంవత్సరం స్కూలు వార్షికోత్సవానికి నాటకాలు వేయించే బాధ్యత ఆయనకి అప్పగించారు. పినిసెట్టి శ్రీరామ్మూర్తిగారు రాసిన 'ఆడది' అనే నాటిక దాన్లో ఒకటి. ఆ నాటికలో ఒక పిల్లవాడి పాత్ర ఉంది. దానికి ఇద్దరం పోటీ పడ్డాం. ఒకటి నేను, మరొకడు శివనరశింహారావు.. క్రాఫ్ట్ మాష్టారు పరీక్ష పెట్టారు మా ఇద్దరికీ. ఇద్దరం సమానంగా వచ్చాం. రిజల్ట్ మరురోజుకి వాయిదా వేశారు. ఆ రోజు రాత్రి నేను నా జీవితంలో మర్చిపోని రాత్రి. ఎలాగైనా స్టేజి ఎక్కాలని ముఖానికి రంగేసుకోవాలని, డైలాగులు చెప్పి చప్పట్లు కొట్టించుకోవాలని అనుకుంటూ ఆ రాత్రంతా నిద్రలేకుండానే గడిపాను. తెల్లవారి అందరికంటే ముందే స్కూలుకి వెళ్ళాను. కౌంట్ డౌన్. జడ్జిమెంటుకి టైం దగ్గరపడింది. చెన్నకేశవరావు మాష్టర్ వచ్చారు శివనాగేశ్వరావు, శివ నరశింహారావు ఇద్దరినీ మార్చి మార్చి చూసారు. ఫైనల్‌గా శివ నరశింహారావు పేరు చదివారు. నాకు దుఃఖం ఆగలేదు. పెద్దగా పైకి ఏడ్చేశాను. మాష్టారు నాదగ్గరకొచ్చి ఓదార్చారు. ఆయన చేతిని విదిలించి కొట్టి బయటకు వెళ్ళిపోయాను.(మీరు నమ్ముతారో లేదో ఇది రాస్తున్నప్పుడు ఇప్పుడు నాకళ్ళ వెంట నీళ్ళు వస్తున్నాయి) ఆత్రేయగారు చెప్పినట్టు "మరపురాని బాధకన్నా మధురమేముంది" ఇప్పుడు నాకొచ్చిన కన్నీళ్ళు దుఃఖంతో కాదు... ఒక గమ్మత్తైన అనుభూతి"

రెండు రోజుల తర్వాత నాకు తెలిసిందేమిటంటే ఆ ముందు రోజు రాత్రి శివనరశింహారావు ఇంట్లో గేదె ఈనిందని. ఆ రాత్రే నరశింహారావు మా కత్తుల చెన్నకేశవరావు మాష్టారింటికి జున్ను పంపించాడని.

మా ఊర్లో గేదె ఈనాక పితికే పాలని 'ముఱ్ఱుపాలు'' అంటారు. వీటికి మూడు వంతుల మామూలు పాలు వేసి, బెల్లం వేసి, కాగబెట్టి దానిలో కొంచెం మిరియాల పొడి కలిపి తర్వాత ఆరబెడితే గట్టిగా అయిపోతుంది. అద్భుతమైన రుచి. ఇప్పుడు మనం స్టార్ హోటల్స్ లో తింటున్నామే "పుడ్డింగ్" అని దాని బాబుకి బాబులా ఉంటుంది మా ఊర్లో చేసే జున్ను. అటువంటి జున్ను తింటే "రేపు ఉరిశిక్ష వెయ్యబోయే ఖైదీని కూడా నిర్దోషిగా వదలగలడు ఆ జడ్జిగారు, ఆయన ముందు మా కత్తుల చెన్నకేశవరావు ఎంత..?

సరే.. ఎంత పెద్ద విషాదమైన ఒకటి, రెండు, మూడు రోజులు. తర్వాత అవే సర్దుకుంటాయి. వాళ్ళ రిహార్సల్స్ జరుగుతున్నాయి, ఉక్రోషం పట్టలేకపోతున్నాను. మా తమ్ముడు చందూ అని ( మా బాబాయిగారి అబ్బాయి) నా కంటే అయిదేళ్ళు చిన్నవాడు. వాడ్ని, వాడి ఈడువార్ని మరో అయిదుగుర్ని పిలిచి అందరికీ తలా రెండు "నిమ్మతొనలు" (ఆరంజ్ కలర్‌లో ఉండేవి. అయిదుపైసలకి అయిదు వచ్చేవి) ఇచ్చి, రిహార్సల్స్ జరుగుతున్న బ్యారన్ మీద రాళ్ళు వెయ్యమని పురమాయించాను. అందరూ రాళ్ళు వేశారు. రిహార్సల్ ఆపి అందరూ బయటకు వచ్చి చూశారు. అందరూ పరిగెత్తుకెళ్ళిపోయారు. నేనొక్కడినే నిలబడి ఉన్నాను. మరుసటి రోజు నన్ను మూడు పీరియడ్స్ బెంచి మీద నుంచోబెట్టారు.

కానీ ఎలాగైనా స్టేజ్ ఎక్కాలనే నా పట్టుదల మాత్రం చచ్చిపోలేదు 'మైలా సాంబశివరావ్' అని నాకంటే అయిదారు సంవత్సరాలు పెద్దవాడు. ఇతను కూడా నాలాగా వేషం ఆశించి చెన్నకేశవరావ్ మాష్టారి చేతిలో భంగపడిన వాడు. అంటే రెబల్ క్యాండిడేట్ అన్నమాట. అతను మంచి నటుడు, రేపల్లె నుండి మా ఊరు (వాళ్ళ అమ్మమ్మగారి ఊరు అని వచ్చి)లో టెంత్ క్లాస్‌లో చేరాడు. అతను అప్పటికే మాయలఫకీరు ఏకపాత్రాభినయం వాళ్ళ ఊర్లో వేశాడు. అతనికి నేను జట్టు కట్టాను. మాయలఫకీరు స్టేజిమీద ఉండి డైలాగులు చెబుతుంటే కాపాలికుడు తెరలోపల వుండి "అ....వు.....ను.." అని అరుస్తుంటాడు, అప్పుడు నాకో ఐడియా వచ్చింది. స్టేజి వెనకాల ఉండి "అ...వు...నూ" అని అరిచే కాపాలికుడి వేషాన్ని స్టేజి మీదే ఉంచేలా చేస్తే? మైలా సాంబశివరావుతో చర్చించి, ఇద్దరూ ఒక తాటి మీద కొచ్చాం. ఎందుకంటే అతనికీ ఒక మోరల్ సపోర్ట్ కావాలి. ఇద్దరం కలిసి కట్టయ్యగారి దగ్గరకెళ్ళి స్పెషల్ పర్మిషన్ తీసుకున్నాం. మరి అప్పటివరకు ఎవరూ చూడని కాపాలికుడు ఎలా ఉండాలి. వంటినిండా మసి పూసి కళ్ళ చుట్టూ ఎర్రగా దానికి మధ్య మధ్యలో తెల్లని చుక్కలు. ఇలా మొత్తానికి (బాహుబలి సినిమాలో కాలకేయుడికి దగ్గరగా) ఒక గెటప్ వేసుకుని స్టేజ్ ఎక్కాం. కాపాలికుడు డైలాగ్ చెప్పేటప్పుడు మాత్రమే ప్రేక్షకుల వైపు తిరిగి "అ....వు..ను" అని మళ్ళీ వెనక్కి తిరిగి నిలబడేవాడ్ని. అది మన ఫస్ట్ స్టేజ్ ఎక్స్‌పీరియన్స్. ఇది టెంత్ క్లాస్‌లోనే జరిగింది కాబట్టి ఈ క్రెడిట్ టెంత్ క్లాస్‌కే ఇవ్వాలి.

తర్వాత మా కట్టయ్యగారు ఒక విప్లవాత్మకమైన మార్పుచేపట్టారు. అది ఏమిటంటే రాత్రుళ్ళు కూడా స్కూల్లోనే చదువుకునే ఏర్పాటు చేశారు. పది, పదకొండు వరకు చదువుకుని మరల వేకువఝామున అయిదుగంటలకు లేచి ఒక గంట చదివి ఇంటికి వెళ్ళాలి. ఒక నెలరోజులు బాగానే జరిగాయి. ఆయన కూడా తొమ్మిదిగంటలవరకు ఉండి ఇంటికి వెళ్ళేవారు. ఆ తర్వాత వారం పెదకాకానిలో కారుమంచి వెంకటసుబ్బయ్య అనే ఆయన "శ్రీ భ్రమరాంబ మల్లీశ్వరీ టాకీసు" అని కట్టించి దానిని భక్తప్రహ్లాద చిత్రంతో ప్రారంభించారు. పోస్టర్లు మా ఊర్లో కూడా అంటించారు. మా ఊరి నుండి పొలాల మధ్య నుంచి నడిచి వెళితే పెదకాకాని రెండు మైళ్ళు. అరగంట పట్టేది, అప్పట్నించి ప్రతివారం ఒక సినిమా మారేది. కట్టయ్యగారు ఇంటికి వెళ్ళగానే బయలుదేరేవాళ్ళం. సెకండ్ షో టైముకి వెళ్ళేవాళ్ళం. రెండు గంటలకు వచ్చి స్కూల్లో పడుకునేవాళ్ళం. కట్టయ్యగారు ఎప్పుడైనా అయిదుగంటలకు వచ్చి చూస్తే క్లాసులో పడుకుని ఉండేవాళ్ళం. ఆయన మమ్మల్ని లేపి చదవమనేవారు. గైరుబోయిన నాగేశ్వరమ్మ అనే పిల్ల పరీక్షల్లో నా ప్రక్కన కూర్చుని ఆన్సర్ పేపర్ చూపించమనేది. క్లాసులో 'అచ్చా వీరభద్రమ్మ' అని ఇంకో అమ్మాయి ఉండేది. ఈ అమ్మాయి ఎగ్జామ్ రాస్తుంటే "ఇన్‌విజిలేటర్లు" భయపడేవారు.

ఎందుకంటే అన్ని అడిషనల్ షీట్స్ తీసుకునేది. "అశోకుడు గొప్పవాడు రోడ్లకిరువైపులా చెట్లను నాటించెను అని మొదలుపెట్టి చెట్టువలన లాభం, చింతచిగురు వలన లాభం నీడనివ్వడం వలన.. ఇలా రాసి, రాసి అడిషనల్ షీట్స్ అన్నీ తనే తీసుకునేది. కానీ మోడరేషన్‌లో పాసయ్యేది.

"రోజ్ హెల్మా" అనే టీచర్ మాకు తెలుగు అద్భుతంగా చెప్పేది. తర్వాత ఆమె స్థానంలో అప్పుడే ఉద్యోగంలో చేరిన 'బొర్రా హనుమంతరావు అని తెలుగు పండిట్ వచ్చారు. తర్వాత అతనే మా క్లాసులో పెద్ది వెంకాయమ్మను లవ్ చేసి పెళ్ళి చేసుకున్నారు.

మొత్తానికి చివరాఖరకు అలా చదవకుండా మాష్టర్లు చెప్పిన దాన్ని విని ఎలాగొలా రాసి టెంత్ క్లాస్‌ని గట్టెక్కించాం. అన్నట్టు నాకు మాథ్స్‌లో స్కూల్ ఫస్ట్. టోటల్ మార్క్సులో మాత్రం నేనే లాస్ట్.

ఇది నా టెంత్ క్లాస ఎక్స్‌పీరియన్స్.

*శివనాగేశ్వరరావుగారు*

కామెడీ సినిమాలు తియ్యడంలో తనదైన ముద్రతో 'మనీ' సినిమా ద్వారా సినీరంగ ప్రవేశం చేసి, 'సిసింద్రి', 'ఒన్ బై టు', 'పట్టుకోండి చూద్దాం', 'ఓ పనైపోతుంది బాబు', 'ధనలక్ష్మి ఐ లవ్ యూ' లాంటి హాస్యచిత్రాలు ఎన్నో తీసి అలరించారు. భార్య పద్మావతి, కుమార్తె భానోదయి, కుమారుడు యోగేష్‌తో హైదరాబాదులో నివశిస్తున్నారు.






# టెంత్ క్లాస్
## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే.! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**



## (చిట్టే) పసుపులేటి భార్గవీలత

**మనిషి జీవితంలో** అత్యంత మధురమైన దశ బాల్యం.

అయితే ఆ బాల్యపు చివరి ఘట్టం టెన్త్‌క్లాస్‌తోనే ముగుస్తుంది అని చెప్పొచ్చు. అందమైన బాల్యాన్ని అనుభవించేటప్పుడు తెలియదుకానీ గడిచిపోయిన ఆ రోజులను ఇప్పుడు తలచుకుంటే ఎంతో దిగులుగా అనిపించి, మళ్ళీ ఒకసారి ఆ బాల్యం జీవితాన్ని పలకరించి మదిని అలరిస్తే ఎంత బాగుంటుందో కదా అని అనిపిస్తుంది

టెన్త్‌క్లాస్, అనేది ఒక్క చదువు విషయంలోనే కాదు, జీవితంలో కూడా అది అతి ముఖ్యమైన మలుపు. టెన్త్‌క్లాస్ తరువాత చదువు పరంగా ఏ 'సబ్జెక్టు' ఎంచుకోవాలి అన్న స్వతంత్రం వచ్చినట్లే మంచి, చెడుల వ్యత్యాసాన్ని

గ్రహిస్తూ జీవితాన్ని మంచి మార్గంలో నడిపించాలి అనిపించి పరిపక్వంగా ఆలోచించగలిగే వయసుకూడా అదే

అందుకే టెన్త్‌క్లాస్ ప్రతిమనిషి జీవితంలోను భవిష్యత్తును ప్రభావితం చేసే అతిముఖ్యమైన దశ.

కడప జిల్లాలోని రైల్వే కోడూరు మా ఊరు. చిన్న టౌనుగా రూపుదిద్దుకున్న మా ఊరిలోని భారత్ హైస్కూల్‌లో ఆరునుండి పదో తరగతి వరకు చదువుకున్నాను నేను.



అంటే అయిదు సంవత్సరాలు వరుసగా అదే స్కూల్లో చదివాను అనుకోకండి సుమా! నేను అక్కడ చదివింది మూడు సంవత్సరాలే. కానీ అయిదు తరగతులను పూర్తిచేసాను.

చిన్నప్పటినుండి చదువులో నేను ముందున్న కారణంగా ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ వస్తుండటంతో కొన్ని తరగతులను నేను చదవకుండానే పదమూడవ సంవత్సరానికే నేను పదవతరగతి పరీక్షలు రాసేసాను.

అంటే అయిదు, ఎనిమిది, తొమ్మిది తరగతులను నేను అస్సలు చదవలేదు. మా నాన్నగారు ఎప్పుడూ నన్ను ప్రోత్సహిస్తూ తరగతులను మార్చి పైన క్లాస్‌లో వేయమని మా టీచర్లకు చెప్పేవారు.

అయినాకూడా పదవతరగతి సిలబస్ నాకేమీ కష్టంగా అనిపించలేదు. పైగా మా క్లాస్‌లో నేనే టాపర్‌గా నిలిచి మంచి మార్కులు తెచ్చుకునేదాన్ని. చదువొక్కటే కాదు, కల్చరల్ ఏక్టివిటీస్‌లో కూడా నేనే ముందుండేదాన్ని. పాటల పోటీలు, వ్యాసరచనలు వంటి వాటిల్లో నాకే మొదటి బహుమతి వచ్చేది.

అందుకే మా టీచర్లందరూ నన్ను ఎంతగానో అభిమానించేవారు "భార్గవి" ఏక సంథాగ్రాహి అని పొగిడేవారు.

కానీ స్పోర్ట్స్‌లో ఎపుడూ నేను వెనకే ఉండేదాన్ని. ఎందుకో తెలియదుగానీ ఆటల్లో ముందుకు వెళ్ళి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేదాన్నికాదు.

టెన్త్ క్లాస్ అనగానే నాకు ముందుగా గుర్తువచ్చేది నా స్నేహితురాళ్ళు సుమలత, విజయలక్ష్మి, లత.

మేము నలుగురం ఒకే మాట, ఒకే బాట అన్నట్లుగా ఒకటిగా కలిసి ఉండేవాళ్ళం. 'లత' చదువులో నాకు గట్టి పోటీగా ఉండేది. అందుకే ఆ సంవత్సరం మా మాష్టర్ల బృందం "బెస్ట్ స్టూడెంట్" అవార్డును ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేక ఇద్దరికీ కలిపి ఒకటే అవార్డును ఇచ్చారు.

స్వభావ పరంగా నేను చాలా ధైర్యంగా ఉండి, ముక్కుసూటిగా మాట్లాడుతూ ఉంటాను. కానీ మా ఫ్రెండు 'లత' చాలా సౌమ్యంగా నెమ్మదిగా ఉంటుంది.

విజయలక్ష్మి, సుమలతలిద్దరూ చాలా చలాకీగా హుషారుగా ఉండేవాళ్ళు. మా క్లాసులో అందరికన్నా వయసులో చిన్నపిల్లనవడంతో నన్ను అందరూ ప్రేమగా చూసుకునేవాళ్ళు.

అపుడపుడూ మేం నలుగురం ఒకే రంగు బట్టలు వేసుకుని ఒకేలా తయారయి స్కూలుకు వెళ్ళేవాళ్ళం.

పదవ తరగతికి పబ్లిక్ పరీక్షలు కావడం మూలాన నలుగురం కలిసి పట్టుదలగా ఎప్పటికప్పుడు పాఠాలన్నీ శ్రద్ధగా చదివేవాళ్ళం. ఏవైనా డౌట్స్ ఉంటే ఒకరినొకరు అడిగి తెలుసుకునేవాళ్ళం. అపుడపుడూ ఆదివారాల్లో దొరికే తీరిక సమయాల్లో అందరం కలిసి సంతోషంగా, సరదాగా గడిపేవాళ్ళు.

గొడవలు పడటం, కోట్లాడుకోవడం, చాడీలు చెప్పడంలాంటివి మాకు అసలు తెలియదు. మా స్నేహం అరమరికలు లేకుండా అందరికీ ఆదర్శంగా, చూసే వారికి ముచ్చట గొలిపేలా ఉండేది. ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా, బద్ధకించకుండా శ్రద్ధగా ప్రతిరోజూ స్కూలుకు వెళ్ళి బాగ చదువుకునేవాళ్ళం.

మా ఊరి ప్రక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండాల పల్లిలో మారమ్మ దేవత గుడి ఉంది. ఆమె చాలా మహిమగల దేవత అని అందరూ నమ్మి భక్తిగా పూజలు చేస్తారు. మొక్కుబడులు ఎన్నో మొక్కి వారి కోరికలు తీరిన తరువాత మరిచిపోకుండా ఆమెను దర్శించి వారి మొక్కుబడులను భక్తిగా చెల్లిస్తారు.

ప్రతి శుక్రవారం అక్కడ ప్రత్యేక పూజలు జరుగుతూ ఉంటాయి. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కుంకుమ, పళ్ళు, ఆకువక్కలను సమర్పించుకుంటారు. కోరుకున్న కోరికలు తీర్చే దేవత అని మా ఊరి వారేకాక చుట్టు ప్రక్కల ఉన్న పల్లెల ప్రజలు కూడా విశ్వసిస్తారు. మేము మా ఇంటినుండి కాలినడకన వెళితే 30 నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు.

మా ఫ్రెండ్ సుమలత వాళ్ళ ఇల్లు కూడా మారమ్మ గుడికి దగ్గరలోనే ఉంటుంది. అందుకే మేము తరచుగా ఆ గుడికి వెళ్ళి వచ్చేవాళ్ళం. ఉదయాన్నే లేచి తలంటు పోసుకుని, పట్టు పరికిణీలు కట్టుకుని కాలినడకన గుడివద్దకు నడుచుకుంటూ బయలుదేరేవాళ్ళం. ఆ సమయంలో ఆ దారి అంతా ప్రశాంతంగా దారి కిరువైపులా ఉన్న పచ్చటి పంట పొలాలతో అందంగా ఉండి పలకరిస్తూ ఉండేది.

ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదిస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటి దగ్గర నుండి మాతో పాటు తెచ్చుకున్న చిరుతిళ్ళు తింటూ ఆ గుడివద్దకు చేరుకునే వాళ్ళం.

అంతే కాదండోయ్. మేము అల్లరి పిల్లలమని అపుడపుడూ నిరూపించుకోవాలి కదా?.. అందుకే ఆ దారి పొడవునా ఉన్న పొలాల్లోని జామచెట్లు, దానిమ్మ చెట్లులాంటివి పండిన పండ్లతో కంటికి కనిపిస్తే చాలు మెల్లగా ఆ తోటలోకి చేరుకుని కావలసినన్ని పళ్ళు కోసుకుని తరువాత వెనక్కి తిరిగి చూడకుండా వేగంగా ముందుకి పరిగెత్తేవాళ్ళం. ఇలాంటి అల్లరిపనులు ఇపుడు తలుచుకుంటే నవ్వొస్తూ ఉంటుంది. బాల్యంలోని అప్పటి అందమైన జ్ఞాపకాలు ఇప్పుడు ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ఎంత కష్టపడినా మరలా తిరిగి రావుకదా!





అలాగే ఆగష్టు పదిహేను, రిపబ్లిక్ డేలాంటి దేశ జాతీయ దినోత్సవాల పండగలకు ఎంతో హుషారుగా, పోటీలు పడి మరీ ఎవరి క్లాసు రూమును వాళ్ళు రంగుల కాగితాలతో, పూలతోనూ అలంకరించుకునేవాళ్ళం.

అప్పటిలో నేను సినిమా పాటలను మార్చి, మా స్కూలు గురించి టీచర్ల గురించీ, మన భారత దేశం గురించి పేరడీ పాటలు రాసి స్టేజి మీద పాడేదాన్ని. అంత చక్కగా సినిమా పాటల్ని మార్చి దేశభక్తి గీతాలుగా మలిచినందుకు మా టీచర్లందరూ నన్ను మెచ్చుకునేవారు. వాళ్ళ గురించి గొప్పగా కూడా రాసినందుకు సంతోషించి మురిసిపోయేవాళ్ళు.

నేను పదవ తరగతిలో ఉన్నపుడే మా స్కూలు వార్షికోత్సవ సందర్భంగా పోటీల్లో "కొండలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు... కొండలంత వరములు గుప్పెడు వాడూ.." అనే అన్నమాచార్య సంకీర్తనను రాగయుక్తంగా పాడి, మొదటి

బహుమతిగా డిన్నర్ సెట్‌ను గెలుచుకోవడం మరచిపోలేని మధురమైన జ్ఞాపకం. అలాగే డాన్సు పోటీల్లో కూడా పాల్గొని మంచి బహుమతులు తెచ్చుకునేదాన్ని.

ఇక మా టీచర్ల విషయానికి వస్తే లెక్కల మాష్టార్లు శేషయ్యగారు, అబ్దుల్ భాషాగారు, సోషల్‌ను చెప్పటానికి చంద్రం మాష్టారు గారు ఇంగ్లీష్ సార్ కళ్యాణ్ గారు, తెలుగు పాఠాల్నిచెప్పటానికి కొండయ్యసార్, సైన్సు టీచర్లుగా జనార్దన్ సార్, రామచంద్ర సార్, హిందీ మాష్టారు శివ సార్ ఉండేవారు. వీరందరూ కూడా ఒకర్ని మించి ఒకరు బాధ్యతగా ఉపాధ్యాయ వృత్తిపట్ల నిబద్దతతో ఉండి విద్యార్థులకు శ్రద్ధగా పాఠాల్ని బోధించేవారు.

తెలుగు సార్ కొండయ్యగారు వయసులో అందరికన్నా పెద్దవారు. ఆయన బోధనా రంగంలో మంచి అనుభవం కలిగినవారు. ఆయన చెప్పే తెలుగు పాఠాలు ఒక్కసారి వింటే చాలు మళ్ళీ పుస్తకం తెరిచి చదివే అవసరమే ఉండేదికాదు. తెలుగు వ్యాకరణాంశాలను కూడా నెమ్మదిగా విపులీకరించి అర్ధమయ్యేలా చెప్తూ సందర్భానుసారంగా జోకులు వేసి నవ్విస్తూ ఉండేవారు. ఆయన క్లాసుకోసం అందరం ఎంతో ఆసక్తిగా ఎదురు చూసేవాళ్ళం లెక్కల మాష్టారు శేషయ్యగారు కూడా సులభమైన రీతిలో మాకు లెక్కలు నేర్పించేవారు. కానీ ఆయన క్లాసులో ఎపుడూ సీరియస్‌గా కోపంగా ఉండేవారు. విద్యార్థులు తప్పు చేసినా సరిగా చదవకపోయినా కఠినంగా వారిని శిక్షించేవారు. క్రమశిక్షణను, పద్ధతిని మాకు నేర్పించేవారు. ఆయన క్లాసులోకి వస్తున్నారంటేనే మాకు గుండె దడగా ఉండేది. నేను తప్ప మిగతా వాళ్ళందరూ ఎపుడో ఒకసారి ఆయన కోపానికి, శిక్షకు గురయి బాధపడిన వాళ్ళే. నా ఫేవరెట్ సబ్జక్టు మాథ్స్ కావడంతో నేను లెక్కలు బాగా నేర్చుకుని మంచి మార్కులు (ఫస్ట్) తెచ్చుకునేదాన్ని. దాంతో ఆయన నాకెపుడూ ఏ విధమైన పనిష్మెంటును ఇవ్వలేదు. ఆయన కోపానికి గురికానందుకు ఇప్పటికీ నాకు గర్వంగా సంతోషంగా ఉంటుంది.

అయితే అంత బాగా చదువుతున్నా కూడా నాకు అపుడపుడూ చాలా భయం కలిగేది. పరీక్షలు రాశాక రిజల్ట్స్ తెలిసేంత వరకు చాలా టెన్షన్‌గా ఉండేది. రాసిన పరిక్షలో ఎన్ని మార్కులు వస్తాయో? తక్కువ వస్తే ఎలా అనే ఆలోచనలో ఉండేదాన్ని. రిజల్ట్స్ వచ్చి మార్కులు తెలిసి నాకే ఫస్ట్ మార్కులు రావడంతో రిలాక్స్ అయి హమ్మయ్య అనుకుంటూ ఊపిరి పీల్చుకునేదాన్ని.

కానీ నా స్నేహితురాళ్ళు అపుడపుడూ ఆయన వేసే శిక్షలకు బలి అయి బాధపడుతూ ఉండేవాళ్ళు. మరి వాళ్ళ బాధ నాకు కూడా బాధే కదా? అలాంటి సమయాల్లో వాళ్ళ కోసం వాళ్ళతో పాటు చాలా విచారించేదాన్ని.

నాకు తెలిసిన లెక్కల పాఠాలు వాళ్ళకి అర్ధమయ్యే విధంగా తెలియజేసి వాళ్ళకి శిక్ష పడకుండా నా శాయశక్తులా ప్రయత్నిస్తూ ఉండేదాన్ని.

ఇకపోతే మా స్కూలు ప్రిన్సిపాల్ గారయిన జనార్ధన్ సార్ గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయనే మాకు సైన్స్ పాఠాలు బోధించేవాళ్ళు.

రసాయన శాస్త్రాన్ని వినడమే కాదు. చదవడం కూడా చాలా కష్టం. కానీ జనార్ధన్ సార్ చెప్పే పాఠాలు వింటే ఆ సబ్జెక్టు పైన ఆసక్తి కలగడం ఖాయం.

ఆయన మాకు వరసకు అన్న అయే బంధుత్వం కూడా మా మధ్య ఉండటంతో నన్ను చాలా ప్రత్యేకంగా ప్రేమగా చూసుకునేవారు. మా నాన్నగారు శ్రీ చిట్టే తిరుపాలయ్యగారు అంటే మా జనార్దన్ సార్‌కు ఎంతో గౌరవం దానికి మించిన అభిమానం.

మేం అందరం అయిదుమంది ఆడపిల్లలుగ పుట్టినా కూడా మగపిల్లలతో సమానంగా పెంచి పెద్ద చేసి అందరినీ పెద్ద చదువులు చదివిస్తున్నందుకు పల్లెను విడిచి, ఆస్తులన్నీ అమ్మి ఆడపిల్లలను చదివిస్తున్నందుకు - మా నాన్నగారిని జనార్థన్ సార్ ఎపుడూ మెచ్చుకుంటూ ఉండేవారు.

ఇప్పటికీ కడపజిల్లాలోని మా ప్రాంతంలో ఆడపిల్లలకు పెద్ద చదువులంటే చాలా చిన్నచూపు చూస్తారు. వయసు వచ్చిన ఆడపిల్లకు పెళ్ళి చేయడమే పరమావధిగా, బాధ్యతగా ఇక్కడివారు భావిస్తున్నారు.

బాగా చదివి ఫస్ట్‌క్లాసులో పదవతరగతి పాస్ అయినా కూడా ఆడపిల్లలకు చదువు ఎందుకు? దండగ అని భావించి చదువు మాన్పించి చిన్న వయసులోనే వాళ్ళకి పెళ్ళి చేస్తున్నారు. ఆడపిల్లను అత్తగారింటికి పంపిచడమే జీవితానికి సార్థకతగా వీళ్ళు నమ్మి ఎంతో తెలివి ప్రతిభకల అమ్మాయిల చదువుల్ని కూడా అర్థాంతరంగా ఆపేస్తున్నారు. కానీ మా నాన్నగారు మాత్రం పరిస్థితులను, ప్రతికూలతలను పట్టించుకోకుండా, పల్లెటూరి జనాల మాటలను పట్టించుకోకుండా మా అయిదుమంది అక్కా చెల్లెళ్ళను పెద్ద చదువులు చదివించారు. అందుకై మేం ఎపుడూ మా నాన్నగారికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉంటాం. చదువుల్లోనూ ఆటపాటల్లోనూ ముందు నిలిచే మమ్మల్ని చూసి మా నాన్నగారు సగర్వంతో పొంగిపోయేవారు. ఇపుడైతే మా నాన్నగారు మా మధ్య లేరు కానీ మా చదువుల రూపంలో ఎప్పటికీ మా మధ్య నిలిచే ఉంటారు.

ఎంతో సరదాగా, సంతోషంగా ఆటపాటలతో, చదువుతో గడిచిపోయే ఆ కాలంలో మా హృదయాల్ని బాధించే ఒక చేదు సంఘటన జరిగింది.

మాకు చదువు చెప్పే ఒక మాష్టారు మా స్నేహితురాలయిన ఒకమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆ అమ్మాయి ఎంతో బాధపడి, భయపడి మాతో చెప్పుకుని ఏడ్చింది. అప్పటిలో మా ప్రాంతంలో ఇలాంటి విషయాలు ఇంట్లో పెద్దవారికి తెలిస్తే ఆ అమ్మాయి చదువును మానిపించి ఇంట్లో కూర్చోమని చెపుతారు. ఆడపిల్లల చదువు మాన్పించడమే అన్ని సమస్యలకు పరిష్కారం అని అప్పట్లో పెద్దవాళ్ళు అనుకునేవాళ్ళు. అందువలన ఇలాంటి సమస్యలను పెద్దవాళ్ళకు చెప్పుకోవాలంటే భయపడే పరిస్థితి ఉండేది.

ఏం చేయాలో అని బాగా ఆలోచించి ఎలాగైనా ఆ మాష్టారుకు తగిన బుద్ది చెప్పాలని భావించి, నేనే ధైర్యం చేసి ప్రిన్సిపాల్ సార్‌ను కలిసి విషయం వివరించి చెప్పాను. ఆయన వెంటనే స్పందించి ఆ మాష్టారును వెంటనే ఉద్యోగంలో నుండి తీసేసి పంపించేసారు.

గురువులను దైవంగా భావించే సంప్రదాయం మనది.

కానీ ఇలాంటి కీచకులైన కొందరు గురువుల వల్ల గౌరవప్రదమైన గురువు అనే పదానికే మచ్చవస్తోంది. ఇలాంటి వాళ్ళు తమ నీచమైన ప్రవర్తనను మార్చుకుని తమ వృత్తికి గౌరవంతెచ్చి గురువేదైవం అన్న మాటను "ఆచార్యదేవోభవ" అన్న సూక్తిని నిజం చేయాలని కోరుకుంటున్నాను.

1999లో పదవతరగతి పరీక్షలు రాశాక ఆఖరు రోజున అందరం కలిసి వీడ్కోలు తీసుకుని విడిపోతున్నందుకు చాలా బాధపడ్డాం. భవిష్యత్తులో ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడినా కూడా టెన్త్‌క్లాసులోని స్నేహితులను అందరినీ మరిచిపోకుండా గుర్తుచేసుకుంటూ ఉండాలనీ వీలయినప్పుడల్లా ఒకరినొకరు కలుసుకోవాలని సిన్సియర్‌గా అందరం ప్రమాణాలు చేసుకున్నాం. తరువాత ఆర్థిక పరిస్థితులు అనుకూలించని కారణంగా సుమలత విజయలక్ష్మిల చదువును టెన్త్‌క్లాస్‌తోనే మానిపించి వారి పెద్దవాళ్ళు వారికి చిన్న వయసులోనే పెళ్ళి చేసేసారు. నేను, లత వాళ్ళని తలచుకుని బాధపడ్డాం. మా చదువులను మేం ముందుకు కొనసాగించాం.

ఇంటర్మీడియట్ తరువాత, బి.టెక్ చదవడానికి నెల్లూరులో నాకు సీటు రావడంతో, నేను మా కోడూరును, స్నేహితురాళ్ళను వదిలి కొద్దికాలం పాటు నెల్లూరు వెళ్ళిపోయాను. బి.టెక్ పూర్తి చేసాక తమిళనాడులోని హోసూరులో ఎం.బి.ఎ చదివాను. హోసూరుకు బెంగుళూరు చాలా దగ్గరగా 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

ఎం.బి.ఎ అయ్యాక హైదరాబాద్‌లో హెచ్.ఆర్ అడ్మిన్‌గా(స్టూడియో ఎన్)లో  కొద్దికాలం జాబ్ చేసాను.

ప్రస్తుతం పెళ్ళి చేసుకుని, ఇద్దరు అబ్బాయిలకు తల్లిగా ఇంట్లోనే ఉండి వాళ్ళ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాను.

పిల్లలు వాళ్ళ బాల్యాన్ని డే కేర్ సెంటర్‌లో గడపడం కాకుండా ఇంట్లో తల్లితండ్రుల సంరక్షణలో ఉండాలని భావించి నేను ప్రస్తుతం ఉద్యోగానికి దూరంగా ఉండాల్సి వచ్చింది.

నా పెళ్ళి అయ్యాక నేను హైదరాబాద్‌లో స్థిరపడినా కూడా అపుడపుడూ మా రైల్వే కోడూరుకు వెళుతుంటాను. నా స్నేహితురాళ్ళను కొందరిని అక్కడ కలిసి పదవతరగతిలో మేం చేసిన అల్లరి చేష్టలు, అపుడు మేం గడిపిన సంతోషకరమైన సందర్భాలు, సరదా సన్నివేశాలు కబుర్లలో కలబోసుకుని నవ్వుకుంటాం.

బాల్యపు ఆఖరి మెట్టు అయిన పదవతరగతిని మరలా ఒకసారి చదివితే బాగుండు అని అపుడపుడూ అనిపిస్తూ ఉంటుంది.

నా పదవతరగతి జ్ఞాపకాలను మీతో పంచుకుని, మరొక్కసారి ఆ రోజుల్ని గుర్తుచేసుకునే అవకాశాన్ని నాకు కల్పించిన కౌముది మాసపత్రికకు, సంపాదకవర్గానికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

# టెంత్ క్లాస్
## - పాఠకులు పాల్గొనే శీర్షిక



ఎవరికైనా వ్యక్తిగత జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ 'టెంత్ క్లాస్' దశ ఓ చక్కటి జ్ఞాపకం. వ్యక్తిత్వపు మొగ్గలు పువ్వులుగా వికసించే పరిణామానికి ఆరంభ దశ. పదో తరగతికి ముందు ఇంకా అమాయకత్వపు ఛాయలు వీడవు, స్కూలు, మిత్రులూ అర్థమవుతూ, అవుతూ ఉంటారు. పదో తరగతికి చేరుకునే సరికి అభిప్రాయాలు, అనుభవాలు ఒక రూపం సంతరించుకుంటాయి. మళ్ళీ ఈ దశ దాటి కాలేజీకి వెళ్ళిపోతే అదంతా మరో ప్రపంచం. అందుకే 'టెంత్ క్లాస్' ఒక మలుపులాంటిది. ఈ మలుపులో ఎన్నో పరిచయాలు, స్నేహితులూ, స్నేహితురాళ్ళూ, సరదాలు, తగాదాలు, గ్రూపులూ, రాజకీయాలూ, వార్షికోత్సవాలు, చిలిపిపనులు, అల్లరి వేషాలు, స్కూలు ఎగ్గొట్టి బలాదూర్లు, సర్స్, మేడమ్స్, పరీక్షలూ, ఫలితాలు, వీడ్కోలూ....ఒకటనేమిటి..ఎన్నో..ఎన్నెన్నో అనుభవాలు. జీవితంలో ఎంత దూరం ప్రయాణించినా ఒక్కసారి వెనక్కి తిరిగి 'టెంత్ క్లాస్' రోజులకి వెళ్తే.. "అబ్బ..! ఆ రోజులెంత బావుండేవో..!!" అనుకోని వాళ్ళు చాలా అరుదుగా ఉంటారేమో!!.. మీ మధురానుభూతులని, గతకాలపు జ్ఞాపకాలని.. పదిమందితో పంచుకోండి. 'కౌముది' లోని ఈ శీర్షిక కేవలం మీ కోసమే! మీ 'టెంత్ క్లాస్' అనుభవాలు 3-4 పేజీల్లో వ్రాసి, వీలైతే ఫోటోలతో సహా పంపించండి. మరోసారి మీ హైస్కూలుని 'కౌముది' ద్వారా అందరికీ చూపించండి..!

**editor@koumudi.net**



# పద్మ యార్లగడ్డ



నా పేరు వై. పద్మ. వైజయంతిమాల లాగా వైపద్మ ఏమిటి అనుకోకండి. ఆ రోజులలో అంతా పద్మల మయమే. మా క్లాస్ లోనే పది మంది పద్మలు ఉన్నారు. అందుకే వై. పద్మ అంటే కానీ తెలియదు. నేను చదువుకొన్న స్కూల్ పేరు వై.యన్.ఓ (కం) హైస్కూల్, కారంచేడు. సరస్వతీ దేవి బొమ్మ మా స్కూల్ బిల్డింగ్ కి

ఆభరణములా ఉండేది. మా స్కూల్ ముందు ఆ చివర నుండి ఈ చివర వరకు వొక చిన్న ఏరు లాంటిది ఉండేది. దానిని మేము పులక్కాలవ అనే వాళ్ళము. పులక్కాలవ వొడ్డునే అశోక చెట్లు ఉండేవి. మా స్కూల్ కున్నంత పెద్ద ప్లే గ్రౌండ్ బహుశా చుట్టుపక్కల ఏ స్కూల్ కి లేదు అనుకుంటాను. మధ్యాహ్నము మా లంచ్ రూమ్స్ ఆ అశోక చెట్లే. ఏడు వందల మందిమి తెలుపు ఆకుపచ్చ యూనిఫాం తో అశోక చెట్ల క్రింద, ప్లేగ్రౌండ్ మొత్తములో గ్రూపులు గ్రూపులుగా కూర్చుని లంచ్ చేసేవాళ్ళము. మావూరి పిల్లలే కాకుండా చుట్టుపక్కల వూళ్ళైన కుంకలమర్రు, పరుచూరు, స్వర్ణనుండి కూడా పిల్లలు వచ్చి మావూళ్ళో చదువుకొనేవాళ్ళు.




ఒకసారి స్కూల్ గ్రౌండ్ లో దురదగుంట ఆకు దొరికింది. అది తీసుకొని మా క్లాస్ మేట్ కొల్లా విజయను నెమ్మదిగా కబుర్లలో పెట్టి, తన చేతి మీద రాశాము. తను మాకు గోక్కుంటూనే కబుర్లు చెప్తూంది. మేము నవ్వుతూ ఉన్నాము. మేము ఎందుకు నవ్వుతున్నామో తనకు అర్ధము కావడము లేదు. ఆరోజే మావి క్వార్టర్లీ ఎక్సామ్స్ మార్క్స్ ఇచ్చారు. తనకు తక్కువ మార్కులు వచ్చాయని నవ్వుతున్నామేమో అనుకున్నది. తరువాత తనుకూడా మా నవ్వులో పాలుపంచుకున్నది.



ఆ రోజులలో అమ్మావాళ్ళు రోజుకు పది పైసలు ఇచ్చేవాళ్ళు. ఇప్పటిలా బాక్స్ లలో స్నాక్స్ పెట్టి పంపేవాళ్ళు కాదు. స్కూల్ బయట రోడ్డు మీద సుబ్బమ్మ అమ్మే తినుబండారాలు (తాటిచాపలు, ముంజలు, నూజీదులు, పప్పుచెక్క లాంటివి), ఐస్ అప్పారావు దగ్గర పాల ఐస్, సేమియ ఐస్, సబ్జా ఐస్ లాంటివి కొనుక్కొని తినేవాళ్ళము. చాలా తక్కువ మంది అప్పుచేసి మరీ కొనుక్కొనే వాళ్ళు. అది తీర్చలేక సుబ్బమ్మకు, ఐస్ అప్పారావుకు కనపడకుండా ఏదో వొక ఎద్దుల బండి వెనుక దాక్కుంటూ స్కూల్కి వచ్చేవాళ్ళు.

స్కూల్లో చదివిన ఐదు సంవత్సరాల కాలములో వొకసారి జగదేక వీరుని కథ సినిమా స్కూల్లో తెరకట్టి వేసి చూపించారు. ఆ రోజులలో అదే గొప్ప విషయము.

1976 – 1982 వరకు అదే ప్రెమిసిస్ లో చదువుకున్నాము. అంటే సిక్స్త్ క్లాస్ నుండి ఇంటర్మీడియెట్ వరకు అక్కడే అన్నమాట. స్కూల్ 4.30PM కి అయిపోయిన వెంటనే ఇంట్లో స్కూల్ బాక్స్ (అప్పట్లో బుక్స్ తీసుకువెళ్ళడానికి బ్యాగ్ కాదు అల్యూమినియం బాక్స్ లు వాడే వాళ్ళము) పెట్టేసి పరుగులు తీసుకుంటూ లైబ్రరీకి వెళ్ళి క్లోజ్ చేసేవరకు చదువుకొనేవాళ్ళము. అంటే వూహ తెలిసిన తరువాత నుండి పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళేవరకు యాక్టివ్ టైం అంతా స్కూల్ & లైబ్రరీలోనే గడిపాము. అందుకే ఇప్పటికీ కారంచేడు వెళ్తే మా లైబ్రరీని, స్కూల్ని బయటి నుండే వొక్కసారి ఆత్మీయంగా దర్శించుకుంటాము (విద్యాలయము, గ్రంధాలయము రెండూ కూడా ఆలయాలే అందుకే దర్శనము అనే పదము వాడాను).

రీడింగ్ హాబిట్ మా బాచ్ తోనే అంతరించిపోయినదేమో. బహుశా మా జూనియర్స్ ని కూడా ఎవరూ లైబ్రరీకి వెళ్ళడము నేను చూడలేదు. ఇంతకూ నేను కూడా సిక్స్త్ నుండి నైంత్ క్లాస్ వరకు మాత్రమే లైబ్రరీకి వెళ్ళి చదువుకోగలిగాను. ఆ రోజులలో పద్నాలుగో సంవత్సరము రావడముతోనే వోణీలు వేసుకోవడము తప్పనిసరి. వోణీలు వేసుకున్నాము అంటే పెద్దవాళ్ళము అయిపోయినట్లే. బయటకు వెళ్ళడము, తల పైకెత్తి నడవడము అన్నీ బంద్. వోణీలు వేసుకున్నందుకు బాధ పడిన కారణము కేవలము లైబ్రరీకి వెళ్ళనివ్వనందుకే. అమ్మా వాళ్ళు వెళ్ళనివ్వకపోవడము కాదు వోణీలు వేసుకున్నవాళ్ళు ఎవరూ లైబ్రరీకి వచ్చి చదువుకోవడము చూడలేదు. ఆ రోజులలో అలాంటివి అన్నీ పైకి చెప్పని, కనపడని ఆంక్షలే.

సోషల్ కి వచ్చే చలమయ్య మాస్టారు ఆడపిల్లల చదువుని ప్రోత్సహిస్తూ అప్పట్లో లేడీ కలెక్టర్ గా ఉన్న సుజాతారావు పేరు మాకు ఇన్స్పిరేషన్ గా చెప్పేవారు. లక్ష్మయ్య మాస్టారు (హెడ్మాస్టారు) ఇంగ్లీష్ గ్రామర్ చాలా బాగా చెప్పేవారు. లక్ష్మీనారాయణ (హిందీ) మాస్టారు చాలా సౌమ్యంగా ఉండేవారు.

(1) అగజానన పద్మార్కం పద్యము చదివేటప్పుడు చాలా మంది చేసే తప్పు అనేకదంతమ్ భక్తానాం అని చదువుతారు కానీ మనము పలుకవలసినది అనేకదం తం భక్తానాం. (2) అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె, నేయి వోయ భగ్గన దరికొన్న భీషణ హుతాశనకీల యనంగ, (3) ఏమేమీ కలహాసనున్డచటికై యేతెంచి యిట్లాడినా1 ఆ మాటల్ చెవి యొగ్గి తావినియెనా లాంటి తెలుగు పద్యాలు, (4) జాతి న పూచో సాధూ కీ, (5) మాలా తో కర్ మే ఫిరై, జీభ్ ఫిరై లాంటి హిందీ పద్యాలు ఇప్పటికీ గుర్తు వున్నాయి అంటే అప్పటి గురువుల చలవే. చదువులో ఫస్ట్ కాకపోయినా టీచర్స్ ద్రుష్టి లొ మంచి పేరే ఉండేది. ఇప్పుడు హైదరాబాదులో మల్టీనేషనల్ కంపెనీలో వర్క్ చేస్తున్నాను అంటే చిన్నప్పటి స్కూల్, ఇన్టర్మీడియట్లో లెక్చరర్స్ ప్రోత్సాహమే కారణము.

పెద్ద ప్లే గ్రౌండ్ ఉండేది. వారములో రెండో, మూడో గేమ్స్ పీరియడ్స్ వుండేవి. అవి కాకుండా సాయంత్రము స్కూల్ అయిపోయిన తరువాత ఎంతసేపైనా ఆడుకోవచ్చు. స్కూల్ అయిపోయిన తరువాత అందరము ఇంటికి వెళ్ళే తొందరలో ఉంటాము కాబట్టి అమ్మాయిలందరము లంచ్ చేసిన తరువాత కుందుళ్ళు, కబడీ, కోకో, రింగ్ ఆడుకునేవాళ్ళము. ప్రక్కనే ఉన్న పర్చూరులో స్పోర్ట్స్ కాంపిటీషన్స్ లో కూడా పార్టిసిపేట్ చేసాము. ఆటలలొ ఫస్ట్ ఉండేదానిని. మా గ్రూప్ కి నేనే కెప్టన్. రిపబ్లిక్ డే కి జరిగే పోటీలలో స్పోర్ట్స్ లో కెప్టెన్ గా నేను స్టేజ్ పైకి వెళ్ళి ప్రైజ్ లు తీసుకునేదానిని. కానీ సంతోషము వుండేది కాదు. చదువులో రానందుకు అవమానంగా ఫీల్ అయ్యేదానిని.

స్కూల్లో అమ్మాయిలు, అబ్బాయిలు మాట్లాడుకోవడము కూడా ఉండేది కాదు. ఐనా కానీ క్లాస్ లో మగ పిల్లలు అందరు కూడా మాతో చాలా మర్యాదగా ఉండేవాళ్ళు. కానీ వాళ్ళు మాకు యిచ్చే మర్యాదను అప్పుడు గుర్తించలేకపోయాము. అంటే అన్ని స్కూల్స్ లో, కాలేజెస్ లో అలానే ఉంటారు అనుకొనేదానిని. డిగ్రీ చదవడానికి చీరాల వి.ఆర్.యస్ & వై.ఆర్.యన్ కాలేజీలో చేరినప్పుడు కానీ మావూరి అబ్బాయిల మంచితనము అర్ధము కాలేదు.

35 సంవత్సరాల తరువాత జనవరి 2015 లో (15 సంత్సరాల వయసులో విడిపోయి 50 సంత్సరాల వయసు వచ్చిన తరువాత) మరలా టెంత్ క్లాస్ బాచ్ వాళ్ళందరము కలిసాము. నేను మా ఫ్రెండ్స్ రజని, రంగా కలసి హైదరాబాదు నుండి ట్రైన్ లో మావూరు బయలుదేరి వెళ్ళాము. మా కంపార్ట్ మెంట్ లోనే వొకతను గ్రే హెయిర్ తో ఉన్నాడు. మావైపు డౌట్ ఫుల్ గా చూసాడు. మేము పెద్దగా పట్టించుకోలేదు. తీరా చూస్తే అతను మాక్లాస్ మేటే. మరుసటి రోజు స్కూల్లో కలసిన తరువాత మరలా అతను మాతో ఈ వియము చెప్పిన తరువాత కానీ గుర్తించలేకపోయాము. అందరిలో ఎంతో మార్పు. మరి ఉండదా. మేము స్కూల్ టీచర్స్ అందరికీ సన్మానము చేసారు. మా బ్యాచ్ లో స్కూల్ ఫస్ట్ తెచ్చుకున్న పత్తిపాటి శ్రీనివాస్ రికార్డ్ ని ఇప్పటివరకు ఎవరూ బ్రేక్ చేయలేకపోయారట. తనను కూడా సన్మానించారు. టీచర్స్ వొకరిద్దరు తప్ప ఎవరూ మమ్మల్ని గుర్తు పట్టలేదు. అప్పటి అమ్మాయిలు, అబ్బాయిలు ఇప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలుగా (అందరూ కాదు) ప్రమోట్ అయ్యారు కాబట్టి అరమరికలు లేకుండా చక్కగా, ఆత్మీయంగా మాట్లాడుకున్నాము. మరలా అందరము పిల్లలమై పోయాము. చాలా పోటీలు పెట్టారు. చాలా మందికి ప్రైజెస్ వచ్చాయి. చిన్నప్పుడు నేర్చుకున్న పద్యాలు చెప్పమన్నా, తెలుగు సంవత్సరాలు అరువది చెప్పమన్నా యిలాంటివి ఏమన్నా అడిగినట్లైతే తప్పకుండా నేను కూడ ఏదో వొక ప్రైజ్ తెచ్చుకునేదానిని.

స్కూల్ ఫస్ట్ వచ్చిన పత్తిపాటి శీను (శ్రీనివాస్ అంటే ఎవరో అన్నట్లుగా ఉంటుంది) – గుడ్ జాబ్, గుడ్ పొజిషన్, పండు వాసు – సినీఫీల్డ్, రామానాయుడు – బిజినెస్సు, బాబీ – పాలిటిక్స్, చెన్నుపాటి శీను కమర్షియల్ టాక్స్ ఆఫీస్, రజని ఓన్ బిజినెస్సు, స్.హెచ్. రంగ – నర్స్, సి.హెచ్. పద్మ – టీచింగ్, నేను (వై. పద్మ) – M.N.C. లో జాబ్ (కొందరి పేర్లు మాత్రమే ఉదహరిస్తున్నాను) యిలా వొక్కొక్కరు వొక్కొక్క ఫీల్డ్ లో హ్యాపీగా ఉన్నాము. కొసమెరుపు ఏమిటంటే టెంత్ క్లాస్ తో చదువు మానివేసి త్వరగా పెళ్ళిళ్ళు చేసుకొన్న వాళ్ళు మాత్రము పిల్లల పెళ్ళిళ్ళు (అమెరికా సంబంధాలు) కూడా త్వరగా చేసేసి చక్కగా అమెరికా వెళ్ళి వచ్చారు. కాబట్టి వాళ్ళు యింకా హ్యాపీ.

**Y. Padma, Y.N.O. (Cum) High School, Karamchedu – 1980 batch.**

యార్లగడ్డ పద్మగారు హైదరాబాదులో లూయిస్ బెర్జర్ అనే మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్నారు. శ్రీవారు అనిల్ కుమార్. ఇద్దరు మగ పిల్లలు నవీన్ క్రిష్ణ & జానకిరాం.  అందరూ ఉద్యోగస్తులే. పుస్తకాలు చదవడం, చదరంగం పద్మగారి హాబీలు.

